

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 316

గురువారం 6-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



40 నుంచి 2వ ర్యాంక్‌కు...
ఐసీసీ టి20 ర్యాంకింగ్స్‌లో ఒకేసారి 38 స్థానాలు ఎగబాకిన అభిషేక్ శర్మ - 14లో



వాటిలో లాభాల స్వీకరణ..
సెన్సెక్స్ నష్టం 313 పాయింట్లు... 23,700 దిగువకు నిఫ్టీ - 15లో

సీఎల్పీ.. వెంటనే ఢిల్లీకి

రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు.. ముఖ్య నేతలకు అధిష్టానం పిలుపు

- జిల్లాల వారీగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో భేటీకి తొలుత నిర్ణయం
- ఇటీవలి ఎమ్మెల్యేల డిన్నర్ భేటీ, అసంతృప్తులపై చర్చించి, మార్గనిర్దేశం చేయాలనే యోచన
- ఢిల్లీ పిలుపు నేపథ్యంలో ఈ భేటీ సీఎల్పీ సమావేశంగా మార్పు
- ఎంసీఆర్‌హెచ్చార్డీలో 11 గంటలకు సీఎం నేతృత్వంలో భేటీ
- ఏడాది కాలంలో ఎమ్మెల్యేల పనితీరును వివరించనున్న రేవంత్
- కులగణన, ఎస్సీ వర్గీకరణను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై చర్చ.. స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం
- ఆ వెంటనే ఢిల్లీ వెళ్లనున్న సీఎం, డిప్యూటీ సీఎం భట్టి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మున్షీ, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- పార్టీ అంతర్గత వ్యవహారాలు, పీసీసీ కార్యవర్గ కూర్పు, మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్ల చైర్మన్ పోస్టులపై చర్చకు చాన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయం రసకందాయంలో పడింది. పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలు, ఎమ్మెల్యేల అసంతృప్తితోపాటు మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పు, కార్పొరేషన్ల చైర్మన్ పోస్టుల భర్తీ తదితర అంశాలను కొలిక్కి తెచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి, వారి పనితీరు, స్థానిక సంస్థల ఎన్నికలు, కుల గణన, ఎస్సీ వర్గీకరణ తదితర అంశాలపై చర్చించేందుకు కాంగ్రెస్ శాసనసభ పక్షం గురువారం భేటీకానుంది. ఈ భేటీ తర్వాత రాష్ట్ర నాయకత్వం వెంటనే ఢిల్లీ వెళ్లనుంది. వాస్తవానికి తొలుత జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో భేటీకి రాష్ట్ర నాయకత్వం సిద్ధమవగా.. అధిష్టానం నుంచి పిలుపు రావడంతో ఆ భేటీని సీఎల్పీ సమావేశంగా మార్చారు. అది ముగియగానే ఢిల్లీకి బయలుదేరనున్నారు.

ఇక్కడ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం

సీఎల్పీ భేటీలో భాగంగా పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి పలు అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు. గత ఏడాదికాలంలో వారి పనితీరుకు సంబంధించిన నివేదికలోని అంశాలను వివరించనున్నట్టు తెలిసింది. పార్టీలో ఇటీవలి అంతర్గత పరిణామాలు, ఎమ్మెల్యేల డిన్నర్ పే చర్చ వ్యవహారం గురించి కూడా సీఎం ప్రస్తావించనున్నట్టు సమాచారం. పాలనలో భాగంగా ఎమ్మెల్యేలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అంశాలు, పెండింగ్ బిల్లుల మిగతా 2వ పేజీలో ▶

కార్యకర్తల కోసం ఎలా పని చేస్తానో చూపిస్తా

జగన్ 2.0

ప్రజలే నా బలం.. పార్టీ క్యాడర్ నా బలగం

పార్టీ నేతలతో సమావేశంలో వైఎస్ జగన్ భరోసా

- మన కార్యకర్తలను చంద్రబాబు ఎన్ని ఇబ్బందులు పెడుతున్నారో చూస్తున్నా..
- మంచి చేసినవారు.. చెడు చేసినవారు... ఇద్దరినీ గుర్తు పెట్టుకోండి
- రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దాం..
- ప్రలోభపెట్టినా, భయపెట్టినా దృఢంగా నిలబడ్డ వారిని చూసి గర్వపడుతున్నా
- జగనన్న 1.0లో ప్రజల కోసమే తాపత్రయపడ్డా
- మన పాలనతో బాబు పాలనను ప్రజలు పోల్చి చూస్తున్నారు
- కాలర్ ఎగరేసి చెప్పుకునే పాలన మనది.. కాలర్ పట్టుకుని నిలదీసే పాలన వారిది
- సూపర్ సిక్స్‌లూ లేవు.. సెవెన్లూ లేవు.. హామీలను బాబు తుంగలో తొక్కారు
- బాబు నైజం ప్రజలకు అర్థమైంది
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీ అఖండ విజయం తథ్యం
- మన ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం.. 30 ఏళ్లు పరిపాలిస్తాం

12 లో



ఈసారి జగనన్న 2.0 కార్యకర్త కోసం ఎలా పని చేస్తుందో చూపిస్తాం. ఇది కచ్చితంగా చెబుతున్నా. జగనన్న 1.0లో కార్యకర్తలకు అంత గొప్పగా చేయలేకపోయి ఉండొచ్చు. ప్రతి పథకం, ప్రతి విషయంలోనూ మొట్టమొదట ప్రజలే గుర్తుకొచ్చి వారి కోసమే తాపత్రయపడ్డా. వారి కోసమే నా టైం కేటాయించా. ప్రజల కోసమే అడుగులు వేశా. కానీ ఇప్పుడు చంద్రబాబు మన కార్యకర్తలను పెడుతున్న ఇబ్బందులు చూశా. కార్యకర్తల బాధలను గమనించా. వారి అవస్థలను చూశా. ఆ కార్యకర్తలకు మీ జగన్ అండగా ఉంటాడు. - వైఎస్ జగన్

న్యూస్‌రీల్

అసమగ్ర కులగణనపై.. తప్పుదోవ పట్టిస్తారా?



తెలంగాణలో చేసిన అసమగ్ర కుల గణన సర్వేను అడ్డుపెట్టుకుని రాహుల్ గాంధీ పార్లమెంటును తప్పుదోవ పట్టించారని కేటీఆర్ ఆరోపించారు. పదేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో బీసీలు 1.85 కోట్లుగా, రాష్ట్ర జనాభాలో 51 శాతం ఉన్నట్టుగా తేలిందన్నారు.

- వివరాలు 2లో▶

స్థానిక ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి!



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేయనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. సీపీఐ, ఇతర వామపక్షాలు బలంగా ఉన్న చోట పరస్పర సహకారంతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. వామపక్ష పార్టీల ఐక్యత తమకు తొలి ప్రాధాన్యమన్నారు.

- వివరాలు 3లో▶

లైటింగ్ లేని 'రింగ్'



దేశంలోనే తొలి భారీ రింగురోడ్డుగా రూపుదిద్దుకున్న హైదరాబాద్ ఓఆర్‌ఆర్.. సాయంత్రం కాగానే శక్తివంతమైన ఎల్‌ఈడీ లైట్ల కాంతులతో ధగధగలాడుతుంది. దానికంటే మెరుగ్గా నిర్మించనున్న ఆర్‌ఆర్‌ఆర్‌పై మాత్రం లైట్లు పెట్టొద్దని నిర్ణయించినట్టు తెలిసింది.

- వివరాలు 3లో▶

ముగ్గురు అదనపు జడ్జీలు శాశ్వత న్యాయమూర్తులుగా..

జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్‌కుమార్‌లను సిఫార్సు చేసిన సుప్రీం కొలీజియం 2 లో



క్రికెటర్ గొంగడి త్రిషను సత్కరించి జ్ఞాపికను ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు

గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా

- వివరాలు 2లో



కులగణన ఆధారంగానే విధాన నిర్ణయాలు

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

- సర్వే సమాచారంతో రాష్ట్రంలో సామాజిక న్యాయం
- అన్ని వివరాలు త్వరలోనే ప్రజల ముందు పెడతాం
- సర్వేలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో తమ ప్రభుత్వం తీసుకోబోయే అనేక విధాన నిర్ణయాలకు కుల గణన సర్వే సమాచారమే ఆధారం అవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో సామాజిక న్యాయం అమలుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని చెప్పారు. కులగణన మిగతా 3వ పేజీలో ▶

బుధవారం యూపీ ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో చేతిలో రుద్రాక్షమాలతో పుణ్యస్నానం ఆచరిస్తున్న ప్రధాని మోదీ.



భక్తిభావంతో నా మనసు నిండిపోయింది

ప్రధాని మోదీ

- కుంభమేళాలో పుణ్యస్నానం గొప్ప ఆశీర్వాదం

6 లో



నీ దూకుడు.. సాటెవ్వరూ..!

- భారత స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో అమ్మకాల విలువ పరంగా ఐఫోన్ అగ్రస్థానం
- విక్రయాల సంఖ్యపరంగా తొలిసారి టాప్-5 జాబితాలో చోటు... దేశంలో పెరుగుతున్న యాపిల్ ఫ్యాన్స్


2 లో

ఎకరంలోపు రైతులకు 'తొలి' భరోసా

17.03 లక్షల రైతుల ఖాతాల్లో రూ.533 కోట్లకు పైగా జమ చేసిన ప్రభుత్వం

- గత నెల 27న 4,41,911 మంది రైతుల ఖాతాలకు రూ.593 కోట్లు విడుదల
- ఇప్పటివరకు 21.45 లక్షల రైతులకు రూ.1,126 కోట్లకు పైగా పెట్టుబడి సాయం
- ఎకరం పైబడి రెండు ఎకరాల వరకు గల రైతులకు త్వరలోనే నిధులు!
- సుమారు కోటిన్నర ఎకరాలకు రైతుభరోసా ఇచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకం అమల్లో భాగంగా తొలుత ఎకరం విస్తీర్ణం వరకున్న సాగు భూములకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం విడుదల చేసింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 17.03 లక్షల రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.533 కోట్లకు పైగా నిధులు జమ చేసింది. గత నెల 26న రైతు భరోసా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని 27వ తేదీన 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రూ.593 కోట్లు జమ చేశారు. దీంతో ఇప్పటివరకు దాదాపుగా 21.45 లక్షల మంది రైతులకు



రూ.1,126.54 కోట్ల మొత్తాన్ని రైతుభరోసా కింద అందజేసినట్లయింది.

72 లక్షల మందికి పైగా రైతులకు...

రాష్ట్రంలో తాజాగా నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వే ప్రకారం కోటిన్నర ఎకరాలకు పైగా వ్యవసాయ మిగతా 5వ పేజీలో ▶



ఢిల్లీలో కమల వికాసం!

27 ఏళ్ల తర్వాత అధికారం

ఆప్ హ్యాట్రిక్ కలలు కల్లలే... ఎగ్జిట్ పోల్స్ జోస్యం

6 లో

- ఢిల్లీ అసెంబ్లీపై 27 ఏళ్ల అనంతరం కాషాయ జెండా ఎగరనుందని ఎగ్జిట్ పోల్స్ జోస్యం చెప్పాయి. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ హ్యాట్రిక్ కల నెరవేరబోదని పేర్కొన్నాయి. బుధవారం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కాంగ్రెస్ ఈసారి కూడా సున్నా చుడుతుందని స్పష్టం చేశాయి. రెండు ఎగ్జిట్ పోల్స్ మాత్రం ఆప్ గెలుస్తుందన్నాయి.

ప్రశాంతంగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

ఓటు వేసిన పలువురు ప్రముఖులు
60.44% పోలింగ్ నమోదు

- వివరాలు 6లో




ఈ పోల్స్‌లో గెలిస్తే రియల్ పోల్స్‌లో గెలిచినట్టేగా సార్!

ఏఐదే హవా!

దేశంలో పెరుగుతున్న ఐటీ నిపుణుల అవసరం

- నైపుణ్యం గల యువత కోసం కంపెనీల యత్నాలు
- పెరుగుతున్న క్యాంపస్ నియామకాలు..
- ఏఐ, సంబంధిత నైపుణ్యానికి ప్రాధాన్యత
- వచ్చే ఏడాది క్యాంపస్ నియామకాలు 20 శాతం పెరిగే చాన్స్!

బీటెక్ విద్యార్థుల్లో చిగురిస్తున్న ఆశలు



సాఫ్ట్‌వేర్ సాధారణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రధాన దేశాల్లో నిపుణుల సంఖ్య (లక్షల్లో)

దేశం	సాధారణ	ఏఐఎంఎల్ నిపుణులు
భారత్	33	4.4
చైనా	34	4
అమెరికా	16	7.86

సాక్షి, హైదరాబాద్: టెక్నాలజీలో సరికొత్త ఆవిష్కరణలకున్న ప్రాధాన్యత దృష్ట్యా తెలంగాణ సహా దేశవ్యాప్తంగా ఐటీ నిపుణుల అవసరం పెరుగుతోంది. దీంతో పలు సంస్థలు నైపుణ్యం గల యువత కోసం అన్వేషిస్తున్నాయి. ఇందులో భాగంగా క్యాంపస్ నియామకాల కోసం కాలేజీల బాట పడుతున్నాయి. మారిన సాంకేతికత అవసరాలకు సరిపోయే నైపుణ్యం ఉన్నవారికే కంపెనీలు ప్రాధాన్యమిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ వంటి నేపథ్యం ఉన్న వారిని అత్యధిక వార్షిక వేతనంతో ఎంపిక చేసుకుంటున్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలో క్యాంపస్ నియామకాలు 20 శాతం పెరిగే వీలుందని ఇటీవల నౌకరీ డాట్ కామ్ సర్వే వెల్లడించడం గమనార్హం. పలు దేశాలు భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల (జీసీసీ) ఏర్పాటుపై దృష్టి పెడుతున్నాయి. దీంతో నైపుణ్యం గల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని నిపుణులు అంటున్నారు. వేగంగా విస్తరిస్తున్న జీసీసీలకు అత్యుత్తమ మానవ వనరులు అవసరమని నిపుణులు చెబుతున్నారు. తాజా పరిస్థితులు బీటెక్ విద్యార్థుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

దేశంలో ఏఐ నిపుణులు అంతంతే..

ఇండక్షన్ అనే సంస్థ వెల్లడించిన నివేదిక ప్రకారం గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు 2025 చివరి నాటికి దేశవ్యాప్తంగా 3.64 లక్షల ఉద్యోగాలు సృష్టించే వీలుంది. ప్రస్తుతం జీసీసీల్లో ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 19 లక్షలు కాగా 2030 నాటికి ఇది 28 లక్షలకు చేరుతుందని అంచనా. స్కిల్ ఇండియా రిపోర్టు ప్రకారం 2026 నాటికి దేశంలో 10 లక్షల మందికి పైగా ఏఐ నిపుణుల అవసరం ఏర్పడుతుంది. 2023 ఆగస్టు లెక్కల ప్రకారం దేశంలో 4.16 లక్షల మంది ఏఐ నిపుణులు మాత్రమే ఉన్నారు. అంటే 2026 నాటికి సుమారుగా మరో 6 లక్షల మంది అవసరం కానున్నారు. ఈ నేపథ్యంలోనే అనవసర మిగతా 12వ పేజీలో ▶

వలసదార్ల విమానం వచ్చేసింది

- 104 మందిని వెనక్కి పంపిన అమెరికా
- అమృత్‌సర్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సైనిక విమానం

6 లో



నీ దూకుడు.. సాటెవ్వరూ..!

భారత స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో అమ్మకాల విలువ పరంగా ఐఫోన్ అగ్రస్థానం

విక్రయాల సంఖ్యపరంగా తొలిసారి టాప్‌-5 జాబితాలో చోటు

దేశంలో పెరుగుతున్న యాపిల్ ఫ్యాన్స్

ధర ఎంతైనా కొనుగోళ్లకు వెనుకాడని వినియోగదారులు

మారుమూల పల్లెలకూ పాకిన క్రేజ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా విక్రయాలే కాదు.. ఎగుమతుల పరంగానూ ఐఫోన్ మార్కెట్ కొత్తపుంతలు తొక్కుతోంది. టాప్ సెల్లింగ్ మోడల్‌గా నిలిచిన యూఎస్, అర్బన్ చైనా, యూకే, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జపాన్ సరసన భారత్ చేరింది. యాపిల్‌కు 5వ అతిపెద్ద మార్కెట్‌గా నిలిచింది.





ముంబైలోని యాపిల్ స్టోర్ ముందు 2024 సెప్టెంబర్ 20న ఐఫోన్ 16 సిరీస్ స్మార్ట్‌ఫోన్ కోసం బారులు తీరిన యాపిల్ ఫ్యాన్స్ చిత్రమిది.. పాత విషయాన్ని ఇప్పుడెందుకు చెబుతున్నారనేగా మీ ప్రశ్న? భారత్‌లో ఐఫోన్ 'విలువ'మరింత పెరిగిందని చెప్పేందుకే పాత జ్ఞాపకాన్ని మీ ముందుంచాం. భారత స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో అమ్మకాల విలువ పరంగా ఐఫోన్ ఏకంగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అంతేకాదు.. విక్రయాల సంఖ్యపరంగా తొలిసారిగా టాప్‌-5 జాబితాలోకి దూసుకొచ్చింది. భారతీయుల్లో యాపిల్ ఉత్పత్తులకు ఉన్న క్రేజ్‌కు ఈ మైలురాళ్లు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఖరీదైనా తగ్గేదేలే..

సగటున ఐఫోన్ ధర సామ్‌సంగ్, వివోతో పోలిస్తే మూడింతలు ఉంటుంది. షావోమీతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ. అయినా మనవాళ్లు తగ్గేదేలే అంటున్నారు. కొత్త సిరీస్ ఎప్పుడొస్తుందా.. ఎప్పుడెప్పుడు చేతుల్లోకి తీసుకుందామా అని ఎదురు చూసే కస్టమర్ల సంఖ్య పెరుగుతోంది. ఐఫోన్ అంటే చాలా మందికి స్టేటస్. అందుకే ఖరీదుకు వెనుకాడడం లేదు. ఈఎంఐ సౌకర్యం ఉందన్న భరోసా ఎలాగూ ఉంది. దేశంలో అమ్ముడవుతున్న ఐఫోన్లలో పెద్ద నగరాల వాటా 40 శాతమే. మిగిలిన 60 శాతం చిన్న నగరాలు, పట్టణాలు, గ్రామాలు కైవసం చేసుకున్నాయంటే ఐఫోన్‌కు ఉన్న క్రేజ్‌ను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా యాపిల్ అమ్మకాల ఆధారంగా సగటు విక్రయ ధర 2024లో రూ. 78,200 ఉంది. 2020లో ఇది రూ. 62,700 నమోదైంది. ఐదేళ్లుగా ఐఫోన్ల అమ్మకాల జోరు కొనసాగుతోంది. ప్రస్తుత వేగాన్నిబట్టి చూస్తే 2026లో భారత్‌లో 1.5 కోట్లకుపైగా ఐఫోన్లు అమ్ముడవుతాయని వివిధ నివేదికలు అంచనా వేస్తున్నాయి. ఐడీసీ ప్రకారం దేశవ్యాప్తంగా 2023లో 90 లక్షల ఐఫోన్లు అమ్ముడయ్యాయి. 2024లో ఈ సంఖ్య 35 శాతం వృద్ధితో 1.2 కోట్లకు ఎగిసింది. నివేదికలనుబట్టి సంఖ్యలు మారినా.. ఐఫోన్లకు డిమాండ్ ఊహించనంతగా దూసుకెళుతోందన్నది వాస్తవం.

యాపిల్ పంట పండింది..

భారత్‌లో 2024లో అన్ని బ్రాండ్స్ కలిపి 15.3 కోట్ల స్మార్ట్‌ఫోన్లను విక్రయించాయి. 2023తో పోలిస్తే విక్రయాలు ఒక శాతం పెరిగాయి. 2024లో అమ్ముడైన మొత్తం స్మార్ట్‌ఫోన్ల విలువలో యాపిల్ 23 శాతం వాటా సొంతం చేసుకొని తొలి స్థానంలో నిలిచిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ నివేదిక తెలిపింది. సంఖ్యాపరంగా 2024 అక్టోబర్‌-డిసెంబర్‌లో యాపిల్ 5వ స్థానానికి ఎగిసింది. వార్షిక ప్రాతిపదికన పరిమాణంలో కంపెనీ వాటా 9 నుంచి 11 శాతానికి చేరింది. అయితే 2024లో భారత్‌లో రూ. 90,680 కోట్ల విలువైన ఐఫోన్లు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయని ఐడీసీ అంచనా వేసింది. 2023లో ఇది రూ. 75,255 కోట్లని వెల్లడించింది. ప్రీమియం ఫోన్లవైపు ప్రజలు మళ్లుతుండటం కంపెనీకి కలిసొస్తోంది. దేశంలో రూ. 30,000పైగా ఖరీదు చేసే స్మార్ట్‌ఫోన్ల విభాగం రెండంకెల వృద్ధిని నమోదు చేస్తోంది.


రికార్డుల భారత్..

యాపిల్ ఎగుమతులు భారత్ నుంచి గతేడాది రూ. లక్ష కోట్ల మార్కును దాటాయి. 2023తో పోలిస్తే ఎగుమతులు 42 శాతం పెరిగి 2024లో రూ. 1.08 లక్షల కోట్లకు చేరాయి. గత సంవత్సరంలో దేశంలో రూ. 1.48 లక్షల కోట్ల విలువైన యాపిల్ ఉత్పత్తులు తయారయ్యాయి. అంత క్రితం ఏడాదితో పోలిస్తే ఇది 46 శాతం అధికం కావడం విశేషం. ఇక దేశం నుంచి వివిధ దేశాలకు 2023లో సరఫరా అయిన ఐఫోన్ల విలువ రూ. 76,500 కోట్లు. గతేడాది ఇది రూ. 1,02,000 కోట్లు. మొత్తం ఐఫోన్ల ఉత్పత్తిలో భారత వాటా 14 శాతం దాటిందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. లేటెస్ట్ మోడళ్లు అయిన ఐఫోన్ 16 ప్రో, ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్ సైతం భారత్‌లో తయారవడం విశేషం. హైదరాబాద్ సమీపంలోని ఫాక్స్‌కాన్ ప్లాంటులో కొద్ది రోజుల్లో ఎయిర్‌పాడ్స్ తయారీ ప్రారంభం కానుంది. 2023–24లో యాపిల్ నికరలాభం 23 శాతం దూసుకెళ్లి రూ. 2,745.7 కోట్లు, ఆదాయం 36 శాతం పెరిగి రూ. 67,121 కోట్లుగా నమోదైంది.


అమ్మకాల్లో మన ఊరి వాటా

పెద్ద నగరాలు	40 శాతం
నగరాల వెలుపల	60 శాతం

భారత్‌లో విలువపరంగా 2024 క్యూ4లో టాప్‌-5 కంపెనీలు, వాటా (శాతాల్లో)



దేశంలో అమ్ముడైన స్మార్ట్‌ఫోన్ల యూనిట్ల పరంగా టాప్‌-5 కంపెనీలు, వాటా (శాతాల్లో)



భారత్‌లో యాపిల్ ఉత్పత్తుల తయారీ, ఎగుమతులు బిలియన్ డాలర్లలో, వృద్ధి శాతాల్లో..

విషయం	2023	2024	వృద్ధి
తయారీ	12	17.5	45.83
ఎగుమతులు	9	12.8	42.2
తయారీలో ఎగుమతుల వాటా	75	73	(2.66)

ప్రపంచ స్మార్ట్‌ఫోన్ల విపణిలో 2020తో పోలిస్తే గతేడాది ఐఫోన్ పనితీరు

విషయం	2020	2024
పరిశ్రమ విలువలో వాటా	38	46
పరిమాణంలో వాటా	15	18
సగటు విక్రయ ధర రూపాయల్లో	62,700	78,200

భారీ అవకాశాలు ఉన్నాయి..

భారత్‌లో అత్యధికంగా అమ్ముడవుతున్న స్మార్ట్‌ఫోన్ మోడల్‌గా ఐఫోన్ అవతరించింది. రికార్డు స్థాయిలో వ్యాపారాన్ని నమోదు చేసిన భారత్‌పై కంపెనీ చాలా ఆసక్తిగా ఉంది. డిసెంబర్ త్రైమాసికంలో ఐఫోన్ అత్యధికంగా అమ్ముడై భారత్‌లో రికార్డు నెలకొల్పింది. ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్లకు భారత్ రెండవ అతిపెద్ద విపణి. అలాగే పర్సనల్ కంప్యూటర్లు, టాబ్లెట్ పీసీలకు మూడవ అతిపెద్ద మార్కెట్. ఇక్కడ భారీ వ్యాపార అవకాశాలు ఉన్నాయి. మరిన్ని యాపిల్ స్టోర్లను ప్రారంభిస్తాం. అంతర్జాతీయంగా డిసెంబర్ త్రైమాసికంలో యాపిల్ మొత్తం ఆదాయం రికార్డు స్థాయిలో 4 శాతం పెరిగి 124.3 బిలియన్ డాలర్లుగా నమోదైంది. - టిమ్ కుక్, సీఈవో, యాపిల్

క్లుప్తంగా...

బీసీల అణచివేతకే కుల గణన


సర్వేలో రాష్ట్రంలోని బీసీల జనాభాను తగ్గించి చూపారు: కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్ విమర్శించారు. కులగణనలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల జనాభాను తగ్గించి చూపిందని ఆరోపించారు. కులగణన సర్వే తప్పుల తడకగా ఉందని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ లెక్కలు బీసీలను రాజకీయంగా అణచివేసేందుకే అన్నట్లుగా ఉన్నాయని అన్నారు. 'కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సమక్షంలో గతేడాది నవంబర్ 6న సర్వేను ప్రారంభించినప్పుడు.. ఈ సర్వే దేశానికి రోల్ మోడల్ అని ఆయన చెప్పారు. బీసీల ఓట్లను తగ్గించి ముస్లింలకు కట్టబెట్టడమే రోల్ మోడలా?' అని లక్ష్మణ్ ప్రశ్నించారు.

ఫిబ్రవరి 12 వరకు హరీశ్ అరెస్టు వద్దు


ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోసారి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును ఫిబ్రవరి 12 వరకు అరెస్టు చేయొద్దని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను మరోసారి పొడిగించింది. రాజకీయ కక్షలో భాగంగానే తనపై నమోదు చేసిన 'ట్యాపింగ్' కేసు నమోదు చేశారని.. దాన్ని కొట్టేయాలంటూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది దామ శేషాద్రి నాయుడు వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. అయితే ప్రభుత్వం తరఫున హాజరుకావాల్సిన సీనియర్ న్యాయవాది ఢిల్లీ ఎన్నికల కారణంగా రాలేకపోయారని.. విచారణ వాయిదా వేయాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు కోరారు. అందుకు అనుమతించిన న్యాయమూర్తి.. ఇరుపక్షాల విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణ ఈ నెల 12కు వాయిదా వేశారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చట్టం చేయాలి

బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా చట్టం చేయాలని బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే రాష్ట్రం రణరంగమవుతుందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని హెచ్చరించారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా కులగణనలో బీసీల శాతాన్ని తగ్గించి చూపించారని ఆరోపించారు.

ముగ్గురు అదనపు జడ్జీలు హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా..



జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్‌కుమార్‌లను సిఫార్సు చేసిన సుప్రీం కొలీజియం

ఒకట్రెండు రోజుల్లో రాష్ట్రపతి ఆమోదం తెలిపే అవకాశం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ కళాసికం సుజన, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌లను శాశ్వత జడ్జీలుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం బుధవారం కేంద్ర న్యాయశాఖకు ఈ మేరకు సిఫార్సులు పంపింది. 2023 జూలై 31న వారు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు ఏడాదిన్నర కాలంలో వందల సంఖ్యలో పిటిషన్‌లను పరిష్కరించారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు ఒకట్రెండు రోజుల్లో రాష్ట్రపతి ఆమోద్రముద్ర వేసే అవకాశం ఉంది. దీంతో శాశ్వత న్యాయమూర్తుల సంఖ్య 26కు చేరింది. అదనపు న్యాయమూర్తుల సంఖ్య నాలుగుకు తగ్గింది. రెండు కలిపి ఇంకా 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జస్టిస్ సుజన కళాసికం..



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన మధుసూదన్, ప్రమీల దంపతులకు 1970 మార్చి 10న సుజన జన్మించారు. ఇంటర్ ఆలేరులో, డిగ్రీ ఓయూలో పూర్తి చేశారు. 1997లో బార్‌కౌన్సిల్‌లో నమోదయ్యారు. 2010లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ హోదాలో కొనసాగుతూనే 2012లో జిల్లా జడ్జి పరీక్షలు రాశారు. కరీంనగర్ అదనపు జిల్లా జడ్జిగా, నిజామాబాద్ జిల్లా జడ్జిగా, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పనిచేశారు. ఘట్‌కేసర్‌కు చెందిన న్యాయవాది శ్రీశంకర్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు అబ్బాయిలు.

జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి..



నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం మెండోరాలో ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, రాజుబాయి దంపతులకు 1968 మే 13న జన్మించారు. ముపకల్ జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్ఎస్‌సీ పూర్తి చేశారు. నిజామాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్, గిరిరాజ్ కాలేజీలో డిగ్రీ చదివారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. 1994లో బార్‌కౌన్సిల్ మెంబర్‌అయ్యారు. రాజ్యాంగం, సివిల్ లాలో పట్టు సాధించారు. జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీ, ఎన్‌బీసీసీ, వివిధ బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. కవిత వాహినిని వివాహం చేసుకున్నారు. వారికి కుశాల్ కృష్ణ, లాస్య సంతానం.

జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి..



లక్ష్మీబాయి, వీర బసప్పలకు 1971 డిసెంబర్ 28న జన్మించారు. వారిది సంగారెడ్డి జిల్లా మంగళ్‌పేట్. ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ, లాలో బ్యాచిలర్ డిగ్రీ, మర్కంటైల్ లాలో మాస్టర్స్ డిగ్రీ, ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిజల్యూషన్‌లో పీజీ డిప్లొమా చేశారు. 2002 నవంబర్ 14న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2014 మార్చి నుంచి 2023 జూలై వరకు హైకోర్టులో రాష్ట్ర న్యాయ సేవా అథారిటీ, జిల్లా న్యాయ సేవా అథారిటీ, శాశ్వత లోక్ అదాలత్‌లకు స్టాండింగ్ కౌన్సెల్‌గా ప్రాతినిధ్యం వహించారు. హిమబిందును వివాహం చేసుకున్నారు. వారికి అక్షిత, హర్షవల్లిక, లక్ష్మీవీర వెంకటేశ్ సంతానం.

పాలమూరు నీటి అవసరాలు తీర్చండి

కర్ణాటక సీఎం, నీటిపారుదల మంత్రికి మంత్రులు జూపల్లి, శ్రీధర్‌బాబు విజ్ఞప్తి



సీఎం సిద్ధరామయ్యకు వినతిపత్రం అందిస్తున్న మంత్రి జూపల్లి, సంపత్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలోని నారాయణపూర్ జలాశయం నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, నీటిపారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్‌కు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ ఆదేశాలతో జూపల్లి కృష్ణారావు బుధవారం బెంగళూరులో సీఎం సిద్ధరామయ్యను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం శ్రీధర్‌బాబుతో.. డీకే శివకుమార్‌ను కలిసి నారాయణపూర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. జిల్లా సాగు, తాగు నీటి అవసరాలు తీర్చే జూరాల ప్రాజెక్టులో నిల్వలు 1.7 టీఎంసీలకు పడిపోయాయని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన డీకే శివకుమార్ 4 టీఎంసీలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

రూ.20 వేల కోట్లు కేటాయించండి

ప్రభుత్వాన్ని కోరిన నీటిపారుదల శాఖ

సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 2025–26 వార్షిక బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లను కేటాయించాలని నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రుణ చెల్లింపులతోపాటు ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ, ఉద్యోగుల జీతాలకు మరో రూ.12,500 కోట్లను ఇవ్వాలని కోరింది. ఈ మేరకు బడ్జెట్ అవసరాలను సమర్పించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి, కొడంగల్‌-నారాయణపేట ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించి వాటిని వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.7,024 కోట్లను ఖర్చు చేయగా పెండింగ్ బిల్లులు కలిపి రూ.10,120 కోట్ల చెల్లింపులు జరిపింది. ఇందులో ప్రాధాన్యత ప్రాజెక్టులకు రూ. 2,740 కోట్లు ఖర్చు చేసింది.

సీఎల్పీ.. వెంటనే ఢిల్లీకి

▶ మొదటి పేజీ తరువాయి

మంజూరు, ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా మంత్రులతో ఎమ్మెల్యేలకు సమన్వయం, ఇన్‌చార్జి మంత్రుల పెత్తనం తదితర అంశాలపైనా చర్చించే అవకాశం ఉంది. ఈ భేటీలో సీఎం రేవంత్‌తోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొననున్నారు.

ఈ అంశాలు ప్రజల్లోకి వెళ్లడం లేదా?

రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఆరు గ్యారంటీల అమలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి కీలక అంశాల విషయంలో ప్రభుత్వం దూకుడుగా వెళుతున్నా.. ప్రజల్లో అంత దూకుడుగా చర్చ జరగడం లేదని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. దీనితో ఈ అంశంపై ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌తోపాటు పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేయనున్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యేలు పోషించాల్సిన పాత్రను వివరించనున్నట్టు సమాచారం. కులగణన, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన చరిత్రాత్మక ఘట్టాన్ని ప్రజలకు వివరించడం, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంపై కూడా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయనున్నారు. అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో 80 శాతానికి పైగా గెలుచుకోవాలన్న దిశగా ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించనున్నట్టు సమాచారం.

ఢిల్లీ వెళ్లి అధిష్టానంతో భేటీ..

రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇటీవలి పరిణామాలపై పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. డిన్నర్ పేరుతో కొందరు ఎమ్మెల్యేలు సమావేశమై తమ అసంతృప్తిని వెళ్లగక్కడం, పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు వంటివి ఢిల్లీ పెద్దల దృష్టికి వెళ్లాయి. చాలాకాలంగా మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్ల చైర్మన్ పోస్టుల భర్తీ పెండింగ్‌లో ఉన్నాయి. పీసీసీ కొత్త కార్యవర్గం కూర్పు కూడా ఇంకా తేలలేదు. వీటిపైనా చర్చించి మార్గనిర్దేశం చేసేందుకు సీఎం బృందానికి అధిష్టానం నుంచి పిలుపు అందింది. దీనితో జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో సీఎం భేటీ కార్యక్రమంలో మార్పు జరిగింది. సీఎల్పీ భేటీ ముగియగానే మధ్యాహ్నం మూడు గంటలకు సీఎం రేవంత్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మున్షీ, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఢిల్లీ వెళ్లనున్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన జరిగిన తీరును అధిష్టానం పెద్దలకు రాష్ట్ర నేతలు వివరించనున్నారు. ఢిల్లీలో పార్టీ నాయకత్వం చర్చల్లో ఏ నిర్ణయాలు తీసుకుంటారు? మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్ పదవుల భర్తీకి మార్గం సుగమం అవుతుందా అని పార్టీ వర్గాల్లో ఉత్కంఠ కనిపిస్తోంది.

గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా

ధృతి కేసరి, నౌషీన్, షాలినిలకు తలో రూ.10 లక్షలు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అండర్‌-19 మహిళల ప్రపంచ కప్‌లో అద్భుతంగా రాణించిన క్రికెటర్ గొంగడి త్రిషకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రూ.కోటి నజరానా ప్రకటించారు. మరో టీమ్ మెంబర్, తెలంగాణకు చెందిన ధృతి కేసరితో పాటు టీమ్ హెడ్ కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి చెరో రూ.పది లక్షల చొప్పున నజరానాను ప్రకటించారు. బుధవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని త్రిష మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించిన సీఎం భవిష్యత్తులో దేశం తరఫున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, సీఎం సెక్రటరీ షానవాజ్ ఖాసీం పాల్గొన్నారు.

డిపెండెంట్ల వయోపరిమితిపై ఏరియా జీఎంలకు అధికారం


మార్గదర్శకాలు జారీ చేసిన సింగరేణి

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో 35–40 ఏళ్ల లోపు వయసున్న కార్మికుల డిపెండెంట్ల వయోపరిమితిపై ఏరియా జీఎంలకు అధికారాలిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు సీఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/సీ/081/176 పేరిట బుధవారం అన్ని ఏరియాలకు ఆదేశాలు జారీ చేసింది. సింగరేణి కార్మికుల డిపెండెంట్ల వయసును 40 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో.. యాజమాన్యం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. వయోపరిమితి విషయంలో 2018 18 మార్చి నుంచి.. 2024 జూన్ 9వ తేదీ వరకు 35 ఏళ్లు దాటిన వారి దరఖాస్తులు కార్పొరేట్ వెల్ఫేర్ జీఎం పరిశీలనకు పంపాలని యాజమాన్యం పేర్కొంది. జూన్ 10 2024 తర్వాత వచ్చే డిపెండెంట్ల వయసును.. ఆయా ఏరియాల్లోని జీఎంలు పరిశీలించి అనుమతించాలని సూచించింది.

అసమగ్ర కులగణనపై.. పార్లమెంటును తప్పుదోవ పట్టిస్తారా?

రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ

- రాష్ట్రంలో బీసీల జనాభాను తగ్గించి దారుణంగా వెన్నుపోటు పొడిచారు
- ఈ విఫల నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలంటారా?
- ఏడాదిలోనే కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడిందని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చేసిన అసమగ్ర కుల గణన సర్వేను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటును తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల సంఖ్య 1.85 కోట్లుగా, రాష్ట్ర జనాభాలో వారు 51శాతం ఉన్నట్టుగా తేలిందని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రస్తుత కులగణనలో ఈ సంఖ్య 1.64 కోట్లతో 46 శాతానికి ఎలా తగ్గిపోయిందని ప్రశ్నించారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ రాశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్న తప్పుడు లెక్కలను ఎవరూ నమ్మబోరని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశం ఆ పార్టీకి లేదని అసెంబ్లీ సాక్షిగా తేలిపోయిందని స్పష్టం చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీని తుంగలో తొక్కి... పార్టీపరంగా మాత్రమే బీసీలకు సీట్లు ఇస్తామంటూ కాంగ్రెస్ చేతులెత్తేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని అంగీకరించేందుకు తెలంగాణ బీసీ సమాజం సిద్ధంగా లేదని స్పష్టం చేశారు.

బీసీలు ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కోల్పోతారు

తెలంగాణ కులగణన సర్వేను ఇతర రాష్ట్రాల్లో వాడుకోవాలనే ఎత్తుగడలో భాగంగానే సర్వే పూర్తయినట్లుగా పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడారని కేటీఆర్ పేర్కొన్నారు. కులగణనలో దొర్లిన తప్పులను సవరించకుండా రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టడాన్ని సహించేది లేదన్నారు. తెలంగాణలోని బీసీ సంఘాల నేతలు కులగణన నివేదికను చించివేయడమే అది తప్పుల తడక అనేందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. కులగణన తప్పుడు లెక్కలతో భవిష్యత్తులో బీసీలు ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీలకు తీవ్ర అన్యాయం చేసే విఫల నమూనాను దేశవ్యాప్తంగా అమలుచేయాలని రాహుల్ కోరడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఏడాదిలోనే కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని, రాష్ట్రంలోని బీసీలకు రాహుల్ గాంధీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

నేడు ఢిల్లీకి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదాతోపాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం ఉదయం ఢిల్లీ వెళ్లనుంది. ఈ పర్యటనలో భాగంగా ధర్మేంద్ర ప్రధాన్, నితిన్ గడ్కరీలతోపాటు మరికొందరు కేంద్ర మంత్రులను కేటీఆర్ బృందం కలసి వినతిపత్రాలు సమర్పించనుంది. ధర్మేంద్ర ప్రధాన్, నితిన్ గడ్కరీల అపాయింట్‌మెంట్లు ఇప్పటికే ఖరారైనట్టు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఇక రాష్ట్రాల హక్కులను హరించేలా ఉన్న యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రులకు కేటీఆర్ వినతిపత్రం ఇవ్వనున్నారు. తెలంగాణలో జాతీయ రహదారులకు సంబంధించి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తారు. మరోవైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ సుప్రీంకోర్టులో కేటీఆర్, మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్ ఈ నెల 10న సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో పార్టీ తరఫున సుప్రీంకోర్టులో వాదిస్తున్న న్యాయవాదులతోనూ కేటీఆర్ భేటీ అవుతారని పార్టీ నేతలు వెల్లడించారు.

క్లుప్తంగా...

కుట్రదారుల వలలో పడొద్దు
మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: కులగణనను విఫలం చేసేందుకు కుట్ర పన్నినవారి వలలో పడొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనని వారికి.. దానిపై మాట్లాడేందుకు ఏం నైతిక హక్కు ఉందని ప్రశ్నించారు. ఆయన బుధవారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారమే అన్ని హామీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. బలహీన వర్గాల కోసం ఒక రోడ్ మ్యాప్ తయారైందన్నారు. కులగణనలో ఏం పొరపాటు జరిగిందో చెబితే బాధ్యతగా సరిచేస్తామని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో బీసీలకు ఏం చేశారో చర్చించడానికి సిద్ధమని చెప్పారు. హక్కుల కోసం అడిగినందుకు బీఆర్‌ఎస్ నుంచి.. బీసీ నేత ఈటల రాజేందర్‌ను బయటకు పంపారని పొన్నం ఆరోపించారు.

కులగణన ఒక చరిత్ర
మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: కులగణన ఒక చరిత్ర అని.. రెండు కులాల ప్రతినిధిగా చెబుతున్నానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆమె బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ ఆలోచనతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేశామని చెప్పారు. కులగణన అమలును అడ్డుకుంటే మనకే నష్టమని స్పష్టం చేశారు. అసెంబ్లీలో సమావేశాల మధ్యలో విపక్ష సభ్యులు వెళ్లిపోవడాన్ని బట్టి బీసీలపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై బీఆర్‌ఎస్ నేతలు వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నివేదిక బయట పెట్టిందా? అని సురేఖ ప్రశ్నించారు.

పార్టీలైన్ దాటితే చర్యలు తప్పవు: మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: పార్టీ లైన్ దాటితే ఎవరిపైన అయినా చర్యలు తప్పవని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీలైన్ దాటి మాట్లాడినవారిపై క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం రేవంత్, మంత్రుల చొరవతో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు మోక్షం లభించిందని, తెలంగాణలో కులగణన, ఎస్సీ వర్గీకరణతో బీసీ, ఎస్సీల దశాబ్దాల కల సాకారమైందన్నారు. కులగణన సర్వేపై ప్రతిపక్షాలు విమర్శలకు బదులు సలహాలు, సూచనలు చేస్తే బాగుంటుందని హితవుపలికారు. బీసీ సంఘాలను బీఆర్‌ఎస్ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని, ప్రతిపక్ష నేతల ట్రాప్‌లో బీసీ సంఘాలు పడొద్దని మహేశ్‌గౌడ్ సూచించారు.


పెద్దన్న పాత్ర పోషిద్దాం..
విశారదన్ మహారాజ్



సాక్షి, హైదరాబాద్: మాదిగలకు 10% రిజర్వేషన్లు రావాలనేది వంద శాతం సత్యమని, ఒక్క శాతం కోసం మళ్లీ పోరాడటం అవివేకమని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అభిప్రాయపడ్డారు. అందరం పెద్ద మనసు చేసుకొని పట్టువిడుపులు వదులుకొని ఒక్క శాతాన్ని దానం చేద్దామని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మాల సోదరులను కలుపుకొని పోదామని కోరారు. పెద్దన్న పాత్ర పోషిద్దామని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని తెలిపారు.

లైటింగ్ లేని 'రింగ్'

- వీధి దీపాలు లేకుండా ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం
- గ్రామీణ కేటగిరీలో నిర్మిస్తున్నందుకేనని సమాచారం
- ముందుగా వెలుపలి లైన్లు నిర్మించాలని నిర్ణయం
- భూ ఆక్రమణలను అడ్డుకునేందుకేనన్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యాధునిక ఎక్స్‌ప్రెస్ రహదారుల్లో ఒకటిగా రూపుదిద్దుకోబోతున్న రీజినల్ రింగ్‌రోడ్డు (ట్రిపుల్‌ఆర్) రాత్రి వేళ మాత్రం చిమ్మ చీకట్లోనే ఉండబోతోంది. ప్రస్తుతం నాలుగు వరుసలు, భవిష్యత్తులో ఎనిమిది వరుసలకు విస్తరణ, 5 మీటర్ల ఎత్తుతో ఎలివేటెడ్ కారిడార్‌ను తలపించే నిర్మాణం, ఇంటర్ ఛేంజ్ కూడళ్లు, అండర్‌పాస్‌లు ఇలా ఎన్నో విశేషాలతో నిర్మాణం కానున్నప్పటికీ, దాని మీద వీధి దీపాలు మాత్రం ఉండవని సమాచారం.

రూరల్ కేటగిరీ అయినందునే..

దేశంలోనే తొలి భారీ రింగురోడ్డుగా రూపుదిద్దుకున్న హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు (ఓఆర్‌ఆర్).. సాయంత్రం కాగానే శక్తివంతమైన ఎల్‌ఈడీ లైట్ల కాంతులతో ధగధగలాడుతుంది. దానికంటే మెరుగ్గా, రెట్టింపు నిడివితో నిర్మించనున్న ఆర్‌ఆర్‌ఆర్ మీద మాత్రం లైట్లు ఏర్పాటు చేయొద్దని నిర్ణయించినట్టు తెలిసింది. ఓఆర్‌ఆర్‌ను అర్బన్ రోడ్డు కేటగిరీలో నిర్మించారు. కానీ, ఆర్‌ఆర్‌ఆర్ స్వయంగా కేంద్ర ప్రభుత్వం నిర్మించే యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే అయినప్పటికీ, దాన్ని రూరల్ రోడ్డు కేటగిరీలో నిర్మిస్తున్నారు. జాతీయ రహదారులపై పట్టణ ప్రాంతాల్లో లైట్లు కనిపించినా, గ్రామీణ ప్రాంతాల్లో లైట్లు ఉండవు. దీంతో దీన్ని కూడా అదే కేటగిరీలో భాగంగా లైట్లు లేకుండా నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించినట్టు తెలిసింది. ఈ రోడ్డు పట్టణాలకు దూరంగా నిర్మితమవుతోంది. ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లు, మరీ పట్టణాలకు దగ్గరగా ఉన్న పరిమిత ప్రాంతాల్లో మాత్రం లైట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ రోడ్డుపై వేగంగా దూసుకెళ్లే వాహనాలు చీకటి వేళ సొంత లైట్ల కాంతినే ఆధారం చేసుకోవాల్సి ఉంటుంది.

తొలుత అవతలి వరుసల నిర్మాణం..

ఆర్‌ఆర్‌ఆర్‌ను ఎనిమిది లేన్లతో డిజైన్ చేశారు. కానీ, ప్రస్తుత అవసరాలకు నాలుగు లేన్లు మాత్రమే సరిపోతాయని నిర్ణయించారు. దీంతో తొలుత సెంట్రల్ మీడియన్‌ను ఆనుకుని నాలుగు (ఒక్కో వైపు రెండు చొప్పున) వరుసలు నిర్మించాలని భావించారు. కానీ, ఇప్పుడు నిర్ణయం మార్చుకుని తొలుత చివరి భాగాల్లో రెండు చొప్పున నాలుగు వరుసలు నిర్మించాలని నిర్ణయించారు. భవిష్యత్‌లో భూములు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉంటుందనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

అత్యంత ప్రతిష్టాత్మకంగా బీసీ కులగణన సర్వే
శాసన మండలి చైర్మన్ గుత్తా ప్రశంసలు



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించని విధంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెలంగాణ ప్రభుత్వం బీసీ కులగణన సర్వేను నిర్వహించిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రశంసించారు. బుధవారం తెలంగాణ శాసన సభ ప్రాంగణంలోని కమిటీ హాల్‌లో బీసీ కులగణన సబ్ కమిటీ చైర్మన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ, అధికారులు సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా నిర్వ హించారని, సర్వేపై కావాలనే కొందరు ప్రతిపక్ష నేతలు అపోహలు సృష్టించే విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రజలు వారి మాటలను నమ్మవద్దని కోరారు. ఉమ్మడి రాష్ట్రాల్లో ఉన్న మాదిరిగా ఏపీఎల్, బీపీఎల్ రేషన్ కార్డ్స్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సుఖేందర్‌రెడ్డి సూచించారు.

కులగణన సర్వే తప్పుల తడక
శాసనమండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: ఉభయసభల్లో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన కులగణన సర్వే తప్పుల తడకలా ఉందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. ఈ నివేదికను రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు అంగీకరించడం లేదని, నివేదికను అడ్డుపెట్టుకొని బీసీలకు అన్యాయం చేసే కుట్ర జరుగుతోందన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, జైపాల్‌యాదవ్‌తో కలిసి మధుసూదనాచారి బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర జనాభా నాలుగు కోట్లకుపైగా ఉండగా, కులగణన సర్వేలో సంఖ్యను తగ్గించి చూపారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టకుండా కాంగ్రెస్ చేసిన కుట్రలపై బీఆర్‌ఎస్ పోరాడుతుందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ కులగణన రిపోర్టును ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే కులాల వారీగా జనాభా సంఖ్యను బయట పెట్టాలన్నారు. సీఎం రేవంత్ అసెంబ్లీలో మానసిక ఉన్మాదిగా వ్యవహరించారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. బీసీలకు జరిగిన అన్యాయంపై రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేస్తామని ఎమ్మెల్సీ ఎల్.రమణ ప్రకటించారు.

ప్రజల వివరాలు ప్రైవేటుకు అమ్ముకున్నారు
సీబీసీఐడీతో విచారణ జరిపించండి.. సీఎంకు షబ్బీర్ లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటయిన తర్వాత 2014, ఆగస్టు 19న గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) ద్వారా సేకరించిన ప్రజల వ్యక్తిగత వివరాలను ప్రైవేటు సంస్థలకు అమ్ముకున్నారన్న ఆరోపణలున్నాయని, దీనిపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 'గత టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో రాష్ట్ర ప్రజల వివరాలను సేకరించారు. ఈ ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగాయి. వివరాల సేకరణకు చట్టబద్ధమైన విధానాన్ని పాటించలేదు. కలెక్షన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ యాక్ట్–2008 ప్రకారం లీగల్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు, ఎల్పీజీ కనెక్షన్లు, వాహన రిజిస్ట్రేషన్ల లాంటి 94 వివరాలు తీసుకున్నారు. దీని కోసం రూ.100 కోట్లు ఖర్చు పెట్టారు. కానీ ఆ వివరాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టలేదు. ఈ క్రమంలో ఆర్థిక అవకతవకలు జరిగాయనే అనుమానం ఉంది. ప్రజల గోప్యత హక్కును కాలరాస్తూ ఈ వివరాలన్నింటినీ ప్రైవేటు సంస్థలకు అమ్ముకున్నారనే ఆరోపణలున్నాయి. సున్నితమైన ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలి. వెంటనే ఈ సర్వేపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించండి'అని ఆ లేఖలో షబ్బీర్‌అలీ విజ్ఞప్తి చేశారు.

కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు: శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. రాజకీయాలు చేసేందుకు ఇది సరైన సమయం కాదంటూ ప్రతిపక్షాలకు హితవు పలికారు. ఈ మేరకు బుధవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. 'పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాం. కొందరు నిరాధార ఆరోపణలతో ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకు రూపొందించిన బీసీ డిక్లరేషన్‌ను నూరు శాతం అమలు చేసి తీరుతాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను కచ్చితంగా కేటాయించి కాంగ్రెస్ చిత్తశుద్ధిని నిరూపించుకుంటాం'అని శ్రీధర్‌బాబు అన్నారు.

సర్వే గణాంకాలతోనే సంక్షేమ పథకాలు

ప్రతి పథకానికి ఇవే ప్రామాణికం: మంత్రి ఉత్తమ్



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మహేశ్‌గౌడ్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకానికి సమగ్ర కుటుంబ సర్వే గణాంకాలే ప్రామాణికమని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రేషన్ కార్డుల మంజూరు మొదలు.. ప్రతి పథకానికి ఈ గణాంకాల ఆధారంగానే లబ్ధి కల్పించే విధంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియంతా పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా జరిగిందని, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారానే క్షేత్రస్థాయిలో సర్వే గణాంకాలు సేకరించామని వివరించారు. సర్వేపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సందేహాలు లేవనెత్తుతున్న నేపథ్యంలో బుధవారం అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారి సందేహాలను నివృత్తి చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సమగ్ర సర్వే జరిగినతీరు, నిబంధనలు పాటించిన విధానం వంటి అంశాలను సభ్యులకు వివరించినట్లు ఉత్తమ్ వెల్లడించారు. ఈ సర్వే పూర్తిగా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. కేంద్రంలో జనగణన విభాగం అనుసరించే విధానంలోనే రాష్ట్రంలో ప్రణాళిక శాఖ సర్వే చేసిందన్నారు. ఈ సర్వే సారాన్ని వెయ్యి పేజీల్లో పొందుపరిచారని, ఈ సమాచారాన్ని ఒకటి, రెండు రోజుల్లో పబ్లిక్ డొమైన్‌లో కులాలు, ఉపకులాలు, జిల్లాల వారీగా అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం మాటలన్నీ కాకమ్మ కథలే

ఆయన చెప్పినవన్నీ తప్పుడు లెక్కలే
బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో వకుళాభరణం, చిరంజీవులు

నాంపల్లి(హైదరాబాద్): రాష్ట్రంలో చేపట్టిన కులగణన బీసీల కోసం చేసింది కాదని.. సీఎం పీఠాన్ని కాపాడుకోవడానికి చేసిన సర్వే అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో 'తెలంగాణ అసెంబ్లీలో బీసీ కులగణనపై జరిగిన పరిణామాలు–సీఎం గారి తప్పుడు లెక్కలు–భవిష్యత్ కార్యాచరణ'అనే అంశంపై బీసీ సంఘాలు, బీసీ మేధావులు అత్యవసర మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్‌లతో పాటుగా పలువురు మేధావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబసర్వే తప్పుల తడకగా జరిగిందన్నారు. ఇదే విషయాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీలో బీసీ కులగణన మీద తీర్మానం చేయకున్నా, చేసినట్టుగా బిల్డప్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాకపోతే పార్టీపరంగా 42 శాతం టికెట్లు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. ఎవరిని బఫూన్లను చేయడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఏమైనా గాంధీభవన్ అనుకుంటున్నారా? గాంధీభవన్‌లో మాట్లాడాల్సిన మాటలు అసెంబ్లీలో ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందన్నారు. అసెంబ్లీలో సీఎం మాట్లాడిన మాటలన్నీ కాకమ్మ కథలుగా అభివర్ణించారు. ఇందులో వాస్తవాలు లేవన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బీసీ ద్రోహుల పార్టీగా ప్రకటిస్తున్నామని చెప్పారు. రేపు హైదరాబాద్ వేదికగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి అసెంబ్లీలో తీర్మానం చేయించుకున్న దామోదర రాజనర్సింహను చూసి బీసీ మంత్రులు సిగ్గు తెచ్చుకోవాలన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి!

- ఇతర వామపక్ష పార్టీలున్న చోట పరస్పర సహకారం
- రాష్ట్రంలో వామపక్ష వేదిక ఏర్పాటుకు కృషి
- బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్
- మీట్ ది మీడియాలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేయనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. సీపీఐ, ఇతర వామపక్షాలు బలంగా ఉన్న చోట పరస్పర సహకారంతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. వామపక్ష పార్టీల ఐక్యత తమకు తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది మీడియా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీపీఎంను విస్తరించడానికి బలమైన ఉద్యమాలే కీలకం కాబోతున్నాయన్నారు. విస్తృత పోరాటాల ద్వారా ప్రజలకు చేరువవుతామని చెప్పారు. అన్ని వామపక్ష పార్టీలను కలుపుకొని రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీలను విస్మరించడం వల్లనే ప్రజలు ఆ పార్టీని కాదని, కాంగ్రెస్‌కు అవకాశమిచ్చారని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్ బాటలోనే నడుస్తోందని ఆయన ధ్వజమెత్తారు. రైతులకు, ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ మతోన్మాద రాజకీయాలపై తన వైఖరేంటో చెప్పకుండా, అవకాశవాదంతో ముందుకెళ్తున్నదని విమర్శించారు. బీజేపీ పట్ల తమ వైఖరేమిటో స్పష్టం చేయాలని ఆ పార్టీ నాయకులను డిమాండ్ చేశారు.

ఓట్లు, సీట్లతో చూడొద్దు..

కమ్యూనిస్టుల శక్తిని ఓట్లు, సీట్లతో కాకుండా ప్రజా ఉద్యమాల ద్వారా చూడాలని జాన్‌వెస్లీ అన్నారు. హక్కుల సాధన కోసం పోరాటాల్లో కలసి వస్తున్న ప్రజలకు రాజకీయ చైతన్యం కల్పించడంలో తమ పార్టీ పరంగా కొంత వైఫల్యం ఉన్న మాట వాస్తవమేనన్నారు. ప్రజలను పోరాటాల వరకే కాకుండా ఎన్నికల్లోనూ వామపక్షాల వైపు ఉండేలా చైతన్యం కల్పించడంపై దృష్టి సారిస్తామని ఆయన చెప్పారు. ప్రజలకు మరింత చేరువ కావాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కేంద్రంలోని మోదీ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్.. పేదల వ్యతిరేక, కార్పొరేట్లకు అనుకూలమని ధ్వజమెత్తారు. తాను సామాజిక సమీకరణాలతో సీపీఎం కార్యదర్శిని కాలేదని, సీపీఎం మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకుంటే కార్యదర్శిని అయ్యానని చెప్పారు. ఈ కార్యక్రమానికి టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఎస్.హష్మీ సమన్వయకర్తగా వ్యవహరించగా, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల గణన ఆధారంగానే విధాన నిర్ణయాలు

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తిచేసిన తర్వాత దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందని అన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దాదాపు లక్ష మందిని భాగస్వాములను చేసి సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. కొందరు ఈ సర్వే జరగకూడదనే కుట్రతో అందులో పాల్గొనవద్దని పిలుపునిచ్చినా ప్రజలు సహృదయంతో పాల్గొన్నారని చెప్పారు. సర్వేలో పాల్గొన్న ప్రతి కుటుంబంతోపాటు సర్వేను విజయవంతం చేయడంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సమాజం ఎక్స్‌రే లాంటి సమాచారాన్ని సేకరించి ప్రజలకు ఇవ్వగలిగామని అన్నారు. సర్వేను చాలా పారదర్శకంగా చేశామని, త్వరలోనే అన్ని వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పౌరుల వ్యక్తిగత సమాచారం మినహా అన్ని వివరాలను ప్రజల ముందు పెడతామని చెప్పారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ ద్వారా దశాబ్దాలుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే ప్రక్రియ పూర్తయిందని ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

మాదిగలకు 11% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 32.33 లక్షల మందికిపైగా ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకునేలా ముందుకు రావడాన్ని స్వాగతిస్తూ..అభినందిస్తున్నామన్నారు. బుధవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మాదిగ జనాభా ప్రకారం మా వాటా మాకు ఇవ్వాల్సిందేనని, ఎవరి వాటా మాకొద్దని, మాది ఎవరు దోచుకున్నా ఊరుకోమని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఏకసభ్య కమిషన్ తీర్పు ఆధారంగా ఎస్సీ వర్గీకరణకు ముందుకు వెళతామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. మాదిగలకు అన్యాయం జరగడంలో మంత్రి దామోదర రాజనర్సింహ పాత్ర ఉందని, ఆయన పూర్తిగా ఫెయిల్ అయ్యారని ధ్వజమెత్తారు. మాదిగ జాతికి అన్యాయం జరగడానికి కారణమైన దామోదరను మాదిగ జాతిప్రతినిధిగా గుర్తించడంలేదన్నారు. ఆయన్ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో రెండు పదవులు మాదిగలకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 7న జరగాల్సిన లక్షల డప్పుల కార్యక్రమానికి అనుమతి రాలేదని, దీంతో ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసుకున్నామని మంద కృష్ణ తెలిపారు. దీనిపై తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు.

మాదిగలకు 11% రిజర్వేషన్‌ను ఏనాడూ అడగలేదు
మంద కృష్ణపై ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి విసుర్లు



సాక్షి, హైదరాబాద్: తన 30 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో మాదిగ సామాజిక వర్గానికి 11 శాతం రిజర్వేషన్లు కావాలని మంద కృష్ణ మాదిగ ఏరోజూ అడగలేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరించి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తుంటే ఇప్పుడు బీజేపీ మెప్పు కోసం 11 శాతం రిజర్వేషన్లు కావాలని అడుగుతున్నారని విమర్శించారు. ఎస్సీల వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బుధవారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి రవి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 11 శాతం రిజర్వేషన్ డిమాండ్ మాదిగలను మోసం చేసే కుట్రలో భాగమేనన్నారు. గతంలో 7 శాతం రిజర్వేషన్ కావాలని కోరిన కృష్ణ మాదిగ ఇప్పుడు 11% కావాలనడం అర్థరహితమని పేర్కొన్నారు. బీజేపీని బలోపేతం చేసి, మాదిగలకు తీరని అన్యాయం జరిగినా తాను రాజకీయంగా లబ్ధి పొందాలనేదే ఆయన ఆలోచన అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల్లోని అన్ని ఉపకులాలకు న్యాయం చేసిందని రవి అభిప్రాయపడ్డారు.



మోసపోవడానికి రెండు మార్గాలున్నాయి:
సత్యం కానిదాన్ని నమ్మడం, సత్యాన్ని నమ్మడానికి తిరస్కరించడం.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 6 ఫిబ్రవరి 2025

చెదిరిన డాలర్ డ్రీమ్స్

అక్రమ వలసల్ని సహించేది లేదనీ, అక్రమ వలసదారుల్ని అమెరికా నుంచి వెనక్కి పంపేవరకు నిద్రపోయేది లేదనీ చెబుతూ వస్తున్న అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు చేతల్లోకి దిగారు. సరైన పత్రాలు లేకుండా తమ దేశంలో ఉంటున్న భారత్‌కు చెందిన అక్రమ వలసదారుల్లో కొందరిని తొలి విడతగా వెనక్కి పంపేశారు. అమెరికాలోని టెక్సాస్‌లో శాన్ ఆంటోనియో నుంచి బయలు అమెరికన్ యుద్ధవిమానం బుధవారం మధ్యాహ్నం మన అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగడంతో కొత్త అంకం ఆరంభమైంది. ఆ ఖరీదైన సీ–17 అమెరికా యుద్ధ విమానం నుంచి 104 మంది భారతీయ అక్రమ వలసదారులు వెనక్కి వచ్చినట్టు కథనం. వచ్చిన వారి పత్రాలనూ పరిశీలించి, ప్రాథమికంగా ప్రశ్నించి, వైద్యపరీక్షలు సైతం చేసి, ఎలాంటి నేర చరిత్రా లేదని నిర్ధరించుకున్నాక వారిని స్వరాష్ట్రాలకు పంపే పనిలో భారత పాలనా యంత్రాంగం నిమగ్నమైంది. గడచిన బైడెన్ హయాంలో 2024లో అమెరికాతో మన సంబంధాలు కొంత అడుగంటాక, తాజా ట్రంప్ ఏలుబడిలో వాటిని మళ్ళీ బలోపేతం చేసుకోవాలని మోదీ సర్కార్ భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈ అక్రమ వలసల అంశం కొంత చీకాకు పరిచేదే అయినా, అనివార్యతల్ని గ్రహించి, సహనంతో సమస్యల్ని చక్కదిద్దుకోవడమే భారత్ ముందున్న మార్గం.

పత్రాలు లేకుండా ఉంటున్నవారిని సహించేది లేదని హెచ్చరిస్తూ వచ్చిన ట్రంప్ జనవరి 20న అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత అలాంటివారిని ఏరి ఏరి మరీ భారత్‌కు వెనక్కు పంపడం ఇది తొలిసారి. గతంలో, గ్వాటిమలా, పెరూ, హాండూరస్‌ల నుంచి చట్టవిరుద్ధంగా వలస వచ్చినవారిని తిరుగు టపాలో పంపేందుకు అమెరికా సైనిక విమానాన్ని వినియోగించింది. ఇప్పుడు మన విషయంలోనూ అదే చేసింది. వెనక్కి పంపేందుకు సిద్ధం చేసిన 15 లక్షల మంది జాబితాలో భారతీయులు 18 వేల మంది దాకా ఉన్నారట. అంటే, రానున్న నెలల్లో ఇలాంటి మరిన్ని విమానాల్లో వందల సంఖ్యలో మనవాళ్ళు వెనక్కి రానున్నారన్నది చేదు నిజం. అంటే, ఎంత స్నేహమున్నా అసలు సంగతికొచ్చేసరికి అగ్ర రాజ్యాధినేత భారత్‌తోనూ ముక్కుసూటిగానే ఉంటారన్నది సుస్పష్టం.

నిజానికి, మెక్సికో, ఎల్‌సాల్వడార్‌ల తర్వాత అమెరికాలో అక్రమ వలసదారుల్లో అధిక సంఖ్యాకులు భారతీయులే. అక్కడ అలాంటి భారతీయుల సంఖ్య దాదాపు 7.25 లక్షలని ఓ లెక్క. తాజాగా వెనక్కివచ్చినవారిలో పంజాబ్ (30 మంది), హరియాణా (33), గుజరాత్ (33), తదితర రాష్ట్రాల వారున్నారు. వీరిలో పిల్లలు, మహిళలు కూడా ఉండడం గమనార్హం. ఆ మాటకొస్తే, అమెరికా ఇలా అక్రమ వలసదారులైన భారతీయుల్ని వెనక్కిపంపడం కొత్తేమీ కాదు. గత అక్టోబర్‌లోనూ వంద మంది పంజాబ్‌కు తిరిగొచ్చారు. 2023 అక్టోబర్ నుంచి నిరుడు సెప్టెంబర్ ఆఖరు వరకు మొత్తం 1100 మంది ఇలా ఇంటి ముఖం పట్టినవారే! అగ్రరాజ్యాన్ని కలలస్వర్గంగా ఊహించుకుంటూ, అక్కడ జీవనం బాగుంటుందనే ఆశతో, డాలర్ల సంపాదనపై ఆకర్షణతో అక్కడకు సక్రమంగానో, అవసరమైతే అక్రమంగానో వెళ్ళి, స్థిరపడాలనే ధోరణి చాలాకాలంగా ఉన్నదే. ఒక లెక్క ప్రకారం ప్రపంచపు పెద్దన్న పంచన చట్టప్రకారమే దాదాపు 50 లక్షల మంది భారత జాతీయులున్నారంటే మన అమెరికా మోజు ఎంతో అర్థం చేసుకోవచ్చు.

దీర్ఘకాలంగా మన భారతీయుల్లో అంతకంతకూ అధికమవుతూ వచ్చిన ఆ మోజు ఫలితమే – అధికసంఖ్యలోని అక్రమ వలసలు. ముఖ్యంగా, పంజాబ్ లాంటి ప్రాంతాల నుంచి అలా వెళ్ళేవారు మరీ ఎక్కువ. స్థానిక పంజాబీ జాతీయంలో చెప్పాలంటే 'డాంకీ రూట్స్'లో (వాహనాలు మారుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతూ) అమెరికా చేరుకుంటారు. విదేశాల్లో బతుకు తెరువుకై తపిస్తున్న వ్యక్తుల ఆశల్ని సొమ్ము చేసుకుంటూ, ట్రావెల్ ఏజెన్సీలు భారీగా లక్షల్లో డబ్బు గుంజి, దొంగ వీసాలతో వారిని ఇలా దేశాల హద్దుల్ని దాటిస్తుంటాయి. సగటున ఏటా 90 వేల పైచిలుకు భారతీయులు ఇలా అక్రమంగా అమెరికాలో ప్రవేశించబోయి, పట్టుబడుతున్నారు. తల తాకట్టుపెట్టి, సరైన పత్రాలు లేకుండానే అందరి కళ్ళుగప్పి అలా హద్దులు దాటి వెళ్ళిన పలువురికి ఇప్పుడు కల చెదిరింది. ట్రంప్ రాకతో వారి కథ మారింది. చాలామందికి కన్నీరే మిగిలింది.

తగిన పత్రాలు లేకుండా అమెరికాలోనే కాదు, ఏ దేశంలోనైనా ఏ జాతీయులు నివసించినా అది తప్పే. శిక్షార్హమైన నేరమే. ఇంతకాలం చూసీచూడనట్టు చెల్లిపోయినా, అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా తీర్చిదిద్దుతానంటూ ఇప్పుడు రెండోసారి పగ్గాలు చేపట్టిన ట్రంప్ ఖడ్గప్రహారం చేయడాన్ని తప్పుపట్టలేం. అందుకే, బాధితులు భారతీయులైనా మన దేశం మారుమాట్లాడ లేకపోతోంది. ఆ మాటకొస్తే, వ్యవస్థీకృత నేరాలకు దారి తీస్తున్నట్లు భావిస్తున్న అక్రమ వలసలకు భారత్ వ్యతిరేకమని మన విదేశాంగ శాఖ నొక్కి వక్కాణించాల్సి వచ్చింది. అదే సమయంలో భారతీయుల పునరాగమనానికి వీలు కల్పిస్తామనీ చెప్పాల్సి వచ్చింది. వాణిజ్య సుంకాల విధింపు సహా అనేక విషయాల్లో ట్రంప్ దూకుడు మీదున్న తరుణంలో అమెరికాతో దీర్ఘకాలిక స్నేహసంబంధాలకు ఇబ్బంది కలగకుండా మన దేశం ఆచితూచి వ్యవహరించక తప్పదు. ఆ కోణం నుంచి చూసినప్పుడు భారత్ వైఖరి సమంజసమే కాదు సహజం కూడా! అయితే, ఈ అక్రమ వలసల్ని ఆపాలంటే, అమాయకుల ఆశను సొమ్ము చేసుకొనే అక్రమార్కుల పనిపట్టాలి. అంతకన్నా ముఖ్యంగా, ఆశల పల్లకీలో అగ్రరాజ్యం వైపు ఉరికే మనవాళ్ళకు గౌరవప్రదమైన ఉపాధి, ఉద్యోగావకాశాలిక్కడే కల్పించడంపై పాలకులు దృష్టిపెట్టాలి. చిత్తశుద్ధితో అది చేయనంతకాలం ఈ డాలర్‌డ్రీమ్స్ కథలు కంచికి చేరవు!

పడిపోతున్న వర్సిటీల ప్రమాణాలు

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

రాష్ట్రాల జాబితాలోని అంశాలు కొన్నింటిని, ఉమ్మడి జాబితాలోని అంశాల్లో మరి కొన్నింటిని క్రమంగా దొడ్డిదారిన తన ఖాతాల్లోకి మళ్లించుకొంటూ ఇప్పటికే కేంద్రం సమాఖ్య స్ఫూర్తిని అపహాస్యం చేస్తోంది. తాజాగా విశ్వవిద్యాలయాల్లో సంస్కరణల పేరుతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ద్వారా రూపొందించిన ముసాయిదాను బలవంతంగా రాష్ట్రాలపై రుద్ది, యూనివర్సిటీలపై పూర్తి స్థాయి పట్టుసాధించడానికి కేంద్రం అడుగులు వేయడంతో మరో కొత్త వివాదం మొగ్గ తొడిగింది.

యూజీసీ ప్రతిపాదించిన సంస్కరణలు అమలులోకి వస్తే... ఎంతో కీలకమైన వైస్ ఛాన్స్‌లర్ల నియామకాల్లో రాష్ట్రాలకున్న హక్కు లుప్తమైపోతుంది. ఇప్పటివరకు ఉపకులపతులుగా అర్హులైన వారిని నియమించడానికి సెర్చ్ కమిటీ వేయడం ఆనవాయితీగా ఉంది. సెర్చ్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రతినిధి ఒకరు ఉంటారు. సెర్చ్ కమిటీ ఎంతో కసరత్తు జరిపి 5 పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపితే... దానిని పరిశీలించి ఒక అభ్యర్థిని ఎంపిక చేసి గవర్నర్ ఆమోదానికి పంపుతుంది. కానీ, కొత్తగా వచ్చే సంస్కరణల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయానికి కత్తిరింపు వేశారు. నిజానికి, రాష్ట్ర ప్రభుత్వాల హక్కుల్ని హరించే సంస్కరణలు చాలానే యూజీసీ ప్రతిపాదించింది. ఇవన్నీ రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటు అవుతాయా అన్న అంశం పక్కన పెడితే... అసలు యూనివర్సిటీల్లో చేపట్టాల్సిన సంస్కరణలు ఏమిటి? నాణ్యతా ప్రమాణాలు పెంచే సంస్కరణలు కాకుండా పెత్తనం కోసం కేంద్రం వెంపర్లాడటం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

సంస్కరణలు ఏ రంగంలో చేపట్టాలి?

మన దేశంలోని పలు యూనివర్సిటీలు, వాటి అనుబంధ కళాశాలల విద్యా ప్రగతి ప్రమాణాలు పాతాళానికి పడిపోయాయన్నది నిర్వివాదాంశం. ఆర్థిక, సాంకేతిక అభివృద్ధికి బంగారు బాటలు వేయడంలో ఉన్నత విద్య, పరిశోధన కీలకమైనవి. ఆరోగ్యం, ఆహారం, ఉపాధి తదితర రంగాలలో ఎదురయ్యే సవాళ్లకు తగిన పరిష్కారం అందించే పరిశోధనలు పురుడుపోసుకొనేది యూనివర్సిటీ ప్రాంగణాలలోనే. వివిధ దేశాలలో జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలతో పోలిస్తే భారత్ ఎంతో వెనుకబడి ఉంది. ఒకప్పుడు దేశానికి గర్వకారణంగా నిలిచిన యూనివర్సిటీలు పలు రుగ్మతలతో కునారిల్లుతున్నాయి. నిధుల లేమి, రాజకీయ జోక్యం, బోధనా సిబ్బంది కొరత, అవసరమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం తదితర కారణాలతో యూనివర్సిటీల ప్రమాణాలు గణనీయంగా పడిపోయాయి. గతేడాది 'క్యూఎస్' అనే ప్రఖ్యాత సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 107 దేశాల్లోని 1,740 యూనివర్సిటీలను అధ్యయనం చేసి ర్యాంకులు ఇవ్వగా అందులో భారత్‌కు చెందిన 78 యూనివర్సిటీలు మాత్రమే ఆ ప్రమాణాలు అందుకోగలిగాయి.

ఒకప్పుడు ప్రపంచానికి దిశానిర్దేశనం చేసి, వేల సంఖ్యలో గొప్ప విద్యావేత్తలను అందించిన నలంద, తక్షశిల, విశ్వభారతి, శాంతినికేతన్ వంటి అత్యున్నత విద్యా పీఠాలు గలిగిన భారతదేశంలో నేడు అనేక యూనివర్సిటీలలో విద్యా ప్రమాణాలు అడుగంటాయి.



ఆవిష్కరణలకు మాతృమూర్తి వంటి విశ్వవిద్యాలయాలు విజ్ఞాన వెలుగులు ప్రసరించాలంటే అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, నిష్ణాతులైన బోధనా సిబ్బంది ఉండాలి. రాజకీయ జోక్యానికి తావులేకుండా సమర్థత, అంకితభావం కలిగిన వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలి.

విశ్వగురువు ఎలా అవుతాం?

2047 నాటికి మన దేశం 'విశ్వగురువు'గా అవతరించాలని ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంగా పెట్టుకొన్నారు. ఈ లక్ష్యం గొప్పదే. అందుకు తగిన కార్యాచరణ అన్ని రంగాలలో కనపడాలిగా! ప్రత్యేకించి ఉన్నత విద్యారంగంలో, పరిశోధనా రంగంలో అభివృద్ధి పథంవైపు అడుగులు పడాలి. అందుకు భిన్నంగా ఈ రంగంలో అడుగులు తడబడుతున్నాయి. అందుకు ఉదాహరణ దేశం నుంచి సుమారు 13 లక్షల మంది విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం విదేశాల బాట పట్టడం. నాణ్యమైన ఉన్నత విద్యకు చిరునామాగా నేటికీ అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాలే నిలుస్తున్నాయి. వైద్య విద్య కోసం ఒకప్పటి కమ్యూనిస్టు దేశాలైన రష్యా, అజర్‌బైజాన్, ఉక్రెయిన్ తదితర దేశాలకు భారతీయ విద్యార్థులు వేల సంఖ్యలో 'క్యూ' కడుతూనే ఉన్నారు.

జబ్బు ఒకటయితే, మందు మరొకటి వేసినట్లుగా... దేశంలోని విశ్వవిద్యాలయాలను అన్ని విధాలా బలోపేతం చేసే చర్యలను తీసుకోకుండా, దేశంలో విదేశీ యూనివర్సిటీలకు ద్వారాలు తెరిచేందుకు రంగం సిద్ధం చేయడం, యూనివర్సిటీలపై రాష్ట్రాల హక్కుల్ని హరించి వేయడం విద్యావేత్తలను కలవరపరుస్తోంది. మరోవైపు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన స్వదేశీ విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేస్తున్నారు.

దేశంలో విదేశీ యూనివర్సిటీల ఏర్పాటుకు మార్గాన్ని ఏర్పరిస్తే... ఎటువంటి విదేశీ యూనివర్సిటీలు ఇక్కడకు వస్తాయి? ప్రపంచంలో పేరు బడిన తొలి 50 యూనివర్సిటీలు భారత్ కొస్తాయా? అని ప్రశ్నించుకొంటే స్పష్టమైన సమాధానం దొరకదు. పైగా ఇక్కడకు వచ్చే విదేశీ యూనివర్సిటీలపై తమ నియంత్రణ ఏదీ ఉండదనీ, కానీ పారదర్శకతతో ఉండాలని మాత్రమే కోరతామనీ యూజీసీ స్పష్టం చేసింది. అంటే... ఫీజుల వసూళ్ల విషయంలో విదేశీ వర్సిటీలకు స్వేచ్ఛ ఉంటుంది. అయితే అవి ప్రదానం చేసే డిగ్రీలకు, విదేశాలలో ఇచ్చే పట్టాలకు సమానమైన విలువ ఉంటాయన్నది ఒక్కటే విద్యార్థులను ఆకర్షిస్తోంది. విదేశీ యూనివర్సిటీలు ఇక్కడ ఎంత పెట్టుబడి పెట్టాలో ముసాయిదా పత్రంలో నిర్దేశించకపోవడంతో అవి మన బ్యాంకుల నుంచే రుణాలు పొంది, వాటితోనే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి, లాభాల్ని మాత్రం తమ దేశానికి తీసుకెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. పైగా విదేశీ యూనివర్సిటీలలో సంపన్నుల పిల్లలు మాత్రమే చదువు'కొనే' అవకాశం ఉన్నందువల్ల... దేశంలో 'సంపన్న విద్యార్థి శ్రేణి' మరొకటి నూతనంగా తయారవుతుంది.

బోధన–పరిశోధన

ఒకప్పుడు దేశంలోని పలు విశ్వవిద్యాలయాలలో జరిపిన పరిశోధనలకు అంతర్జాతీయంగా పేటెంట్లు లభించాయి. ఒక అంచనా ప్రకారం... దేశంలోని మన వర్సిటీలు ఏటా 24,000 డాక్టరేట్ పట్టాల్ని ప్రదానం చేస్తున్నాయి. అంటే ఏటా వేల సంఖ్యలో పరిశోధనా పత్రాలు వెలువడుతున్నాయి. కానీ... వాటిని దేశాభివృద్ధి కోసం ఏ మేరకు ఉపయోగించుకోగలుగుతున్నారనేదే ప్రశ్నార్థకం. అసలు రీసెర్చ్ ఈ అంశం మీద జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఏది ఏమైనా... స్వదేశీ విశ్వవిద్యాలయాలకు రెండు కళ్లుగా భావించే బోధన, పరిశోధనలను పటిష్ఠం చేయాలి. విదేశీ విశ్వవిద్యాలయాల మోజులో స్వదేశీ విశ్వవిద్యాలయాలను నిర్లక్ష్యం చేయడం ఎంతమాత్రం తగదు. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలను, సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు ఉన్నత విద్యా వ్యవస్థను మెరుగ్గా తీర్చిదిద్దాలి. విశ్వ విద్యాలయాలపై రాష్ట్రాల హక్కుల్ని కొనసాగించాలి. ఉపకులపతుల నియామకం పూర్తిగా రాజకీయమై పోయింది. రాజకీయాలకు అతీతంగా విశ్వ విద్యాలయాలు పని చేయగలిగే సంస్కరణలు తేవాలి తప్ప కొండ నాలిక్కి మందేస్తే ఉన్న నాలిక ఊడిన చందంగా కేంద్రం వ్యవహరించడం సమ్మతం కాదు.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి

◆ యూజీసీ ప్రతిపాదించిన సంస్కరణలు అమలులోకి వస్తే, ఎంతో కీలకమైన వైస్ ఛాన్స్‌లర్ల నియామకాల్లో రాష్ట్రాలకున్న హక్కు లుప్తమైపోతుంది.

◆ వివిధ దేశాలలో జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలతో పోలిస్తే భారత్ ఎంతో వెనుకబడి ఉంది. ఒకప్పుడు దేశానికి గర్వకారణంగా నిలిచిన యూనివర్సిటీలు పలు రుగ్మతలతో కునారిల్లుతున్నాయి.

◆ గతేడాది 'క్యూఎస్' అనలిటికా సంస్థ ప్రపంచవ్యాప్తంగా 107 దేశాల్లోని 1,740 యూనివర్సిటీలను అధ్యయనం చేసి ర్యాంకులు ఇస్తే, అందులో గ్లోబల్ టాప్–25లో గానీ, ఆసియా టాప్–10లో గానీ ఒక్క ఇండియా యూనివర్సిటీ లేదు.

సోషల్ మీడియా

వైఖరి బహిరంగం



నాకు తెలిసినప్పటి నుంచీ ఇజ్రాయెలీ వలసవాద ప్రాజెక్టు, పాలస్తీనియన్ల ఊచకోతకు యూఎస్ మద్దతిస్తూనే ఉంది. ట్రంప్ వైఖరిలో కొత్త విషయం ఏమంటే, దాన్ని ఆయన వేగవంతం చేయాలనుకుంటున్నారు.

– జేసన్ హికెల్, సీనియర్ ఫెలో

ద్వేషంలో పోటీ



ఇవ్వాళ భారమైన హృదయంతో ఓటు వేయడానికి వెళ్లాను. బంగ్లాదేశీ వలసదారుల మీద ద్వేషాన్ని రెచ్చగొట్టడంలో బీజేపీ, ఆప్ రెండు పార్టీలూ పోటీ పడుతున్నాయి. పాఠశాల ప్రవేశాల్లో పిల్లలు ఇప్పుడు తాము బంగ్లాదేశీ కాదని నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఇదంతా ట్రంప్ ప్లేబుక్ నుంచి అరువుతెచ్చుకున్నట్టుగా ఉంది.

– హర్ష్ మందర్, సోషల్ యాక్టివిస్ట్

మా సానుభూతి



ఆగా ఖాన్ తన జీవితాన్ని శాంతి సౌభాగ్యాల కోసం అర్పించారు. అన్ని ఖండాలు, సంస్కృతుల వ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లయిన పేదరికం, విద్య, లింగ సమానత్వం కోసం పనిచేశారు. ఆయన కుటుంబానికీ; కెనడా, ఇంకా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ ముస్లింలు అందరికీ మా కుటుంబ సానుభూతి.

– జస్టిన్ ట్రూడో, కెనడా మాజీ ప్రధాని

మతానికి దూరం



అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చి షరియా చట్టాన్ని అమలు పరుస్తున్నప్పటి నుంచీ ఇస్లాంను తిరస్కరిస్తున్న అఫ్గాన్ యువత సంఖ్య పెరుగుతోంది. తాలిబన్లు ఎక్కువ కాలం అధికారంలో ఉంటే, సగం మంది మతానికి దూరమైనా ఆశ్చర్యం లేదు.

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ యాక్టివిస్ట్

ఆగిపోవడం కాదది!



మీరు జీవితంలో ఎదగక పోతే, మీరు నిలిచిపోయారు అన్న భావనలో మాత్రం ఉండవద్దు. క్షీణిస్తున్నారని అర్థం. ప్రకృతిలో ఏదైనా పెరుగుతుంది, లేదా నశిస్తుంది. నిలిచిపోవడం అనేది ఉండదు.


– మనోజ్ అరోరా, పర్యావరణవేత్త

ఇన్‌బాక్స్

అద్వితీయ చిత్రకళా తపస్వి

తెలుగు జాతి సాంస్కృతిక పునరుజ్జీవనానికి అతి పిన్న వయసులో విశిష్టమైన కృషి చేసిన తొలి కళా తపస్వి దామెర్ల రామారావు. బాల్యం నుంచే చిత్రకళ పట్ల నెలకొన్న గాఢమైన అభినివేశం ఆయన్ని అవిశ్రాంత కళా పిపాసిగా చేసింది. 1897, మార్చి 8న జన్మించిన రామారావు రెండు పదుల వయసు నిండకుండానే ముంబైలోని 'జె. జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్'లో చేరి చిత్రకళలో నైపుణ్యం సంపాదించారు. రాజమండ్రి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా చేసిన ఆంగ్ల రచయిత ఆస్వాల్డ్ కూల్డ్రేకు రామారావు అంటే ఎంతో అభిమానం. అందుకే తాను రాసిన 'సౌత్ ఇండియన్ అవర్' అనే గ్రంథాన్ని తెలుగులో గొప్ప రచయితలైన కవికొండల వెంకటరావు, అడివి బాపిరాజులతో బాటుగా దామెర్ల రామారావు గారికి కూడా అంకిత మిచ్చారు.

ప్రఖ్యాత కవి పండితులు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి దామెర్లవారి గురించి ఇలా అన్నారు: **'జీవముల వోసి, బొమ్మల జేసెనొకడు/బొమ్మలు గీసి జీవమును వోసెనొకడు/ రాముడాతడు, దామెర్ల రాము డితడు/ లేవు కాలావధులు చిత్ర లీలలందు.'** రవీంద్రనాథ్ టాగోర్‌ను కలిసిన పది నిమిషాల్లో విశ్వకవి చిత్రపటాన్ని గీసిచ్చారు. రామారావు ప్రతిభకు ఆశ్చర్యపోయిన టాగోర్ 'ప్రపంచంలోకెల్లా గొప్ప చిత్రకరుడివి కాగలవు' అని దీవించారట. అప్పటి వైస్రాయ్ లార్డ్ రీడింగ్ రామారావు 'తూర్పు కనుమల్లో గోదావరి' చిత్రాన్ని చూసి ముగ్ధుడై అప్పటికప్పుడు ఆ చిత్రం కొనేయడమే కాక, 'స్వదేశీ ఉద్యమం జరుగుతున్న సమయంలో నేను స్వదేశీ చిత్రాన్ని కొంటున్నాను చూడండి' అని చమత్కరించారట. అశ్లీలతకు తావులేకుండా భారతీయ మహిళని తొలిసారిగా నగ్నంగా చిత్రించిన రామారావు నవ్యాంధ్ర చిత్రకళా స్థాపకులు. 1922లో రాజమండ్రిలో 'ఆంధ్ర సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్' పేరిట చిత్రకళాశాలను స్థాపించారు. అప్పుడే 'సత్యవాణి' అనే చిత్రకారిణిని వివాహం చేసుకున్నారు. రామారావు చిత్రాలకు ఆయన భార్య సత్యవాణిగారే 'మోడల్'గా ఉండేవారు.



దామెర్ల రామారావు

స్వదేశంలోనే కాక పారిస్, లండన్, టోరంటో వంటి అంతర్జాతీయ ప్రదర్శనల్లో కూడా రామారావు చిత్రాలు ఎన్నో ప్రశంసలు, పురస్కారాలు పొందాయ్. ఇంతటి ప్రతిభావంతుడు 28 ఏళ్ళ అతి చిన్న వయసులోనే గుంటూరు జిల్లాలో పర్యటిస్తూ మశూచి వ్యాధికి గురై 1925, ఫిబ్రవరి 6న అకాల మరణం చెందారు. రామారావు చిత్రించిన 'సిద్ధార్థ రాగోదయం', 'పుష్పాలంకరణ', 'నంది పూజ', 'గోపికాకృష్ణ', 'బావి వద్ద', 'అజంత', 'ఎల్లోరా', 'పట్టిసీమ', 'మెయిడ్స్ ఆఫ్ కథియావాడ్'... వంటి అత్యద్భుత కళాఖండాల్ని ఎన్నింటి గురించి చెప్పుకున్నా తక్కువే. రామారావు స్మృతిలో రాజమండ్రిలో చిత్రకళా మందిరాన్ని, శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 1925 లోనే ఆ రెంటినీ సందర్శించిన మహాత్మా గాంధీజీ ఆ చిత్రాలని చూసి ముగ్ధులయ్యారు. ప్రస్తుతం రాజమండ్రిలోని గోదావరి స్టేషన్ వద్ద ఉన్న 'దామెర్ల రామారావు మెమోరియల్ ఆర్ట్ గ్యాలరీ'లో ఎన్నో కళాఖండాలు ఉన్నాయి. అవన్నీ తెలుగువారు సంరక్షించుకోవలసిన విశేషమైన కళా సంపదలే.

– గౌరవ్ । సాంస్కృతిక కార్యకర్త (నేడు దామెర్ల రామారావు శతవర్ధంతి)

శాసన సభ ఉన్నతిని పరిరక్షించాలి!

అభిప్రాయం



చాడ వెంకటరెడ్డి

చట్టసభలలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాత్రపై విశ్లేషణ జరగాల్సిన అవసరముంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలో పేర్కొన్న ప్రకారం ప్రజలకు ప్రజాప్రతినిధులు జవాబుదారీగా ఉండాల్సిందే. తెలంగాణ ఏర్పడే వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ హైదరాబాద్‌లోనే కొనసాగింది. ఆ సభ మేధావులకు, పోరాటయోధులకు, విలువలకు నిలువుటద్దం లాంటి వారికి నిలయంగా ఉండేది.

1983లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న ప్రభుత్వాన్ని గవర్నర్ ద్వారా కేంద్రం కూలదోయడంతో 'ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం' ఉధృత రూపం దాల్చింది. ఫలితంగా 1985లో తిరిగి అసెంబ్లీ ఎన్నికలు జరపగా ఎన్టీఆర్ ప్రభుత్వం మళ్లీ ఏర్పడింది. 1989లో కాంగ్రెస్ గెలిచింది. 1995లో టీడీపీ పాలనలో విద్యుత్ చార్జీలను భారీగా పెంచడంతో విద్యుత్ ఉద్యమం మొదలైంది. దాని సెగతో 2004లో టీడీపీ (చంద్రబాబునాయుడు) ఓడిపోవడం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఆరంభం కావడం జరిగింది. 2004లో వైఎస్ఆర్ ముఖ్యమంత్రి, చంద్రబాబు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు. అటువంటి అసెంబ్లీలో వామపక్షాలతో పాటు అనేక పార్టీలుండటం గమనార్హం. అంతేగాదు పూర్తిస్థాయిలో శాసనసభ నడిచింది. శాసనసభ చట్టంలో పేర్కొనబడిన నిబంధనలను అనుసరించి ప్రశ్నోత్తరాలు, వాయిదా తీర్మానాలు, 304 నిబంధన, మోషనులు, జీరో అవర్, లఘు చర్చ, ప్రభుత్వ బిల్లులు, మధ్యాహ్నం చర్చలు జరిగేవి. బడ్జెట్ సమావేశాలు 45 రోజుల పాటు జరిగేవి. వైఎస్ఆర్ ప్రజాదర్బార్ ద్వారా ప్రజల బాధలు తెలుసుకొని పరిష్కారానికి కొత్తగా పలు పథకాలు: ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎస్సీ, ఎస్టీ యాక్షన్ ప్లాన్, భూ పంపిణీ, ఇండ్ల స్థలాలు వంటి అంశాలపై చర్చించి అమలుకు పూనుకొనేవారు. ఆ తదుపరి 2009లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతరూపం దాల్చడంతో సభ అదుపు తప్పి గందరగోళంగా మారింది.



కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత శాసనసభ నిర్వహణ అంతంత మాత్రంగానే జరిగింది. గెలిచిన టీడీపీ, కాంగ్రెస్ సభ్యులు చాలామంది గులాబి పార్టీలోకి ఫిరాయించడంతో టీఆర్ఎస్‌కు బలమైన ప్రతిపక్షం లేకుండా పోయింది. ప్రతిపక్షాలు బలహీనపడటం, వామపక్షాలు బలంగా లేకపోవడం... కేసీఆర్‌కు కలిసి వచ్చిన కాలంగా భావించాలి. ఆయన ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఆయన చర్యలు ప్రజాస్వామ్య మనుగడకే ముప్పుతెచ్చాయి. ఎన్‌కౌంటర్లు, ఇందిరా పార్కు ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం వంటి తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా అసెంబ్లీలో చర్చించే అవకాశం లేకపోయింది. ఆఖరుకు హైకోర్టు జోక్యంతో ధర్నాచౌక్ పునరుద్ధరించబడింది.

అసెంబ్లీ స్పీకర్ పాత్ర

స్పీకర్ అధ్యక్షతన శాసన సభ సమావేశాలు జరుగుతాయి. ఆయన అనుమతి లేకుండా ఏ సభ్యుడు కూడా మాట్లాడే అవకాశముండదు. ఆయన నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. అప్పట్లో ముఖ్యమంత్రిగా వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఉన్న సమయంలో స్పీకర్ స్థానంలో ఉన్న కె.ఆర్. సురేశ్ రెడ్డి సభను గౌరవప్రదంగా నడిపించారు. ఒక సందర్భంలో ప్రతిపక్షాలను నియంత్రించేందుకు అధికార పక్షం వైపు నుంచి వచ్చే సంకేతాలకు అనుగుణంగా నడుచుకుంటున్నారని నేను సభలో అన్నాను. అలాంటిదేమీ లేదంటూ ఆయన ప్రతిసారీ మాట్లాడేందుకు అవకాశమిచ్చేవారు.

ఉమ్మడి రాష్ట్రంలో కొంతమేరకు నిబంధనలను దృష్టిలో ఉంచుకొని సభ నిర్వహణ జరిగినా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పిదప ఏకపక్షంగా జరగడం స్పీకర్ పదవికి కళంకం ఏర్పడింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెడుతుండటం, ఆఖరుకు 2/3 మెజారిటీతో పార్టీ మారినవారికి అనుకూలంగా నిర్ణయాలు వెలువడటంతో కోర్టులు కూడా జోక్యం చేసుకోని పరిస్థితి ఏర్పడింది.


ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయాలి. దూకుడుగా వ్యవహరించకూడదు. గత ప్రభుత్వం మాదిరిగా తప్పులు చేయకుండా, అవినీతికి దూరంగా, పారదర్శకతతో పరిపాలన చేస్తేనే ప్రజలలో సానుకూలత ఏర్పడుతుంది. ముఖ్యమంత్రి గారే స్వయంగా ప్రజాదర్బారు (వైఎస్ఆర్ లాగా) నిర్వహించడం ద్వారా అనేక ప్రజాసమస్యలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. తక్షణమే ప్రజలను, ప్రజాసంఘాల నాయకులను, ప్రజాప్రతినిధులను నేరుగా కలుసుకోవడం విధిగా జరగాలి. స్పీకర్ కూడా చట్ట ప్రకారం నిర్ణయాలు తీసుకొని సభ గౌరవాన్ని ప్రజల్లో నిలబెట్టాలి. ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణకు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటే చరిత్రలో నిలబడటం తథ్యం.

వ్యాసకర్త సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

సంస్కారాలు

గతాన్ని విడిచిపెడుతూ, ఎప్పటికప్పుడు పునరుత్తేజాన్ని పొందుతూ శిశిర రుతువులో ఒక్క ఆకు కూడా లేనటువంటి చెట్లు వసంత రుతువులో ఆకుపచ్చని ఆకులతో నిండి ఉంటాయి. ఎందుకు? ఎందుకంటే ప్రాణంలేని ఆకులన్నీ రాలిపోయి, తిరిగి ప్రాణశక్తిని పొంది కొత్త ఆకులతో చెట్లు నిగనిగలాడతాయి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మన సంస్కారాలు కూడా మనల్ని గతంలోనికి తోసివేస్తాయి లేక భవిష్యత్తులోనికి లాక్కెళతాయి. పర్యవసానంగా మనం మన కళ్లెదుట ఉన్న వర్తమానాన్ని కోల్పోతున్నాం.

మన చంచలమైన మనస్సును స్థిరపరచాలి. దీనిని లోపలికి మళ్ళించుట (అనగా అంతర్ముఖత్వం గావించుట)ను అభ్యసించాలి. గతంలో సంభవించిన వాటిని లేక భవిష్యత్తులో సంభవించనున్న వాటిని పట్టుకొని మనస్సు ఊగిసలాడకూడదు. జీవితం దాని మార్గంలో అది నడుస్తూ ఉంటుంది. వర్తమాన కాలంలో ఏం జరుగనున్నదో దానికి సాక్షీభూతుడుగా ఉండాలి.

మనస్సు నుండి అనేక కోరికలు పుడతాయి. అటువంటి వానిలో కొన్ని మనం ఏ ప్రయత్నం చేయకుండానే పూర్తవుతాయి. అందువలన మనం సంతోషాన్ని పొందుతాం. మరికొన్ని కోరికలు మనం ఎంతగా ప్రయత్నం చేసినా పూర్తి కావు. కోరికలు ఫలించని పరిస్థితిలో... నా కోరికలు ఏ విధంగా నెరవేరతాయి? ఏ కోరికలు నెరవేరతాయో అటువంటి కోరికలనే నేను కోరుకోవాలా? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. అయితే ఈ రెండింటికి సమాధానాలు మన దగ్గర లేవు.

మనస్సు వస్తువులతో అంటిపెట్టుకొని ఉండటం వలన కోరికలు జనిస్తాయి. కోరికలు నెరవేరినా, నెరవేరకున్నా వాటిని గూర్చి మనస్సులో ఎక్కువ ఆలోచనలు కలుగుతాయి. ఎవరైతే ఇటువంటి పరిస్థితిలో చిక్కుకుంటారో అటువంటివారి విధిని ఊబిలో చిక్కిన మనిషితో పోల్చవచ్చు. ఈ విధంగా చిక్కుకున్నప్పుడు పరిష్కారం ఎక్కడ లభిస్తుంది?

మనస్సును నెమ్మదిగా, క్రమంగా ఆలోచనారహిత స్థితికి తీసుకొని రావాలి. అందుకోసం సాధకుడు తన సాధనల ద్వారా ఆలోచనల వలన కలిగే ఒత్తిడిని దూరం చేసుకోవాలి. ఆధ్యాత్మిక లక్ష్యంపైననే మనస్సును కేంద్రీకరింప చేయాలి. దేవుని (గురువు) అనుగ్రహం వలన సాధకుడు కాస్త ముందుగానో లేక ఆలస్యంగానో తన సాధన ఫలితాలను పొందగలడు.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.నవమి రా.12.58 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** కృత్తిక రా.9.48 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** ఉ.10.35 నుండి 12.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.23 నుండి 11.11 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** రా.7.34 నుండి 9.05 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.53.

క్లుప్తంగా...

నిద్రలేపి.. గొంతు కోసి

- ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హత్య


అడమా

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఒక యువకుడిని హత్య చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా అరుణ్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాకడీ గ్రామానికి చెందిన అడమా (28) ఇంటికి మంగళవారం అర్ధరాత్రి మావోయిస్టులు వచ్చారు. నిద్రిస్తున్న అడమాను బయటకు తీసుకొచ్చి.. ఇంటి ఆవరణలోనే గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందువల్లే హతమార్చామని స్పష్టం చేశారు. ఇంకెవరు ఇన్‌ఫార్మర్లుగా మారినా ఇదే శిక్ష పడుతుందని హెచ్చరించారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు


హంసిని

ఆర్మూర్ టౌన్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రినగర్, మామిడిపల్లిలోని వేంకటేశ్వర కాలనీ, యోగేశ్వర కాలనీల్లో కుక్కలు దాడి చేసిన ఘటనలో ముగ్గురు చిన్నారులతో పాటు ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం వేర్వేరుగా జరిగిన ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. వేంకటేశ్వర కాలనీలో ఇంటి బయట ఆడుకుంటున్న హంసినిని, యోగేశ్వర కాలనీలో గుజరాతీ వివన్స్, శాస్త్రినగర్‌లో జేబీ హుస్సేన్‌తో పాటు ఓ ఆటో డ్రైవర్‌పై కుక్కలు దాడి చేశాయి. దాడిలో హంసిని (4), వివన్స్ (5), జేబీ హుస్సేన్ (9)కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చిన్నారులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇందులో వివన్స్‌ను హైదరాబాద్ తరలించారు. ఆర్మూర్‌లో కుక్కల బెడద తీవ్రంగాఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థులతో గురువుల అసభ్య ప్రవర్తన

- ఇద్దరిపై పోక్సో కేసు

నిర్మల్: నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదైంది. ఇప్పటికే సస్పెండైన ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి, మోహన్‌రావులపై శిశు సంక్షేమశాఖ నివేదిక ప్రకారం.. సోమవారం కేసు నమోదు చేసినట్లు మండల పోలీసులు తెలిపారు.

అమ్మకు చికిత్స చేయించలేక.. అప్పులు తీరక

- వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతుల ఆత్మహత్య


బాలకిషన్


మొగిళి

కురవి/పరకాల: తల్లికి అనారోగ్యం.. పంటకు చేసిన అప్పు తీరక మనస్తాపానికి గురై ఒక రైతు.. పంట పెట్టుబడికి చేసిన అప్పు తీరలేదని మరో రైతు వేర్వేరు ప్రాంతాల్లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం హూమ్లా తండాకు చెందిన బానోత్ బాలకిషన్ (36).. తన తల్లి వాలికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో.. ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో దయాలసిస్ చేయిస్తున్నాడు. తనకున్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో.. రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. తోటకు తెగుళ్లు సోకి మొత్తం దెబ్బ తింది. పెట్టుబడుల కోసం, తల్లి దయాలసిస్‌కు రూ.10 లక్షలు అప్పు చేశాడు. వీటికి వడ్డీలు కట్టలేక, పంటలు చేతికి రాక మనస్తాపానికి గురయ్యాడు. దీంతో పురుగు మందు తాగడంతో.. కుటుంబ సభ్యులు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. హనుమకొండ జిల్లా పరకాల మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన రైతు పసుల మొగిళి (60) ఈ నెల 1న ఇంటి నుంచి భార్య దేవమ్మతో కలిసి మిర్చితోటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో.. అటు వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఐదు రోజుల తర్వాత బుధవారం తన తోట పక్కనే ఉన్న మరొకరి చేను వద్ద శవమై కనిపించాడు. మిర్చి సాగుకు చేసిన రూ.2 లక్షల అప్పు ఎలా తీర్చాలోనని ఆందోళన చెందిన భర్త.. పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భార్య దేవమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'2014 సర్వే బహిర్గతం చేయాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఇంటింటి కుటుంబ సర్వే గణాంకాలన్నీ తప్పులే అని కుల నిర్మూలన వేదిక (కేఎన్‌వీ) అధ్యక్షులు పాపని నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ప్రభుత్వం 2014లో చేసిన సమగ్ర సర్వేను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. గత పాలనపై వివిధ శ్వేతపత్రాలు విడుదల చేసిన ప్రస్తుత ప్రభుత్వం.. సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఎందుకు బయట పెట్టడం లేదని మండిపడ్డారు.



భక్తజన సంద్రంగా చెర్వుగట్టు

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుపై వెలసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 6.30 గంటలకు స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామి, అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

– నార్కట్‌పల్లి

పిక్కలు పీకేస్తున్నాయ్



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఏటా కుక్కకాట్లు పెరిగిపోతున్నాయి. రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో కుక్కల దాడుల ఘటనలు వందలు, వేలల్లో చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కుక్క కాట్లు తగ్గడం లేదు.. ప్రభుత్వ గణాంకాలే దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. 2024లో 1,21,997 కేసులు నమోదవగా జీహెచ్‌ఎంసీ, చుట్టుపక్క జిల్లాల్లోనే 42,067 కేసులు నమోదయ్యాయి. ఆయా ఘటనల్లో 13 మంది మరణించారు. 2023 గణాంకాలతో పోలిస్తే ఇది చాలా అధికం.

పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌లో 2024, జూన్ 28న వీధికుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతిచెందాడు. బిహార్‌కు చెందిన బాలుడి కుటుంబం పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన బాలుడిపై కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

హైదరాబాద్ మణికొండలో 2024, జూన్ 22న ఓ మహిళపై ఏకంగా 15 వీధికుక్కలు దాడి చేశాయి. సుమారు అరగంటసేపు తీవ్రంగా దాడి చేశాయి. చివరకు ఎలాగోలా బాధితురాలు వాటి బారి నుంచి ప్రాణాలతో బయటపడింది.

స్పందించిన హైకోర్టు

వీధికుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు మృతిచెందిన ఉదంతంపై వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పిటిషన్లకు దీన్ని జత చేసింది. ఈ పిటిషన్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కౌంటర్ దాఖలు చేసింది. దీనిపై రిప్లై కౌంటర్ వేయడానికి సమయం కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో విచారణ 25కు వాయిదా వేసింది.

రాష్ట్రంలో ఏటా పెరిగిపోతున్న కుక్క కాట్లు	ఒక్క 2024లోనే 1,21,997 కేసుల నమోదు	జీహెచ్‌ఎంసీ చుట్టుపక్కల జిల్లాల్లో 42,067 కేసులు.. 13 అనుమానాస్పద మరణాలు..	గతేడాదితో పోల్చితే పెరిగిన తీవ్రత

జీహెచ్‌ఎంసీ చేస్తున్న కసరత్తు ఇలా..

మున్సిపల్ కార్పొరేషన్ బయట కుక్కల కోసం పునరావాస కేంద్రాల ఏర్పాటు	కుక్కకాట్లు, ఇతర ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 040–2111111 అందుబాటులోకి..
898 కుక్కల సంరక్షణ కేంద్రాలతోపాటు 92 బోన్లు, కుక్కల తరలింపునకు 49 వ్యాన్ల ఏర్పాటు	
యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ)కి సంబంధించిన 6 ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటు. స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్‌కు చర్యలు	18 మంది వెటర్నరీలు, ఆరుగురు షెల్టర్ మేనేజర్లు, 22 పారా వెటర్నరీలు, 362 మంది డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ వర్కర్ల నియామకం

కుట్లు వేస్తే వైరస్ వ్యాప్తి...



కుక్క కరిచిన వెంటనే ట్యాప్ వాటర్, సబ్బుతో గాయాన్ని కడగాలి. చర్మంపై గాయాలకు టీటీ, యాంటీ రేబిస్ నాలుగు డోసులు సరిపోతుంది. కుక్క కరిచిన 1వ రోజు, 3వ రోజు, 7వ రోజు, 14వ రోజు టీకా వేయించుకోవాలి. కండ లోపలికి గాయమైనా కుట్లు వేయకూడదు. వేస్తే శరీరంలో వైరస్ మరింత వ్యాప్తి చెందుతుంది. ఒక వేళ చేతులు, ముఖంపై తీవ్ర గాయాలైతే ముందుగా అక్కడ ఇమ్యునోగ్లోబులిన్ ఇంజెక్షన్ వేయాలి. 2 గంటలు ఆగాక కుట్లు వేయవచ్చు. ఎంత ఆలస్యమైనా యాంటీ రేబిస్ టీకా తీసుకోవాలి.

– డాక్టర్ జి.రాజమనోహర్‌రెడ్డి, ల్యాప్రోస్కోపిక్ సర్జన్

మెదడు అదుపులో ఉండదు...



రేబిస్ సోకిన కుక్కల మెదడు అదుపులో ఉండదు. ఎదురుగా ఏ జీవి వచ్చినా కరుస్తాయి. కరిచినప్పుడు లాలాజలంలో ఉండే వైరస్ శరీరంలోకి వెళ్తుంది. రేబిస్ సోకిన జంతువు, వ్యక్తి కూడా కుక్కల మాదిరే ప్రవర్తిస్తారు.

– చిట్యాల బాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, కనగల్

సంవత్సరాల వారీగా రాష్ట్రంలో కుక్క కాటు కేసులు, అనుమానాస్పద మరణాలు..

	2022	2023	2024	మొత్తం
కుక్క కాటు కేసులు	92,924	1,19,014	1,21,997	3,33,935
అనుమానాస్పద మరణాలు	8	15	13	36

లావణ్య హత్యకు మస్తాన్‌సాయి పథకం

- ఇంటిపై దాడిచేసి చంపేయత్నం
- రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న పోలీసులు
- నేడు కోర్టులో కస్టడీ పిటిషన్ వేసే అవకాశం


మస్తాన్‌సాయి

మణికొండ: యువతులు, మహిళలకు డ్రగ్స్ అలవాటు చేసి వారిపై అఘాయిత్యాలకు పాల్పడిన మస్తాన్‌సాయి గురించి పోలీసులు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడించారు. అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన లావణ్యను హత్యచేసేందుకు మస్తాన్ ప్రయత్నించినట్లు తెలిపారు. తన హార్డ్ డిస్క్ కోసం డ్రగ్స్ మత్తులో లావణ్య ఇంటిపై దాడిచేసి ఆమెను గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించాడని నార్సింగి పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. దాడి దృశ్యాలు రికార్డు కాకుండా సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేసినట్టు కోర్టుకు తెలిపారు. గతంలో లావణ్యను ఉద్దేశపూర్వకంగానే వరలక్ష్మి టిఫిన్‌సెంటర్ డ్రగ్స్ కేసులో ఇరికించినట్టు విచారణలో నిందితుడు అంగీకరించాడని చెప్పారు. 'లావణ్య వీడియోలను తొలగించాలని సినీ నటుడు రాజ్‌తరుణ్ గతంలో మధ్యవర్తిత్వం చేసి మస్తాన్‌సాయి ఐపాడ్ నుంచి తొలగింపచేశాడు. అప్పటికే అతను సదరు వీడియోలను తన హార్డ్ డిస్క్‌లోకి కాపీ చేసుకున్నాడు. ఆ విషయం తెలిసి గత ఏడాది నవంబర్‌లో గుంటూరులోని అతని ఇంటికి వెళ్లిన లావణ్య.. 4 టీబీ హార్డ్ డిస్క్‌ను తీసుకెళ్లింది. దాన్ని తనకు తిరిగి ఇచ్చేయాలని, లేదంటే ఎంతకైనా తెగిస్తానని అతడు బెదిరించాడు' అని పోలీసులు తెలిపారు.

లావణ్య ఇంటిపై దాడులు..: హార్డ్ డిస్క్‌ను తిరిగి తీసుకునేందుకు జనవరి 30న తన మిత్రులతో కలిసి లావణ్య ఇంటిపై మస్తాన్‌సాయి దాడి చేశాడు. లావణ్య గొంతు నులిమి చంపటానికి ప్రయత్నించగా, ఆమె తమ్ముడు, పని మనిషి అడ్డురావటంతో వదిలి పెట్టాడు. హార్డ్ డిస్క్‌తో అక్కడి నుంచి తప్పించుకున్న లావణ్య.. తన స్నేహితురాలి ఇంట్లో తల దాచుకుంది. తిరిగి ఈ నెల 2వ తేదీన లావణ్య ఇంటికి మరోసారి తన మిత్రుడు షేక్ ఖాజా మొయినుద్దీన్‌తో కలిసి వచ్చి హంగామా చేశాడు. లావణ్య ఫిర్యాదు చేయటంతో మస్తాన్‌సాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. ఆ తర్వాత మస్తాన్‌తో పాటు షేక్ ఖాజా మొయినుద్దీన్‌కు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రావటంతో వారిపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టం ప్రకారం కూడా కేసు నమోదు చేశారు.

డ్రగ్స్ పార్టీలో లైంగిక దాడులు

డ్రగ్స్‌ను వాడటంతోపాటు విక్రయిస్తున్న మస్తాన్‌సాయి.. అతని విల్లాలో అనేకసార్లు భారీగా డ్రగ్స్ పార్టీలు నిర్వహించినట్టు పోలీసులు గుర్తించారు. పార్టీల్లో యువతులకు డ్రగ్స్ ఇచ్చి, వారు మత్తులోకి జారుకున్న తరువాత లైంగిక దాడులకు పాల్పడుతూ వీడియోలు చిత్రీకరించేవాడు. ఆ వీడియోలు చూపించి వారిని బ్లాక్‌మెయిల్ చేసేవాడని పోలీసులు తెలిపారు. మస్తాన్‌సాయికి బుధవారం జైలులో నోటీసులు అందించారు. గురువారం కోర్టులో కస్టడీ పిటిషన్ వేసే అవకాశం ఉంది.

సంప్రదాయబద్ధంగా గుడిమెలిగె పండుగ

- మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


సమ్మక్క గుడిలో అమ్మవారి శక్తి పీఠాన్ని అలంకరిస్తున్న పూజారులు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో బుధవారం మినీ జాతరలో భాగంగా పూజారులు ఆదివాసీ సంప్రదాయబద్ధంగా గుడిమెలిగె పండుగ నిర్వహించారు. మేడారంలోని సమ్మక్క గుడిలోని అమ్మవారి శక్తి పీఠాన్ని అలికి ముగ్గులు వేశారు. కన్నెపల్లి సారలమ్మ గుడిలో వడేరాలను పసుపు, కుంకుమలతో అలంకరించి పూజలు చేశారు. అమ్మవార్లకు యాటలను మొక్కుగా సమర్పించారు. ఈ గుడిమెలిగె పండుగతో మినీ మేడారం తొలి పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. పూజా కార్యక్రమాల నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చారు.

మట్టిలో కలిసిన ముగ్గురి జీవితాలు

- అపార్ట్‌మెంట్ సెల్లార్ నిర్మాణ పనుల్లో అపశ్రుతి
- ఎల్బీనగర్ పరిధి చంద్రపురి కాలనీలో ఘటన
- మృతులది ఖమ్మం జిల్లా



మట్టిపెళ్లలు కూలుతున్న దృశ్యం
తండ్రీకొడుకులు వీరయ్య, రాము

మన్సూరాబాద్/నాగోలు/కొణిజర్ల: మట్టిదిబ్బలు కూలి ముగ్గురి జీవితాలు మట్టిలో కలిసిపోయాయి. పొట్ట చేత పట్టుకొని వలస వచ్చిన రెండు కుటుంబాల్లో ఈ ఘటన తీవ్ర విషాదం నింపింది. ఎల్బీనగర్ పరిధి చంద్రపురి కాలనీలోని ప్లాట్ నంబర్ 36, 37 పార్ట్ స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణానికి కుసుమ జగదీష్, కుసుమ విజయ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి డబుల్ సెల్లార్, గ్రౌండ్ +4 అంతస్తులకు అనుమతులు తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం డబుల్ సెల్లార్ తవ్వకాలు జరిగాయి. తవ్వకాలు పూర్తి కాగానే బిల్డర్ సిద్ధం సాయినాథ్ ఫుటింగ్‌ల కోసం వారం రోజులుగా పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో ఫుటింగ్‌ల వద్ద మట్టిని తొలగించేందుకు బుధవారం ఉదయం మేస్త్రీ చలపతి దినసరి కూలీలను రప్పించాడు. పనికి వచ్చిన ఆలకుంట్ల వీరయ్య (50), ఆలకుంట్ల రాము (19), ముద్దంగుల శ్రీనివాస్(19) మట్టిని తొలగిస్తుండగా ఒక్కసారిగా మట్టిదిబ్బలు కూలి వీరిపై పడ్డాయి. దీంతో దిబ్బల కింద చిక్కుకొని ఊపిరాడక ముగ్గురూ మృతి చెందారు. మరో కూలీ బిక్షపతి అలియాస్ దశరథ తీవ్రంగా గాయపడగా, అతడిని ఎల్బీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మట్టి శిథిలాల కింద చిక్కుకున్న ముగ్గురి మృతదేహాలను పోలీసులు, డీఆర్‌ఎఫ్ బృందం కలిసి వెలికితీశాయి. అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి తరలించాయి.

సెల్లార్ తవ్వకం సక్రమంగా లేకనే ప్రమాదం

సెల్లార్ తవ్వకం పనులను కాంట్రాక్టర్ ఇష్టారీతిగా చేపట్టడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు జరిగే ప్లాట్ ను ఆనుకొని ఉన్న మరో ప్లాట్ యజమాని పనులపై కాంట్రాక్టర్‌ను ముందుగానే హెచ్చరించినట్టు తెలిసింది. సెల్లార్ తవ్వకం పనులు సరిగ్గా చేయలేదని, ప్రమాదం జరగొచ్చని ఆయన ముందే చెప్పినట్టు సమాచారం.

నిర్మాణదారుడిపై చర్యలు: జోనల్ కమిషనర్

'ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు పాటించలేదు. జీహెచ్‌ఎంసీ నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణ పనులు చేపట్టాడు. నిర్మాణదారుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం' అని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవపాటిల్ అన్నారు. సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఇచ్చిన అనుమతుల మేరకు నిర్మాణం జరగపోవడం వల్లే ఈ దురదృష్ట సంఘటన చోటు చేసుకుందన్నారు.

జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం: ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి

విషయం తెలియగానే ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సెల్లార్ తవ్వకాల విషయంలో జీహెచ్‌ఎంసీ పాటిస్తున్న నిబంధనలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అధికారులు తమకు తోచిన విధంగా అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు.

నిర్వాహకులపై కేసు నమోదు

వీరయ్య పెద్ద కుమారుడు ఆలకుంట్ల శ్రీనివాస్ బుధవారం సాయంత్రం ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుటుంబ సభ్యుల మృతికి కారణమైన స్థల యజమాని, బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిర్వాహకులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు.

సీసీ కెమెరాలలో రికార్డు

మట్టిదిబ్బలు కూలిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బుధవారం ఉదయం 10:15 నిమిషాల సమయంలో దాదాపు 10 మంది వరకు సెల్లార్‌లో పనిచేస్తుండగా ఒక్కసారిగా సెల్లార్ మట్టిపెళ్లలు కూలి వారిపై పడిన దృశ్యాలు కనిపించాయి.

నగరానికి వలస వచ్చి...

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం మల్లుపల్లికి చెందిన ఆలకుంట వీరయ్య –రాధమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరయ్య దంపతులతోపాటు పెద్ద కుమారుడు శ్రీను, చిన్న కుమారుడు రాము, రాధమ్మ తమ్ముడు ముద్దంగుల కృష్ణ, ఆయన ఇద్దరు కుమారులు శ్రీనివాస్ అలియాస్ వాసు, శ్రీమంత్ కూడా పెద్ద అంబర్‌పేట ప్రాంతంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. కృష్ణ భార్య తిరుపతమ్మ గత ఏడాది గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందింది. దీంతో కృష్ణ కుమారులిద్దరినీ రాధమ్మ కుటుంబమే తమతోపాటు ఉంచుకొని పనులకు తీసుకెళుతోంది. మల్లుపల్లిలో వీరయ్య కుటుంబానికి సెంటుభూమి కూడా లేదు. కేవలం ఒక రేకుల షెడ్డు మాత్రమే ఉంది. హైదరాబాద్ నుంచి పండుగలు, పబ్బాలకు ఏడాదిలో ఒకటి, రెండుసార్లు వచ్చి వెళుతుంటారు. వీరయ్య కుటుంబంతోపాటు 100 మందికి పైగా మల్లుపల్లి వాసులు హైదరాబాద్‌లో మట్టి పనులు, రాళ్లు కొట్టే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకే గ్రామానికి తండ్రీకొడుకుతోపాటు బంధువు మృతి చెందడంతో మల్లుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.


పూర్వగిరిలో శ్రీస్వామి సేవ ఊరేగింపు

మహాకుంభ సంప్రోక్షణకు యాగశాల సిద్ధం

- యాదగిరిగుట్టలో ఈనెల 19 నుంచి 23 వరకు నిర్వహణ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య విమాన స్వర్ణ గోపురం మహా కుంభ సంప్రోక్షణకు అర్చకులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుక ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనుంది. హోమాది పూజలు జరిపించేందుకు ఉత్తర మాడ వీధిలో ప్రత్యేకంగా యాగశాలను నిర్మిస్తున్నారు. ఈ పనులను బుధవారం ప్రత్యేక సిబ్బందితో ఆలయ సివిల్ విభాగం అధికారులు చేపట్టారు. దివ్య విమాన గోపురానికి బంగారు రేకులను బిగించే పనులను కూడా ముమ్మరం చేశారు. యాదగిరీశుడి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాల్లో మూడో రోజైన బుధవారం పురప్పాట్టు సేవ, తిరుమంజన మహోత్సవం, దివ్య ప్రబంధ సేవా కాలంను వైభవంగా జరిపించారు.

రైతుభరోసాపై చేసింది గోరంత.. చెప్పుకునేది కొండంత

- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రైతుభరోసా విషయంలో చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత.. అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ ప్రభుత్వం రైతులందరికీ ఎకరాకు రూ.7,500 చొప్పున రైతు భరోసా ఇస్తామని ప్రకటించి దానిని రూ.6 వేలకు కుదించిందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'ఎకరంలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా విదిల్చి, ఇచ్చిన మాట మీద నిలబడ్డట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. రాష్ట్రంలో 68 లక్షల మంది రైతులుండగా ఇందులో 21,45,330 మందికి రైతు భరోసా ఇచ్చినట్లు చెప్తోంది. మరి మిగతా రైతుల పరిస్థితి ఏమిటి. 2023 వానాకాలానికి సంబంధించి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరం లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 22,55,181గా గుర్తించి రైతుబంధును ఇచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వీరి సంఖ్యను 21,45,330 మందిగా గుర్తించింది. అంటే ఎకరాలోపు భూమి ఉన్న 1,09,851 మంది రైతులకు కోత విధించింది' అని హరీశ్‌రావు అన్నారు. లక్ష మందికి పైగా రైతులకు ఎందుకు రైతు భరోసా లేకుండా చేసారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి రైతులు, పేదల సంక్షేమం పట్ల ఏమాత్రం శ్రద్ధ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ 14 నెలల పాలనలో 415 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదన్నారు.

ఎకరంలోపు రైతులకు 'తొలి' భరోసా

▶ మొదటి పేజీ తరువాయి

యోగ్యమైన భూమిని రైతు భరోసాకు అర్హత గలదిగా తేల్చారు. 72 లక్షల మందికి పైగా రైతుల వద్ద ఉన్న ఈ భూములన్నింటికీ ఖజానాలో నిధుల లభ్యతను బట్టి రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖజానాలో ఉన్న నిధులను బట్టి విడతల వారీగా రెండు, మూడు ఎకరాల ప్రాతిపదికన రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం ఎకరం వరకు ఉన్న భూమికి రైతు భరోసా నిధులివ్వగా, ఎకరం పైబడి రెండు ఎకరాల వరకు గల రైతులకు త్వరలోనే ఈ పథకం కింద నిధులను జమ చేయనున్నారు. అయితే సరిగ్గా ఎప్పుడు మలివిడత నిధులు విడుదల చేస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.

వ్యవసాయ యోగ్యం కాని భూములు 2.50 లక్షల ఎకరాలు!

రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యం కాని భూములు అటు ఇటుగా రెండున్నర లక్షల ఎకరాలని అధికారులు లెక్క తేల్చినట్లు తెలిసింది. గత నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ ఎక్స్‌టెన్షన్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా జరిపిన సర్వేలో 2.10 లక్షల ఎకరాలు సాగు యోగ్యం కానివిగా గుర్తించగా, 21 నుంచి 24వ తేదీ వరకు సాగిన గ్రామ సభల్లో వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదుల అనంతరం వాటి విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాలకు పెరిగినట్లు తెలిసింది. హైదరాబాద్ సమీపంలోని రంగారెడ్డి, యాదాద్రి–భువనగిరి, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాల్లో రియల్ వెంచర్లుగా, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న భూములపై ఫిర్యాదులు వచ్చిన సంగతి తెలిసిందే. కాగా పలు జిల్లాల్లోని కొన్ని గ్రామాల్లో తొలుత వ్యవసాయ యోగ్యం కాని భూములుగా గుర్తించిన వాటిని తర్వాత సాగుకు పనికొచ్చేవిగా మార్చారు. ఈ కసరత్తు కోసం ప్రభుత్వం దాదాపు వారం రోజుల సమయం తీసుకుంది. కూడికలు, తీసివేతల తరువాత సాగు యోగ్యం కాని భూముల విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాలుగా నిర్ధారించినట్లు తెలిసింది.

రైతులకిచ్చిన మాట నిలబెట్టుకుంటాం



రైతులకిచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రైతు భరోసా నిధులను నిర్ణీత కాల వ్యవధిలో చెల్లిస్తుంది. ఈ పథకం కింద ఇప్పటివరకు రూ.1,126.54 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఇప్పటికే రైతుబంధు (కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో) కింద రూ.7,625 కోట్లు, రుణమాఫీకి రూ.20,616.89 కోట్లు, రైతు భీమాకు రూ.3000 కోట్లు చెల్లించాం. పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఎన్నడూలేని విధంగా రూ.14,893 కోట్లతో 20,11,954 మెట్రిక్ టన్నుల పత్తిని మద్దతు ధరకు సేకరించాం. రూ.406.24 కోట్లతో సోయాబీన్, పెసర, కంది పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేశాం. యాసంగిలో 48.06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ.10,547 కోట్లు వెచ్చించి సేకరించాం. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ కింద రూ.1,154 కోట్లు రైతులకు అందజేశాం. ఈ యాసంగికి కూడా సన్నాలకు బోనస్ కొనసాగిస్తాం.

– వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

గాజాపై ట్రంప్ కన్ను

స్వాధీనం చేసుకుంటామని వివాదాస్పద వ్యాఖ్య



- బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తాం
- పాలస్తీనియన్లకు పక్క దేశాల్లో పునరావాసం
- నెతన్యాహూ సమక్షంలోనే ట్రంప్ ప్రకటన
- అన్ని దేశాల నుంచీ తీవ్ర వ్యతిరేకత
- మా నేలను వీడేది లేదు: గాజన్లు

వాషింగ్టన్: సంచలనాల ట్రంప్ మరో అంతర్జాతీయ సమాజంపై మరో బాంబు విసిరారు. గాజాను అమెరికా పూర్తిగా స్వాధీనం చేసుకుంటుందని ప్రకటించారు. ''ఇజ్రాయెల్‌తో యుద్ధంలో శ్మశానసదృశంగా మారిన గాజాను అత్యంత సుందర పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. ఆర్థికాభివృద్ధి కార్యకలాపాలు చేపడతాం. భారీగా ఆవాస, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం'' అని అమెరికా అధ్యక్షుడు చెప్పుకొచ్చారు. గాజాలో ఉంటున్న దాదాపు 20 లక్షల మంది పాలస్తీనావాసులు ఆ ప్రాంతాన్ని వీడాల్సిందేనని స్పష్టం చేశారు. వారిని గాజా నుంచి శాశ్వతంగా తరలించి పునరావాసం కల్పిస్తామన్నారు. అయితే, పశ్చిమాసియాలోని పొరుగు దేశాలే వారిని అక్కున చేర్చుకోవాలని తేల్చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సమక్షంలోనే ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేయడం విశేషం. పాలస్తీనావాసులను గాజా నుంచి తరలించేందుకు, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేందుకు అమెరికాకు ఏం అధికారముందని ప్రశ్నించగా తన చర్య గాజా, ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియా అంతటికీ గొప్ప స్థిరత్వాన్ని తెస్తుందని ఆయన బదులిచ్చారు. గాజా స్వాధీనానికి సైన్యాన్ని రంగంలోకి దించుతారా అని ప్రశ్నించగా, అన్ని అవకాశాలనూ పరిశీలిస్తామని బదులిచ్చారు. ఈ సందర్భంగా నెతన్యాహూ పదేపదే చిరునవ్వులు చిందిస్తూ కన్పించారు. ట్రంప్ ప్రకటనకు పూర్తి మద్దతు తెలిపారు. ''ఈ నిర్ణయం చరిత్రను మార్చేస్తుంది. గాజాకు అద్భుతమైన భవిష్యత్తు అందిస్తుంది. ఇజ్రాయెల్‌కు ముప్పును శాశ్వతంగా తొలగిస్తుంది'' అని ప్రకటించారు. ట్రంప్ ప్రకటన అంతర్జాతీయంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. పశ్చిమాసియా భౌగోళిక, రాజకీయ పరిస్థితులను అల్లకల్లోలం చేసేలా కనిపిస్తున్న ఈ ప్రతిపాదనను అక్కడి దేశాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి. పాలస్తీనా, సౌదీ అరేబియా, ఈజిప్ట్, తుర్కియేతో పాటు చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ కూడా దీన్ని ఖండించాయి. అమెరికాలో విపక్ష నేతలు కూడా ట్రంప్ ప్రకటనను దుయ్యబడుతున్నారు. గాజావాసులకు తమ దేశంలో ఆశ్రయం కల్పించాలన్న ట్రంప్ ప్రతిపాదనను ఈజిప్ట్, జోర్డాన్, తుర్కియే తదితర అమెరికా మిత్ర దేశాలన్నీ ఇప్పటికే ముక్త కంఠంతో తిరస్కరించడం తెలిసిందే. గ్రీన్‌లాండ్‌ను, పనామా కాల్వను స్వాధీనం చేసుకుంటానని, కెనడాను అమెరికాలో కలిపేస్తానని ట్రంప్ ఇప్పటికే పలు వివాదాస్పద ప్రకటనలు చేశారు.

అంతర్జాతీయ ప్రాంతంగా గాజా

అమెరికా పర్యటనలో ఉన్న నెతన్యాహూతో ట్రంప్ మంగళవారం భేటీ అయ్యారు. అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో ఆకస్మికంగా గాజా స్వాధీన ప్రకటన చేశారు. దీన్ని పశ్చిమాసియా గర్వించదగ్గ విషయంగా అభివర్ణించారు. ''పశ్చిమాసియా నమ్మశక్యం కానంత గొప్ప ప్రదేశం. అద్భుతమైన తీర ప్రాంతం. గొప్ప వ్యక్తులతో నిండిన అందమైన ప్రదేశాల్లో ఒకటి. గాజాలో త్వరలో పర్యటిస్తా. ఇజ్రాయెల్ అంటే నాకిష్టం. అక్కడ, సౌదీ అరేబియాలో, పశ్చిమాసియా అంతటా పర్యటిస్తా. గాజాలో ఇప్పుడేమీ మిగల్లేదు. ఆ ప్రాంతమంతా మృత్యువుకు, విధ్వంసానికి చిరునామాగా, నరకకూపంగా మారింది. ప్రతి భవనమూ నేలమట్టమైంది. చిరకాలంగా శప్తభూమిగా ఉన్న గాజాను పూర్తిగా పునర్నిర్మిస్తాం. పేలని బాంబులు, ఆయుధాలను తొలగిస్తాం. ధ్వంసమైన భవనాలను తొలగించి ఆ ప్రాంతాన్నంతా చదును చేస్తాం. అక్కడ అపరిమితమైన ఉద్యోగాలందించేలా అద్భుతమైన ఆర్థిక వ్యవస్థను సృష్టిస్తాం. గాజావాసుల జీవన స్థితిగతులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం. ఏ ఒక్క సమూహానికో కాకుండా అందరికీ అద్భుతమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పాలస్తీనావాసులతో పాటు ప్రపంచం నలుమూలలకు చెందిన ప్రజలు అక్కడ నివసిస్తారు. లేదంటే ఆ ప్రాంతం వందల ఏళ్లుగా ఎలా ఉందో అలాగే ఉంటుంది. ఏదైనా డిఫరెంట్‌గా చేయాలి. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలి. అది పునరావృతం కాకుండా చూసుకోవాలి. ఏదైనా అద్భుతం చేయడానికి మాకు అవకాశముంది'' అని చెప్పుకొచ్చారు. ''ఇదేమీ అల్లాటప్పగా తీసుకున్న నిర్ణయం కాదు. దీనిపై చాలా ప్రముఖులు, ముఖ్యులతో లోతుగా చర్చించా. వారంతా నా ప్రతిపాదనను అమితంగా ఇష్టపడ్డారు. గాజాను సొంతం చేసుకుని అభివృద్ధి చేసి అపారమైన ఉపాధి అవకాశాలు సృష్టించాలన్న అమెరికా ఆలోచనలను ఇష్టపడుతున్నారు'' అని చెప్పారు. ''గాజాలో దశాబ్దాలుగా మరణమృదంగం కొనసాగుతోంది. చంపుకోవడాలు లేకుండా ఆనందంగా ఉండగలిగే అందమైన ప్రదేశంలో వారికి శాశ్వతంగా పునరావాసం కల్పించగలిగితే చాలు. మరో దారి లేకే వారు గాజాకు తిరిగి వెళ్తున్నారు. ఎప్పుడు కూలతాయో తెలియని పై కప్పుల కింద బతుకీడుస్తున్నారు. దానికి బదులుగా అందమైన ఇళ్లలో సురక్షితంగా, స్వేచ్ఛగా, శాంతియుతంగా జీవించే అవకాశం వారి ముందుంది. ఆ మేరకు చక్కని పునరావాసం పొందగలరని, ఇప్పుడు వద్దంటున్న దేశాల్లోనే వారికి ఆ సదుపాయం ఏర్పాటు చేయగలనని నమ్ముతున్నా'' అని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో అనుసరించదగ్గ మార్గం ఇదేనని నెతన్యాహూ అభిప్రాయపడ్డారు. ''హమాస్‌ను నిర్మూలించాలన్న మా లక్ష్యాలను సాధించడానికి ట్రంప్ కొత్త ఆలోచనలతో ముందుకొచ్చారు. ఇది యూదు జాతికి సాయపడుతుంది'' అని చెప్పారు. ''ఉగ్రవాదానికి కేంద్రబిందువుగా ఉన్న గాజాకు భిన్నమైన భవిష్యత్తును ట్రంప్ కాంక్షిస్తున్నారు. హంతక సంస్థ (హమాస్)ను నిర్మూలిస్తే అక్కడ శాంతి సాధ్యమే'' అన్నారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతుందో లేదో చెప్పలేనన్నారు. బైడెన్ ప్రభుత్వం తమకు పెద్దగా సాయం చేయలేదని నెతన్యాహూ ఆక్షేపించారు.

గాజాను వీడబోం: స్థానికులు

ట్రంప్ ప్రతిపాదనపై గాజా పౌరులు మండిపడుతున్నారు. ''ఇన్నాళ్లకు కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత సొంత గూటికి తిరిగి వెళ్తున్నాం. మా ఇళ్లను విడిచిపెట్టబోం. గౌరవప్రదమైన జీవితం కోరుకుంటున్నాం. మా నేతలను వీడాలనుకోవడం లేదు'' అని చెబుతున్నారు. ట్రంప్ ప్రతిపాదన గాజాతో పాటు పరిసర దేశాల్లో మరింత విధ్వంసానికి, ఘర్షణకు కారణమవుతుందని వారంటున్నారు. ట్రంప్ వ్యాఖ్యలను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయకుండా ఇజ్రాయెల్‌తో ఎలాంటి సంబంధాలను కొనసాగించబోమని స్పష్టం చేసింది. గాజన్లు తమ ఇళ్లకు తిరిగి వచ్చి పునర్నిర్మించాలని కోరుకుంటున్నారని ఐరాసలో పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ అన్నారు. వారి ఆకాంక్షలను గౌరవించాలన్నారు. ట్రంప్‌ది హాస్యాస్పద, అసంబద్ధ ప్రకటన అని హమాస్ దుయ్యబట్టింది. ''ఈ తరహా ఆలోచనలు పశ్చిమాసియాలో మరిన్ని ఘర్షణలకు దారితీస్తాయి. గాజావాసులకు సమీప దేశాల్లో పునరావాసం కల్పించాలన్న ట్రంప్ ప్రతిపాదన మరింత గందరగోళం, ఉద్రిక్తతలకు కారణమవుతుంది. గాజావాసులు దీనికి ఒప్పుకోరు'' అని హమాస్ అధికారి సమీ అబు స్పష్టం చేశారు.

అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ట్రంప్ గాజా ప్రణాళిక

గాజాను పునర్నిర్మించాలంటూ పది రోజుల క్రితమే పిలుపునిచ్చిన ట్రంప్ ఆ విషయమై ఎంత సీరియస్‌గా ఉన్నారో తాజా ప్రకటనతో ప్రపంచానికి తెలిసొచ్చింది. కానీ అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా విరుద్ధమైన ఆయన గాజా ప్రణాళిక పశ్చిమాసియాను అతలాకుతలం చేయడమే గాక ప్రపంచ శాంతికి గొడ్డలిపెట్టుగా మారేలా కనిపిస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం, ఇజ్రాయెల్–హమాస్ పరస్పర బందీల విడుదల ప్రక్రియపైనా ప్రభావం చూపేలా ఉంది. ఒక దేశ జనాభాను బలవంతంగా నిరాశ్రయులను చేయడం అంతర్జాతీయ చట్టం ప్రకారం నిషేధం. ఇజ్రాయెల్ మాత్రం పాలస్తీనియన్లను తరిమేసి గాజాను యూదు స్థావరంగా మార్చుకోవాలని ఆశపడుతోంది. ట్రంప్ ప్రకటన కార్యరూపం దాలిస్తే 20 లక్షల మంది పాలస్తీనావాసులు శాశ్వత శరణార్థులుగా మారిపోతారు.

ఢిల్లీలో కమల వికాసం

27 ఏళ్ల తర్వాత అధికారం

- ఆప్ హ్యాట్రిక్ కలలు కల్లలే
- ఎగ్జిట్ పోల్స్ జోస్యం

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీపై 27 ఏళ్ల అనంతరం కాషాయ జెండా ఎగరనుందని ఎగ్జిట్ పోల్స్ జోస్యం చెప్పాయి. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ హ్యాట్రిక్ కల నెరవేరబోదని పేర్కొన్నాయి. బుధవారం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కాంగ్రెస్ ఈసారి కూడా సున్నా చుడుతుందని స్పష్టం చేశాయి. బీజేపీ, ఆప్ మధ్య హోరాహోరీ నెలకొందని రెండు ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. అయితే మొగ్గు మాత్రం బీజేపీవైపేనని తెలిపాయి. ఆప్ గెలుస్తుందని మరో రెండు చెప్పుకొచ్చాయి. బీజేపీకి 51 నుంచి 60 దాకా రావచ్చని, ఆప్ 10 నుంచి 19కి పరిమితమవుతుందని పీపుల్స్ పల్స్ పేర్కొంది. కాంగ్రెస్ సున్నా చుడుతుందని చెప్పింది. బీజేపీకి 40–44, ఆప్‌కు 25–29, కాంగ్రెస్‌కు 2 సీట్లొస్తాయని పీపుల్స్ ఇన్‌సైట్ చెప్పింది. 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు బోల్తా కొట్టిన నేపథ్యంలో ఈసారి ఏం జరగనుందన్నది ఆసక్తికరంగా మారింది. అందరి కళ్లూ 8వ తేదీన వెలువడబోయే ఫలితాలపైనే ఉన్నాయి. ఢిల్లీ అసెంబ్లీలో 70 స్థానాలున్నాయి. విజయానికి 36 సీట్లు కావాలి. ప్రస్తుత అసెంబ్లీలో ఆప్‌కు ఏకంగా 62 సీట్లున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ఆప్ తోసిపుచ్చగా బీజేపీ నేతలు విజయంపై ధీమా వెలిబుచ్చారు. ఢిల్లీలో గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆప్ ఘనవిజయం సాధించింది.


సంస్థ	బీజేపీ	ఆప్	కాంగ్రెస్
పీపుల్స్ పల్స్	51-60	19-19	0
పీపుల్స్ ఇన్‌సైట్	40-44	25-29	0-1
పీ-మార్క్	39-49	21-31	0-1
జేవీసీ	39-45	22-31	0-2
పోల్ డైరీ	42-50	18-25	0-2
చాణక్య స్ట్రాటజీస్	39-44	25-28	2-3
మ్యాట్రిజ్	35-40	32-37	0-1
డీవీ రీసెర్చ్	36-44	26-34	0
వీ ప్రిసైడ్	18-23	46-52	0-1
మైండ్‌బ్రింక్ మీడియా	21-25	44-49	0-1
పోల్ ఆఫ్ పోల్స్	39	30	0

ప్రశాంతంగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

60.44 శాతం పోలింగ్ నమోదు


కేజ్రీవాల్


న్యూఢిల్లీ: ఢిల్లీ శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల ఎదుట ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. మొత్తం 70 నియోజకవర్గాలకు గాను 13,766 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, కేంద్ర మంత్రులు ఎస్. జైశంకర్, హర్దీప్‌సింగ్ పురి, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తదితరులు ఉదయమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేజ్రీవాల్ తన తల్లిదండ్రులను చక్రాల కుర్చీల్లోపోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చారు. మెరుగైన పరిపాలన కావాలంటే ఓటర్లంతా తప్పనిసరిగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. 60.44 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అత్యధికంగా నార్త్‌ఈస్టు జిల్లాలో 63.83 శాతం నమోదైనట్లు తెలియజేసింది. ముస్తఫాబాద్ నియోజకవర్గంలో 66.68 శాతం నమోదైనట్లు పేర్కొంది. ఢిల్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతంపై తుది గణాంకాలు గురువారం బహిర్గతం కానున్నాయి. ఢిల్లీలో 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 62.59 శాతం, 2024 నాటి లోక్‌సభ ఎన్నికల్లో 56 శాతం పోలింగ్ రికార్డయ్యింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 8న వెల్లడి కానున్నాయి.


త్రివేణి సంగమంలో పుణ్యస్నానం వేళ రుద్రాక్షమాలతో జపం చేస్తున్న ప్రధాని మోదీ

భక్తిభావంతో మనసు నిండిపోయింది

మహా కుంభమేళాలో పుణ్యస్నానం గొప్ప ఆశీర్వాదం: మోదీ

ప్రయాగ్‌రాజ్: పవిత్రమైన మహా కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించడం గొప్ప ఆశీర్వచనంగా భావిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. భక్తిభావంతో తన మనసు నిండిపోయిందని అన్నారు. ఆయన బుధవారం ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో చేతిలో రుద్రాక్షమాలతో పుణ్యస్నానం ఆచరించారు. ఈ సందర్భంగా నారింజ, నీలం రంగు దుస్తులు ధరించారు. వేద పండితులు మంత్రాలు పఠిస్తుండగా మోదీ గంగా నదిలో మునకలు వేశారు. సూర్యుడికి, గంగామాతకు నమస్కరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. పుణ్యస్నానం అనంతరం మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మహా కుంభమేళాలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. కోట్లాది మంది భక్తుల తరహాలో తాను గొప్ప అనుభూతి పొందానని ఉద్ఘాటించారు. శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం, సామరస్యంతో గంగామాత మనందర్నీ ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కుంభమేళాలో పూజ, అర్చన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఉద్ఘాటించారు. గంగామాత కటాక్షంతో ఇక్కడ గొప్ప శాంతి, సంతృప్తి కలిగాయన్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానానికి సంబంధించిన ఫొటోలను మోదీ 'ఎక్స్'లో షేర్ చేశారు. ఢిల్లీ నుంచి విమానంలో ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన ప్రధానమంత్రి తొలుత అరాయిల్ ఘాట్ నుంచి మోటార్ బోట్‌లో త్రివేణి సంగమానికి చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులకు అభివాదం చేశారు. 90 నిమిషాలపాటు కుంభమేళాలో గడిపారు. నరేంద్ర మోదీ 2019 ఫిబ్రవరిలో త్రివేణి సంగమంలో కుంభమేళా వేడుకలో పాల్గొన్న సంగతి తెలిసిందే. అప్పట్లో ఆయన పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రశంసిస్తూ స్వయంగా వారి కాళ్లు కడిగారు.




ఉత్తరాఖండ్‌లో రిజిస్టరైన ఒక సహజీవనం

పరిశీలనలో మరో నాలుగు దరఖాస్తులు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) పది రోజుల క్రితం అమల్లోకి వచ్చింది. యూసీసీ చట్టం ప్రకారం వివాహాలతోపాటు సహ జీవనా లను కూడా ప్రభుత్వం పోర్టల్‌లో తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో గత పది రోజుల్లో ఒకేఒక్క సహజీవనం రిజిస్టరైనట్లు అధికారులు బుధవారం చెప్పారు. సహజీవనం సాగిస్తున్న ఐదు జంటల నుంచి దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఒక దరఖాస్తు రిజిస్ట్రేషన్ జరిగిందని, మిగిలినవి పరిశీలన దశలో ఉన్నాయని వెల్లడించారు. స్వతంత్ర భారతదేశంలో యూసీసీని అమలు చేస్తున్న మొట్టమొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో జనవరి 27 నుంచి యూసీసీ అమల్లోకి వచ్చింది. వివాహాలు, విడాకులు, సహజీవనాల రిజిస్ట్రేషన్ల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఒక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌లో నమోదైన తొలి వివాహం ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీదే కావడం విశేషం. సహజీవన బంధంలోకి అడుగుపెట్టిన జంట నెల రోజుల్లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే మూడు నెలల వరకు జైలుశిక్ష లేదా రూ.10 వేల దాకా జరిమానా లేదా ఈ రెండు శిక్షలూ విధించవచ్చు.

ఆగాఖాన్ అస్తమయం

- కన్నుమూసిన కోట్లాది ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు
- ఎన్నో దేశాల్లో పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేసిన ఆగాఖాన్ సంస్థ
- సంతాపం వ్యక్తంచేసిన ప్రధాని మోదీ, పలువురు ప్రపంచ నేతలు



పారిస్: ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది 'ఇస్మాయిలీ' వర్గం ముస్లింల ఆధ్యాత్మిక గురువు, వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి ఆగాఖాన్ కన్నుమూశారు. షియా ఇస్మాయిలీ ముస్లింల 48వ ఇమామ్ హోదాను యుక్తవయసులో వారసత్వంగా పొంది దశాబ్దాలపాటు వేల కోట్ల రూపాయల దాతృత్వ కార్యక్రమాలు చేసి గొప్ప వితరణశీలిగా పేరు తెచ్చుకున్నారు. ఆగాఖాన్ పోర్చుగల్‌లో మంగళవారం తుది శ్వాస విడిచారని ఆయన కుటుంబం బుధవారం ప్రకటించింది. ఆగా ఖాన్ అంత్యక్రియలు పోర్చుగల్ రాజధాని నగరం లిస్బన్‌లో జరుగుతాయని ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్, ఇస్మాయిలీ రిలీజియస్ కమ్యూనిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆగాఖాన్‌కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మొహమ్మద్ ప్రవక్త వారసులుగా షియా ముస్లింలలో ఉప వర్గమైన ఇస్మాయిలీ వర్గానికి ఆగాఖాన్ కుటుంబం ఆధ్యాత్మిక గురువులుగా శతాబ్దాలుగా కొనసాగుతోంది. 1936 డిసెంబర్ 13న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జన్మించిన ఈయన అసలు పేరు ప్రిన్స్ కరీమ్ అల్ హుస్సేనీ. ఆగాఖాన్ తండ్రి ప్రిన్స్ అలీఖాన్ విలాస పురుషుడు. దీంతో అలీఖాన్‌ను కాదని తాత సర్ సుల్తాన్ మొహమ్మద్ షా (ఆగాఖాన్-3).. కరీమ్ అల్ హుస్సేనీను డిగ్రీ స్టూడెంట్‌గా ఉన్నప్పుడే ఆగాఖాన్-4గా 1957 అక్టోబర్ 19వ తేదీన ప్రకటించారు. టాంజానియాలోని దారెస్సలామ్‌లో ఈ కార్య క్రమం జరిగింది. గతంలో ఇదే దారెస్సలామ్ వేదికగా ఆగాఖాన్-3ను ఇస్మాయిలీ వర్గీయులు ఆయనంత బరువు వజ్రాలను కానుకగా సమర్పించిన వార్త అప్పట్లో సంచలనమైంది. ఆనాటి నుంచి ఆధ్యాత్మిక గురువుగా కొనసాగుతూనే వేల కోట్ల రూపాయల విలువైన వ్యాపార సంస్థలను విజయవంతంగా నడిపిస్తున్నారు. వీళ్ల ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పలు ప్రపంచ దేశాల్లో వందలాది ఆస్పత్రులు సేవలందిస్తున్నాయి. ఏటా ఒక బిలియన్ డాలర్ల మేర లాభాపేక్షలేని అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆగా ఖాన్ మృతికి ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, బ్రిటన్ రాజు ఛార్లెస్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సహా పలు ప్రపంచదేశాల అధినేతలు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. మరోవైపు ఇస్మాయిలీ ముస్లింల నూతన ఆధ్యాత్మిక గురువుగా ఆగాఖాన్4 కుమారుడు రహీమ్ అల్ హుస్సేనీ పేరును ప్రకటించారు. 50వ గురువుగా ఈయనను ఇకపై ఆగాఖాన్-5గా పిలవనున్నారు.

యూఎన్‌హెచ్‌ఆర్‌సీకి ట్రంప్ గుడ్‌బై

త్వరలో యునెస్కోకు కూడా!

న్యూయార్క్: ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా వైదొలుగుతున్నట్టు ఇప్పటికే ప్రకటించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘానికి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) కూడా గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై మంగళవారం ఆయన సంతకం చేశారు. ''రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యుద్ధాలను నిలువరించి అంతర్జాతీయంగా శాంతిభద్రతల స్థాపనకు కృషి చేసే లక్ష్యంతో ఐరాస స్థాపనకు అమెరికా సాయపడింది. కానీ ఐరాసకు చెందిన పలు ఏజెన్సీలు కొంతకాలంగా సంస్థ లక్ష్యానికి భిన్నంగా పని చేస్తున్నాయి. పైగా అమెరికా ప్రయోజనాలనే దెబ్బ తీస్తున్నాయి'' అంటూ ఉత్తర్వుల్లో తూర్పారబట్టారు. పాలస్తీనా శరణార్థులకు ఆ సంస్థ అందిస్తున్న సాయానికి అమెరికా నిధుల సాయాన్ని తక్షణం నిలిపేయాల్సిందిగా కూడా ట్రంప్ ఆదేశించారు. అంతేకాదు, ఐరాస విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో), పాలస్తీనా శరణార్థుల సహాయ, పనుల సంస్థ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ)ల్లో కొనసాగడం అవసరమా పరిశీలించాల్సిందిగా కూడా అధికారులకు సూచించారు. ''మానవ హక్కుల ఉల్లంఘనదారులను యూఎన్‌హెచ్‌ఆర్‌సీ కాపాడుతోంది. విదేశీ ఉగ్ర సంస్థలుగా అమెరికా విదేశాంగ శాఖ చాన్నాళ్ల క్రితమే ప్రకటించిన పలు మూకలు నానా ముసుగుల్లో యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏలో చొరబడ్డారు. ఇక యునెస్కో తనను తాను సంస్కరించుకోవడంలో నిత్యం విఫలమవుతూనే ఉంది'' అని ఉత్తర్వుల్లో ట్రంప్ ఆక్షేపించారు. గాజా యుద్ధం విషయంలో యూఎన్‌హెచ్‌ఆర్‌సీ తమపై ఉద్దేశపూర్వకంగా బురదజల్లుతోందని ఇజ్రాయెల్, అమెరికా కొంతకాలంగా ఆరోపిస్తుండటం తెలిసిందే. ట్రంప్ తన తొలి హయాంలో కూడా యూఎన్‌హెచ్‌ఆర్‌సీ నుంచి వైదొలగుతూ నిర్ణయం తీసుకున్నారు. యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏకు నిధులను నిలిపేశారు.

వలసదార్ల విమానం వచ్చేసింది

- 104 మందిని వెనక్కి పంపిన అమెరికా
- బయోమెట్రిక్ ద్వారా గుర్తింపు ప్రక్రియ
- స్వస్థలాలకు పంపిస్తామన్న అధికారులు



అమృత్‌సర్: అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను అక్కడి ప్రభుత్వం గుర్తించి, బలవంతంగా వెనక్కి పంపిస్తోంది. అమెరికా నుంచి భారతీయ అక్రమ వలసదార్లతో బయలుదేరిన సైనిక విమానం బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని శ్రీగురు రాందాస్‌జీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ల్యాండయ్యింది. మొత్తం 104 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. వీరిలో పంజాబ్‌కు చెందిన 30 మంది, హరియాణాకు చెందిన 33 మంది, గుజరాత్‌కు చెందిన 33 మంది, మహారాష్ట్రకు చెందిన ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, చండీగఢ్‌కు చెందిన ఇద్దరు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. తిరిగి వచ్చినవారిలో 19 మంది మహిళలు, 13 మైనర్లు ఉన్నారని చెప్పారు. అమెరికా సైన్యానికి చెందిన సి–17 గ్లోబ్‌మాస్టర్ విమానంలో 205 మంది భారతీయ అక్రమ వలసదార్లను తరలిస్తున్నట్లు తొలుత వార్తలు వెలువడ్డాయి. కానీ, 104 మంది వచ్చినట్లు అధికారులు చెప్పారు. వాస్తవ సంఖ్య ఎంత అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. అమెరికా నుంచి భారతీయుల రాక సందర్భంగా అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వెనక్కి వచ్చినవారిని క్షుణ్నంగా తనిఖీ చేశారు. వారి వద్ద పాసుపోర్టులు లేకపోవడంతో బయోమెట్రిక్ ద్వారా గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. ఏదైనా నేర చరిత్ర ఉందా? అనేది తేలుస్తామని అధికారులు చెప్పారు. వెనక్కి వచ్చినవారిని స్వస్థలాలకు పంపించబోతున్నట్లు అధికారులు చెప్పారు. విమానంలో వచ్చినవారికి భోజనం పెట్టించామని, ప్రస్తుతం వారంతా క్షేమంగా ఉన్నారని పంజాబ్ మంత్రి కులదీప్‌సింగ్ ధలీవాల్ చెప్పారు. ఇది మొదటి బ్యాచ్ మాత్రమేనని, త్వరలో మరికొందరిని అమెరికా ప్రభుత్వం వెనక్కి పంపనున్నట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా గత నెలలో డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అక్రమ వలసదార్ల కోసం వేట మొదలయ్యింది. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా నివసిస్తున్నవారిని అమెరికా అధికారులు గుర్తిస్తున్నారు. వారిని ప్రత్యేక విమానాల్లో స్వదేశాలకు తరిస్తున్నారు. ఈ విషయంలో ప్రపంచ దేశాల నుంచి ఎన్ని విమర్శలు వస్తున్నా ట్రంప్ ప్రభుత్వం లెక్కచేయడం లేదు. అమెరికాలోని అక్రమ వలసదార్లలో భారతీయులు లక్షల సంఖ్యలో ఉన్నారు. వారందరినీ బయటకు వెళ్లగొట్టడం ఖాయమని సమాచారం.


వలసదార్లతో మాట్లాడుతున్న పంజాబ్ మంత్రి కుల్దీప్

సంకెళ్లు వేసి అవమానించారు: కాంగ్రెస్

అమెరికా నుంచి భారతీయులను అవమానకరమైన రీతిలో వెనక్కి పంపించారని కాంగ్రెస్ పార్టీ మీడియా, ప్రచార విభాగం నేత పవన్ ఖేరా బుధవారం ఆవేదన వ్యక్తంచేశారు. చేతులకు సంకెళ్లు వేసి పంపించడం దారుణమని అన్నారు. ఈ దృశ్యాలు తమను కలచివేస్తున్నాయని చెప్పారు. ఒక భారతీయుడిగా తాను చాలా బాధపడుతున్నానని పేర్కొన్నారు. 2013లో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రాగడేను ఇలాగే అమెరికాలో అవమానిస్తే అప్పటి యూపీఏ ప్రభుత్వం తీవ్రంగా స్పందించిందని, దాంతో అమెరికా ప్రభుత్వం దిగివచ్చి విచారం వ్యక్తంచేసిందని పవన్ ఖేరా గుర్తుచేశారు.



'పవర్'ప్లాన్ సిద్ధం

'గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. 2024 మే నెలలో 4,352 మెగావాట్లు వినియోగించగా.. ఈ ఏడాది ఏప్రిల్/మే 5 వేల ఎంయూలకు చేరుకోవచ్చు. -10లో



నిలబడి.. నవ్వుల జడి..

ఇటీవల సిటీలో అత్యధికులకు స్టాండ్-అప్ కామెడీ చేరువైంది. ఒక వ్యక్తి వేదికపై నుంచి జోకులు వేస్తూ ప్రేక్షకులను నవ్వించేదే స్టాండ్-అప్ కామెడీ. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/19.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు ఉండే అవకాశముంది. గరిష్టంగా 34, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

అజయ్ కుటుంబానికి అండగా ఉంటాం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



అజయ్ కుటుంబ సభ్యులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

కీసర: నగరంలోని హుస్సేన్ సాగర్‌లో గత నెల 26న జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందిన నాగారం మున్సిపాలిటీకి చెందిన అజయ్ కుటుంబానికి అండగా ఉంటానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఆయన మేడ్చల్ జిల్లా రూరల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి నాగారం మున్సిపాలిటీలోని మృతుడు అజయ్ తల్లిదండ్రులు జానకీ రాముడు, నాగలక్ష్మిని పరామర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అజయ్ మృతి తనను కలచి వేసిందన్నారు. అజయ్‌ని తిరిగి తీసుకు రాలేను కానీ.. ఎదిగిన కొడుకును పోగొట్టుకున్న పేద కుటుంబానికి, అజయ్ సోదరుడు, సోదరిలకు ఎటువంటి సాయం చేయడానికైనా నా తాను ముందుంటానన్నారు. కిషన్‌రెడ్డి వెంట గ్రేటర్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, నాగారం మున్సిపల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నేతలు ఉన్నారు.

మాదక ద్రవ్యాలపై నిఘా పెట్టండి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



అబిడ్స్: డ్రగ్స్, గంజాయి రవాణా, వినియోగం, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పని చేస్తున్న ఎస్టీఎఫ్ బృందాల పని తీరుపై ఆయన సమీక్షించారు. జనవరిలో నాలుగు ఎస్టీఎఫ్ బృందాలు కలిసి నమోదు చేసిన 53 కేసుల వివరాలను పరిశీలించారు. ప్రధానంగా గత నెలలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, డ్రగ్స్‌పై కలిపి 40 కేసులు నమోదు చేయడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నాటుసారా కేంద్రాలపై దాడులు, రైళ్లలో గోవా, ఢిల్లీ ప్రాంతాల నుంచి వస్తున్న మద్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా ఉత్తమ పని తీరు కనబరచిన నలుగురు ఎస్సైలు, ముగ్గురు కానిస్టేబుళ్లకు ప్రశంస పత్రాలు అందజేశారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషీ, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, ఎస్టీఎఫ్ టీమ్ లీడర్స్ అంజి రెడ్డి, ప్రదీప్‌రావు, తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.



రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈసారి వేసవి కాస్త ముందుగానే వచ్చినట్టు ఎండల తీవ్రతను చూస్తే తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం గొడుగుల నీడలో వెళ్తున్న యువతుల చిత్రం ఎన్టీఆర్ మార్గ్‌లో కనిపించింది.

వాటర్ పంప్ హౌస్ @ సోలార్ పవర్ ప్లాంట్

- నాలుగు ప్లాంట్లలో 79 మెగావాట్ల విద్యుదుత్పత్తికి యోచన
- టీజీరెడ్కో అధికారులతో కీలక సమావేశం
- ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు కసరత్తు

విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించుకునేందుకు జలమండలి ప్రణాళిక



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి ప్రధాన జలాశయాల నుంచి పంపింగ్ ద్వారా నీటి తరలింపు, శుద్ధి, విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు జలమండలి సిద్ధమైంది. ఇప్పటికే ఉచిత నీటి సరఫరా, పేరుకుపోయిన నీటి బకాయిలతో పీకల్లోతు నష్టాల్లో కూరుపోయిన జలమండలికి విద్యుత్ చార్జీలు ఆర్థిక భారంగా తయారయ్యాయి. దీంతో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి సారించింది. ముందుగా పైలట్ ప్రాజెక్టుగా నాలుగు కేంద్రాల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. రెండు రోజుల క్రితం రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (టీజీరెడ్కో) అధికారులతో సమావేశమై పంప్‌హౌస్ ప్రాంగణాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై చర్చించింది. వాటర్ పంపింగ్ హౌస్‌లో సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అంగీకరించడంతోపాటు క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన జరిపి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించేందుకు టీజీరెడ్కో సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో సోలార్ పవర్ ప్లాంటు ప్రాజెక్టు వైపు అడుగులు పడుతున్నాయి.

79 మెగావాట్ల విద్యుదుత్పత్తి..

జలమండలి నాలుగు పంప్ హౌస్‌ల్లో పగటి పూట 7 గంటల పాటు సౌర విద్యుత్ అవసరాలు తీరేలా ప్రణాళికలు రూపొందించింది. ప్రయోగాత్మకంగా గోదావరి నీటి సరఫరా పథకం పరిధిలోని మూడు పంప్ హౌస్‌ల్లో, మంజీరా నీటి సరఫరా పథకం పరిధిలోని ఒక పంప్ హౌస్‌తో కలిపి సుమారు 79 మెగావాట్ల విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. ఇందుకు అవసరమైన రిజర్వాయర్లు, నీటి శుద్ధి ప్లాంట్లు, ఖాళీ స్థలాలను గుర్తించింది. పైలట్ ప్రాజెక్టు సత్ఫలితాలినిస్తే కృష్ణా, గోదావరి, మంజీరా, సింగూర్ రిజర్వాయర్లు, వాటర్ పంప్ హౌస్, ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూషన్ పంప్ హౌస్‌లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలతో పాటు ఖాళీ స్థలాల్లో సౌర పలకలను ఏర్పాటు చేసి సౌర విద్యుదుత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించింది.

నెలవారీ భారం రూ.120 కోట్లకుపైగానే

జలమండలి నెలవారీ విద్యుత్ చార్జీల పేరిట రూ. 120 కోట్లపైనే ఆర్థిక భారం భరిస్తోంది. సౌర విద్యుదుత్పత్తి చేసే ఏడాదిలో సుమారు 280 రోజులు పగటి పూట ఏడు గంటల పాటు విద్యుత్తు అవసరాలు తీర్చవచ్చు. దీంతో ఏటా రూ.40 కోట్ల ఛార్జీల తగ్గుతాయని అధికారుల అంచనా. అయితే సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు దాదాపు రూ. 400 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు ఖర్చు కావచ్చని జలమండలి అధికారులు అంచనా వేస్తున్నారు.

జలమండలి పంప్ హౌస్‌లలో సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రణాళిక ఇలా..

ప్రాంతం	సగటు వినియోగం	ఎకరాలు (స్థలం)	సోలార్ ఇన్‌స్టలేషన్		ఏడాదికి యూనిట్ల పొదుపు
	ఏడాదికి మిలియన్ యూనిట్లు		మెగావాట్లు	యూనిట్లు	(విలువ రూ.కోట్లలో)
ముర్మూర్	125.1072	60	15	37.8	25.14
మల్లారం	161.184	80	19	47.88	31.84
కొండపాక	147.408	100	25	63.00	41.90
పెద్దాపూర్	58.682	50	20	50.4	33.53

విద్యుత్ చార్జీల ఆదా

జలాశయాల నుంచి నీటి తరలింపు, సరఫరా కోసం విద్యుత్ ఖర్చులు తగ్గించుకునేందుకు సౌరశక్తి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందుకోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు కసరత్తు జరుగుతోంది. ఒకసారి ప్లాంట్ల ఏర్పాటు వ్యయం భరిస్తే ఆ తర్వాత పైసా ఖర్చు లేకుండా శాశ్వతంగా విద్యుత్ అవసరాలను తీర్చుకోవచ్చు. పైలట్ ప్రాజెక్టుగా నాలుగు పంప్‌హౌస్‌లలో సౌర శక్తి ప్లాంట్లను ఏర్పాటు సంకల్పించాం. సత్ఫలితాలు ఇస్తే దశలవారీగా అన్ని పంప్ హౌస్‌లకు విస్తరిస్తాం.



– మయాంక్ మిట్టల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జలమండలి

స్వచ్ఛ ర్యాంక్ దక్కేనా?

SWACH TELANGANA HYDERABAD

సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ఈసారి హైదరాబాద్ పరిస్థితి ఏం కానుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు కారణాలు ఉన్నాయి. నగరంలో గతంలో ఎత్తేసిన డంపర్ బిన్లను తిరిగి ఏర్పాటు చేస్తుండటం ఇందుకు ఒక కారణం కాగా.. కేంద్ర బృందం క్షేత్రస్థాయి పర్యటనలో తప్పుడు వివరాలిచ్చినట్లు గుర్తిస్తే పెనాల్టీ విధించనున్నారు. అంటే మైనస్ మార్కులుంటాయి. తద్వారా మెరుగైన ర్యాంకు వచ్చే అవకాశం ఉండదు. నగరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు పొందేందుకు గతంలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కేవలం స్వచ్ఛ ర్యాంకుల కోసమే నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న డంపర్ బిన్లను ఎత్తివేశారు. దీంతో ప్రజల నుంచి పలు విమర్శలు ఎదురయ్యాయి. రోడ్ల వెంబడి ఎక్కడికక్కడే చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. నగరంలో చెత్త పరిస్థితులకు డంపర్‌బిన్లు లేకపోవడం కూడా ముఖ్య కారణంగా భావించిన కమిషనర్ ఇలంబర్తి తిరిగి వాటిని ఏర్పాటు చేసే పనిలో పడ్డారు. గతంలో మాదిరిగా కాకుండా ఆధునిక సాంకేతికతతో చెత్త పూర్తిగా నిండకముందే కంట్రోల్‌రూమ్‌కు 'అలర్ట్' వెళ్తుంది. వెంటనే వాహనం వెళ్లి ఆటోమేటిక్‌గా చెత్త తరలిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో స్థానికులు చెత్త వేసేందుకు ఇతర ఏర్పాట్లు చేశారు. ఎటొచ్చీ బహిరంగ ప్రదేశాల్లో ఉండే 'చెత్త సేకరణ'తో మార్కులు తగ్గుతాయి.

తప్పుడు వివరాలిస్తే..

ప్రస్తుతం నడుస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో కొన్ని నిబంధనలు ఇటీవల కొత్తగా చేర్చారు. స్వచ్ఛ కార్యక్రమాల అమలు గురించి పోటీలో పాల్గొనే స్థానికసంస్థలు నిర్ణీత వ్యవధుల్లో సంబంధిత 'స్వచ్ఛతమ్' పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తాయి. పోర్టల్‌లో పొందుపరిచిన వివరాలు నిజంగా అమలవుతున్నదీ, లేనిదీ పరిశీలించేందుకు కేంద్రం నుంచి వచ్చే బృందాలు తమ తనిఖీలు, పరిశీలనల్లో తప్పుడు వివరాలు నమోదైనట్లు గుర్తిస్తే పెనాల్టీ విధిస్తాయి. మైనస్ మార్కులు వేస్తాయి. 'రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్' థీమ్‌తో నడుస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్–2024కు సంబంధించి మూడు సర్వేలో మూడు దశలు పూర్తయ్యాయి. నాలుగో దశ కోసం ఈ మార్పులు చేశారు. అమలు విధివిధానాల్లోనూ కీలక మార్పులు చేశారు.

మారిన నిబంధనలతో మైనస్ మార్కులు

- డంపర్ బిన్ల ఏర్పాటు ప్రభావం చూపేనా?

ఈ మేరకు మార్పులు ఇలా ఉన్నాయి..

- జనాభా ప్రాతిపదికన నిబంధనలు.
- పది విభాగాలో ఇండికేటర్స్ సరళీకరణ.
- కొత్తగా 'సూపర్ స్వచ్ఛ్ లీగ్' పట్టణాలు.
- కొన్ని అంశాలకు కొత్త ఇండికేటర్స్.
- పాఠశాలలు, జనసమ్మర్ధం ఉండే పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి.
- స్వచ్ఛతకు సంబంధించి పాఠశాలలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు.
- స్వచ్ఛతమ్ పోర్టల్‌లో పొందుపరిచిన వివరాలు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు భిన్నంగా ఉంటే మైనస్ మార్కులు.
- ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు మంచి ర్యాంక్ రావడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సూపర్ స్వచ్ఛ్ లీగ్..

కొత్తగా పొందుపరిచిన అంశాల్లో సూపర్ స్వచ్ఛ్ లీగ్‌ను ప్రవేశపెట్టారు. జనాభా ప్రాతిపదికన 2021, 2022, 2023లలో స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకుల్లో కనీసం రెండు పర్యాయాలు మొదటి మూడుస్థానాల్లో నిలిచిన నగరాలు సూపర్ స్వచ్ఛ్ లీగ్‌గా గుర్తిస్తారు. సదరు పట్టణాల్లో అమలయ్యే స్వచ్ఛ కార్యక్రమాలను ప్రత్యేక ఇండికేటర్స్ ఆధారంగా పరిశీలిస్తారు. అవి తమ ప్రత్యేక హోదాను కాపాడుకునేందుకు అవి భవిష్యత్‌లో 85 శాతం మార్కుల్ని పొందాల్సి ఉంటుంది. ఇండోర్ వంటి నగరాలు సూపర్ స్వచ్ఛ్ లీగ్‌లో చేరితే, హైదరాబాద్‌కు గతం కంటే మెరుగైన ర్యాంకు వస్తుందనుకుంటే.. మారిన నిబంధనలు, మైనస్ మార్కులతో మంచి ర్యాంకుపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నెల 17 వరకూ నుమాయిష్



అబిడ్స్: నుమాయిష్‌ను రెండు రోజుల పాటు పొడిగిస్తూ ఎగ్జిబిషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ తీర్మానం చేసింది. జనవరి 3న ప్రారంభమైన ఎగ్జిబిషన్ ఈ నెల 15న ముగియాల్సి ఉంది. ఈ ఏడాది రెండు రోజులు ఆలస్యంగా ఎగ్జిబిషన్ ప్రారంభమైనందున మరో రెండు రోజులు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి వెల్లడించారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 15న ముగిసే ఎగ్జిబిషన్ ఈసారి 17న ముగియనుంది.

ఉలిక్కిపడిన దూలపల్లి

- కూలిన సమీప నివాసాల గోడలు
- తప్పిన పెను ప్రమాదం

గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా.. వరుసగా పేలిన 18 సిలిండర్లు

సుభాష్‌నగర్: వరుస పేలుళ్లతో దూలపల్లి ఉలిక్కి పడింది. గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల ఇళ్ల గోడలు కూలిపోయాయి. దీంతో జనాలు ఇళ్ల నుంచి పరుగులు తీశారు. జీడిమెట్ల ఫైర్ అధికారులు సకాలంలో వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. స్థానికుల కథనం ప్రకారం.. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని దూలపల్లి 15వ వార్డు అయ్యప్ప కాలనీ ప్రధాన రోడ్డును ఆనుకొని షాపు ముందు భాగంలో రతన్‌లాల్ అనే వ్యక్తి సైకిల్ షాప్ నడుపుతుండగా.. వెనుక భాగంలో మరో వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నాడు. రోజువారీగా బుధవారం సాయంత్రం గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో సిలిండర్ పేలింది. ఆ తర్వాత 18 గ్యాస్ సిలిండర్లు గాల్లోకి లేచి పేలిపోయాయి. దీంతో చుట్టుపక్కల మంటలు పెద్ద ఎత్తున అలుముకున్నాయి. పేలుడు ధాటికి రీఫిల్లింగ్ చేస్తున్న గదిలోని గోడలు షాపులో, వెనకాల ఉన్న గోడ మరో ఇంటిపై పడ్డాయి.

100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డ సిలిండర్లు..

పేలుడు సంభవించగానే రీఫిల్లింగ్ చేసిన వ్యక్తి కాలిన గాయాలతో పరుగులు తీయగా, సైకిల్ షాప్‌లో ఉన్న రతన్‌లాల్ తలకు గాయాలయ్యాయి. వెనకాల ఉన్న రెండిళ్లలోని సత్యవతి, జాహ్నవి, తేజస్వి, ధనుంజయ్, నీలునామ్, నీదులు బయట బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా డోర్‌పై గోడలు పడడంతో.. పక్కనే ఉన్న లక్ష్మి అనే మహిళ శిథిలాలను తొలగించి వారిని బయటకు తీసింది. పేలుడు ధాటికి గ్యాస్ సిలిండర్లు 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. సైకిల్ షాప్‌తో పాటు, వై.నాయుడు, ధనుంజయ్, అజయ్ కుమార్‌కు చెందిన ఇళ్లలోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా. ఈ ఘటనతో దూలపల్లి, జీడిమెట్ల పారిశ్రామిక వాడ రహదారిపై వాహనాల రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి.





పేలుడు ధాటికి కూలిన గోడలు, మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సెల్లార్ల తవ్వకాలు.. తెల్లారుతున్న బతుకులు

నిబంధనలు పాటించని బిల్డర్లు

- పట్టించుకోని అధికారులు
- మొక్కుబడిగా నోటీసులు
- నగరంలో ఆగని ఉల్లంఘనలు
- ఎల్‌బీనగర్‌లో మరో దుర్ఘటన



సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణాల్లో బిల్డర్ల ఉల్లంఘనలు, అధికారుల ఆమ్యామ్యాలు అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. నిర్మాణాల్లో పలు డీవియేషన్లకు పాల్పడే బిల్డర్లు సెల్లార్ల తవ్వకాల్లోనూ కనీస ప్రమాణాలు పాటించకపోవడంతో.. పొట్టకూటి కోసం పనిచేసే కార్మికులు అసువులు బాస్తున్నారు. తాజాగా బుధవారం ఎల్‌బీనగర్ పరిధిలో ముగ్గురి ప్రాణాలు పోవడం వెనుకా నిలువెత్తు నిర్లక్ష్యమే బట్టబయలైంది. సంబంధిత అధికారులు సైతం మొక్కుబడిగా నోటీసులిస్తూ చేతులు దులుపుకుంటున్నారు తప్ప పనులు ప్రారంభమైనప్పటి నుంచీ తనిఖీలు చేస్తూ ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవడం లేదు. బిల్డర్లు, అధికారులకు మధ్యనున్న 'ఆర్థిక సంబంధాలే' ఇందుకు కారణమనే ఆరోపణలు షరా 'మామూలు'గా మారాయి.

నిబంధనలు కాగితాల్లోనే..

- అనుమతులతోపాటు పాటించాల్సిన నిబంధనలు కాగితాల్లో ఉంటున్నాయి తప్ప చాలామంది వాటిని పాటించడం లేదు. నిబంధనల మేరకు సెల్లార్ తవ్వే నేల బలంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించాలి. పనులు జరిగే ప్రాంతంలో బారికేడింగ్, రిటైనింగ్ వాల్ ఉండాలి. ప్రస్తుతం పనులు తొలి దశలోనే ఉన్నందున రిటైనింగ్ వాల్ దాకా రాలేదు కానీ మిగతా జాగ్రత్తలు కూడా పాటించలేదు.
- నేల జారిపోకుండా అవసరమైన పటిష్టతా చర్యలు చేపట్టాల్సి ఉండగా అవీ జరగడంలేదు. తగిన సెట్‌బ్యాక్‌లు లేవు. సెల్లార్ తవ్వకం ప్రాంతాన్ని నిత్యం పరిశీలిస్తూ, ఎక్కడైనా నేల బలహీనంగా ఉన్నా, జారిపోయేలా ఉన్నా వెంటనే తగిన చర్యలు చేపట్టాలి. కానీ వాటిని పట్టించుకోలేదు. నిర్మాణంలో భద్రతా చర్యలు, కార్మికుల రక్షణ చర్యలు గాలికొదిలేశారు.
- జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల మేరకు సెల్లార్ తవ్వకానికి ముందు నిర్మాణదారు సంబంధిత అధికారికి సమాచారమివ్వాల్సి ఉండగా, ఆ పని చేయలేదు. సంబంధిత సర్కిల్ అధికారి గతనెల 16వ తేదీన ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి నోటీసు ఇచ్చినట్లు ఎల్‌బీనగర్ జోన్ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారి తెలిపారు. అయినప్పటికీ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే సెల్లార్ తవ్వకం పనులు మొదలు పెట్టారు. అందువల్లే వదులుగా ఉన్న మట్టి మీదపడి ముగ్గురి ప్రాణాలు పోవడంతోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

మృత్యు ఘంటికలు ఇలా..

చాలా ప్రాంతాల్లో ఎలాంటి అనుమతుల్లేకుండానే సెల్లార్లు తవ్వుతున్నారు. గత సంవత్సరం అధికారుల తనిఖీల్లో ఈ విషయం వెల్లడైంది. ఎల్‌బీనగర్‌జోన్‌లో ఇవి ఎక్కువగా ఉండటం కూడా వెల్లడైంది. తవ్వకాల్లో వెలువడిన మట్టిని తరలించే లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్తుండటాన్ని గుర్తించారు.

- సెల్లార్ తవ్వకాల్లో ఉల్లంఘనల వల్లే దాదాపు ఎనిమిదేళ్ల క్రితం నానక్‌రామ్‌గూడలో భవనం కూలి పదిమందికి పైగా మరణించారు.
- 2017లో కొండాపూర్‌లో ఓ భవన నిర్మాణానికి సంబంధించి 30 అడుగుల లోతున జరుగుతున్న సెల్లార్ పనుల్లో ఇద్దరు మహిళలు మృతి చెందారు.
- 2019లో ఉప్పల్‌లో నిర్మాణంలో ఉన్న సెల్లార్‌లో పడి ఇద్దరు మైనర్ బాలలు మరణించారు.
- 2020లో మాదాపూర్ ఖానామెట్‌లో ప్రైవేట్ కళాశాల బస్సు సెల్లార్ గుంతలో పడింది.కూకట్‌పల్లిలో ఏడాది క్రితం నిబంధనలు పాటించనందున సెల్లార్ తవ్వుతున్న పరిసరాల్లో నేల కుంగింది.

ఓయూలో ఆర్ట్స్ కాలేజీ పీజీ విద్యార్థుల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ నిబంధనల ప్రకారం నిర్ణీత 75 శాతం హాజరు లేనందున ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం పీజీ విద్యార్థులను సెమిస్టర్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో బుధవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఆర్ట్స్ కాలేజీ సమీపంలో రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వివిధ ఉద్యోగ పరీక్షలు ఉన్నందున తరగతులకు హాజరుకాలేక పోయామని విద్యార్థులు పేర్కొన్నారు. ఉద్యోగాల రాత పరీక్షల కోసం శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఓయూ అధికారులే హాజరు శాతాన్ని పరిగణనలోకి తీసుకోవడం దారుణమన్నారు. అధ్యాపకులు సరిగా లేని ఆర్ట్స్ కాలేజీలో హాజరు శాతాన్ని అడగడం ఏమిటని ప్రశ్నించారు. పరీక్షలకు విద్యార్థులను అనుమతించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో కారణంగా ట్రాఫిక్ జామ్ అవడంతో పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థులకు నచ్చచెప్పి ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం వద్దకు పంపించారు.

నీటి ట్యాంకర్ల బుకింగ్‌లో అక్రమాలకు చెక్

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వేసవిలో మంచినీటి ట్యాంకర్ల బుకింగ్‌లో చేతివాటానికి పాల్పడే వారిని గుర్తించి..ఆయా ట్యాంకర్లను బ్లాక్ లిస్టులో పెడ్తామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ట్యాంకర్ మేనేజ్‌మెంట్‌పై ఐటీ వింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గతేడాది అక్రమ పద్ధతిలో ట్యాంకర్లు బుక్ చేసిన మొబైల్ నెంబర్లు, క్యాన్ నంబర్లను బ్లాక్ చేయనున్నట్లు వెల్లడించారు. గతేడాది కాలంలో అత్యధిక ట్యాంకర్లు బుక్ అయ్యాయని.. ఇదే సమయంలో నలభై మందికి పైగా డ్రైవర్లు అక్రమాలకు పాల్పడ్డట్లు గుర్తించామని తెలిపారు. తప్పుడు పద్ధతిలో ట్యాంకర్లు బుక్ చేసి రెట్టింపు రేట్లకు అమ్ముకోవడానికి తెరలేపారని పేర్కొన్నారు. ట్యాంకర్ బుక్ చేసుకోలేని వారి క్యాన్ నంబర్లను గుర్తించి, వారి క్యాన్ నంబర్‌కు డ్రైవర్ల నెంబర్లు అనుసంధానం చేసి వాళ్లే డొమెస్టిక్ అవసరాల కోసం బుక్ చేసి బ్లాక్‌లో అమ్మినట్లు గుర్తించామన్నారు. అత్యధికంగా ఒక్కో క్యాన్ నెంబర్‌పై వంద ట్రిప్పులకుపైగా బుక్ చేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇదే అంశంపై లోతుగా అధ్యయనం చేసి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, ఐటీ వింగ్ అధికారులు పాల్గొన్నారు

పాఠశాల భవనం పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- ప్రిన్సిపాల్ మందలించాడని మనస్తాపం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


నీరజ్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: ప్రిన్సిపాల్ మందలించాడని ఓ విద్యార్థి పాఠశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం పట్టణంలో కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని సీఎస్‌కే వెంచర్‌లో నివాసం ఉంటున్న హరిభూషణ్ పటేల్, భాగ్య దంపతుల కుమారుడు నీరజ్(15) స్థానిక శాస్త్ర పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం స్కూల్‌కు వెళ్లిన నీరజ్ స్నేహితుడితో కలిసి క్లాస్‌రూం నుంచి కారిడార్‌కు వచ్చాడు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ నరేందర్ రాయ్ వారిని మందలించాడు. దీంతో సాయంత్రం 4గంటలకు సుమారు 20 ఫీట్ల ఎత్తులో ఉన్న స్కూల్ అంతస్తు పైనుంచి నీరజ్ కిందికి దూకాడు.

రక్తపు మడుగులో..

పాఠశాల భవనం పైనుంచి దూకిన నీరజ్ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా.. పాఠశాల సిబ్బంది వెంటనే అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు వెంటనే చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు.

విద్యార్థి నేతల ఆందోళన..

విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ యువసత్తా యూత్ నాయకులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాల ఫర్నిచర్, అద్దాలు, బోర్డులు ధ్వంసం చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట బైఠాయించారు.

వార్షికోత్సవం మరుసటి రోజే విషాదం..

హరిభూషణ్ పటేల్, భాగ్య దంపతులకు నీరజ్‌తో పాటు ఓ కూతురు ఉన్నారు. మంగళవారం హరిభూషణ్ దంపతుల పెళ్లి రోజు కావడంతో వారు కుటుంబ సభ్యులతో ఘనంగా వేడుక జరుపుకొన్నారు. మరుసటి రోజే కొడుకు మృతిచెందడంతో గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. ఆర్మీ జవాన్‌గా పని చేసిన హరిభూషణ్ రిటైర్మెంట్ తీసుకుని, ప్రస్తుతం ప్రస్తుతం బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

- మృతుల్లో ముగ్గురు యువకులు..ఓ యువతి
- నగరంలో విషాద ఘటనలు..

నగరంలో 18.. 28.. 29 ఏళ్ల వయసున్న ముగ్గురు యువకులు, 22 ఏళ్ల ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రేమ విఫలమైందని ఒకరు..ఈ జీవితం నచ్చలేదంటూ మానసిక వేదనతో మరొకరు.. పరీక్ష సరిగా రాయలేదనే భయంతో ఓ యువకుడు, అనారోగ్యం వేధిస్తోందని ఓ యువతి ఉసురు తీసుకున్నారు. క్షణికావేశం.. జీవితమంటే ఏర్పడిన భయం.. మానసిక ఒత్తిడితో బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఎంతో భవిష్యత్తు ఉన్న నలుగురు ప్రాణాలు తీసుకోవడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

– గచ్చిబౌలి/మాదాపూర్/అమీర్‌పేట

ప్రియురాలికి వీడియో కాల్ చేసి..

ప్రేమ వ్యవహారంలో మనస్పర్థల కారణంగా ఓ యువకుడు ప్రియురాలికి వీడియో కాల్ చేసి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపిన ప్రకారం.. ఒడిశాలోని గంజాం జిల్లా జిల్లుండ జరడ గ్రామానికి చెందిన ధర్మ ప్రధాన్ (29) ఇరవై రోజుల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి రాయదుర్గంలోని అపర్ణ సైట్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. అక్కడే లేబర్ కాలనీలో నివాసం ఉంటూ మంగళవారం సాయంత్రం 4.55 గంటల సమయంలో ఓ యువతికి వీడియో కాల్ చేసి మాట్లాడుతూ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. అంతకు ముందు చేతిపై కత్తితో కోసుకొని..ఆ తర్వాత వీడియో కాల్ చేసినట్లుగా ఎస్ఐ రాములు పేర్కొన్నారు. ప్రేమ వైఫల్యమే కారణమై ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. వీడియో కాల్ అందుకున్న యువతి హైదరాబాద్‌లో మరో సైట్‌లో పనిచేస్తున్న తమ బంధువులకు ఫోన్‌చేసి ధర్మ ప్రదాన్ విషయాన్ని చెప్పి అప్రమత్తం చేసింది. వెంటనే వారు సైట్‌లోని లేబర్ కాలనీకి వచ్చి చూడగా యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం మృతుడి బంధువులు రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్య సమస్యలతో ఐటీ ఉద్యోగిని..


రిటోజ బసు (ఫైల్)

అనారోగ్య సమస్యలతో ఐటీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం ఘటన జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రిటోజ బసు(22) మాదాపూర్ సిద్ధిఖ్‌నగర్ జోలో స్టెర్లింగ్ కో లివింగ్ హాస్టల్‌లో స్నేహితునితో కలసి నివాసం ఉంటున్నారు. గచ్చిబౌలిలోని ఓ ఐటీ కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నారు. ఆమె స్నేహితుడు కోల్‌కత్తాకు చెందిన హర్ష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు కలిసి ఒక నెలక్రితమే హాస్టల్‌కు వచ్చారు. కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లి చేసుకుందామనుకున్నారు. ఈ లోపే అనారోగ్య సమస్యల కారణంగా ఒత్తిడికి గురైన రిటోజ బసు హాస్టల్ భవనం ఆరవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవితం నచ్చలేదంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన ప్రకారం..జగిత్యాల జిల్లా బూగారం మండలం భోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గంతుల కుమార్ (28) ఎంబీఏ పూర్తి చేసి గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. బీకే గూడ సంజయ్ గాంధీనగర్ కాలనీలో గంగాధర్ అనే స్నేహితుడితో కలిసి ఉంటున్నాడు. బుధవారం ఉదయం గంగాధర్ బయటికు వెళ్లి తిరిగి 10 గంటల సమయంలో రూమ్‌కు వచ్చాడు. లోపలి నుంచి గడియ వేసి ఉండటంతో తలుపులు తట్టినా లోపల నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో కిటికీలో నుంచి చూడగా కుమార్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి విచారణ జరిపారు. గదిలో ఓ సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. 'నాకు జీవితం నచ్చలేదు. నన్ను క్షమించండి' అని నోట్ రాసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పరీక్ష భయంతో సీఏ విద్యార్థి


అమర్‌జీత్ (ఫైల్)

పరీక్ష సరిగా రాయలేదని ఓ సీఏ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాన్వి మండలం కరిటిగుడ్డ గ్రామానికి చెందిన రాజుశెట్టి కుమారుడు ఎస్.అమర్‌జీత్ (18) ఎస్ఆర్ నగర్ బాపూనగర్‌లోని జీవీ క్రేజీ పీజీ హాస్టల్‌లో ఉంటూ లక్ష్య కళాశాలలో సీఏ చదువుతున్నాడు. 2024 డిసెంబరు 22న పరీక్షలు రాసి సొంత గ్రామానికి వెళ్లాడు. పరీక్ష సరిగా రాయలేదని ఇంట్లో కుటుంబ సభ్యుల వద్ద బాధపడ్డాడు. ఫెయిల్ అవుతానేమో అని భయం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో గత జనవరి 27న మరో పరీక్ష రాయాల్సి ఉండటంతో తిరిగి నగరానికి వచ్చి హాస్టల్‌నే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లాల్సి ఉండగా ఆరోగ్యం బాగాలేదని రూమ్‌మేట్ సుబ్రమణ్యంతో చెప్పి గదిలో ఉండిపోయాడు. రాత్రి 10.30 గంటల సమయంలో సుబ్రమణ్యం వచ్చి చూడగా లోపలి నుండి లాక్ చేసి ఉంది. ఎంత పిలిచినా పలుకకపోవడంతో అనుమానం వచ్చి హాస్టల్ నిర్వాహకులకు చెప్పగా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు తెరిచి చూడగా అమర్‌జీత్ ఉరి వేసుకుని కనిపించాడు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ జరిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్యుత్తమ వైద్య సేవల కేంద్రంగా హైదరాబాద్

- మంత్రి పొంగులేటి

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్య సేవల కేంద్రంగా హైదరాబాద్ అవతరిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రెనోవా సెంచరీ ఆసుపత్రిలో నూతన ఆర్థోపెడిక్స్, రోబోటిక్ సర్జరీ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీయులు సైతం చికిత్స కోసం నగరానికి వస్తున్నారన్నారు. వైద్య రంగానికి ప్రభుత్వం మద్దతుగా నిలుస్తోందని, ఈ అవకాశాన్ని ఆసుపత్రి యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా, సేవా కోణంలో చూడాలని కోరారు. రోబోటిక్ సర్జరీతో అత్యంత ఖచ్చితత్వంతో చికిత్సలు చేయడానికి సాధ్యమవుతుందన్నారు. మిల్లీ మీటరు కంటే తక్కువ సైజులో ఎముక కోత, అవయవం పొడవు పునరుద్ధరణ, 3డి వర్చువల్ మోడల్ వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. తన కుటుంబ సభ్యులకు ఇక్కడే మోకీలు మార్పిడి జరిగిందని గుర్తుచేశారు. రెనోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్థోపెడిక్స్, రోబోటిక్ సర్జరీ వైద్యులు సుహాస్ మసిలామణి మాట్లాడుతూ రెనోవా సెంచరీ హాస్పిటల్స్ అత్యాధునిక ఆర్థోపెడిక్స్ చికిత్సలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆర్థోపెడిక్స్ చికిత్స, సంరక్షణలో భాగంగా తెలంగాణలోనే మొదటిసారి రెనోవా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్థోపెడిక్స్, రోబోటిక్ సర్జరీని అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తెలంగాణ ఐడీసీఎల్ చైర్మన్ విజయ్ బాబు, రెనోవో ఆసుపత్రుల ఎండీ, సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి, వైద్యులు బీకేఎస్ శాస్త్రి, జె.ఎం.కె.మూర్తి, హిమాకాంత్ లింగాల, విజయ్ కుమార్ రెడ్డి గుర్రం, అనూప్ రెడ్డి సామ, రవీంద్రనాథ్ గరగ, తదితరులు పాల్గొన్నారు.



ఓయూలో సీఎం దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీల వర్గీకరణ తీరుపై మాల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ మాల విద్యార్థి జేఏసీ నేత మాదాసు రాహుల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల భాస్కర్ మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంది తొందరపాటు చర్య అన్నారు. ఎలాంటి చర్చలు లేకుండా ఏకపక్షంగా వర్గీకరణ నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గడ్డం శ్రీనివాస్, మాల విద్యార్థి సంఘం ఓయూ అధ్యక్షులు నామ సైదులు, కిశోర్, రేను, సంతోష్, దిలీప్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



7న కిసాన్ అగ్రి షో

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 7వ తేదీన కిసాన్ అగ్రి షో పేరిట వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన 9వ తేదీ వరకు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మందికి పైగా సందర్శకులు రానున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ తదితర అధికారులు పాల్గొంటారని, రైతులకు ఉపయుక్తమైన విధానాలు, ప్రదర్శనలు ఈ షోలో వివరిస్తారని పేర్కొన్నారు.

భారీగా డ్రగ్స్ స్వాధీనం

ముగ్గురు విదేశీయుల అరెస్ట్

కాచిగూడ: నగరంలో భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు విదేశీయులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నగరంలో డ్రగ్స్ సరఫరా చేయడానికి పెడ్లర్లు వచ్చినట్లు సమాచారం రావడంతో బుధవారం లంగర్‌హౌజ్ పోలీసులు, నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌తో కలిసి జాయింట్ ఆపరేషన్ చేశారు. డ్రగ్ పెడ్లర్ ఒలివర్ అలియాస్ జాన్సన్‌తో పాటు ఆఫ్రికా దేశానికి చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా.. అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ సుధీంద్ర తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర

ఎస్సీ వర్గీకరణ విజయం అమరులకు అంకితం: మోత్కుపల్లి

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణ ద్వారానే దళితులకు రాజ్యాధికారం దక్కుతుందని, ఆ దిశగా దళితులంతా ఐక్యంగా ఉద్యమించాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పిలుపునిచ్చారు. మాదిగల ఎన్నో ఏళ్ల కలను సీఎం రేవంత్‌రెడ్డి సాకారం చేశారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్(టీఎస్) రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వర్గీకరణ విజయాన్ని అమరులకు అంకితం చేస్తూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని అన్నారు. వంగపల్లి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విజయం అమరులకు అంకితం అని పేర్కొన్నారు. మార్చి 1వ తేదీన మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది పూర్తిగా ఒక్కరి విజయం కాదని, ప్రతి మాదిగ బిడ్డ విజయమని అన్నారు. కార్యక్రమంలో యాతాకుల భాస్కర్, కోర్‌కమిటీ సభ్యులు మధు, బి.శ్రీనివాస్, పి.రమేష్, సాయికృష్ణ, సంజీవ, మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు వెంకట్, నాయకులు చందు, నాగరాజు, శ్రీకాంత్, సురేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నేతల సంబరాలు

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి



శంకర్‌పల్లి: ఓ ప్రైవేటు పాఠశాల బస్సు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇంజనీరింగ్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని ఎన్‌సీడీ రాయల్ పెవిలియన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి మోకిల సీఐ వీరబాబు, స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా విజయవాడ అర్బన్ మండల కేంద్రానికి చెందిన శ్రీహర్ష(19)కు దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ సీటు వచ్చింది. దీంతో అతని తల్లి మోకిలతండాలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఇక్కడే ఉంటూ కొడుకును చదివిస్తోంది. శ్రీహర్ష నిత్యం బైక్‌పై కాలేజీకి వెళ్లివస్తుంటాడు. ఇదిలా ఉండగా బుధవారం కళాశాల ముగిసిన తర్వాత ఉప్పల్‌కు చెందిన క్లాస్‌మేట్ హర్షనందన్(19)ను తీసుకుని ఫ్రెషప్ అయ్యేందుకు మోకిలతండాకు వచ్చారు. సుమారు గంటపాటు రూంలో గడిపిన అనంతరం హర్షనందన్‌ను కాలేజీ వద్ద వదిలిపెట్టేందుకు బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఎన్‌సీడీ రాయల్ పెవిలియన్ సమీపంలో కొండకల్ వైపు అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న ఏపీ మోడల్ పాఠశాల బస్సు వీరిని బలంగా ఢీ కొట్టింది. బైక్ నడుపుతున్న శ్రీహర్షకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా.. హర్షనందన్ పాక్షిక గాయాలతో బయటపడ్డాడు. అతన్ని శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మోకిల పోలీసులు శ్రీహర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు.

నమ్మించి..రూ.కోటిన్నరతో ఉడాయించాడు


పోలీసులను ఆశ్రయించిన బాధితులు


ఓంప్రకాష్ (ఫైల్)

జగద్గిరిగుట్ట: ఎన్నో ఏళ్లుగా జ్యువెలరీ షాపు నడుపుతూ..ప్రజలతో నమ్మకంగా ఉంటూ వ్యాపారం చేసిన ఓ నగల వ్యాపారి వినియోగదారులు తాకట్టుపెట్టిన బంగారం, నగలు చేయించాలని ఇచ్చిన బంగారంతో ఓ రాత్రికి రాత్రే ఉడాయించాడు. విషయం తెలిసి బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే..జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రగిరినగర్‌లో ఓంప్రకాష్ (35) అనే వ్యక్తి 2010లో రాజస్థాన్ నుంచి వచ్చి రాందేవ్ జ్యువెలర్స్ పేరుతో షాపు ప్రారంభించాడు. ఈ క్రమంలో నగలు తాకట్టు పెట్టుకుని డబ్బులు ఇవ్వడం, కొత్త నగలు చేయించడంతో ప్రజలు నమ్మారు. 2022లో రూ.3 కోట్లు వెచ్చించి ఓ ఇల్లు కూడా కొన్నాడు. ఆ తర్వాత దాన్ని అమ్మేసి అద్దె ఇంట్లో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఇటీవల బంగారు నగలు తాకట్టు పెట్టిన వారికి డబ్బులు ఇచ్చినా నగలు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడు. జ్యువెలరీ షాపు పేరును శ్రీశివంగా పేరు మార్చాడు. ఇటీవల బాధితుల నుండి ఒత్తిడి పెరగడంతో జనవరి 25న ఎవరికీ చెప్పకుండా కుటుంబంతో సహా పరారయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా గుర్తించిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం తాకట్టు పెట్టిన 86 తులాల బంగారు ఆభరణాలు, నగలు విడిపించడానికి ఇచ్చిన డబ్బులు, కొత్తగా నగలు చేయించడానికి ఇచ్చిన డబ్బులు కలిపి దాదాపు రూ.కోటిన్నర వరకు మోసగించినట్లు తెలుస్తోంది. ఇంకా బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉందని సీఐ నర్సింహ తెలిపారు. చంద్రగిరినగర్‌లో ఉంటున్న అతని సోదరుడిని స్టేషన్‌కి పిలిచి ఓంప్రకాష్ గురించి ఆరా తీస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: జయశంకర్‌నగర్ 11కెవీ ఫీడర్ బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు పద్మావతినగర్, సైట్–3, ఎన్ఆర్ఆర్‌పురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

వైభవంగా వార్షిక రథోత్సవ పూజలు



పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తికి అవభృత స్నానం నిర్వహిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయంలో వార్షిక రథోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దమ్మ తల్లి ఉత్సవమూర్తికి పుష్కరిణిలో అవభృత స్నానం నిర్వహించారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు టేబుళ్లు విరాళం



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ టేబుళ్లను అందజేసింది. ఈ మేరకు బ్యాంక్ జనరల్ మేనేజర్ సందీప్ పట్నాయక్ బుధవారం పాఠశాలలో వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.పరమేశ్వరమ్మ, టీచర్లు హనుమంతరావు, విశ్వేశ్వరరావు, మద్దీశ్వరుడు, శాంతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన



కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. మార్కెట్‌లో రూ.4,000 ఖరీదయ్యే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను కేవలం రూ.1500లకే అందించనున్నట్లు తెలిపారు. నిత్యం హాస్పిటల్‌ను సందర్శించే కేన్సర్ రోగులు, వారి కుటుంబ సభ్యులకు కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు వీలుగా నర్సింగ్ కళాశాల విద్యార్థులు, విద్యార్థినులు ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. వీటి ద్వారా కేన్సర్ వ్యాధిపై సందేహాలను నివృత్తి చేయడమే కాకుండా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీఈఓ కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ టీఎస్‌రావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు రాఘవరావు పోలవరపు సర్జికల్ అంకాలజిస్ట్ రాజగోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ ఫణి కోటేశ్వరరావు, అసోసియేట్ డైరెక్టర్ కల్పనా రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 8న ప్రత్యేక వాకథాన్ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



ఫేర్‌వెల్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో బుధవారం 12వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ తరగతి విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అకాడమిక్ డైరెక్టర్ మధుసూదన్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. ఈ నేపథ్యంలో భావోద్వేగానికి లోనైన 12వ తరగతి విద్యార్థులు ఇన్నాళ్లు పాఠశాలలో తాము గడిపిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలు, సెల్ఫీలతో సందడి చేశారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.

లెక్క తేలింది...

డివిజన్ల వారీగా రేషన్‌కార్డుల వివరాల సేకరణ

ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు..
ప్రభుత్వ అనుమతి రాగానే కార్డుల పంపిణీ..
ఈ నెలకు కొత్తవారికి రేషన్ లేనట్లే..

బంజారాహిల్స్: కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల గుర్తింపు పూర్తయ్యింది. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో డివిజన్ల వారీగా లబ్ధిదారుల జాబితాను రూపొందించారు. ఇప్పటికే కొత్త రేషన్‌కార్డులు మంజూరైన వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే వీరికి ఆహార భద్రత కార్డులు అందజేస్తారు. అయితే గత నెల 26న రిపబ్లిక్ డే రోజున డివిజన్‌కు కొన్ని చొప్పున గుర్తించిన వారికి మొదటి దశలో కార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో మాత్రం ఈ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాకపోవడంతో కొత్తగా రేషన్‌కార్డు పొందిన లబ్ధిదారులు ఈ నెల రేషన్ తీసుకోవడానికి అర్హత సాధించలేకపోయారు. గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన వివరాల ప్రాతిపదికగా లబ్ధిదారులను గుర్తించారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో మొత్తం 6,096 మంది ప్రజాపాలన దరఖాస్తుల అర్హుల జాబితాతో గత నెల 21వ తేదీ వరకు 360 డిగ్రీల కోణంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేశారు. అర్హులను ప్రభుత్వమే గుర్తించి ఈ మేరకు లబ్ధిదారుల జాబితాను ఖైరతాబాద్ సర్కిల్–7 కార్యాలయానికి పంపించింది. అంతేకాకుండా ఏ డివిజన్ నుంచి ఎన్ని దరఖాస్తులు సర్వే చేశారు, ఎంతమంది లబ్ధిదారులగా గుర్తించారు. అనే వివరాలు కూడా సర్కిల్–7 కార్యాలయానికి పంపారు. మొత్తం 6,096 మంది అర్హులను గుర్తించి సర్వే చేయగా ఇందులో 2,897 మంది రేషన్ కార్డుకు లబ్ధిదారులుగా ఎంపికయ్యారు. సర్వే చేసిన వారిలో 3199 మంది అనర్హులుగా తేలారు. కేవలం ఈ సర్కిల్‌లో 47.52 శాతం మాత్రమే రేషన్‌కార్డుకు అర్హత సాధించారు.
ఏ డివిజన్‌లో ఎన్ని కార్డులు అంటే..



కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

డివిజన్ పేరు	ఎంతమందిని సర్వే చేశారు	లబ్ధిపొందిన కార్డుదారులు
అమీర్‌పేట	205	31
సనత్‌నగర్	482	236
ఖైరతాబాద్	540	211
సోమాజీగూడ	732	265
వెంకటేశ్వరకాలనీ	260	88
బంజారాహిల్స్	561	361
జూబ్లీహిల్స్	455	391
యూసుఫ్‌గూడ	401	176
వెంగళరావునగర్	465	192
ఎర్రగడ్డ	481	150
రహమత్‌నగర్	783	437
బోరబండ	731	359

కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

లిబర్టీ: అన్నమ రాజు రచించిన 'కవన కుసుమని' కవితా సంపుటిని బుధవారం ప్రముఖ కవి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ విలువలు, మానవ సంబంధాలు మాధుర్యాలను వివరిస్తూ కవితా కుసుమాలతో సంపుటిని తీసుకురావడం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన అన్నమరాజు డాక్టర్ రాధా, కవి లోడే రాములు, సి.నర్సింహారావు మాట్లాడుతూ ప్రకృతి ఆరాధన, సామాజిక విలువలతో కూడిన కవితా సంపుటిని రచించడం సాహిత్య రంగంలో మరో మలుపన్నారు. కార్యక్రమంలో కవి గంగప ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు న్యాయం



నరేంద్రమోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

ఫిలింనగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం జూబ్లీహిల్స్ డివిజన్, ఇంద్రానగర్ గణేష్ మిఠాయి భండార్ చౌరస్తాలో ప్రధాని ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కాడిగారి భోజిరెడ్డి, ఖైరతాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం వెంకట్‌స్వామి మాట్లాడుతూ దేశ చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో ప్రజాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని ఈ బడ్జెట్ రూపకల్పన చేశారని కొనియాడారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని ఆర్థి సంవత్సరానికి రూ.12 లక్షల వరకు ట్యాక్స్ ఫ్రీ చేయడం, కిసాన్ క్రెడిట్ కార్డ్ రూ.5 లక్షల వరకు పెంచడంతో పాటు రైతులను దృష్టిలో ఉంచుకుని ఆరు కొత్త పథకాలు ప్రకటించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా కేన్సర్ పేషెంట్లను దృష్టిలో ఉంచుకుని ఔషధాలపై 50 శాతం పన్ను తగ్గించారన్నారు. పీఎంఏవై కింద పేదలకు కొత్తగా ఇంటి నిర్మాణానికి నిధులు కేటాయించడం, దేశవ్యాప్తంగా 200 బుల్లెట్ ట్రైన్స్‌కు నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్త నీరజ, దండుగుల శ్రీనివాస్, వల్లెపు శంకర్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, సీతల అనిల్‌కుమార్, ముద్దంగుల శ్రీనివాస్, బోయ రామాంజనేయులు, గణేష్‌యాదవ్, డొంగరి రాజకళ, లలిత, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం



రహమత్‌నగర్: బోరబండ డివిజన్ సైట్–2లోని సద్గురు ఖ్వాజా ఆయాజ్ చిస్తీ ట్రస్ట్ 28వ ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.తొలిరోజు అభిషేకం, సమా, చందనఫేరి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవా లు గురువారం ముగియనున్నాయి.

మురళీముకుంద్‌కు ఐపీఎన్ ఫౌండేషన్ అవార్డు



ఐపీఎన్ ఫౌండేషన్ ఇంపాక్ట్ లీడర్ 2024 అవార్డు అందుకుంటున్న మురళీముకుంద్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మురళీముకుంద్‌ను మరో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. ఐపీఎన్ ఫౌండేషన్ ఇంపాక్ట్ లీడర్ 2024 అవార్డు వేడుకల్లో భాగంగా 'భారతదేశంలో మోస్ట్ ఇంపాక్ట్‌ఫుల్ స్కూల్ లీడర్ అవార్డు'తో ఆయనను సత్కరించారు. మురళీముకుంద్ ఈ అవార్డు ద్వారా పాఠశాల పేరు ప్రతిష్టలు, గుర్తింపు పెరిగే విధంగా మరోసారి తన సత్తా చాటుకున్నారు. ఐపీఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మోడరేటర్ గౌరవ యాదవ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

క్వారీ మైదానంలో హైడ్రా అధికారుల తనిఖీలు

రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానం పరిసర ప్రాంతాలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా అధికారులు బుధవారం మైదానంలో పర్యటించి నిర్మాణాలను పరిశీలించారు. మైదానం కింద ఉన్న కేసీఆర్‌నగర్ ప్రాంతాన్ని హైడ్రా అధికారి సృజన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. కొందరి ఫిర్యాదు మేరకు పరిశీలనకు వచ్చిన అధికారి ఒక ప్రాంతాన్నే పరిశీలించడం, వారితో పాటు బీఆర్ఎస్ నాయకులు రావడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీనిపై స్పందించిన హైడ్రా అధికారి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బోరబండ డిఐ భూపాల్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి చేయూత

బంజారాహిల్స్: సెంటిఫిక్ టెక్ కంపెనీ కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్)లో భాగంగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌కు చెందిన నిరుపేద మహిళలకు బుధవారం రూ.14 లక్షల విలువైన నాలుగు జ్యూట్, మరో నాలుగు కుట్టు మిషన్లను పంపిణీ చేసింది. సదరు సంస్థ నగరానికి చెందిన ఎన్జీఓ ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్)కు నైపుణ్యాభివృద్ధికి సహకారాన్ని అందిస్తోంది. అందులో భాగంగా మహిళలకు కుట్టుమిషన్లను అందజేసి వారి స్వయం ఉపాధికి చేయూత అందించారు. ప్యూర్ అకాడమీలో వివిధ నేపథ్యాలకు చెందిన 40 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. మగ్గం వర్క్, డ్రైక్లీనింగ్, చీర రోలింగ్, బ్లాక్ ప్రింటింగ్, ఎంఎస్ ఆఫీస్, గ్రాఫిక్ డిజైనింగ్, కొవ్వొత్తుల తయారీతో అవసరమైన స్వయం ఉపాధి పొందేందుకు ప్యూర్ శిక్షణ ఇస్తోంది. కార్యక్రమంలో ఏఐసీఈఓ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) వైస్‌ప్రెసిడెంట్ సూర్యప్రభ, సీఎస్ఆర్ హెడ్ రేష్మి, ప్యూర్ వ్యవస్థాపకురాలు శైలా తలూరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను బుధవారం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. పార్థసారథి, అతడి కుమారుడు విజయభార్గవ్ కలిసి జలమండలి వాటర్ రిజర్వాయర్ కోసం కేటాయించిన స్థలంతో పాటు పక్కనే ఉన్న మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి చుట్టూ షీట్లు నిర్మించి ఆక్రమించుకున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు అక్రమంగా నిర్మించిన గదులు కూల్చివేశారు. వీరిపై చర్యలకు ఉపక్రమించారు. కొంతకాలంగా ఈ స్థలంలో రౌడీలు ఉంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెండింగ్ పనులను పూర్తి చేయండి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌లోని జీహెచ్ఎంసీ గ్రౌండ్‌ను క్రీడాకారులకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, బీజేఆర్‌నగర్, మహాభారత్‌నగర్‌లలో వరద కాలువ పనులు, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, డి. చైతన్య, స్థానిక నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌తో కలిసి డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

హోలియదాసరులను ఎస్సీ 'సీ' లో చేర్చడం అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

పంజగుట్ట: ఎస్సీల్లో అత్యంత వెనకబడిన హోలియ దాసరి కులాన్ని ఎస్సీ 'సి' జాబితాలో చేర్చడం దారుణమని, తాము ఏ విధంగా అభివృద్ధి చెందినట్లు గుర్తించారో ముఖ్యమంత్రి వివరించాలని హోలియ దాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తంటం జహంగీర్ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధానకార్యదర్శి రమేష్,కోశాధికారి ఆర్.శంకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తమ కుల జనాభా సుమారు లక్షకు పైగా ఉన్నా కేవలం 8482 మంది ఉన్నట్లు చూపించడం దారుణమన్నారు. హోలియ దాసరి కులం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఎంపీటీసీ, ముగ్గురు సర్పంచ్‌లు మాత్రమే ఉన్నారని, ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ లేరని విద్యలో కూడా తాము ఎంతో వెనకబడి ఉన్నామని అలాంటి తమ కులాన్ని ఎస్సీ సీ జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఎస్సీల్లో మాల, మాదిగను మినహాయించి మిగిలిన 57 కులాలను ఒక్కచోట చేర్చి తమకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి అత్యంత వెకబడిన తమ కులాన్ని ఎస్సీ ఏ లో చేర్చాలని, లేదా మాల, మాదిగలను మినహాయించి 57 కులాలను ఒక్కచోట చేర్చి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వీరేష్, రాజు, నర్సింహ, చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయండి

● బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి



సాక్షి, సిటీ బ్యూరో: జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. బుధవారం హిమాయత్ నగర్ డివిజన్ నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. బీజేపీ బలమైన శక్తిగా అవతరిస్తుందని, ప్రజా సమస్యలపై స్పందించి, పరిష్కార మార్గాలు అన్వేషించాలని కోరారు. భాగ్యనగర పరిధిలో ఏ ఎన్నికలు నిర్వహించినా బీజేపీ హవా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, సుధాకర్, మల్లేష్, మనీల శాంతికుమార్ శాంతికుమార్, రంజిత్, మీసాల సాయి, భాను ప్రసాద్, అభిషేక్ యాదవ్, నందు, నరేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

వెంగళరావునగర్ : అన్నార్తులకు సేవలు అందించడంలో మధురానగర్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని అసోసియేషన్ నేతలు అన్నారు. జలమండలిశాఖలో పని చేస్తూ గత నెల ఆకస్మికంగా మృతిచెందిన జగదీష్ పిల్లలకు బుధవారం అసోసియేషన్ నేతలు ఆర్థిక సాయం అందజేశారు. ఐదేళ్ల క్రితం తల్లిని కోల్పోగా, గత నెలలో తండ్రి కూడా చనిపోవడంతో వారు అనాథలుగా మారారు. ఈ నేపథ్యంలో మధురానగర్ అసోసియేషన్ రూ.1, 25,510 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో చిన్నారులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, కోశాధికారి కె.సుగుణ, మాజీ నేతలు, కాలనీ పెద్దలు, శాశ్వత సభ్యులు డి.నాగార్జునరెడ్డి, రాజగోపాల్, హనుమంతరావు, చంద్రమోహన్, విజయవాణి, రాజేంద్రప్రసాద్, హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న మధురానగర్ అసోసియేషన్ నేతలు

క్రీడలతో మానసిక వికాసం



బంజారాహిల్స్: క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. మాదాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడంలో భాగంగా క్రీడోత్సవాలు నిర్వహించారు. బుధవారం కేబీఆర్ పార్క్ ఎదుట మాన్య కల్చరల్ అకాడమీ, వికాస్ భారత్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ విజయం అంత సులువుగా రాదని, సంకల్ప బలం, ఎనలేని కృషి ఉంటేనే విజయం వరిస్తుందన్నారు. క్రీడలు జీవితంలో అనేక పాఠాలను నేర్పిస్తాయన్నారు. క్రీడల వల్ల పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. విద్య మనిషికి జ్ఞానాన్ని ఇస్తుందని, క్రీడలు జీవితానికి అవసరమైన పాఠాలు నేర్పిస్తాయన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది అన్నట్లుగా పోటీల్లో ఓడినవారు నిరుత్సాహపడకుండా భవిష్యత్తులో గెలుపే లక్ష్యంగా దూసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త రామ్‌గోపాల్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు మోహన్‌రావు, రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్, నవ్య, ఫుట్‌బాల్, స్కేటింగ్ ట్రైనర్ దినేష్‌పంచాలి, మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా క్రీడల్లో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం రహమత్‌నగర్ బ్రహ్మశంకర్‌నగర్ ప్రాంతంలో నివసించే జి.శంకర్‌గౌడ్ వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 4వ తేదీ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి మరుసటి రోజు వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వట్టికోట ఆళ్వార్ స్వామి సేవలు ఎనలేనివి

లిబర్టీ: ప్రజల మనిషి, వైతాళికుడు రచయిత వట్టికోట ఆళ్వార్ స్వామి అని లోక్ దళ్ పార్టీ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పీవీ రాజేశ్వరరావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. వట్టికోట ఆళ్వార్‌స్వామి వర్ధంతి పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిజాంకు వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపించిన యోధుడని గుర్తు చేశారు. ఆయనను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సౌభాగ్యవతి, పి.వి. శ్రీనివాసరావు, సంకీర్త పాల్గొన్నారు.

రుగ్మతల నిర్ధారణతోనే మెరుగైన వైద్య సేవలు

సాక్షి, సిటీ బ్యూరో: ఖచ్చితమైన రోగ నిర్ధారణతో మెరుగైన వైద్య సేవలు అందించవచ్చునని నేషనల్ హెల్త్ మిషన్ తెలంగాణ అదనపు డైరెక్టర్ అమర్ సింగ్ అన్నారు. రోగ నిర్ధారణ సామర్థ్యాలను పెంపొందించేందుకు నిమ్స్ బయోకెమిస్ట్రీ విభాగం, తెలంగాణ జాతీయ ఆరోగ్య మిషన్ సహకారంతో బుధవారం హై–పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రఫీ సమగ్ర ఓరియెంటేషన్, ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోగనిర్ధారణలో ఖచ్చితత్వాన్ని పెంపొందించడానికి అవసరమైన నైపుణ్యాలను వివరించారు. హీమోగ్లోబినోపతి, హెచ్‌పిఎల్‌సి టెక్నాలజీ స్క్రీనింగ్, డయాగ్నసిస్‌లో ప్రసిద్ధి చెందిన నిమ్స్ బయోకెమిస్ట్రీ, మెడికల్ జెనెటిక్స్ విభాగానికి చెందిన ప్రముఖ ఫ్యాకల్టీ శిక్షణా సెషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో జన్యుపరమైన రుగ్మతల నిర్ధారణ సేవలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యాధిని నిర్ధారించగలిగినపుడే ఖచ్చితమైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రోగి ఫలితాలను మెరుగుపరచడంలో అధునాతన సాంకేతిక వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నిమ్స్ డైరెక్టర్ డా.ఎన్.బీరప్ప మట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో వైద్యులు, సాంకేతిక నిపుణుల నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణా సెషన్లు నిర్వహించడంలో నిమ్స్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ డయాగ్నోస్టిక్స్ అనుబంధ లేబొరేటరీ నిపుణులు, కన్సల్టెంట్ పాథాలజిస్టులు, బయోకెమిస్ట్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



లింగ ఆధారిత హింసపై మౌనం వీడాలి

– ఐజీ కార్తికేయ శర్మ



రాయదుర్గం: దేశంలో లింగ ఆధారిత హింసపై మౌనం వీడాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్తికేయ శర్మ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'జెండర్ బేస్డ్ వయలెన్స్ ఇన్ ఇండియా' అనే అంశంపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ... మౌనంగా న్యాయం సాధించడం సాధ్యం కాదన్నారు. లింగ ఆధారిత హింస నుంచి సమాజాన్ని విముక్తం చేసేలా ఆలోచనా విధానం మారాలన్నారు. హింసను నిరోధించేందుకు చేసిన చట్టాలు సక్రమంగా అమలు కావాలంటే మహిళలకు నైతిక విలువలు, సమాన హక్కులు కల్పించాలన్నారు. 'మనూ' వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ సమాజంలో లింగ ఆధారిత హింసను సహించబోమన్నారు. 'మనూ'లో బాలికలందరికీ హస్టల్ సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. సమావేశంలో 'మనూ' ఓఎస్‌డీ ప్రొఫెసర్ షగుఫ్తాషహీన్, సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ డానిష్‌మోయిన్ పాల్గొన్నారు.

శాస్త్ర విజ్ఞానం లేనిదే మనుగడ లేదు

సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు



ప్రసంగిస్తున్న సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు

చందానగర్: మానవజాతి అభివృద్ధి చెందాలంటే వైజ్ఞానిక పరిజ్ఞానం ఎంతో అవసరమని ప్రముఖ జీవశాస్త్రవేత్త, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో 'వైజ్ఞానిక దృక్పథం–బౌద్ధం' అనే అంశంపై సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు శాస్త్ర పరిజ్ఞానానికి ఉన్న విలువ అనంతమని, శాస్త్ర విజ్ఞానం లేనిదే మనుగడ లేదన్నారు. మానవజాతి అభివృద్ధి చెందాలంటే వైజ్ఞానిక పరిజ్ఞానం అవసరమన్నారు. నిత్యజీవితంలో విజ్ఞానం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాముఖ్యత ఉందన్నారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు, ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి బీవి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్

సిటీ కోర్టు : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పలుకేసుల్లో విచారణ కోసం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. బుధవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు 9 కేసులకు సంబంధించిన విచారణకు హాజరయ్యారు. ఈ కేసుల్లో పలువురు ఫిర్యాదు దారులు, సాక్షులను జడ్జి ఎస్.శ్రీదేవి విచారణ చేశారు. అనంతరం విచారణను ఫిబ్రవరి 20కి వాయిదా వేశారు.

బండి సంజయ్ గైర్హాజరు..

కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు సంబంధించిన నాలుగు కేసుల్లో విచారణ బుధవారం నాంపల్లి కోర్టులో జరిగింది. విచారణకు కేంద్ర మంత్రి గైర్హాజరు కావడంతో ఆయన తరపు న్యాయవాది పిటీషన్ దాఖలు చేశారు. వివిధ ముఖ్యమైన సమావేశాల నేపథ్యంలో ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కోర్టుకు హాజరుకా లేకపోయారని కోర్టుకు తెలిపారు. దీనిపై విచారణకు చేపట్టిన కోర్టు విచారణను ఫిబ్రవరి 20కి వాయిదా వేసింది.

సీఎం రేవంత్‌రెడ్డి కేసు విచారణ 13కు వాయిదా

సిటీ కోర్టులు : ముఖ్యమంత్రి రేవంత‌ర్‌రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. కేసు విచారణకు సీఎం గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి విచారణకు హాజరుకావాలని సూచించిన కోర్టు ఫిబ్రవరి 13కు విచారణను వాయిదా వేసింది.

మంచి చేయండి, మంచిగా ఉండండి

ఆధ్యాత్మిక గురువు స్వామి ముకుందానంద



చందానగర్ : మనస్సు స్థిరంగా ఉంటే ప్రశాంతమైన జీవితం అలవడుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు స్వామి ముకుందానంద అన్నారు. గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్ ఆడిటోరియంలో ఎఫ్‌ఐసీసీఐ మహిళా సంస్థ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాలలో ఆదాయం, సౌకర్యాలు పెరిగాయి కానీ నేరాల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ట్రాఫిక్‌ను చూస్తే ఇది సైబరాబాద్ కాదు ట్రాఫికాబాద్ అనేలా ఉందన్నారు. ఏఐజీ హాస్పటల్ డైరెక్టర్, సర్జికల్ గ్యాస్ట్రోంటరాలజిస్ట్ డాక్టర్ జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాన్ సిద్ధం

- ఇన్నర్, ఔటర్, రీజినల్ రింగ్‌రోడ్ల వారీగా ప్రణాళికలు
- 213 సబ్‌స్టేషన్లు, 11 వేల కిలోమీటర్ల కొత్త లైన్లు
- 'సాక్షి'తో ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

2030నాటికి పదివేల మెగావాట్ల డిమాండ్



సాక్షి, సిటీబ్యూరో: 'గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ ఏటా 15 శాతం పెరుగుతోంది. 2023 వేసవిలో 3700 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగించగా అది 2024 మేలో 4352 మెగావాట్లకు చేరింది. అదే 2025 ఏప్రిల్,మే నెలల్లో ఐదు వేల మెగావాట్లకు చేరుకుంటుందని అంచనా వేశాం. ఆరు వేల మెగావాట్లు దాటినా ఇబ్బంది లేదు' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫారూఖీ చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. భవిష్యత్తు విద్యుత్ డిమాండ్, సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా ఇప్పటికే చేపట్టిన లైన్ల పునరుద్ధరణ పనులను వివరించారు. సబ్‌స్టేషన్ల మధ్య అండర్ గ్రౌండ్ కేబుల్ లైన్ల అనుసంధానం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్) , డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, వేలాడుతున్న వైర్లు, ఆయిల్ లీకేజీల గుర్తింపు వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వేసవిలో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు స్పష్టం చేశారు.

భవిష్యత్ అవసరాలను బట్టి ఏర్పాట్లు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యూచర్ సిటీ అవసరాల మేరకు విద్యుత్ ప్రతిపాదనలు సిద్ధం చేశాం. గ్రేటర్‌ను మూడు ఏరియాలుగా విభజించాం. ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఔటర్ రింగ్‌రోడ్డు, ట్రిబుల్ ఆర్ ఇలా మూడు దశల్లో 2030 నాటికి విద్యుత్ డిమాండ్ 10,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా. గృహాలు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక వాడల వారీగా రానున్న విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేశాం. ఆ మేరకు కొత్త సబ్‌స్టేషన్లు, లైన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రస్తుతం 571 (33కేవీ) సబ్ స్టేషన్లు ఉండగా, వీటి సామర్థ్యం 9675 ఎంవీఏగా ఉంది. కొత్తగా మరో 213(33/11 కేవీ) సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు గ్లోబల్ టెండర్లు పిలిచాం. పనులు చేసేందుకు ముందుకు వచ్చే కాంట్రాక్టర్లకు ఆయా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు అప్పగించి, నిర్దేశిత లక్ష్యంలోగా వాటిని పూర్తి చేయిస్తాం. అంతేకాదు కొత్తగా నాలుగు వేల కిలోమీటర్ల 33 కేవీ లైన్లు, ఏడు వేల కిలోమీటర్ల 11 కేవీ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. భవిష్యత్తు అవసరాల మేరకు సబ్‌స్టేషన్లులెన్లు విస్తరిస్తున్నాం. సమ్మర్ యాక్షన్ ప్లాన్ నుఇప్పటికే పూర్తిచేశాం. 50 శాతానికి మించి లోడు ఉన్న ఫీడర్లను గుర్తించి, వాటి సామర్థ్యాన్ని పెంచుతున్నాం. డిమాండ్‌కు ఎక్కువగా సమోదవుతున్న ఫీడర్లను గుర్తించి, వాటిపై నిరంతర నిఘాను ఏర్పాటు చేశాం.

త్వరలోనే బౌరంపేట్ 132 కేవీ సబ్‌స్టేషన్

గతంలో నిజాంపేట, బాచుపల్లి, కూకట్‌పల్లి, గండిమైసమ్మ, అమీన్‌పూర్‌లో విద్యుత్ డిమాండ్ అధికంగా నమోదైంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని బౌరంపేటలో 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. ఈ నెలాఖరు లోగా దీన్ని చార్జ్ చేయబోతున్నాం. వేసవిలో అనధికారిక కరెంట్ కోతలు, సరఫరాలో హెచ్చుతగ్గులు, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. విద్యుత్ కనెక్షన్ల జారీ, మీటర్ రీడింగ్, బిల్లుల వసూళ్ల పై వరుస సమీక్షలు చేస్తున్నాం. అక్రమ వసూళ్లు, అవినీతి నిర్మూలన కోసం చేపట్టిన చర్యలు అత్యుత్తమ ఫలితాలను ఇస్తున్నాయి. ఇప్పటికే వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి, పలువురు ఇంజనీర్లపై చర్యలు కూడా తీసుకు న్నాం. కాల్ సెంటర్‌కు ఫిర్యాదుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.

ఐటీని మరింత విస్తరిస్తాం

ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్



జయేష్‌రంజన్‌కు జ్ఞాపికను అందిస్తున్న మూవ్ ఇన్ సింక్ సీఈఓ దీపేష్ అగర్వాల్ తదితరులు

రాయదుర్గం: ఐటీ పరిశ్రమను హైదరాబాద్‌కే పరిమితం కాకుండా రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షరటాన్ హోటల్‌లో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) వృద్ధికోసం జీసీసీ కాన్‌క్లేవ్ – 2025'ను బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ సంస్థల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతూనే నగరానికి తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఉత్తర నాలుగు ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేసేలా పూర్తి స్థాయిలో ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆయా ప్రాంతాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం 280 జీసీసీలు పనిచేస్తుండగా, అందులో కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నామన్నారు. మరిన్ని సంస్థలు వీటిని ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. మూవ్ ఇన్ సింక్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ దీపేష్‌అగర్వాల్ మాట్లాడుతూ దేశంలో జీసీసీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.రాబోయే అయిదేళ్ళలో మార్కెట్ రెండింతలు పెరిగే అవకాశం ఉందన్నారు. హ్యూమనైజ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ జగదీష్‌మిత్ర, లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ఇండియా సీఈఓ, ఎండీ శిరీష ఓరుగంటి పాల్గొన్నారు.

శిల్పారామంలో 7 నుంచి ఒరియా ఫుడ్, క్రాఫ్ట్‌మేళా

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఈనెల 7 నుంచి ఒరియా ఫుడ్, క్రాఫ్ట్ మేళా జరుగనుంది. ఒడిశాలోని అత్యుత్తమ వంటకాలు, సంప్రదాయ చేతిపనులు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. ఒడిశాలోని ప్రసిద్ద సంబల్‌పురి, బొమ్‌కై , కోట్‌ప్యాడ్ అల్లికలతో పెయింటింగ్‌లు మేళాలో ప్రదర్శిస్తారు.

8న హెచ్ఎంఎ డైమండ్ జూబ్లీ వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన హోటల్ మ్యారిగోల్డ్ వేదికగా డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు చంద్ర శేఖర్ తెలిపారు. ఈ వజ్రోత్సవాల్లో భాగంగా 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్' ఏర్పాటు చేస్తున్నారన్నారు. 'ఇన్‌స్పైర్, ఇన్నోవేట్, ఇంపాక్ట్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముఖ్య అతిథిగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

'యువత దేశ ఐక్యతను చాటాలి'



సదస్సులో ప్రసంగిస్తున్న డా. జి. సతీష్‌రెడ్డి

లాలాపేట: భారతదేశంలో భాషలు, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు వేర్వేరుగా ఉన్నప్పటికీ భారతీయులందరం ఒక్కటే అనే ఐక్యతా సందేశాన్నివ్వాలని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డా. జి. సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థి సేవా సమితి, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో తార్నాకలోని ఐఐసీటీ ఆడిటోరియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. వచ్చే నాలుగేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా నైపుణ్యం కల్గిన యువత 40 శాతం కేవలం మన దేశంలోనే ఉంటుందని పేర్కొన్నారు. యువత తమలోని నైపుణ్యాలను దేశ అభివృద్ధి కోసం వెచ్చించాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ కిమ్స్ న్యూరాలోజిస్టు డా. పద్మ ఎస్. వీరపనేని, ఏబీవీపీ నార్త్‌ఈస్ట్ జోన్ సెక్రటరీ కమల్ నయన్ తదితరులు పాల్గొన్నారు.

ప్యారానగర్.. గరం గరం

- ప్యారానగర్‌లో హెచ్‌ఎండీఏ డంప్‌యార్డు
- హైదరాబాద్ మహానగరంలోని చెత్త ఇక్కడికే
- రోజుకు సుమారు 19 వేల టన్నులు తరలింపు
- స్థానికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న స్థానికులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టుపై స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలో ప్రతీరోజు సుమారు 7,500 టన్నుల చెత్త ఉత్పత్తి కాగా ఇందులో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్ల పరిధిలో నిత్యం ఉత్పత్తి అయ్యే సుమారు 1,900 టన్నుల చెత్తను ప్యారానగర్ డంప్‌యార్డుకు తరలించనున్నారు. ఈ భారీ డంప్‌యార్డుతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులు పోరాటం చేస్తున్నారు. గుమ్మడిదల మండలం ప్యారానగర్, నల్లవల్లి, మాంబాపూర్ తదితర గ్రామాలతోపాటు, మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే శివంపేట, నావపేట గ్రామస్తులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అఖిలపక్షంగా ఏర్పడి ఈ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి దాటాక ఈ యార్డు నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను తరలించడంతో స్థానికులు ఒక్కసారిగా నిరసనకు దిగారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారీ ఎత్తున మోహరించిన పోలీసులు నిరసన వ్యక్తం చేస్తున్న వారిని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

పచ్చని పంట పొలాల్లో

ఈ డంప్‌యార్డు ఏర్పాటు చేస్తున్న ప్యారానగర్ చుట్టుపక్కల మొత్తం పచ్చని పంట పొలాలే ఉన్నాయి. వ్యవసాయమే జీవనాధారమైన మా పంట పొలాల్లో చెత్త డంప్‌యార్డు పెట్టొదంటూ రైతులు వాపోతున్నారు. ఈ యార్డుతో వెలువడే కాలుష్యంతో చెరువులు, కుంటలే కాదు, భూగర్భ జలాలు కూడా కలుషితమై పంటలు పండించుకునే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నాయకుల ముందస్తు అరెస్ట్

డంపింగ్‌యార్డ్ నిర్మాణ పనులను అడ్డుకోకుండా కొంతమంది నాయకులను పోలీసులు అర్ధరాత్రి ముందస్తు అరెస్టు చేసి కంది మండలంలోని బేగంపేట్ పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. ఇక అదేసమయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు డంపింగ్‌యార్డ్ నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నించారు. డంపింగ్‌యార్డ్ పనులతోపాటు అక్రమ అరెస్టులను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులతో కలిసి ఆందోళనకు దిగారు. పోలీసులు ఆందోళనకారులందర్నీ అరెస్టు చేశారు. ప్యారానగర్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు.

నిందితుడికి 25 ఏళ్ల జైలు

చార్మినార్: మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో నాంపల్లి లోని పోక్సో కేసులకు సంబంధించిన 12వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నిందితుడికి 25 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమాన విధించారు. బహదూర్ పురా పోలీస్ స్టేషన్ పరిధి లోని జహనుమా బషారత్ నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫరీద్ (45) అనే నిందితుడు 2020 లో మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బహదూర్‌పురా పోలీసులు దర్యాప్తు కొనసాగించగా బుధవారం న్యాయమూర్తి నిందితునికి 25 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు.

భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ మేనేజర్ మృతి



ప్రొ.జ్యోతి జోషి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం విశ్రాంత అధ్యాపకురాలు ప్రొ. జ్యోతి జోషి (76) మృతి చెందారు. మంగళవారం కాచిగూడలోని తన నివాసంలో రాత్రి 11 గంటలకు గుండెపోటుతో మరణించారు. కోఠి ఉమెన్స్ కాలేజీలో అధ్యాపకురాలుగా పని చేసిన ఆమె వివిధ హోదాలలో పదవులను చేపట్టారు. భారత క్రికెట్ మహిళ జట్టుకు మేనేజర్‌గా పనిచేశారు. ఆమె మృతి పట్ల ఓయూ ప్రొ.రాజేష్‌కుమార్, ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్, ఇతర అధ్యాపకులు సంతాపం తెలిపారు.

బొటానికల్ గార్డెన్‌కు రెండు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న తనూజ, లక్ష్మారెడ్డి

గచ్చిబౌలి: కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌కు 'పుష్పావాటిక', గోల్డ్ గార్డెన్ అవార్డులు దక్కాయి. 8వ గార్డెన్ ఫెస్టివల్ సందర్భంగా బొటానికల్ గార్డెన్‌కు రెండు అవార్డులు వరించాయి. టీఎస్ఎఫ్‌డీసీ అసిసెంట్ డైరెక్టర్ తనూజ, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డిలకు హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా అవార్డులు అందజేశారు. తెలంగాణ అటవీ అభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్‌లో 50 ఎకరాల విస్తీర్ణంలో వాకింగ్ ట్రాక్‌లు, గ్రీనరీ, లాన్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, బొటానిస్ట్ డాక్టర్ వీర కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, హాజరైన అధికారులు

ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జరిగిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని దైవదర్శనం కోసం వచ్చే సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుండి మార్చి 1 వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు 6 నుంచి 7 లక్షల మంది భక్తులు హాజరవుతారన్నారు. వివిధ శాఖల అధికారులు ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. మేడ్చల్ – మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. శీఘ్ర దర్శనం, అభిషేకం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికగుప్తా, ఆలయ చైర్మెన్ తటాకం నారాయణ,డిఆర్‌ఓ హరిప్రియ, కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అగాఖాన్‌కు నగరంతో ఎంతో అనుబంధం

- అగాఖాన్ సేవల్లో మనదే తొలిస్థానం
- విద్య, వైద్య రంగాల్లో ఉత్తమ సేవలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ షియా ఇమామ్ ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ప్రిన్స్ ఖరీం ఆల్ హుస్సేనీ అగాఖాన్‌కు హైదరాబాద్ నగరంతో ఎంతో అనుబంధముంది. అగాఖాన్ మంగళవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు.పోర్చుగల్‌లోని లిస్బన్ లో ఆయన తుదిశ్వాస విడిచారు. బ్రిటన్ పౌరసత్వం ఉన్న ఆగాఖాన్ స్విట్జర్‌లాండ్‌లో జన్మించారు. 20 ఏళ్ల వయస్సులో ఇస్మాయిలీ ముస్లింల 49వ వంశ పారంపర్య ఇమామ్‌గా ఆగాఖాన్ నియమితులయ్యారు. ఆయన పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ.. పోర్చుగల్‌లోని లిస్బన్ స్వగృహంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న నగర ఇస్మాయిలీ ముస్లింలు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

నగరంతో అగాఖాన్‌కు ఎంతో అనుబంధముంది. తన ట్రస్టు ద్వారా నగరంలో విద్య, వైద్య రంగాల్లో అనేక సేవలు అందించారు. 1967లో ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్‌ను స్థాపించారు. ఆగాఖాన్ అకాడమీ రంగారెడ్డి జిల్లా రావిరాలలో ఒక అంతర్జాతీయ స్కూల్‌ను స్థాపించింది. విభిన్న సామాజిక–ఆర్థిక నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థులకు ఇక్కడ ఉత్తమ విద్య అందిస్తున్నారు. అకాడమీతో పాటు, హైదరాబాద్‌లోని డైమండ్ జూబ్లీ హైస్కూల్ తరతరాలుగా విద్యా సేవలందిస్తోంది. అంతేకాక కుతుబ్ షాహి సమాధులను అకాడమీ పరిరక్షించింది.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి ఆత్మీయ సత్కారం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక న్యాయ సాధన, అసమానతలకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. దీని కోసం లాల్ నీల్ శక్తులు ఏకం కావాలని కోరారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో దళిత సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారిత తదితర అంశాలపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనగారిన వర్గాల, శ్రామికుల, దళితుల అనైక్యతలు రాకుండా విశాల ఐక్యత దృక్పథంతో సంఘటిత ఉద్యమం చేపడతామన్నారు. భూమి, వనరులు, బడ్జెట్‌లను సాధించుకోవాలని ఆయన కోరారు. దేశ బడ్జెట్‌లో దళితులకు ఐదు శాతం నిధులు కూడా కేటాయించలేదన్నారు.

- అంబేడ్కర్ రాజ్యాంగం మూలంగానే తాను ప్రధాని కాగలిగానని చెబుతున్న మోదీ అంబేడ్కర్‌ను ఆయన రాసిన రాజ్యాంగాన్ని అవమానిస్తున్న నోరు మెదపడం లేదన్నారు. అనగారినవర్గాల అంతిమ లక్ష్య సాధనకు పాటుపడతామని అన్నారు. మార్క్స్, పూలే, అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామనన్నారు.

అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జాన్ వెస్లీకి ఆత్మీయ సత్కారం చేశారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరవి వినయ్‌కుమార్, సీనియర్ దళిత నేత జేబీ రాజు, అంబేడ్కర్ వాది నర్సింగ్‌రావు, ప్రొ. తడక యాదగిరి, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, జి.రాములు, ఆర్.వెంకటరాములు, ప్రసాద్, పద్మ, పులి కల్పన తదితరులు పాల్గొన్నారు.

చిరకాల ఆకాంక్ష నెరవేరింది

కాచిగూడ: మాదిగల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని, ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్దత కల్పించిన రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగ సంఘాల ఫ్రంట్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదిగ సంఘాల ఫ్రంట్ ప్రతినిధులు, తెలంగాణమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడు జన్ను కనకరాజు మాదిగ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం ఎస్సీ జనాభా 17.43 శాతం ఉన్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లు 17శాతం పెంచుతూ మాదిగ జనాభాకు తగినట్లుగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అలాగే దశాబ్దాల కాలంగా మాదిగలు నష్టపోయిన రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సమావేశంలో లాయర్ మల్లన్న, బొక్కల వెంకటస్వామి పాల్గొన్నారు.

పోచారంలో పేలుడు పదార్థాలు స్వాధీనం

పోచారం: పోచారం పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ సమీపంలో ఐటీ కారిడార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన మేరకు... సంస్కృతి టౌన్‌షిప్ సమీపంలో భవన నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని పేలుడు పదార్థాలను నిర్లక్ష్యంగా వినియోగిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మేడిపల్లికి చెందిన అలకుంట్ల ఉపేందర్ (24), ఘట్‌కేసర్‌కు చెందిన అజయ్ (24), రాంనగర్‌కు చెందిన సాయికిరణ్(26)గా నిందితులను గుర్తించారు. మేడిపల్లికి చెందిన అలకుంట్ల నర్సింహ సూచనలతో అక్రమంగా రాళ్లను బ్లాస్టింగ్ చేస్తున్నట్లు వారు చెప్పారు. వీరి వద్ద నాలుగు జిలెటిన్ స్టిక్స్, రెండు డిటోనేటర్స్, 13 ఎవరెడీ బ్యాటరీలు, 10 మీటర్ల ఎలక్ట్రికల్ వైర్, నెంబర్ ప్లేట్‌లేని కంప్రెసర్ ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కుల గణనపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదు




మాట్లాడుతున్న గజ్జల కాంతం

పంజగుట్ట: కుల గణన గూర్చి మాట్లాడే హక్కు కేటీఆర్, హరీష్‌రావు, కవితతో సహా బీఆర్ఎస్ నాయకులు ఎవ్వరికీ లేదని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గజ్జల కాంతం అన్నారు. 10 సంవత్సరాలు తెలంగాణను పాలించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు లబ్ధి చేకూర్చే ఏ ఒక్కపనీ చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేసి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించి, ఎస్సీ వర్గీకరణ చేస్తే దాన్ని కూడా వ్యతిరేకించడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో సమగ్ర కుటుంబ సర్వే చేసిన కేసీఆర్ ఆ నివేదికను ఎందుకు ప్రజలముందు పెట్టలేదు, ఎందుకు అసెంబ్లీలో చర్చించలేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం చేసిన మందకృష్ణపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. ఇప్పుడు మందకృష్ణ ఉద్యమానికి మద్దతు ఇచ్చామని, అసెంబ్లీలో తీర్మానం చేశామని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశం గౌడ్, గంధం రాములు, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం,
6, ఫిబ్రవరి, 2025





'ఈ రోజు వర్క్ ఫుల్ స్ట్రెస్ అనిపించింది బ్రో.. ఏదైనా మంచి స్టాండప్ కామెడీ షో ఉంటే చూడు పోదాం' ఫ్రెండ్స్ ముచ్చట్లలో ఇలాంటివి సర్వసాధారణంగా మారాయి. ఇటీవల సిటీలో అత్యధికులకు స్టాండ్-అప్ కామెడీ చేరువైన పరిస్థితికి ఇవి నిదర్శనంగా నిలుస్తాయి. ఒక వ్యక్తి వేదికపై నుంచి జోకులు వేస్తూ ప్రేక్షకులను నవ్వించే స్టాండ్-అప్ కామెడీ. దాదాపుగా ఓ 15ఏళ్ల క్రితం నగరవాసులు ఎవరూ ఈ పదం విని ఉండరు.. గతేడాది అలా దూసుకువచ్చి సూపర్‌హిట్ కొట్టిన మిస్ శెట్టి.. మిస్టర్ పొలిశెట్టి సినిమా స్టాండప్ కామెడీ అంటే ఏంటో నగరవాసులకు మరింత పరిచయం చేసింది. - సాక్షి, సిటీబ్యూరో

- సిటీలో స్థిరపడిన స్టాండప్ కామెడీ కల్చర్
- నగరవ్యాప్తంగా తరచూ ఏర్పాటవుతున్న షోస్
- కామెడీ ఈవెంట్స్ నిర్వహణకు ప్రత్యేక సంస్థలు
- స్టాండప్ కామెడీని కెరీర్‌గా చేపడుతున్న యూత్



నిలబడి.. నవ్వుల జడి..

ప్రస్తుతం నగరవ్యాప్తంగా అనేక మంది స్టాండ్ అప్ కామెడీ అంటే ఇష్టపడుతున్నారు. సాంకేతిక విప్లవంతో సోషల్ మీడియా పుణ్యమాని హాస్యం అందించే విభిన్న ప్లాట్‌ఫారమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా హాస్యం పండించే వారు లక్షలాది మందికి చేరువ కావడానికి అవకాశాలు పెరిగాయి. యూట్యూబ్ ద్వారా రస్సెల్ పీటర్స్ వంటి హాస్య సమర్పకులు గణనీయమైన ఫాలోయింగ్‌ను సాధించారు. దాంతో చాలా మంది ఆ బాటను అనుసరించారు. ఇది స్టాండ్-అప్ కామెడీ కెరీర్‌గా వృద్ధి చెందేందుకు దారితీసింది.

కామెడీకి స్వర్ణయుగం..

ఓ రకంగా 2010 సంవత్సరం నుంచి రెండేళ్ల కాలాన్ని కామెడీకి స్వర్ణయుగం అని పిలుస్తారు. ఎందుకంటే ఇది నేటి మేటి హాస్య సమర్పకులు అనేక మంది తమ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించిన సమయం. జాకీర్ ఖాన్, సపన్ వర్మ, కరుణేష్ తల్వార్ తదితరులు మన నగరంతో సహా పలుచోట్ల ఇచ్చిన ప్రదర్శనలు విజయవంతం అయ్యాయి. అమిత్ టాండన్, నీతి పల్టా అభిషేక్ ఉప్మన్యు, అనుభవ్ సింగ్ బస్సీ, ఆకాష్‌గుప్తా, సమయ్ రైనా, హర్ష గుజారాల్ వంటివారు ఇప్పుడు సెలబ్రిటీలుగా మారిపోయారు. పాపులారిటీ కారణంగా కొందరు సినిమాల్లో అవకాశాలు కూడా దక్కించుకున్నారు. అదేవిధంగా కొందరు వివాదాస్పద హాస్యంతో వివాదాలకు చిరునామాగా మారడం, అలాంటి కమెడియన్ల షోలకు నగరంలో అనుమతి నిరాకరిస్తుండటం కూడా మనకు తెలిసిందే.

సెలబ్రిటీలు సైతం..

ఓ వైపు స్టాండప్ కామెడీ అనేక మంది సాధారణ వ్యక్తుల్ని సెలబ్రిటీలుగా మారుస్తుంటే.. కొందరు సెలబ్రిటీలు తామే స్టాండప్ కామెడీకి జై కొడుతున్నారు. 'నా దగ్గర చెప్పడానికి కొన్ని కథలు ఉన్నాయి, అవి తమాషాగా ఉండి స్టాండ్-అప్ కామెడీకి నప్పుతాయి. అందుకే 59 సంవత్సరాల వయస్సు గల స్టాండ్-అప్ కామిక్‌ని అనుకుంటున్నాను' అని చెప్పారు సినీనటుడు అశిష్ విద్యార్థి. ఇటీవలే స్టాండప్ కామెడీలోకి ప్రవేశించిన ఈయన నగరంలో తన కామెడీ ప్రదర్శన కూడా ఇచ్చారు. చిన్న చిన్న సమూహాల కోసం కేఫ్స్, రెస్టారెంట్స్, క్లబ్స్, పబ్స్, ఆఖరికి కార్పొరేట్ కంపెనీల్లో సైతం తరచూ వీరి షోస్ నిర్వహించడం పరిపాటిగా మారింది. ప్రత్యేకంగా గచ్చిబౌలిలోని కామెడీ థియేటర్ తరహాలో పలు క్లబ్స్ కూడా ఏర్పాటయ్యాయి.

ప్లేస్.. పబ్లిక్‌ని బట్టి..

క్లబ్స్‌లో ఒకలా, లాంజ్ బార్లయితే మరోలా, కేఫ్స్‌లో ఇంకోలా.. ఇలా ప్రదర్శించే చోటును బట్టి హాజరయ్యే ప్రేక్షకులను బట్టి స్టాండప్ కామెడీ స్క్రిప్ట్ మెటీరియల్ మారుతుంటుంది. అలాగే ఈ కమెడియన్స్‌లో కూడా రాజకీయాలకు కొందరు రిలేషన్‌షిప్స్, శృంగారభరిత హాస్యానికి కొందరు.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో విధంగా స్పెషలైజ్ అవుతున్నారు. నగరంలో పేరొందిన స్టాండప్ కమెడియన్స్ దాదాపుగా 25 మంది దాకా ఉంటారు. వీరికి ఇచ్చే రెమ్యునరేషన్ కూడా షోకి రూ.10 వేలు నుంచి మొదలవుతూ.. భారీగానే ఉంటోంది. రోజువారీ పని ఒత్తిడిలో పడి నవ్వలేకపోవడం అనే రోగానికి గురైన వారికి చికిత్స చేసి నవ్వడం అనే భోగాన్నిస్తూ నవ్వించే యోగులుగా మారారు స్టాండప్ కమెడియన్స్. 'పని సంబంధిత ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఈ ఆధునిక యుగంలో హాస్యం ఒక గొప్ప మార్గం' అని చెన్నైకి చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అయిన ఎవామ్ డైరెక్టర్ సునీల్ విష్ణు.కె అంటున్నారు. జీవితం అత్యంత సంక్లిష్టమైంది దాన్ని వీలైనంత సరదాగా ఆహ్లాదకరంగా మనం మార్చాలి, హాస్యం లేకుండా జీవితం భరించలేనంత బోరింగ్‌గా అనిపిస్తుందని నమ్ముతున్నా అని ప్రస్తుతం దక్షిణాదిలోని అగ్రగామి కామెడీ షోస్ నిర్వాహక సంస్థ ఎవామ్ డైరెక్టర్ చెబుతున్నారు.



కొలీగ్స్‌ని నవ్వించడమే.. కెరీర్‌గా మారింది



అమెజాన్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు కొలీగ్స్‌తో జోక్స్ వేసి సరదాగా నవ్వించడం అలాగే ఓ సారి కంపెనీ పెట్టిన కాంటెస్ట్‌లో పాల్గొని కామెడీ షో చేస్తే అది హిట్ అవడం.. ఫైనల్‌గా నేను స్టాండప్ కమెడియన్‌గా మారడం.. జరిగింది. ప్రస్తుతం నగరంలోని పలు వెన్యూస్‌లో తరచూ కామెడీ షోస్ సమర్పిస్తున్నాను. విభిన్న రకాల అంశాలను మేళవించి నవ్వించడం నా శైలి. ఇతర మెట్రో నగరాల్లో బాగా వేళ్లూనుకున్న ఈ ప్రొఫెషన్ నగరంలో ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. నా షోస్ ఎక్కువగా నగరంలోని అరోమలి కేఫ్, పక్కా లోకల్, కామెడీ థియేటర్.. తదితర చోట్ల ఉంటాయి. - సందేశ్ జానీ, స్టాండప్ కమెడియన్



మూలాల్లోకి ఫ్యాషన్ ప్రయాణం

వింటెరా కలెక్షన్ ఆవిష్కరించిన ట్రెండీ డిజైనర్ అనీషారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: కొన్నేళ్ల క్రితం ఫ్యాషన్ ఔత్సాహికులు అత్యాధునిక డిజైన్ల వైపు మొగ్గు చూపేవారని, కానీ ప్రస్తుతం మళ్లీ పాత రోజుల్లోకి వెళ్తున్నారని, ఆనాటి డిజైన్లకు మళ్లీ ఆదరణ పెరుగుతోందని ప్రముఖ జువెల్లరీ డిజైనర్, విభ జ్యూవెలరీ వ్యవస్థాపకురాలు అనీషారెడ్డి అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా సాధారణ స్థాయి మొదలు విలాసవంతమైన జీవితం గడుపుతున్న మహిళల వరకు ఆభరణాల ఖర్చు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారని.. దీనికి అనుగుణంగా రూపొందిస్తున్న కలెక్షన్లకు మాత్రమే మార్కెట్‌లో ఆదరణ పెరుగుతోందని అన్నారు. మణికొండ వేదికగా నూతనంగా రూపొందించిన వింటెరా కలెక్షన్‌ను బుధవారం ఆవిష్కరించారు.



అంతరంగమే.. ప్రేరణ అందించేలా..

సాక్షి, సిటీబ్యూరో: మన ఆలోచనల్లోని మార్పులు, చేర్పులు, ఆచరణాత్మక దృక్పథాలే మన విజయాలు, గమ్యాన్ని నిర్ణయిస్తాయని విద్యావేత్తలు, ప్రముఖులు స్పష్టం చేశారు. నగరంలోని వోక్సెన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన టెడ్ ఎక్స్ టాక్స్‌లో పలువురు ప్రముఖులు పాల్గొని యువతకు విజయాల సాధనలో దిశానిర్దేశం చేశారు. ఇంటర్నేషనల్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్, బెస్ట్ సెల్లింగ్ పుస్తకాల రచయిత, ఆర్టిస్ట్, ట్రాన్స్‌ఫర్మేషన్ కోచ్ మయూర్ కల్‌బాగ్ స్వీయ-ఆవిష్కరణ పరివర్తనపై తన దృక్పథాలతో ఆకట్టుకున్నారు. అఘోరి - యాన్ అన్‌టోల్డ్ స్టోరీ, స్మైల్ ఎట్ స్ట్రైస్, రైజింగ్ వాటర్ ఫాల్ అడ్వెంచర్స్ ఆఫ్ పూర్ణ వంటి విజయవంతమైన పుస్తకాలకు ప్రసిద్ధి చెందిన కల్‌బాగ్ తన ప్రసంగంలో వృద్ధికి ఉత్ప్రేరకంగా ఆంతరంగిక భావనను చూపారు. ఎర్త్‌న్ ట్యూన్స్ సహ వ్యవస్థాపకుడు అసోసియేట్ డీన్ సంతోష్ కొచెర్లకోట, పద్మశ్రీ అవార్డ్ గ్రహీత చింతకింది మల్లేశం, చుర్రోల్బో హైదరాబాద్ - జాసా మీడియా వ్యవస్థాపకుడు నీహార్ బిసాబతిని పాల్గొన్నారు.

మలేషియా రెగట్టాలో సిటీ సెయిలర్స్

సాక్షి, సిటీబ్యూరో: మలేషియాలోని పెర్దానాలో జరగనున్న 21వ లంకావై అంతర్జాతీయ రెగట్టాకు మన రాష్ట్రానికి చెందిన 11 మంది సెయిలర్స్ ఎంపికయ్యారు. ముంబైలో ఇటీవల జరిగిన సీనియర్ నేషనల్స్‌లో కాంస్యం గెలుచుకున్న ప్రీతి కొంగర, జోగులాంబ గద్వాల్‌కు చెందిన చాకలి కార్తీక్‌తో కలిసి 470 మిక్స్‌డ్ క్లాస్ సీనియర్స్ విభాగంలో పోటీపడనున్నారు. పలు జాతీయ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణాలు సాధించిన నగరానికి చెందిన వైష్ణవి వీరవంశం, నల్గొండ జిల్లాకు చెందిన యువ గిరిజన బాలుడు శ్రావణ్ కాత్రవత్‌తో 420 మిక్స్‌డ్ క్లాస్ జూనియర్స్‌లో పోటీ పడుతున్నారు. వీరు ప్రస్తుతం భారత్‌లో నంబర్-1 ర్యాంక్‌లో ఉన్నారు. రిజ్వాన్ మొహమ్మద్, రసూల్‌పురాకు చెందిన లాహిరి కొమరవెల్లి, వినోద్ దండు, చంద్రలేఖ, భానుచంద్ర, రవికుమార్, బద్రీనాథ్ కూడా పోటీ పడుతున్నారని తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుహీమ్ షేక్ తెలిపారు.



యువతను ఆకట్టుకునేలా..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బంజారాహిల్స్‌లోని రా మ్యాంగో బ్రాండ్ తమ సరికొత్త డిజైనర్ దుస్తుల కలెక్షన్‌ను సిటీ మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ తార అనన్య పాండే చిల్డ్రన్ ఆఫ్ ద నైట్ కలెక్షన్స్ ధరించి కనువిందు చేశారు. ఆధునిక యువతను ఆకట్టుకునే విధంగా ఈ కలెక్షన్‌ను తీర్చిదిద్దారు.





టీ హబ్‌లో 'ఏఐ హెల్త్‌కేర్ సమ్మిట్'

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎంఎల్ స్టార్టప్ ఇంక్యుబేటర్లలో ఒకటైన డిఎస్టీ మ్యాథ్(మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ హబ్) ఆధ్వర్యంలో టీ-హబ్ వేదికగా 'ఏఐ హెల్త్‌కేర్ సమ్మిట్ 2025'ను నిర్వహించింది. 'కృత్రిమ మేధతో ఆరోగ్య సంరక్షణను పునర్నిర్వచించడం' అనే థీమ్‌తో బుధవారం జరిగిన ఈ సమ్మిట్‌లో భాగంగా భారతీయ ఆరోగ్య సంరక్షణ రంగంలో కృత్రిమ మేధ ఆవశ్యకత, ప్రాధాన్యత, సాంకేతిక విశిష్టతను ప్రముఖ సంస్థలు వెల్లడించాయి. ఇందులో పాల్గొన్న ప్రముఖ 17 సంస్థలు భవిష్యత్ తరంలో అత్యాధునిక సాంకేతిక అంశాలు, ప్రభావాన్ని తెలియజేశాయి. ఈ సదస్సులో రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ రంజన్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్టార్టప్ విజేతలను అభినందించారు.



అప్పటి గవర్నర్ తమిళిసై చేతులమీదుగా..

చదువుతోనే సమాజ వికాసం జరుగుతుందన్న విశ్వాసం ఆయనది.. అందుకే ప్రతిఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలన్నదే అతడి ఆకాంక్ష.. విద్యకు డబ్బు సమస్య కాకూడదనే ఉద్దేశ్యంతో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పేరిట తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తూ వారు చదువు కొనసాగించేలా దోహదపడుతున్నారు. ఆయనే మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మణిదీప్. బేగంపేట కుందన్‌బాగ్‌కు చెందిన మణిదీప్ విభిన్న సేవా కార్యక్రమాలను చేపడుతూ నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. - సనత్‌నగర్

సామాజిక సేవలో మణిదీపం

- నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత
- ల్యాప్‌టాప్‌లు అందజేస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..
- మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ విస్తృత కార్యక్రమాలు



మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్‌ను 2018లో ప్రారంభించిన మణిదీప్ సేవలను విస్తరించుకుంటూ వెళ్తున్నారు. చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి చేయూతగా నిలవాలని తలంపుతో మహా యజ్ఞాన్ని ఆరంభించారు. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇప్పటి వరకు 180 మందికి వారి ఆర్థిక స్థోమతను బట్టి సహకారం అందించి అండగా నిలబడ్డారు. ఈ ఒక్క ఏడాదే 50 మందికి స్కాలర్‌షిప్పులను అందజేశారు. అలాగే చినజీయర్ స్వామి ఆశ్రమంలోని గురుకుల్ ట్రస్ట్‌లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు వైశ్య వికాస వేదిక వారు 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో టాప్‌గా నిలిచిన వారికి ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. పేద విద్యార్థులకు ఇప్పటి వరకు ఆయన 30 ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. యూపీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న 10 మంది విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు అందించేందుకు ముందుకు వచ్చారు. నిరుపేదలకు మెడిసిన్‌తో పాటు న్యూట్రిషన్, విటమిన్ ఆహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యపరంగానూ సేవలు అందిస్తున్నారు. కరోనా సమయంలో సంస్థ తరఫున ఎన్నో సేవలు అందించారు.

ప్రతిభా పురస్కారం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా యూత్ కన్వీనర్‌గా కూడా మణిదీప్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పలు సంస్థలతో కలిసి రక్తదాన శిబిరాల నిర్వహణ చేపట్టడంతో పాటు విపత్తుల సమయంలో తీవ్రంగా నష్టపోయిన వారికి అండగా నిలబడుతున్నారు. మణిదీప్ సేవలను గుర్తించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇటీవలే ప్రతిభా పురస్కారాన్ని కూడా అందించారు.



త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి ఆశ్రమంలో విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్ అందజేస్తూ..

ల్యాప్‌ట్యాప్‌లు అందిస్తున్నాం

సమాజం మనకు ఏమి ఇచ్చింది అనే కంటే.. సమాజానికి మనం ఏం చేశామన్నది ముఖ్యం. చదువే అన్నింటికీ సమాధానం. ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో చదువును ఎవరూ ఆపకూడదు. అందుకోసం మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్ తరపున నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం, అవసరమైన వారికి ల్యాప్‌ట్యాప్‌లు అందిస్తున్నాం. రాజ్‌భవన్ వేదికగా వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టాం. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరపున సేవ చేసే అవకాశం లభించడం అదృష్టం. - మణిదీప్, మణిదీప్ చారిటబుల్ ట్రస్ట్

క్లుప్తంగా...

తిరుపతి విమానంలో సాంకేతిక లోపం.. రద్దు

ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతి బయల్దేరిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో రద్దయింది. బుధవారం ఉదయం 5.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 32 మంది ప్రయాణికులతో తిరుపతికి బయల్దేరేందుకు అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 877 విమానం టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో విమానంలో సాంకేతిక లోపాన్ని గమనించిన పైలట్లు దాన్ని నిలిపివేశారు. మూడు గంటల వరకు ప్రయాణికులకు ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడంతో వారు ఆందోళన చేపట్టారు. తర్వాత ఎయిర్‌లైన్స్ అధికారులు విమానాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

టెట్ ఫలితాలు విడుదల

పేపర్–1లో 59.48..
పేపర్–2లో 31.21 శాతం ఉత్తీర్ణత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్) ఫలితాలను విద్యాశాఖ బుధవారం వెల్లడించింది. పేపర్–1ను 69,476 మంది రాస్తే.. 41,327 (59.48 శాతం) మంది అర్హత సాధించారు. పేపర్–2ను 1,35,802 మంది పరీక్ష రాస్తే 42,384 (31.21 శాతం) మంది అర్హత సాధించారు. టీజీ టెట్ జనవరి 2 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం 2,75,753 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఎయిమ్స్‌లలో భారీగా బోధనా సిబ్బంది కొరత

బీబీనగర్‌లో 36 శాతం ఖాళీలు

సాక్షి, న్యూఢిల్లీ: అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ సంస్థల్లో దేశవ్యాప్తంగా బోధనా సిబ్బంది పోస్టులకు సంబంధించి భారీగా ఖాళీలున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో పూర్తి స్థాయిలో పనిచేస్తున్న ఏడు ఎయిమ్స్ సంస్థలలో 24 శాతం నుంచి 39 శాతం వరకు అధ్యాపక పోస్టులకు సంబంధించి ఖాళీలు ఉన్నాయని పార్లమెంట్‌లో ప్రభుత్వం వెల్లడించింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎయిమ్స్ సంస్థల్లో బోధనా సిబ్బంది కొరతపై ప్రస్తావించడంతో ఈ మేరకు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. తెలంగాణలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో 183 మంది బోధనా సిబ్బందికి గానూ 118 మంది మంది పనిచేస్తుండగా, 65 పోస్టులు (36 శాతం) ఖాళీగా ఉన్నాయని పేర్కొంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ సంస్థల్లో అవసరమైన సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని బుధవారం జైరాం రమేశ్ కేంద్రాన్ని కోరారు.

పీహెచ్‌డీ కౌన్సెలింగ్ ప్రారంభం

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. విశ్వవిద్యాలయంలోని వాటర్ టెక్నాలజీ బ్లాక్‌లో రిజిస్ట్రార్ సీహెచ్ విద్యాసాగర్ కౌన్సెలింగ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మొదటి ర్యాంకు సాధించిన విజయశ్రీకి సీటు కేటాయింపు పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో పీజీ డీన్ కేబీ ఈశ్వరి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మల్లారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో 'టక్కరి దొంగ'

కార్యకర్తలు సంబురాల్లో ఉండగా 8 సెల్‌ఫోన్ల చోరీ

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో టక్కరిదొంగ దొరికాడు. బీసీల కులగణన లెక్కలు తేలాయని, ఎస్సీల వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం లభించిందని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంబురాల్లో ఉంటే ఓ దొంగ తన చేతివాటానికి పనిచెప్పాడు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 8 సెల్‌ఫోన్లను కార్యకర్తల జేబుల్లోంచి ఎవరికీ అర్థం కాకుండా కొట్టేశాడు. అయినా అతని చౌర్యదాహం తీరలేదేమో ఇంకా ఫోన్లు దొరుకుతాయని ప్రయత్నాలు చేస్తుండగా ఓ ఫొటోగ్రాఫర్ కంటపడటంతో ఆ దొంగ పట్టుబడ్డాడు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ తన గన్‌మెన్‌ను సన్మానించడంతో వెలుగులోకి వచ్చింది. బాణసంచాలు కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ కార్యకర్తలు బిజీగా ఉన్న సమయంలో సెల్‌ఫోన్లను కొట్టేస్తున్న ఆ దొంగను ఫొటోగ్రాఫర్ హరీశ్ చొరవతో పట్టుకున్నందుకు తన గన్‌మెన్ దేవరాజ్‌ను శాలువాతో సన్మానించారు. దొంగను హ్యాండిల్ చేసిన విధానాన్ని మహేశ్‌గౌడ్ అభినందించారు.

సచివాలయం వద్ద మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ సచివాలయం ఎదుట ఉరితాళ్లతో నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, నేతలు గుంటి మధుసూదన్‌రెడ్డి, రాంపాక నాగయ్య, కేశ బోయిన మల్లయ్య, నెమలి సుభాష్ గౌడ్, మెడబోయిన గణేష్, బొల్లం శారదలను అరెస్టు చేసి కాంచన్‌బాగ్, షాయినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా యాదయ్య గౌడ్ మాట్లాడుతూ 13 నెలలుగా అనేక రూపాల్లో ఉద్యమాలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నా కనికరం లేదన్నారు.



కార్యకర్తల కోసం ఎలా పని చేస్తానో చూపిస్తా

జగన్ 2.0

ప్రజలే నా బలం.. పార్టీ క్యాడర్ నా బలగం

పార్టీ నేతలతో సమావేశంలో వైఎస్ జగన్ భరోసా

సాక్షి, అమరావతి: ''మన ప్రభుత్వ పాలనతో చంద్రబాబు సర్కార్ పరిపాలనను ప్రజలు పోల్చి చూస్తున్నారు.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ చంద్రబాబు తుంగలో తొక్కారు.. వ్యవస్థలన్నింటినీ పూర్తిగా నిర్వీర్యం చేశారు.. మన ప్రభుత్వంలో ప్రతిదీ పకడ్బందీగా జరిగింది. మరి చంద్రబాబు అదే ఇప్పుడు ఎందుకు చేయలేకపోతున్నారనే చర్చ ప్రతి ఇంట్లోనూ జరుగుతోంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం తథ్యం.. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టడం ఖాయం. రాష్ట్రాన్ని 30 ఏళ్ల పాటు పరిపాలిస్తాం''అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విజయవాడ నగర పాలక సంస్థ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించి పార్టీని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. 'ఒక్కటే గుర్తు పెట్టుకోండి.. ఈసారి జగనన్న 2.0 కొంచెం వేరుగా ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

కష్టాలు ఎల్లకాలం ఉండవు..

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజకీయాల్లో కష్టాలు వస్తాయి. కానీ ఆ కష్టాల్లో ఉన్నప్పుడు మనం వాటిని ఎలా ఎదుర్కొంటాం అన్నదే నాయకుల్ని చేస్తుంది. కష్టం వచ్చినా మన వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు. ఒక్కసారి వ్యక్తిత్వాన్ని కోల్పోతే ప్రజల్లో చులకన అవుతాం. కష్టాలు ఎల్లకాలం ఉండవు. ఎవరికి.. ఏ కష్టం వచ్చినా నా కథ గుర్తు తెచ్చుకోండి. నన్ను 16 నెలలు జైల్లో పెట్టారు. నామీద కేసులు వేసింది కూడా కాంగ్రెస్, టీడీపీ నాయకులే. కేవలం రాజకీయంగా ఎదుగుతున్నానన్న కారణంతో దొంగ కేసులు బనాయించి 16 నెలలు జైల్లో పెట్టారు. కానీ ఏం జరిగింది? బయటకు వచ్చి ప్రజల అండతో ముఖ్యమంత్రినయ్యా. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోండి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెదిరిస్తారు.. దొంగ కేసులు పెడతారు.. జైల్లో పెడతారు. అయినా రెట్టించిన ఉత్సాహంతో పని చేద్దాం. మీకు మంచి చేసిన వారిని, చెడు చేసిన వారినీ ఇద్దరినీ గుర్తు పెట్టుకోండి.

దృఢంగా నిలబడినందుకు గర్వపడుతున్నా..

విజయవాడ కార్పొరేషన్‌లో 64 స్థానాలు ఉంటే అప్పట్లో మనం 49 గెలిచాం. టీడీపీకి వచ్చిన స్థానాలు కేవలం 14. కమ్యూనిస్టులు ఒక్క సీటు గెలిచారు. వాళ్లకు కేవలం 14 స్థానాలున్నా ఎన్నికలు అయిపోయిన తర్వాత రకరకాల ప్రలోభాలకు గురిచేసి, భయపెట్టి 13 మందిని తీసుకున్నారు. అయినా ఇంకా 36 మంది నిటారుగా నిలబడ్డారని చెప్పేందుకు గర్వపడుతున్నా. వైఎస్సార్‌సీపీ విలువల కోసం నిలబడిన పార్టీ. నా దగ్గర నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకూ ఇది నా పార్టీ అని కాలర్ ఎగరేసుకుని గర్వంగా చెప్పుకునేలా వ్యవహరించాం. ఇవాళ ఎన్నికలు పూర్తయి దాదాపు 9 నెలలు కావస్తోంది. మనం ఓడిపోయినా ఈ రోజుకు కూడా గర్వంగా తలెత్తుకుని ప్రజల దగ్గరకు పోగలుగుతాం. వాళ్ల మధ్య నిలబడి సమస్యలను వినగలుగుతాం. వారితో మమేకం కాగలుతాం. కారణం.. మనం ప్రజలకు మంచే చేశాం. ఏరోజూ మనం వాళ్లను మోసం చేయలేదు. ఏరోజూ అబద్ధాలు చెప్పలేదు. ఏదైతే చెప్పామో.. అది చేసి చూపించిన తర్వాత వాళ్లను ఓట్లు అడిగాం. కాబట్టి ప్రజల దగ్గర మన విలువ తగ్గలేదు. ఎన్నికలు జరిగి 9 నెలలు కూడా తిరక్కముందే కూటమికి చెందిన ఎమ్మెల్యే మొదలు.. కార్యకర్త వరకు ప్రజల దగ్గరకు వెళ్లే పరిస్థితి లేదు. కారణం.. ఏ గడపకు వెళ్లినా ఎన్నికల ముందు వాళ్లు ఇచ్చిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లు, సూపర్ సెవెన్‌లు గురించి ప్రజలు నిలదీస్తున్నారు. ఇలా ఏ ఇంటికి వెళ్లినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఆ రోజు ఎన్నికలప్పుడు తాము చేయలేకపోతే కాలర్ పట్టుకోమన్నారు. అదే మాట గుర్తు చేస్తూ.. ఈరోజు ప్రజలు ఎక్కడ కాలర్ పట్టుకుంటారో అని భయపడి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారు.

ఆ రోజే చెప్పా.. అదే జరిగింది

ఎన్నికలు అయిపోయిన 9 నెలల తర్వాత.. ఇవాళ సంపద సృష్టించడం ఎలాగో చెవిలో చెబితే తెలుసుకుంటానని చంద్రబాబు చెబుతున్నారు. ఆ రోజే నేను ఎన్నికల ప్రచారంలో చెప్పా. 'చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే..! చంద్రబాబును నమ్మడం అంటే పులి నోట్లో తలపెట్టడమే..!'అని చెప్పా. మన మేనిఫెస్టో, వాళ్ల హామీలను చూపిస్తూ.. చంద్రబాబు చెప్పినవి అమలు చేయడం సాధ్యం కాదని చెప్పా. ఇప్పుడు సరిగ్గా అదే జరిగింది. చంద్రబాబు ఆ పథకాలు అమలు చేయలేక చేతులెత్తేశారు.

చేసేదే చెప్పాం.. చెప్పిందే చేశాం

రాష్ట్ర బడ్జెట్ ఇదీ.. మనం చేస్తున్న కార్యక్రమాలు ఇవీ.. వీటికింత ఖర్చవుతుంది అని నాడు మనం చెప్పాం. మరోవైపు చంద్రబాబు రూ.1.72 లక్షల కోట్లు ఖర్చయ్యే ప్రతిపాదనలు చెబుతున్నారు.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంతా మోసం.. అని వివరిస్తూ మనం ఏం చేయగలుగుతాం అనేది కూడా ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పాం. ఆరోజు మన ప్రజా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు నా దగ్గరకు వచ్చి మనం కూడా సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌లా హామీలు ఇద్దామన్నారు. కానీ అప్పుడు నేను ఒక్కటే చెప్పా.. విలువలు, విశ్వసనీయత లేని రాజకీయాలు చేయడం అనవసరం అని చెప్పా. ఏదైతే చేయగలుగుతామో అదే చెప్పాలి. చేయలేనిది చెప్పి, ప్రజలను మోసం చేయడం ధర్మం కాదని చెప్పా. ఓడిపోయాం.. ఫరవాలేదు. ప్రతిపక్షంలో కూర్చున్నాం.. అదీ ఫర్వాలేదు. మళ్లీ అదే రోజుకు వెనక్కి వెళ్లినా కూడా ఇదే విధంగానే మరలా చెబుతాం. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు అర్థం అదే! జమిలి ఎన్నికలు అంటున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అదే విలువలు, విశ్వసనీయత అన్న పదం మీద వైఎస్సార్‌సీపీ మళ్లీ అఖండ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఎందుకంటే ఇప్పటికే ప్రజలకు చంద్రబాబు నైజం పూర్తిగా అర్థం అవుతోంది.

లెక్క తప్పలేదు

- అన్ని వర్గాల లెక్కలు తేలాయి
- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసమే ఒక్క రోజులో బీఆర్ఎస్ సర్వే
- నరేంద్ర నుంచి రాజేందర్ వరకు బీసీలను వెళ్లగొట్టారు
- మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి సీతక్క



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ప్రక్రియ ఎక్కడా లెక్క తప్పలేదని, అన్ని సామాజిక వర్గాల లెక్కలు పక్కాగా తేలాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ప్రస్తుత కులగణనలో లభించిన సమాచారం ఆధారంగానే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు. ప్రజల విజ్ఞప్తులను అక్కడికక్కడే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడిన సీతక్క కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడారు. మేక వన్నె పులిలా బీసీ, ఎస్సీల హక్కులను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఒక్క రోజులోనే సర్వే పూర్తి చేశారని, అదంతా కేవలం లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కోసమేనని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు కులగణన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఆలె నరేంద్ర, ఈటల రాజేందర్ లాంటి బలమైన బీసీ నేతలను పార్టీ నుంచి వెళ్లగొట్టారన్నారు. తమ సర్వేను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అప్పుడు జరిగిన కులగణన ఎందుకు బయటపెట్టలేదో కేసీఆర్‌ను ప్రశ్నించలేదని అన్నారు. పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం, ఇన్‌చార్జ్ భేటీకి ప్రత్యేకత ఏమీ లేదని, ప్రతి మూడు నెలలకోసారి ఎమ్మెల్యేలతో సమావేశం ఉంటుందని సీతక్క చెప్పారు. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని, ఆయన సంగతి పార్టీ చూసుకుంటుందని చెప్పారు.

అధికారులను వెళ్లి కలవండి

మంత్రితో ముఖాముఖిలో భాగంగా తమకు వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు చేరవేస్తామని, వాటి పరిష్కారానికి ప్రజలు స్థానిక అధికారులను సంప్రదించాలని సీతక్క చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ప్రభుత్వ పథకాలు నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. గ్రామాల రోడ్లు, హోంగార్డు ఉద్యోగాలు, పంట రుణాల మాఫీ, కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపుల ఏర్పాటు, వడ్డీ వ్యాపారుల ఆగడాలు, ధరణి తదితర అంశాలపై ప్రజలు మంత్రి సీతక్కకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎం.ఏ.ఫహీం, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, టీపీసీసీ నేత అల్లం భాస్కర్ పాల్గొన్నారు.

టీకా వికటించి శిశువు మృతి

- రాజన్నసిరిసిల్ల జిల్లా నేరెళ్ల పీహెచ్‌సీలో ఘటన
- ఆస్పత్రి ఎదుట తల్లిదండ్రుల ధర్నా



నేరెళ్ల పీహెచ్‌సీ వద్ద రోదిస్తున్న శిశువు తల్లిదండ్రులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): టీకా వికటించి శిశువు మృతి చెందిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నేరెళ్ల గ్రామానికి చెందిన దాసరి లలిత–రమేశ్ దంపతులకు ఇద్దరు సంతానం కొడుకు హన్షిత్ (9), కూతురు(45రోజులు) ఉన్నారు. కూతురుకు నేరెళ్ల పీహెచ్‌సీలో బుధవారం టీకా వేయించారు. ఇంటికెళ్లాక పాప అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హుటాహుటిన సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు శిశువు అప్పటికే మృతి చెందిందని తెలపడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా ఏడ్చారు. పాప మృతదేహంతో నేరెళ్ల పీహెచ్‌సీ వద్ద ధర్నాకు దిగారు. సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై రామ్మోహన్ వారికి నచ్చజెప్పినా వినలేదు. కలెక్టర్ రావాలని పట్టుబట్టారు. జిల్లా వైద్యాధికారి రజిత అక్కడికి చేరుకొని బుధవారం ముగ్గురు చిన్నారులకు టీకాలు వేస్తే ఇద్దరు బాగానే ఉన్నారన్నారు. పాప మృతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయినా తల్లిదండ్రులు వినలేదు. వీరికి తోడుగా సిద్దిపేట–సిరిసిల్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో దిగిన బీజేపీ మండలాధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావుతోపాటు మరో పదిమందిని పోలీసులు అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి పాప కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.లక్ష చెక్కు అందించారు. తంగళ్లపల్లి తహసీల్దార్ గురువారం మరో రూ.లక్ష అందజేయనున్నట్లు ప్రకటించారు.

రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టండి



మాట్లాడుతున్న కోమటిరెడ్డి. చిత్రంలో వికాస్‌రాజ్

అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) పద్ధతిలో రహదారుల మరమ్మతులు చేపట్టాలని అధికారులను రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. బాగా దెబ్బతిన్న రోడ్లను బాగు చేసే పనులను హ్యామ్ పద్ధతిలో పనులు చేయాలని సూచించారు. రోడ్ల మరమ్మతులపై అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. 15 ఏళ్లపాటు నిర్మాణ సంస్థనే రోడ్ల నిర్వహణ బాధ్యతలు చూడనున్నందున.. ఆయా రోడ్ల విషయంలో నిర్మాణ సంస్థ నిక్కచ్చిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డివైడర్లు, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, రోడ్డు విస్తరణ, పేవ్డ్ షోల్డర్ల నిర్మాణం.. వంటి పనుల్లో నిబంధనలు పాటించేలా చూడాలని ఆదేశించారు. మట్టి రోడ్లను బీటీగా మార్చేందుకు ప్రాధాన్యమిస్తున్నందున.. ఆ రోడ్ల వివరాలను తన దృష్టికి తేవాలని కోరారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంలో జాప్యం చేయొద్దని కాంట్రాక్టర్లకు సూచించారు. వర్షాలతో దెబ్బతిని ఏళ్లపాటు బాగు చేయకుండా ఉండిపోయిన రోడ్లను మెరుగుపరిచే పని తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటివరకు 82 నియోజకవర్గాల్లో గుర్తించిన 1,690 కి.మీ. రోడ్ల మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని తెలిపారు. సమీక్షలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సీఈలు తిరుమల, మోహన్‌నాయక్, ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయ ముట్టడికి యత్నిస్తున్న యాదవ సంఘం సభ్యులు

బీజేపీ ఆఫీస్ ముట్టడికి యత్నం

- జిల్లా అధ్యక్షుల నియామకాల్లో యాదవులను విస్మరించారని నిరసన
- పలువురిని అరెస్టు చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకాల్లో యాదవ సామాజికవర్గాన్ని నిర్లక్ష్యం చేశారని యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పలువురు బీజేపీ ఆఫీస్ ముట్టడికి ప్రయత్నించారు. దీంతో బీజేపీ కార్యాలయం వద్ద యాదవ సంఘం సభ్యులను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. బీజేపీ ప్రకటించిన 19 జిల్లా అధ్యక్షుల్లో ఒక్క యాదవ సోదరుడు మీకు కనిపించలేదా? అని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ ప్రశ్నించారు. బీసీల్లో మెజారిటీ సంఖ్యలో ఉన్న యాదవులను బీజేపీ విస్మరించడం తగదన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో యాదవుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి అర్బన్ జిల్లాలకు యాదవ సోదరులకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని రాములు నిలదీశారు. బీజేపీ అగ్రకులాల పార్టీగా వ్యవహరిస్తోందని, యాదవులకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వకుంటే బీజేపీ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను బొంద పెడతాం

నమ్మిన మాలలను నట్టేట ముంచింది: చెన్నయ్య



కవాడిగూడ (హైదరాబాద్): నమ్ముకున్న మాలలను కాంగ్రెస్ పార్టీ నట్టేట ముంచిందని, ఆ పార్టీని రాబోయే రోజుల్లో బొంద పెడతామని మాల సంఘాల నేతలు హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాలనేతలను పోలీసులు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంబేడ్కర్ వాదులైన మాలలను కాంగ్రెస్ పార్టీకి దూరం చేసేందుకు మంద కృష్ణ మాదిగ, చంద్రబాబు నాయుడుతో కుమ్మక్కై వర్గీకరణ ద్వారా మాలలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. 2011 జనాభా లెక్కలలో ఉపకులాల గణన జరగలేదని, తప్పుడు జనాభా లెక్కలతో వర్గీకరణ చేశారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు దాటిన తర్వాత పాత లెక్కలను ఎలా తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం డేటా లేటెస్ట్‌గా తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘంలో ఒక మాల మంత్రి కూడా లేకపోవడంతో మాలలకు అన్యాయం జరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాలలకు ద్రోహం చేశారని ఆరోపించారు. మాలలంతా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు రావాలని చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ వర్గీకరణ ద్వారా అట్టడుగున ఉన్న పేద కుటుంబాలకు న్యాయం జరగదని, ఇది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉందని దీనిపై న్యాయపోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు తీరును పరిశీలిస్తాం

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు తీరును పరిశీలిస్తామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. బుధవారం బీసీ కమిషన్ కార్యాలయంలో సభ్యులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లు ఎలా అమలవుతున్నాయో పరిశీలించాలని, ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించాలని కమిషన్ నిర్ణయించిందన్నారు. సహకార రంగంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశంపై అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విభాగాల్లో రోస్టర్ పాయింట్ రిజిస్టర్ నిర్వహణను కూడా లోతుగా పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే–2024 నివేదికను బీసీ కమిషన్ స్వాగతిస్తోందన్నారు. బీసీల్లోని కొన్ని కులాల పేర్ల మార్పులపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించామని, ఆ కులాల జీవన స్థితిగతులను క్షేత్రపర్యటన చేసి తుది నిర్ణయం తీసుకుంటామని నిరంజన్ వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు జోరు పెంచిన బీజేపీ

నేడు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య నామినేషన్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 27న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరగనున్న ఎన్నికల కోసం బీజేపీ సన్నాహాలను వేగవంతం చేసింది. గురువారం కరీంనగర్– నిజామాబాద్– మెదక్– ఆదిలాబాద్ జిల్లాల స్థానంలో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. శుక్రవారం కరీంనగర్– నిజామాబాద్– మెదక్– ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, నల్లగొండ– ఖమ్మం– వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తం రెడ్డి నామినేషన్లు సమర్పించనున్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థుల నామినేషన్ల సమర్పణ, ప్రచార వ్యూహాలు, టీచర్లకు ఇవ్వాల్సిన భరోసాపై చర్చించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాల్లోనూ గెలుపొంది పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నేతలు ఎన్.రామచంద్రరావు, ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా, పార్టీ కార్యాలయంలో కరీంనగర్ – నిజామాబాద్ –మెదక్ – ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తరపున ఆయన కుమార్తె అశ్విత, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిలు, జి.కిషన్‌రెడ్డి నుంచి బీ–ఫారమ్ అందుకున్నారు.

ఏఐదే హవా!

▶ మొదటి పేజీ తరువాయి

ఆందోళనలు పక్కనపెట్టి ఏఐని ఆహ్వానించాలని, ఐటీ దిగ్గజ సంస్థకు చెందిన జాకర్ తెలిపారు. ఇవన్నీ గమనంలో ఉంచుకునే విద్యా సంస్థలు ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ లాంటి కోర్సుల్లో ప్రవేశాలు పెంచుకుంటున్నాయి. కంపెనీలు సైతం ఏఐపై పట్టున్న వారికే ప్రాంగణ నియామకాల్లోనూ మంచి అవకాశాలు ఇస్తున్నాయి.

ప్రత్యేక నైపుణ్యమే ప్రధానం

దేశంలో ప్రతి ఏటా 15 లక్షల మంది ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉపాధి కోసం ప్రయత్నిస్తున్నారు. ఇందులో కేవలం 9 శాతం మాత్రమే ఐటీ రంగంలో మంచి ఉద్యోగాలు పొందుతున్నారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్‌పై పట్టు వారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సివిల్, మెకానికల్‌లో బీటెక్ కోర్సులు చేస్తున్న విద్యార్థులు కూడా ఏఐ, తదితర టెక్నాలజీల్లో సర్టిఫికెట్ కోర్సులు చేస్తేనే క్యాంపస్ నియామకాల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. ఏఐ, డేటా సైన్స్ రంగాల్లోని పట్టభద్రులకు క్యాంపస్ నియామకాల్లో సంప్రదాయ ఐటీ రంగాల నిపుణుల కన్నా 30 శాతం ఎక్కువ వేతనాలు లభిస్తున్నాయి. జీసీసీల్లో అత్యధిక డిమాండ్ కలిగిన టెక్నాలజీల్లో నైపుణ్యం ఉన్నవారికి మంచి ప్యాకేజీలు ఇస్తున్నారు. క్యాంపస్ నియామకాల్లో ఏఐ ఇంజనీరింగ్, జనరేటివ్ ఏఐ, డేటా ఫ్యాబ్రిక్స్, డిస్ట్రిబ్యూషన్ ఎంటర్‌ప్రైజెస్, క్లౌడ్ నేటివ్ ప్లాట్‌ఫామ్స్, అటానమస్ సిస్టమ్స్, డెసిషన్ ఇంటెలిజెన్స్, హైపర్ ఆటోమేషన్, సైబర్ సెక్యూరిటీ మెష్ నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. సైబర్ సెక్యూరిటీలో ప్రారంభ వేతనం సగటున ఏడాదికి 9.57 లక్షలుగా ఉంది.

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో 2024-25 క్యాంపస్ నియామకాల్లో సగటు ప్యాకేజీలు ఇలా..

సంస్థ	ప్యాకేజీ (రూ.లక్షల్లో)
హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ	29.53
కాన్పూర్ ఐఐటీ	19.15
ఐఐటీ గువాహటి	18.70
ఐఐటీ ఢిల్లీ	17.60
ఐఐటీ రూర్కీ	16.72
ఐఐటీ హైదరాబాద్	16.25
ఐఐటీ వారణాసి	16
ఐఐటీ బాంబే	15
ఐఐటీ ఖరగ్‌పూర్	15
ఐఐటీ మద్రాస్	15
బిట్స్ పిలానీ	13
ఎన్ఐటీ వరంగల్	10

ఏఐ నైపుణ్యానికి కంపెనీల ప్రాధాన్యం

రెండేళ్లుగా జేఎన్‌టీయూహెచ్‌లో ప్రాంగణ నియామకాలు పెరుగుతున్నాయి. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్‌తో పాటు ఏఐ అనుసంధానం ఉన్న కోర్సుల విద్యార్థులకు కంపెనీలు ప్రాధాన్యమిస్తున్నాయి. అయితే సివిల్, మెకానికల్ విద్యార్థులు కూడా ఈ ట్రెండ్‌ను అర్థం చేసుకుని, ఏఐఎంఎల్ మైనర్ డిగ్రీ కోర్సులు చేస్తున్నారు. వీరికి కూడా ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయి.

– ప్రొఫెసర్ పద్మావతి విశ్వనాథ్
(వైస్ ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూహెచ్)

స్థానిక వనరులపై ఐటీ సంస్థల దృష్టి

ఏఐ విస్తరణకు అనుగుణంగా డేటా కేంద్రాలు, మాడ్యూల్స్ అభివృద్ధి చేయాల్సి వస్తోంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో స్థానికంగా మానవ వనరులు అభివృద్ధి పరుచుకోవడంపై సంస్థలు దృష్టి పెట్టాయి. ఇందులో భాగంగానే నైపుణ్యం వారి కోసం క్యాంపస్ నియామకాలు పెంచాయి.

– నవీన్ ప్రమోద్
(ఎంఎన్‌సీ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్)

రైల్వే డివిజన్ల సరిహద్దుల్లో మార్పులు

సౌత్‌కోస్ట్ రైల్వేజోన్ ఏర్పాటు నేపథ్యంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో సెక్షన్ల పరిధిలో రైల్వేబోర్డు కొన్ని కీలక మార్పులు చేసింది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే, సౌత్‌కోస్ట్ రైల్వే, సౌత్ సెంట్రల్ రైల్వే మధ్య ప్రధాన డివిజన్ల పంపిణీ చేసిన నేపథ్యంలో డివిజన్లు, సెక్షన్ల మార్పులు జరిగాయి. ఈస్ట్ కోస్ట్ రైల్వే, కొత్తగా ఏర్పడనున్న సౌత్ కోస్ట్ రైల్వే మధ్య పంపకాలు జరిగాయి.

- దక్షిణమధ్య రైల్వే పరిధిలో ఎప్పటిలాగే సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు కొనసాగనున్నాయి. కానీ, కొన్ని సెక్షన్ల విషయంలో మాత్రం మార్పులుచేర్పులు జరిగాయి.
- ప్రతిపాదిత సౌత్‌కోస్ట్ రైల్వే పరిధిలోని గుంతకల్ డివిజన్‌లోకి వచ్చే రాయచూర్ నుంచి వాడీ సెక్షన్‌ను దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్‌లోకి బదిలీ చేయాలని నిర్ణయించింది. లేని పక్షంలో కీలక వాడీ ప్రాంతం ఇటు సౌత్ సెంట్రల్ రైల్వే, అటు సౌత్ కోస్ట్ రైల్వే, సెంట్రల్ రైల్వే మధ్య నిర్వహణ పరమైన ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉంటుందని తేల్చింది.
- వాడీ సెక్షన్ పరిధిలోకి వచ్చే రెండు కీలక థర్మల్ పవర్ ప్లాంట్లకు సికింద్రాబాద్ డివిజన్ మీదుగా బొగ్గు రవాణా జరుగుతుంది. బొగ్గు రవాణా, పవర్ ప్లాంట్లు ఉన్న ప్రాంతం ఒకే డివిజన్ పరిధిలోకి వస్తే నిర్వహణపరమైన ఇబ్బందులు ఉండవన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది.
- ప్రస్తుతం గుంటూరు డివిజన్ పరిధిలో ఉన్న విష్ణుపురం నుంచి పగిడిపల్లి ప్రాంతం, విష్ణుపురం నుంచి జాన్‌పహాడ్ సెక్షన్‌ను సికింద్రాబాద్ డివిజన్‌లోకి బదిలీ చేయాలని నిర్ణయించింది. సింగరేణి నుంచి విష్ణుపురం, యాదాద్రి పవర్ స్టేషన్లకు బొగ్గు సరఫరాలో నిర్వహణపరమైన అవాంతరాలు ఎదురుకాకుండా ఈ నిర్ణయం తీసుకుంది.
- సికింద్రాబాద్ డివిజన్‌లోని కొండాయ్‌పల్లి నుంచి మోటుమర్రి సెక్షన్‌ను విజయవాడ డివిజన్‌కు బదిలీ చేయాలని నిర్ణయించింది. ఎన్.తాతారావు పవర్ ప్లాంట్, రాయనపాడు వర్క్‌షాప్‌లు జోనల్ ఇంటర్‌ఛేంజ్ సరిహద్దులో ఉన్నందున నిర్వహణపరమైన ఇబ్బందులు రాకుండా ఈ నిర్ణయం తీసుకుంది.

స్త్రీ శక్తి

పురాణాల నుంచి వర్తమానం వరకు పతి ప్రాణాలు రక్షించుకోవడం కోసం మహిళలు పడిన కష్టాలు, చేసిన పోరాటం మనకు కొత్త కాదు. నూకమ్మ చేసిన పోరాటం ఆ కోవలోకే వస్తుంది.

శ్రీకాకుళం జిల్లాలోని మారుమూల గ్రామానికి చెందిన నూకమ్మ భర్త, అతడి బృందం గుజరాత్‌లో చేపల వేటకు వెళ్లి పాకిస్తాన్ కోస్టు గార్డుల చేతికి చిక్కారు. పాకిస్తాన్ జైల్లో పద్నాలుగు నెలలు మగ్గారు.

అప్పట్లో 'ప్రజా సంకల్పయాత్ర' చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకు వెళ్లారు. బాధిత కుటుంబాలకు జగన్ అండగా నిలబడ్డారు. ధైర్యం చెప్పారు. వీరి నిరంతర పోరాటం వల్ల... నాటి వైఎస్ జగన్ ప్రభుత్వం చొరవతో మత్స్యకారులు పాకిస్తాన్ జైలు నుంచి 14 నెలల తరువాత విడుదలయ్యారు

నాగచైతన్య కథానాయకుడిగా వస్తున్న 'తండేల్' సినిమాకు మూలం రామారావు–నూకమ్మల జీవితకథ.





పాక్ జైల్లో బందీలుగా వున్న మత్స్యకారుల గురించి పాదయాత్రలో వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి వివరిస్తున్న నూకమ్మ తదితరులు



పాకిస్తాన్ నుంచి విడుదలైన తర్వాత తనను కలిసిన రామారావుకు స్వీట్ తినిపించిన నాటి సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి

'అల' పెరుగని గుండెల్

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం పంచాయతీ పరిధిలోని గ్రామాలు డి.మత్స్యలేశం, కె.మత్స్యలేశం. గనగళ్ల రామారావుది కె.మత్స్యలేశం. నూకమ్మది డి.మత్స్యలేశం గ్రామం. వీరిద్దరి పరిచయం ప్రేమగా మారింది. పెద్దలు కూడా వీరి ప్రేమను ఆమోదించారు. పెళ్లి చేశారు. తమ ప్రేమకు పెద్దలు ఒప్పుకుంటారో లేదో, ఎన్ని కష్టాలు ఎదురవుతాయో! అనుకున్నారు.

హమ్మయ్య... ఎలాంటి కష్టం లేకుండానే వారి పెళ్లి జరిగింది.

అయితే సినిమా ట్విస్ట్‌లా అసలు కష్టాలు ఆ తరువాతే మొదలయ్యాయి.

తన బృందంతో కలిసి చేపల వేట కోసం రామారావు గుజరాత్‌లోని వెరావల్‌కు వెళుతుండేవాడు. గుజరాత్‌లో వేటకెళ్లిన మత్స్యకారుల నాయకుడిని 'తండేల్' అని పిలుస్తారు.

అదృష్టం కాదు... అంతా ఆమె కష్టమే!

పాకిస్తాన్ జైల్లో ఉన్నప్పుడు ఎప్పుడూ కుటుంబం గుర్తుకొచ్చి నాలో నేను కుమిలి పోయేవాడిని. నెల గర్భిణిగా ఉన్న నా భార్య నేను విడుదలయ్యే నాటికి మూడు నెలల పాపతో కనిపించింది. ఎన్నో నెలల పాటు నా కుటుంబానికి దూరంగా బతికాను. నా విడుదల కోసం నా భార్య చేసిన పోరాటం, పడిన కష్టాలు ఎంతో మంది ద్వారా విన్నాను. ఆమె పడిన కష్టం వల్లే విడుదలయ్యాను.

– గనగళ్ల రామారావు



ఆందోళనలో బతికా

నా భర్త పాకిస్తాన్‌కు పట్టు పడినట్లు తెల్సుకున్నాక ఆందోళన చెందా. గుజరాత్ మరి వెళ్లనని సంక్రాంతికి వచ్చి ఇక్కడే ఉండి పోతానని అన్నారు. అంతలో పాకిస్తాన్‌లో చిక్కుకుపోయారు. పాకిస్తాన్ మన శత్రుదేశం కావటం వల్ల ఎంతో ఆందోళన చెందాను. అయినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా పోరాటం చేశాను. ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను, అధికారులను కలిశాను. ఆయన జైలులో ఉండగా పాప పుట్టింది. మా కథ సినిమాగా వస్తుండటం సంతోషంగా ఉంది.

– నూకమ్మ

ఆరోజు....

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 22 మంది రామారావు నాయకత్వంలో మూడు బోట్లలో గుజరాత్ వెరావల్ నుంచి బయలుదేరి చేపల వేట సాగిస్తున్నారు. ఎదురుగా దట్టమైన మంచు. ఏమీ కనిపించడం లేదు. పయనిస్తున్న పడవ దిశ మారిపోయింది. దీంతో పాకిస్థాన్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించారు. బోట్‌లలో వైర్‌లెస్ సెట్లు కూడా పనిచేయకపోవడంతో వారికి దిక్కు తోచలేదు.

ఆ తరువాత పాకిస్తాన్ కోస్టు గార్డులు చేతికి చిక్కారు. వీరి ఫొటోలు తీసుకుని ఏ ప్రాంతానికి చెందిన వారని ఆరా తీశారు. 'పొరపాటున వచ్చిన మిమ్మల్ని విడిచి పెడతాం' అని కోస్టు గార్డులు హామీ ఇవ్వడంతో 'బతికిపోయినం దేవుడా' అనుకున్నారు. ఊపిరి పీల్చుకున్నారు.



కె.మత్స్యలేశంలో రామారావు, నూకమ్మ, ఇతర మత్స్యకారులతో చర్చిస్తున్న నాగచైతన్య, చందు మొండేటి (ఫైల్)

కథ మలుపు తిరిగింది...

కానీ తరువాత కథ మలుపు తిరిగింది. 'భయపడకండి... విడిచి పెడతాం' అన్న వాళ్లే ఆ తరువాత 'విడిచిపెట్టేదే లేదు' అంటూ మాట మార్చారు. ఆ మాట వారి గుండెల్లో గునపంలా దిగింది. వేలిముద్రలు తీసుకుని కరాచీ సబ్‌జైలులో బంధించారు. వీరందరినీ ఒకే బ్లాక్‌లో ఉంచారు. జైలులో వారు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సరైన ఆహారం అందకపోవడం, జైలు సిబ్బంది నానా రకాలుగా ఇబ్బంది పెట్టడంతో చిత్రహింసలు అనుభవించారు.

ఎవరికి ఎవరూ ధైర్యం చెప్పుకునే పరిస్థితి లేదు. అందరి కళ్ల ముందు దుఃఖసముద్రం.

పద్నాలుగు నెలలు... ప్రతి రోజూ నరకమే

వేటకు వెళ్లిన తమ వాళ్ల ఆచూకి దొరకక పోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. పాకిస్తాన్ కోస్టు గార్డులకు పట్టుబడ్డారనే వార్త తెలిసి కుప్పకూలిపోయారు.

'ఎన్ని కష్టాలొచ్చినా సరే నా భర్తను జైలు నుంచి విడిపించుకుంటాను' ఏడుస్తూనే దృఢంగా అన్నది నూకమ్మ.

'నీ భర్త విజయనగరంలో ఉన్నాడనుకున్నావా? విశాఖపట్నంలో ఉన్నాడనుకున్నావా?... అక్కడెక్కడో పాకిస్తాన్ జైలులో ఉన్నాడు' అన్నారు ఒకరు. ఆ మాటకు అర్థం... ఇక ఆశ వదులుకోవాల్సిందేనని!

అయితే చివరి శ్వాస వరకు అయినా పోరాడాలని నిర్ణయించుకుంది నూకమ్మ. ఆమెకు ఎర్రమ్మ భార్య శిరీష జత కలిసింది.

నిండు గర్భిణీగా ఉన్న నూకమ్మ, ఎర్రయ్య సతీమణి శిరీష కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వానికి విన్నపాలు చేశారు. అప్పట్లో 'ప్రజాసంకల్పయాత్ర' చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకు వెళ్లారు. బాధిత కుటుంబాలకు జగన్ అండగా నిలబడ్డారు. ధైర్యం చెప్పారు. వీరి నిరంతర పోరాటం వల్ల, నాడు ఉన్న వైఎస్ జగన్ ప్రభుత్వం చొరవతో మత్స్యకారులు పాకిస్తాన్ జైలు నుంచి 14 నెలల తరువాత విడుదలయ్యారు. భర్తను జైలు నుంచి విడిపించటం కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు నూకమ్మ చేసిన పోరాటం, గర్భిణిగా, పాపకు జన్మనిచ్చిన తల్లిగా తను ఎదుర్కొన్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

అంతులేని నిస్సహాయతలో కూడా చిన్న ఆశ మనిషిని బతికిస్తుంది. పోరాటశక్తిని ఇస్తుంది. విజయాన్ని చేతికి అందిస్తుంది. నూకమ్మ విషయంలో అదే జరిగింది.

– కందుల శివశంకరరావు, సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

● మన(సు)లో మాట

మగ దేవుళ్ళను కూడా పూజించొద్దు అంటున్నాడు మా ఆయన

మా పెళ్ళయి 15 సంవత్సరాలయింది. ఇద్దరు పిల్లలు. మొదటి నుంచి మా ఆయన నన్నెంతో ప్రేమించేవారు. కానీ ఇటీవల 2 సంవత్సరాల నుండి అనుమానంతో వేధిస్తున్నాడు. ప్రతి చిన్న విషయానికీ ఆయనకు నాపైన అనుమానమే! చివరకు నా అన్నా తమ్ముడితో మాట్లాడినా అనుమానమే! ఒకప్పుడు తరచు సినిమాకో, హోటల్‌కో తీసుకెళ్ళే ఆయన, ఇపుడు అవన్నీ పూర్తిగా మానేశారు. నన్ను ఒక విధంగా హౌస్ అరెస్ట్ చేసి, బయట లోకమే లేకుండా చేశారు. చివరకు ఇంట్లో మగ దేవుళ్ళ పటాలు కూడా తీసివేసి, పూజలు కూడా చేసుకోనివ్వడం లేదు. ప్రమాణంగా చెప్తున్నాను. నాకసలు అలాంటి ఆలోచనలే లేవు. ఈ విషయాలు ఎవరితో చెప్పుకోలేక ఆయన బాధలు పడలేక ఒక్కోసారి చచ్చిపోదామనిపిస్తోంది. నన్ను బయటకు కదలనివ్వడం లేదు. దయచేసి నా సమస్యకు పరిష్కారం చూపిస్తారనే ఆశిస్తున్నాను.

– ఒక సోదరి విజయవాడ

జ. మీ మనోవేదనను అర్థం చేసుకున్నాను. మగవారినే కాదు, మగ దేవుళ్ళను కూడా చూడొద్దు, పూజించొద్దు అనే స్థాయికి వెళ్ళాడంటే అది ఖచ్చితంగా మానసిక జబ్బే! 'డెల్యూజనల్ డిసార్డర్' లేదా 'పారనాయిడ్ సైకోసిస్' అనే ఈ తీవ్రమైన మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. మెదడులోని సెరటోనిన్ అనే ఒక ప్రత్యేక రసాయనిక పదార్థం సమతుల్యంలో తేడాలొచ్చినప్పుడు లేదా వారసత్వంగా కూడా కొందరికి ఇలాంటి మానసిక జబ్బు వచ్చే అవకాశముంది. ఇలాంటి ప్రవర్తన కూడా ఒక మానసిక రుగ్మతేనన్న విషయం తెలియక కొందరు మానసిక వ్యాధి అంటే 'పిచ్చి' పట్టిందని అంటారనే భయంతో బయటకు చెప్పుకోలేక పోవడం లేదా ఆ వ్యక్తి డాక్టరు దగ్గరకు చికిత్సకు వచ్చేందుకు సహకరించక పోవడం వల్ల జబ్బు ముదిరిపోయి, తీవ్రస్థాయికి వెళ్ళే ప్రమాదముంది. మీ దగ్గరి బంధువుల సహాయం తీసుకొని, ఏదో ఒకవిధంగా ఒకసారి మీరు హాస్పిటల్‌కి రాగలిగితే పూర్తి వివరాలు తీసుకుని, ఇలాంటి వారికి ఎలాంటి వైద్యం చేయాలో మీతో వివరంగా చర్చించడానికి వీలవుతుంది. కొత్త మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం ప్రకారం ఆయన ఒప్పుకోకపోయినా వైద్యం చేసే అవకాశముంది. ఆలస్యం చేయకుండా ముందుకెళ్ళండి!




డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బ్యూటిప్

పిగ్మెంటేషన్ సమస్యకి...







- రకరకాల కారణాల వల్ల ముఖంపై పిగ్మెంటేషన్ వస్తుంటుంది చాలామందికి. చూడటానికి అది చాలా ఇబ్బందిగా ఉంటుంది. దానికి క్రీములు, ఇతర మందులు వాడే బదులు ఒక బంగాళదుంపని తురిమి అందులో పావు కప్పు నిమ్మ రసం కలపండి. పిగ్మెంటేషన్ ఎక్కువగా ఉన్న చోట ఈ మాస్క్‌ని వేసుకుని అరగంట ఆగి చల్లని నీటితో కడిగేయాలి. ఇలా రోజుకి రెండుసార్లు చేయవచ్చు.
- రెండు టేబుల్ స్పూన్ల తేనెలో రెండు టేబుల్ స్పూన్ల నిమ్మ రసం కలిపి అవసరమున్న చోట ఈ మిశ్రమాన్ని పూతలా వేసుకోవాలి. తర్వాత గోరు వెచ్చని నీటిలో మెత్తటి బట్ట ముంచి పిండేసి ఆ బట్టని ఈ మిశ్రమం అప్లై చేసిన చోట కవర్ చేసినట్లుగా వేయండి. ఇరవై నిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. ఇలా వారానికి ఒకసారి చేయాలి. ఇలా చేయడం వల్ల పిగ్మెంటేషన్ సమస్య తగ్గి ముఖం మిలమిలలాడుతుంది.

● కిచెన్ టిప్స్



- సాధారణంగా పచ్చి మిరకాయలు ఎక్కువ కాలం నిల్వ ఉంచితే.. ఎరుపు రంగులోకి మారుతాయి. అయితే ఇలా మారకుండా ఉండాలంటే పచ్చి మిరపకాయల్ని సీసాలో నిల్వ చేసే సమయంలో కాసింత పసుపు చేర్చాలి. ఇలా చేయడం వల్ల పచ్చి మిరపకాయలు ఎరుపు రంగులోకి మారవు.
- వెల్లుల్లి రేకులను ఎండలో కొద్ది సేపు ఉంచి పొట్టు తీస్తే సులువుగా తీయొచ్చు.



భీష్మ ఏకాదశి విశిష్టత ఏమిటి... ఆ రోజు ఏం చేయాలి? ఆత్మ సాక్షాత్కారం అంటే..? సిసలైన శూరుడు ఎవరు? ఆత్మశుద్ధీకరణకు ఏమి పేరు? ఇలాంటి ఎన్నో విశేషాలను నేటి సాక్షి ఫ్లస్ సన్నిధిలో చూడవచ్చు.



ఉమెన్ పవర్

సీతమ్మ నోట స్త్రీ కష్టం

మహిళల శ్రమశక్తికి సాక్ష్యాలు, తూనికరాళ్లు అక్కర్లేదు. స్త్రీ శ్రమశక్తి అనేది నిత్యం కళ్ల ముందు కనిపించేది.

ఒక్క ముక్కలో చెప్పాలంటే శ్రమ అంటేనే స్త్రీ.

అయినా సరే, ఎప్పటికప్పుడు మహిళలు తమను తాము నిరూపించుకోవాల్సి వస్తోంది. మరింత ఎక్కువగా కష్టపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మహిళల కష్టం గురించి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఒక ఇంటర్వ్యూ సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

'గుర్తింపు పొందడానికి మహిళలు పురుషుల కంటే మూడు రెట్లు ఎక్కువగా కష్టపడాల్సి ఉంటుంది. స్కూల్, కాలేజీ, బోర్డ్, ఆర్మీ, మీడియా... ఇలా ఎక్కడైనా సరే గుర్తింపు రావాలంటే పురుషుల కంటే మూడురెట్లు తమను తాము నిరూపించుకోవాలి. ఇది అన్ని చోట్లా ఉంది' అంటున్నారు నిర్మలమ్మ.

'లైఫ్ ఈజ్ అన్ ఫెయిర్' అంటూనే అంతర్గత శక్తి ని పెంపొందించుకోవడం గురించి నొక్కి చెబుతున్నారు. అన్యాయాలు జీవితంలో ఒక భాగమని, వాటిని అధిగమించడానికి అంతర్గత బలాన్ని పెంపొందించుకోవడం కీలకం అంటున్నారు నిర్మలా సీతారామన్.

'కంపెనీ బోర్డులలో మహిళల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. కంపెనీ బోర్డుల్లో ఉండడానికి తాము అర్హులమని ఇప్పటికీ నిరూపించుకోవాలా!' అని ప్రశ్నిస్తున్న సీతారామన్–

'మహిళలు తమను తాము నిరూపించుకున్నారు. తమదైన గుర్తింపు పొందారు' అంటూ చరిత్రను గుర్తు తెచ్చారు.

ఎంతో ఆత్రుతగా ఎదురు చూసిన బడ్జెట్ రానే వచ్చింది.. పేదలు, యువత, రైతులు, మహిళల అభివృద్ధే లక్ష్యంగా భావిస్తున్న ఈ ప్రభుత్వం జెండర్ బడ్జెట్‌లో ఆ దిశగా కేటాయింపులనూ పెంచామంటోంది. ఇక్కడొక మాట.. జెండర్ బడ్జెట్ అనేది మహిళల కోసం ప్రత్యేకమైంది కాదు. కానీ వార్షిక బడ్జెట్‌లోనే లింగసమానత్వం, మహిళా ప్రగతికి ప్రత్యేక నిధులు ఇస్తుంది వివిధ శాఖలు, విభాగాలలో బాలికలు, మహిళలకున్న సంక్షేమ పథకాలకు పూర్తిగా లేదా పాక్షిక కేటాయింపులతో! ఈ లెక్కన ఈ ఆర్థిక సంవత్సరానికి ఈ బడ్జెట్‌లో జెండర్ బడ్జెట్ కింద రూ. 4.49 లక్షల కోట్లను కేటాయించింది ప్రభుత్వం. మొత్తం బడ్జెట్‌లో ఇది 8.86 శాతం. కిందటేడుతో పోలిస్తే 37 శాతం పెరిగింది. అంకెల్లో ఇది పెరిగినట్టు కనిపించినా దాన్ని, శాఖలు, విభాగాల వారీగా విశ్లేషించాలి అంటున్నారు ఆర్థిక నిపుణులు.

అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాల కేటాయింపుల్లో స్త్రీ పక్షపాతమే చూపించామని... ఏకపక్షంగా నిధులు ఇచ్చామని... మహిళల ప్రగతి విషయంలో తమ దృక్పథంలో మార్పేమీ లేదు.. అంటున్న ప్రభుత్వం మరి తగ్గించిన కేటాయింపులు, అసలు కేటాయింపులే చేయని వాటికి సమాధానమేం చెబుతుందని ప్రశ్నిస్తున్నారు ఆర్థిక విశ్లేషకులు. జెండర్ బడ్జెట్ కేటాయింపుల మీద తెలుగు రాష్ట్రాల్లోని పలు రంగాలకు చెందిన నిపుణులు ఏమంటున్నారో చూద్దాం.

'సగానికి' భాగమిదేనా?



పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నిర్మలా సీతారామన్

ఇంకొంత కసరత్తు

ఈ ఏడు జెండర్ బడ్జెట్‌కు కేటాయింపులు పెరిగాయి. మహిళలు, బాలికల ప్రయోజనార్థం పలు పథకాల అమలుకు రూ. 3 లక్షల కోట్లకు పైగా నిధులను కేటాయించారు. మహిళా సాధికారత కోసం మిషన్ శక్తి కింద రూ.3,150 కోట్లకు పెంచారు. బేటీ బచావో – బేటీ పఢావో, వన్‌స్టాప్ కేంద్రాలు, నారీ అదాలత్‌లు, మహిళా సహాయవాణులు, మహిళా పోలీసు వాలంటీర్లకు రూ. 628 కోట్లు కేటాయించారు. ఇవన్నీ బాగానే ఉన్నాయి. కానీ మహిళల భద్రత–రక్షణ కోసం, స్త్రీ, పురుష అసమానతలను రూపుమాపే దిశగా బడ్జెట్ పరంగా ఇంకొంత కసరత్తు జరగాల్సింది.



– మల్లవరపు బాల లత, మాజీ డిప్యూటీ డైరెక్టర్, రక్షణ మంత్రిత్వశాఖ

పెద్దగా మార్పు కనపడలేదు

2047 కల్లా దేశాన్ని వికసిత్ భారత్.. అంటే అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని ప్రధాని లక్ష్యం. అదీ మహిళల నేతృత్వంలోనే జరగాలని ఆశిస్తున్నారు. ఈ క్రమంలో మొదటిసారి మహిళా ఆంట్రప్రెన్యూర్స్ కోసం రెండు కోట్ల రూపాయలను కేటాయించారు. ఇది శుభపరిణామం. మొత్తంమీద మహిళా సంక్షేమానికి కేటాయింపులు పెరిగినా ప్రత్యేకించి మహిళల కోసమే ఉన్న కేటాయింపుల్లో పెద్దగా మార్పు కనపడలేదు. అంటే జెండర్ ఈక్వాలిటీ, మహిళల అభివృద్ధికి చేపట్టిన పథకాల మీద కేటాయింపులను పెంచలేదు. ఆ విషయంలో కొంత అసంతృప్తి ఉంది.



– ప్రియ గజ్దార్, చైర్‌పర్సన్, ఎఫ్ఎల్ఓ, హైదరాబాద్

శ్వేతపత్రం విడుదల చేయాలి

స్త్రీ పక్షపాతినని చెప్పుకుంటున్న ప్రభుత్వం జనాభా నిష్పత్తిలో బడ్జెట్ కేటాయించాలి కదా! అసలు ఆ మాట కొస్తే పదిహేనేళ్లుగా జనాభా లెక్కలే లేవు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు స్త్రీలకు కేటాయించింది ఎంత? అందులో ఖర్చు పెట్టింది ఎంత? ఇంకెంత బాకీ ఉంది? అన్న దాని మీద శ్వేతపత్రం విడుదలచేయాలి. అప్పుడు తెలుస్తుంది ప్రభుత్వాలకున్న చిత్తశుద్ధి!



– ఝాన్సీ గడ్డం, నేషనల్ కన్వీనర్, దళిత్ స్త్రీ శక్తి

ఇంపాక్ట్ అసెస్‌మెంట్ లేదు

జెండర్ బడ్జెట్ అంటే ప్రత్యేకించి మహిళల ఆరోగ్యం, చదువు, ఉపాధి, రక్షణ, ఆంట్రప్రెన్యూర్‌షిప్‌కి సంబంధించి ఉండాలి. స్త్రీ, పురుష అసమానతలను తొలగించే దిశగా కేటాయింపులు చేయాలి. ఉదాహరణకు పదేళ్ల నుంచి జెండర్ బడ్జెట్‌ను పెడుతూ వస్తున్నారు. ఈ పదేళ్ల జెండర్ బడ్జెట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ లెక్క ఎక్కడా లేదు. డిపార్ట్‌మెంట్ల వారీగా డిపార్ట్‌మెంట్‌ల డబ్బులను దామాషా పద్ధతిలో పంచి చూపిస్తుందే తప్ప మహిళల కోసం ప్రత్యేకమైన పథకాలు లేవు. మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు, ప్రత్యేక పనివిధానం కోసం కేటాయించి.. ఆ లక్ష్య సాధనకే ఖర్చు చేసినప్పుడే అది జెండర్ బడ్జెట్ అవుతుంది. ఇది అయితే కాదు.



– మల్లెపల్లి లక్ష్మయ్య, సీనియర్ జర్నలిస్ట్

గర్భిణులు, తల్లుల కోసం పెట్టిన ప్రధానమంత్రి మాతృ వందన యోజన ఊసే లేకుండా పోయింది. అన్నిటికన్నా ముఖ్యం అయినది.. మహిళల భద్రత, రక్షణ! ఇటీవలి కోల్‌కతా ఆర్.జి.కర్ ఆసుపత్రిలో యువ డాక్టర్ హత్యాచారం నేపథ్యంలో ఇకనైనా ప్రభుత్వాలు మహిళల భద్రత, రక్షణను యుద్ధప్రాతిపదికన తీసుకుంటాయని, కేంద్రప్రభుత్వం ఈ విషయాన్ని బడ్జెట్‌లో కేటాయింపుల రూపంలో చూపిస్తుందని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. ఈ ఏడు నిర్భయ ఫండ్ కింద కేటాయించింది కేవలం రూ. 30 కోట్లే! ఇది పెట్టిన తొలినాళ్లలో దీనికి వెయ్యి కోట్ల రూపాయలను కేటాయించిన ప్రభుత్వాలు.. అంతకంతకు పెరుగుతున్న నేరాల దృష్ట్యా ఈ నిధులను పెంచాల్సింది పోయి రెండంకెలకు కుదించడం మహిళల భద్రత, రక్షణ పట్ల వాటికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

నిజాయితీతో కూడిన మద్దతు అవసరం

మహిళలకు వంద శాతం నిధులు కేటాయించవలసిన 'కేటగిరీ–ఎ'లో 23.5 శాతం మంది మాత్రమే లబ్ధిదారులున్నారు. మెజారిటీ కేటాయింపులు మహిళా లబ్ధిదారులు తక్కువ ఉండే ఇతర పథకాలకు తరలుతున్నాయి. తక్షణ ఫలితాలనిచ్చే బాలికల విద్య, ఉన్నతికి కేటాయించిన నిధులు ఆయుష్మాన్ భారత్ వంటి దీర్ఘకాలిక పథకాలకు తరలిస్తున్న సందర్భాలున్నాయి. సిసలైన మహిళా సాధికారతకు, అభివృద్ధికి రాజకీయ ఉపన్యాసాలకన్నా నిజాయితీతో కూడిన రాజకీయ మద్దతు చాలా అవసరం.



– డా. సమున్నత, వైస్ ప్రిన్సిపల్ కామర్స్ కాలేజ్, ఉస్మానియా యూనివర్సిటీ

– సరస్వతి రమ

రషీద్ ఖాన్ ప్రపంచ రికార్డు... టి20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఘనత



పోర్ట్ ఎలిజబెత్: పురుషుల టి20 క్రికెట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. సౌతాఫ్రికా (ఎస్‌ఏ) 20 లీగ్ సందర్భంగా 26 ఏళ్ల రషీద్ ఈ ఘనత సాధించాడు. ఈ లీగ్‌లో ముంబై ఇండియన్స్ కేప్‌టౌన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రషీద్ పార్ల్ రాయల్స్‌తో జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. తద్వారా టి20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా వెస్టిండీస్ క్రికెటర్ డ్వేన్ బ్రావో (582 మ్యాచ్‌ల్లో 631 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును రషీద్ ఖాన్ (461 మ్యాచ్‌ల్లో 633 వికెట్లు) బద్దలు కొట్టాడు. 2015లో టి20ల్లో అరంగేట్రం చేసిన రషీద్ ఇప్పటి వరకు అఫ్గానిస్తాన్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఫ్రాంచైజీ లీగ్‌లలో కలిపి 18 జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 'ఇదో గొప్ప ఘనత. పదేళ్ల క్రితం ఆటలో అడుగు పెట్టినపుడు ఈ రికార్డు సాధించగలనని ఊహించలేదు. అఫ్గానిస్తాన్ నుంచి వచ్చి ఉన్నత శిఖరానికి చేరుకోవడం చాలా గర్వంగా ఉంది. టి20ల్లో మేటి బౌలర్ అయిన డ్వేన్ బ్రావో రికార్డును అధిగమించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా' అని రషీద్ వ్యాఖ్యానించాడు.

40 నుంచి 2వ ర్యాంక్‌కు...



- ఒకేసారి 38 స్థానాలు ఎగబాకిన అభిషేక్ శర్మ
- ఐసీసీ టి20 ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ 2వ స్థానంలో భారత ఓపెనర్

దుబాయ్: భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు దూసుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో చివరి టి20లో మెరుపు శతకంతో విజృంభించిన అభిషేక్... ఏకంగా 38 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఫోర్ల కంటే ఎక్కువ సిక్స్‌లు కొడుతూ రికార్డులు తిరగరాస్తున్న 24 ఏళ్ల అభిషేక్ బుధవారం ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 829 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా స్టార్ ట్రావిస్ హెడ్ (855 పాయింట్లు) 'టాప్'లో కొనసాగుతుండగా... హైదరాబాద్ బ్యాటర్ ఠాకూర్ తిలక్ వర్మ (803 పాయింట్లు) ఒక స్థానం కోల్పోయి మూడో ర్యాంక్‌లో నిలిచాడు. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (738 పాయింట్లు) ఐదో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మూడు స్థానాలు మెరుగు పరుచుకొని రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 14 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన వరుణ్ 705 రేటింగ్ పాయింట్లతో ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. వెస్టిండీస్ స్పిన్నర్ అకీల్ హొసైన్ (707 పాయింట్లు) అగ్రస్థానానికి చేరాడు. బౌలర్ల జాబితాలో భారత్ నుంచి రవి బిష్ణోయ్ (6వ ర్యాంక్), అర్ష్‌దీప్ సింగ్ (9వ ర్యాంక్) టాప్-10లో చోటు దక్కించుకున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణం



గాయత్రి



కాంస్య పతకాలతో తెలంగాణ ఆర్చరీ జట్టు

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఖాతాలో మూడో స్వర్ణ పతకం చేరింది. బుధవారం మహిళల కనోయ్ స్లాలోమ్ కే-1 విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాగిడి గాయత్రి పసిడి పతకం సాధించింది. అంతకుముందు వెయిట్‌లిఫ్టింగ్‌లో నీలంరాజు, పల్లవి బంగారు పతకాలు గెలిచిన సంగతి తెలిసిందే. బుధవారమే ఆర్చరీలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక రజతం, ఒక కాంస్యం లభించాయి. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో తిరుమూరు గణేశ్ మణిరత్నం-మాదాల సూర్య హంసిని జోడీ రజత పతకం గెలిచింది. ఫైనల్లో గణేశ్-సూర్య హంసిని ద్వయం 148-154 పాయింట్ల తేడాతో రిషభ్ యాదవ్-దీప్షిక (హరియాణా) జంట చేతిలో ఓడింది. కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో తిరుమూరు గణేశ్ మణిరత్నం కాంస్య పతకం సంపాదించాడు.

తెలంగాణకు కాంస్యం

మరోవైపు తెలంగాణ ఖాతాలో బుధవారం ఒక కాంస్య పతకం చేరింది. మహిళల ఆర్చరీ కాంపౌండ్ టీమ్ విభాగంలో చికిత, మానస నయన, శ్రేష్ఠ రెడ్డి, మన్నూరా హసీబాలతో కూడిన తెలంగాణ జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. తెలంగాణ జట్టు 232 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. బుధవారం పోటీలు ముగిశాక ఆంధ్రప్రదేశ్ 3 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో కలిపి 8 పతకాలతో 18వ స్థానంలో... తెలంగాణ 1 స్వర్ణం, 3 కాంస్యాలతో కలిపి 4 పతకాలతో 25వ స్థానంలో ఉన్నాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'చాంపియన్స్'కు సన్నాహం

టి20 సిరీస్‌లో ఇంగ్లండ్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు ఇప్పుడు వన్డే సమరానికి సిద్ధమైంది. సరిగ్గా ఆరు నెలల విరామం తర్వాత వన్డేల్లో బరిలోకి దిగుతున్న టీమిండియా రాబోయే చాంపియన్స్ ట్రోఫీకి ముందు సన్నాహకంగా ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను వాడుకోవాలని భావిస్తోంది. మరోవైపు ఒకరిద్దరు మినహా దాదాపు టి20 టీమ్‌తోనే వన్డే సిరీస్ కూడా ఆడనున్న బట్లర్ బృందం ఈ ఫార్మాట్‌లోనైనా రాణించి పరువు నిలబెట్టుకోవాలని కోరుకుంటోంది. తుది జట్టు ఎంపిక, వ్యూహాల విషయంలో ఈ మూడు మ్యాచ్‌లో రోహిత్ బృందానికి కీలకం కానున్నాయి.

నేడు భారత్, ఇంగ్లండ్ తొలి వన్డే

- మరో సిరీస్ విజయంపై టీమిండియా గురి
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

107 భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఇప్పటి వరకు 107 వన్డేలు జరిగాయి. 58 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గగా... 44 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచింది. 2 మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. 3 మ్యాచ్‌లు రద్దయ్యాయి.

52 స్వదేశంలో ఇంగ్లండ్‌తో భారత్ ఆడిన వన్డేలు. 34 మ్యాచ్‌ల్లో టీమిండియా, 17 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచాయి. 1 మ్యాచ్ 'టై' అయింది.

6 వీసీఏ స్టేడియంలో భారత్ ఆడిన వన్డేలు. ఇక్కడ 4 వన్డేల్లో నెగ్గిన టీమిండియా, 2 వన్డేల్లో ఓడిపోయింది. 2019 తర్వాత వీసీఏ స్టేడియంలో భారత్ వన్డే ఆడనుంది.

పిచ్, వాతావరణం

చక్కటి బ్యాటింగ్ వికెట్. అయితే పిచ్ స్పిన్‌కు అనుకూలిస్తుంది. వర్షసూచన ఏమాత్రం లేదు.



నాగ్‌పూర్: వన్డే వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శనతో ఫైనల్ చేరిన అనంతరం 6 మ్యాచ్‌లే ఆడిన భారత జట్టు దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ గెలిచి, ఆ తర్వాత శ్రీలంక చేతిలో ఓడింది. మన ఆటగాళ్లు ఈ ఫార్మాట్‌లో గత ఏడాది ఆగస్టు తర్వాత మళ్లీ మ్యాచ్ ఆడలేదు. ఇప్పుడు కొంత విరామం తర్వాత భారత్‌లోనే మన జట్టు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో తలపడనుంది. జమ్తాలోని విదర్భ క్రికెట్ సంఘం (వీసీఏ) మైదానంలో నేడు ఇరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగుతుంది. ఇటీవల టెస్టుల్లో ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొన్న కెప్టెన్ రోహిత్, కోహ్లి తమదైన శైలిలో చెలరేగేందుకు వన్డేలే సరైన వేదిక. టి20 ఫామ్‌ను కొనసాగిస్తూ ఇక్కడా జట్టు సిరీస్‌ను గెలుచుకుంటుందా అనేది ఆసక్తికరం.

షమీ, కుల్దీప్ ఫామ్ కీలకం...

టెస్టు, టి20 ఫార్మాట్‌లతో పోలిస్తే భారత వన్డే జట్టు కూర్పు చాలా కాలంగా గందరగోళం లేకుండా దాదాపు ఒకేలా ఉంది. ముఖ్యంగా టాప్-6 విషయంలో సందేహాలు లేవు. వరల్డ్ కప్ తరహాలోనే రోహిత్, గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, పాండ్యాలు వరుసగా ఆయా స్థానాల్లో ఆడతారు. వీరంతా కుడిచేతి వాటం బ్యాటర్లే. అయితే ఇప్పుడు కొత్త ప్రణాళికల్లో భాగంగా వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ స్థానంలో వైవిధ్యం కోసం పంత్‌ను తీసుకుంటారా అనేది చూడాలి. నాగ్‌పూర్ పిచ్‌ను బట్టి చూస్తే ముగ్గురు స్పిన్నర్లు ఆడవచ్చు. గాయం నుంచి కోలుకొని పునరాగమనం చేస్తున్న కుల్దీప్ ఆడటం ఖాయం. అతనికి తోడు జట్టుకు నాలుగు స్పిన్ ప్రత్యామ్నాయాలు జడేజా, అక్షర్, సుందర్, వరుణ్ చక్రవర్తి రూపంలో అందుబాటులో ఉన్నాయి. పేసర్లుగా షమీ, అర్ష్‌దీప్‌పై బాధ్యత ఉంది. తాజాగా ఇంగ్లండ్‌పై 2 టి20లు ఆడిన షమీకి వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత ఇదే తొలి వన్డే కానుంది. బుమ్రా గైర్హాజరీలో షమీపై అదనపు బాధ్యత కూడా ఉంది.

రూట్, బట్లర్ మినహా...

టి20ల్లో చిత్తయిన ఇంగ్లండ్‌పై తీవ్ర ఒత్తిడి ఉంది. కొంత కాలం క్రితం వరకు భీకరమైన లైనప్‌తో ఈ ఫార్మాట్‌ను శాసించిన ఆ జట్టు వరుస వైఫల్యాలతో తడబడుతోంది. వరల్డ్ కప్ తర్వాత టీమ్‌లో స్థానం కోల్పోయిన సీనియర్ జో రూట్‌ను మళ్లీ ఈ సిరీస్ కోసం ఎంపిక చేశారు. అతనితో పాటు కెప్టెన్ బట్లర్‌కు మాత్రం భారత్‌లో చెప్పుకోదగ్గ అనుభవం ఉంది. ఎక్కువ మంది టి20 స్పెషలిస్ట్‌లే ఉన్న జట్టు వన్డేల్లో ఏమాత్రం రాణించగలదనేది చూడాలి. మ్యాచ్‌కు ముందు రోజే ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది.

తుది జట్ల వివరాలు: **భారత్ (అంచనా):** రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా, సుందర్, కుల్దీప్, అర్ష్‌దీప్, షమీ.

ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్), డకెట్, సాల్ట్, రూట్, బ్రూక్, లివింగ్‌స్టోన్, బెతెల్, కార్స్, ఆర్చర్, రషీద్, సాఖిబ్.



రోహిత్ శర్మ




తెలుగు సినిమా పండగ రోజు

● 93 వసంతాల 'భక్త ప్రహ్లాద'

సమాజంపై అమితంగా ప్రభావితం చూపుతున్న మాధ్యమం సినిమా! అలాంటి తెలుగు సినిమాకు ఇవాళ పండగ రోజు. తొలి పూర్తి నిడివి తెలుగు చలనచిత్రం 'భక్త ప్రహ్లాద' ఇప్పటికి 93 ఏళ్ళ క్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైంది. ప్రముఖ దర్శకుడు హెచ్.ఎం. రెడ్డి దర్శకత్వంలో తయారై, 1932 ఫిబ్రవరి 6న రిలీజైన ఆ సినిమాతో పూర్తి నిడివి తెలుగు టాకీల నిర్మాణం శ్రీకారం చుట్టుకుంది. దాని వెనుక చాలా పెద్ద కథే ఉంది.

అంతకు ముందు దాకా భాషతో ప్రమేయం లేని మూగచిత్రాలు (మూకీలు) వచ్చేవి. 1931 మార్చి 14న తొలి భారతీయ టాకీ 'ఆలమ్ ఆరా' విడుదలతో క్రమంగా భాషల వారీగా వాక్చిత్రాలు (టాకీలు) రావడం మన దేశంలో మొదలైంది. 'ఆలమ్ ఆరా'కు దర్శకత్వ శాఖలో పని చేసిన హెచ్.ఎం. రెడ్డే ఆ తరువాత సరిగ్గా ఏడున్నర నెలలకు తొలి దక్షిణ భారతీయ భాషా టాకీ 'కాళిదాస్'ను రూపొందించారు. అదీ బొంబాయిలోనే, 'ఆలమ్ ఆరా' కోసం వేసిన సెట్స్‌ను ఉపయోగించుకుంటూ తీశారు! ఆ 'కాళిదాస్' కేవలం 4 రీళ్ళ లఘు చిత్రం.



నిజానికి, తెరపై తొలిసారిగా మన తెలుగు మాటలు, పాటలు వినిపించింది ఆ 'కాళిదాస్' సినిమాలోనే! తీరా పూర్తిగా తెలుగు డైలాగులతో తీసిన ఆ 'కాళిదాస్' చిత్రం నిడివి తక్కువైంది. దాంతో 'కాళిదాస్' ఫిల్ముకు ముందు 3 రీళ్ళ తమిళ దేశభక్తి గీతాలు – ప్రణయ గీతాలు – తెలుగు త్యాగరాయ కీర్తనల లఘుచిత్రం జోడించారు. అలాగే 'కాళిదాస్' ఫిల్మ్ తర్వాత 2 రీళ్ళ తమిళ కురత్తి (కురవంజి) డ్యాన్స్ లఘు చిత్రాన్ని కలిపారు. అలా మొత్తం మూడు చిన్న నిడివి చిత్రాలనూ కలిపి, ఒకే కదంబ కార్యక్రమ ప్రదర్శన (ప్రోగ్రామ్)గా 'కాళిదాస్' అనే టైటిల్‌తోనే రిలీజ్ చేశారు. అది 1931 అక్టోబర్ 31న మద్రాసులో విడుదలైంది. మద్రాస్ ప్రెసిడెన్సీలోని అన్ని భాషల వారినీ ఆకర్షించేందుకు దర్శక – నిర్మాతలు అప్పట్లో తెలివిగా ''తొలి తమిళ – తెలుగు టాకీ'' అంటూ 'కాళిదాస్'కు ప్రకటనలు జారీ చేశారు. అయితే, మొత్తం తెలుగు డైలాగుల 'కాళిదాస్' చిత్రాన్ని తెలుగువాళ్ళం వదిలేస్తే, అది తమ తొలి టాకీ అంటూ తమిళులు దాన్ని తమ చరిత్రలో కలిపేసుకోవడం విడ్డూరం. మరుగునపడ్డ ఈ వాస్తవాలన్నీ జర్నలిస్టు, పరిశోధకుడు రెంటాల జయదేవ కొన్నేళ్ళ పరిశ్రమతో, ఆ చిత్ర హీరోయిన్ ఇచ్చిన ఇంటర్వ్యూ, ఆ సినిమా సమీక్ష, పాటల పుస్తకం తదితర సాక్ష్యాలతో ఆ మధ్య నిరూపించారు.

అప్పట్లో 'కాళిదాస్' విజయవంతం కావడంతో, పూర్తి నిడివి తెలుగు చిత్రం తీయాలనే ఆలోచన వచ్చింది. అప్పుడు మళ్ళీ హెచ్.ఎం. రెడ్డి దర్శకత్వంలోనే ఏకంగా 10 రీళ్ళ తెలుగు టాకీగా 'భక్త ప్రహ్లాద' రూపొందింది. ఆ చిత్ర నిర్మాణం, సెన్సారింగ్, తొలి విడుదల కూడా బొంబాయిలోనే! 'భక్త ప్రహ్లాద' 1932 జనవరి 22న సెన్సార్ పూర్తి చేసుకొని, ఫిబ్రవరి 6న జనం ముందుకొచ్చింది. ఆ తొలి పూర్తి నిడివి తెలుగు టాకీ విడుదలై, నేటితో 93 ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ తేదీని కొన్నేళ్ళుగా 'తెలుగు సినిమా దినోత్సవం'గా చేస్తున్నారు.

మన 'భక్త ప్రహ్లాద' కేవలం 18 వేల రూపాయలతో, 18 రోజుల్లో నిర్మాణమైంది. ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటకం ఆధారంగా, సురభి నాటక సంస్థ నటీనటులతోనే ఎక్కువ వేషాలు వేయించి ఈ సినిమా తీశారు. హిరణ్యకశిపుడిగా మునిపల్లె సుబ్బయ్య, అతని భార్య లీలావతిగా 'సురభి' కమలాబాయి, వారి కుమారుడైన ప్రహ్లాదుడిగా మాస్టర్ కృష్ణారావు ముఖ్యపాత్రలు పోషించారు. తరువాతి కాలంలో సినీ దిగ్గజంగా ఎదిగిన ఎల్.వి. ప్రసాద్ మొద్దబ్బాయిగా నటించారు. బొంబాయిలోనే కృష్ణా సినిమా హాలులో ఈ 'భక్త ప్రహ్లాద' ముందుగా విడుదలైంది. అక్కడ రెండు వారాలు ఆడాక, అటుపైన తెలుగు నేల పైకొచ్చింది. విజయవాడ (శ్రీమారుతి హాలు), రాజమండ్రి (శ్రీకృష్ణా హాలు)ల్లో ప్రదర్శితమైంది. తర్వాత మద్రాసులో ఏప్రిల్ 2న విడుదలైంది.

అప్పటి దాకా నాటకాలు, మాటా పలుకూ లేని మూగ సినిమాలే అలవాటైన ప్రేక్షకులకు... తెరపై బొమ్మలు మాట్లాడడం, అదీ మన సొంత తెలుగు భాషలోనే ఆడడం, పాడడం పెద్ద విడ్డూరమైంది. దాంతో, 'కాళిదాస్', ఆ వెంటనే 'భక్త ప్రహ్లాద' టాకీల విడుదల సంచలనం సృష్టించింది. అలా మొదలైన మన తెలుగు సినిమా ప్రభ ఇవాళ దేశాల సరిహద్దుల్ని దాటి, అంతర్జాతీయంగా ఆస్కార్ అవార్డు అందుకొనే దాకా వెళ్లింది. ఇలా మన ఘన చరిత్ర అప్రతిహతంగా సాగడం అందరికీ గర్వకారణం.

మహేశ్ మూవీలో విలన్?

మహేశ్‌బాబు మూవీలో విలన్‌గా నటించనున్నారట ప్రియాంకా చోప్రా. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా ఓ కీలక పాత్రకు ఎంపికయ్యారనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇటీవల ప్రియాంకా చోప్రా హైదరాబాద్ రావడం, కొన్ని రోజులు ఇక్కడే ఉండటం వంటి అంశాలు ఈ మూవీలో ఆమె భాగమయ్యారనే విషయాన్ని పరోక్షంగా స్పష్టం చేస్తున్నట్లుగా ఉన్నాయి. కాగా ఈ మూవీలో ప్రియాంకా చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ ఆమె చేయనున్నది హీరోయిన్ రోల్ కాదని, నెగటివ్ షేడ్స్ ఉన్న విలన్ రోల్ చేయనున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక ఇటీవల మహేశ్-ప్రియాంక పాల్గొనగా హైదరాబాద్‌లో షూట్ జరిగింది. ఇది టెస్ట్ షూట్ అని, కాదు రెగ్యులర్ షూట్ అని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.



● ప్రియాంకా చోప్రా

ప్రేమకథ ప్రారంభం

మారిశెట్టి అఖిల్, భానుశ్రీ హీరో హీరోయిన్లుగా శ్రీధన్ దర్శకత్వంలో మారిశెట్టి శ్రీకాంత్ ఓ సినిమా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని నిర్మాత శ్రీకాంత్ సొంత గ్రామమైన లక్ష్మీపురంలోని రామాలయంలో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నట్టి కుమార్ క్లాప్ ఇచ్చి, మాట్లాడుతూ– ''అనకాపల్లి రాజకీయాల్లో మంచి పేరున్న శ్రీకాంత్‌గారు తన కుమారుడి ఆసక్తి గమనించి, సినిమా నిర్మించడం అభినందనీయం'' అన్నారు. ''అన్నపూర్ణ ఫిలిం యాక్టింగ్ స్కూల్‌లో నటనలో శిక్షణ తీసుకున్నాను'' అన్నారు మారిశెట్టి అఖిల్. ''ఈ చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు ఓ పాట, యాక్షన్ సీక్వెన్స్ చేస్తాం. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితర ప్రదేశాలలో షూటింగ్ చేస్తాం'' అన్నారు శ్రీకాంత్. ''హారర్, కామెడీ అంశాలున్న ప్రేమకథా చిత్రమిది'' అని తెలిపారు శ్రీధన్.



● మారిశెట్టి అఖిల్

నటుడిగా సంతృప్తినిచ్చింది

- అక్కినేని నాగచైతన్య



''తండేల్' అందమైన ప్రేమకథా చిత్రం. ఈ కథలో ఆ ప్రేమ వెనుకే మిగతా లేయర్స్ ఉంటాయి. నా కెరీర్‌లో కథ, నా పాత్ర పరంగానే కాదు... బడ్జెట్ పరంగా పెద్ద సినిమా ఇది. ఇప్పటికే మా యూనిట్ అంతా సినిమా చూశాం... విజయంపై చాలా నమ్మకంగా ఉన్నాం. ప్రత్యేకించి సెకండ్ హాఫ్, చివరి 30 నిమిషాలు, భావోద్వేగాలతో కూడిన క్లైమాక్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. నటుడిగా నాకు బాగా సంతృప్తి ఇచ్చిన చిత్రం 'తండేల్'' అని అక్కినేని నాగచైతన్య అన్నారు. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జంటగా అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన 'తండేల్' రేపు (శుక్రవారం) తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం నాగచైతన్య విలేకరులతో చెప్పిన విశేషాలు ఈ విధంగా...

- 'ధూత' వెబ్ సిరీస్ చేస్తున్నప్పుడు 'తండేల్' మూవీ లైన్‌ని విక్రమ్ కె. కుమార్‌గారు చెప్పారు. ఈ కథని వాసుగారు గీతా ఆర్ట్స్‌లో హోల్డ్ చేశారని తెలిసింది. ఈ కథని డెవలప్ చేసి, ఫైనల్ స్టోరీని చెప్పమని వాసుగారికి చెప్పాను. సినిమాటిక్ లాంగ్వేజ్‌లోకి మార్చిన 'తండేల్' కథ విన్నాక అద్భుతంగా అనిపించింది. నాకు ఎప్పటి నుంచో వాస్తవ ఘటనల ఆధారంగా సినిమా చేయాలని ఉండేది. పైగా ఇది మన తెలుగోళ్ల కథ కావడంతో రాజు పాత్ర చేయాలనే స్ఫూర్తి కలిగింది.
- 'తండేల్' అంటే లీడర్. ఇది గుజరాతీ పదం. ఈ సినిమాని దాదాపు సముద్రంలోనే చిత్రీకరించాం. రియల్ లొకేషన్స్‌లో షూట్ చేయడం నటనకి కూడా ప్లస్ అవుతుంది. జైలు సెట్‌లో చిత్రీకరించిన ఎపిసోడ్స్ చాలా భావోద్వేగంగా ఉంటాయి. రాజు పాత్రకి తగ్గట్టు నేను మారాలంటే మత్స్యకారుల జీవన శైలి తెలుసుకోవాలి. అందుకే శ్రీకాకుళం వెళ్లి వాళ్లతో కొద్ది రోజులు ఉండి... హోం వర్క్ చేశాక ఈ పాత్ర చేయగలననే నమ్మకం వచ్చాకే 'తండేల్' జర్నీ మొదలైంది. నటుడిగా తర్వాతి స్థాయికి వెళ్లే చాన్స్ ఈ సినిమాలో కనిపించింది. దాదాపు ఎనిమిది నెలలు స్క్రిప్ట్, నా ట్రాన్స్‌ఫర్మేషన్ మీదే ఉన్నాను. శ్రీకాకుళం యాసలో మాట్లాడటం సవాల్‌గా అనిపించింది.
- చందు, నా కాంబోలో 'తండేల్' మూడో సినిమా. నన్ను కొత్తగా చూపడానికి ప్రయత్నిస్తాడు. '100 పర్సెంట్ లవ్' మూవీ తర్వాత గీతా ఆర్ట్స్‌లో మళ్లీ సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటుంటే.. 'తండేల్'తో కుదిరింది. అరవింద్‌గారు, వాసుగారు సినిమాలు, ఎంచుకునే కథలు చాలా బాగుంటాయి.
- 'తండేల్' షూటింగ్ కోసం కేరళ వెళ్లినప్పుడు అక్కడి కోస్ట్ గార్డ్స్ కెమేరామేన్, కొందరు యూనిట్‌ని అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ఇలా కొన్ని సవాళ్లు ఎదురయ్యాయి. ఈ సినిమా చేస్తున్నప్పుడు అవార్డులు, రికార్డులు, వసూళ్ల గురించి ఆలోచించలేదు. ప్రేక్షకులను అలరించడమే నాకు ముఖ్యం. అయితే అరవింద్‌గారు మాత్రం 'తండేల్' రిలీజ్ తర్వాత నేషనల్ అవార్డ్స్‌కి పంపిస్తానని అన్నారు.

> సినిమా కోసం నా కాస్ట్యూమ్స్‌ని డిజైనర్స్ సెలక్ట్ చేస్తుంటారు. వ్యక్తిగత విషయానికొస్తే... ట్రిప్‌లకు వెళ్లినప్పుడు షాపింగ్ చేసి, నాకు నచ్చినవి కొనుక్కుంటాను. అలాగే ఆన్‌లైన్ షాపింగ్ చేస్తుంటాను. అయితే ప్రస్తుతం నా డ్రెస్‌లను నా భార్య శోభిత సెలెక్ట్ చేసి, నాకు సర్‌ప్రైజ్ ఇస్తోంది.

ఆ సినిమాల వల్ల 100 కోట్లు నష్టపోయా!

- సింగనమల రమేశ్‌బాబు

''ఈ రోజుల్లో ఏదైనా సినిమా నిర్మాణం అంటే... రాజమౌళి, శంకర్ సినిమా మూడేళ్లు... నాలుగేళ్లు పడుతుంటుంది. ఇటీవల 'పుష్ప 2: ది రూల్'ని మూడేళ్లు తీశారు. నేను తీసిన 'కొమరం పులి, ఖలేజా' సినిమాల టైమ్‌లో మూడేళ్లనేది లేదు. ఆర్నెల్లు లేదా తొమ్మిది నెలలు.. లేదంటే ఏడాది అంతే'' అని నిర్మాత సింగనమల రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఫైనాన్షియర్‌గా, నిర్మాతగా (మా అన్నయ్య, వీడే, కొమరం పులి, ఖలేజా) తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న సింగనమల రమేశ్‌బాబు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ– ''కొమరం పులి, ఖలేజా' సినిమాల వల్ల నాకు 100 కోట్లు నష్టం వచ్చింది. 'కొమరం పులి' టైమ్‌లో పవన్ కల్యాణ్‌గారు ప్రజారాజ్యం పార్టీలో ఉన్నారు. ఆలస్యానికి అదో కారణం.. అలాగే ఎన్నో కారణాలున్నాయి. అలానే 'ఖలేజా' ఆలస్యానికి కూడా పలు కారణాలున్నాయి. ఆ సినిమాలకు మూడేళ్లు పట్టింది. అన్నేళ్లు ఓ సినిమా అంటే అన్ని ఖర్చులూ పెరిగిపోతాయి '' అన్నారు. ఇంకా మాట్లాడుతూ – ''మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించి, 14 కోట్లు మోసం చేశానని నాపై కేసు పెట్టారు. 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశాను. అది తప్పుడు కేసు అని తేలడంతో న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చి, కేసు కొట్టివేసింది. ఇక ఫైనాన్షియర్‌గా, నిర్మాతగా చిత్ర పరిశ్రమలోనే కొనసాగుతా. కథే నా హీరో. త్వరలో ఓ ప్రాజెక్ట్ ప్రకటిస్తా. నా ఇద్దరు పిల్లలు హీరోలుగా చేశారు. ఇప్పుడు రైటింగ్, డైరెక్షన్ చేయాలనుకుంటున్నారు'' అని చెప్పారు.



సాక్షి బిజినెస్
గురువారం
6-2-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	313	78,271
నిఫ్టీ ▽	43	23,696

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	19,652	▽ 10
డోజోన్స్	44,686	△ 130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,623	△ 52
డాక్స్	21,586	△ 80
షాంఘై	3,229	▽ 21
నికాయ్	38,831	△ 33

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	84,657	△ 1647
బంగారం (99.5 స్వచ్ఛత)	84,318	△ 1640
వెండి (కిలో)	95,425	△ 1632

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.60	87.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.80	109.64
€	యూరో	ఎస్‌బీఐ	88.58	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.62	55.98
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.98	55.19
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.09	23.66
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.15	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.79

ఓలా ఈ–బైక్ 501 కిలోమీటర్లు

- రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ విడుదల
- ప్రారంభ ధర రూ.74,999
- వచ్చే ఏడాది రోడ్‌స్టర్ ప్రో రాక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓలా ఎలక్ట్రిక్ తాజాగా రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్‌తో మోటార్‌సైకిల్స్ విభాగంలోకి ప్రవేశించింది. రోడ్‌స్టర్ ఎక్స్, రోడ్‌స్టర్ ఎక్స్ ప్లస్ మోడళ్లను ఆవిష్కరించింది. ధర రూ.74,999 నుంచి ప్రారంభమై రూ.1,54,999 వరకు ఉంది. వాహనం పరుగెడుతున్నప్పుడు కూడా చార్జింగ్ అవుతుంది. ఐపీ67 రేటెడ్ బ్యాటరీ, స్మార్ట్ కనెక్టివిటీతో 4.3 అంగుళాల ఎల్‌సీడీ, ఫ్రంట్ డిస్క్ బ్రేక్, రివర్స్ మోడ్ వంటి ఏర్పాటు ఉంది. గరిష్ట పవర్ 7–11 కిలోవాట్ ఉంది.

నిర్వహణ వ్యయం రూ.500..

రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్‌లో వేరియంట్‌నుబట్టి 2.5–4.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 140–252 కిలోమీటర్లు పరిగెడుతుంది. గరిష్ట వేగం గంటకు 105–118 కిలోమీటర్లు. రోడ్‌స్టర్ ఎక్స్ ప్లస్ సిరీస్‌లో 4.5–9.1 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఏర్పాటు చేశారు. ఒకసారి చార్జింగ్‌తో 252–501 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 125 కిలోమీటర్లు. నెలవారీ నిర్వహణ వ్యయం పెట్రోల్ బైక్‌కు రూ.4,000 అయితే రోడ్‌స్టర్ ఎక్స్‌తో రూ.500 మాత్రమేనని ఓలా తెలిపింది. మార్చిలో డెలివరీలు ఉంటాయి.

మరో రెండు మోడల్స్..

రోడ్‌స్టర్, రోడ్‌స్టర్ ప్రో మోడల్స్‌లో సైతం కంపెనీ పలు వేరియంట్లను రూపొందిస్తోంది. రోడ్‌స్టర్‌లో 3.5-6 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఉంది. ఒకసారి చార్జింగ్‌తో 151–248 కి.మీ. ప్రయాణిస్తాయి. గరిష్ట వేగం గంటకు 116–126 కిలోమీటర్లు. ధర రూ.1,04,999 నుంచి రూ.1,39,999 వరకు ఉంది. అలాగే రోడ్‌స్టర్ ప్రో సిరీస్‌లో 8–16 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 316–579 కిలోమీటర్లు పరుగు తీస్తాయి. గరిష్ట వేగం గంటకు 154–194 కిలోమీటర్లు. ధర రూ.1,99,999 నుంచి రూ.2,49,999 వరకు ఉంది. డెలివరీలు 2026 జనవరి నుంచి మొదలవుతాయి.

జారుడు బల్లపై రూపాయి...

వాణిజ్యయుద్ధ భయాల ఎఫెక్ట్



ముంబై: అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధభయాల కారణంగా ఇన్వెస్టర్లు రిస్కులు తీసుకోవడానికి ఇష్టపడకపోతుండటంతో రూపాయి మారకం విలువపై మరింతగా ఒత్తిడి పెరుగుతోంది. దీంతో దేశీ కరెన్సీ రోజురోజుకూ కొత్త కనిష్టాలకు జారిపోతోంది. తాజాగా బుధవారం డాలరుతో పోలిస్తే మరో 36 పైసలు క్షీణించి ఇంకో రికార్డు కనిష్ట స్థాయి 87.43కి పడిపోయింది. ఒక దశలో 87.49 కనిష్ట స్థాయిని కూడా తాకింది. అమెరికా, చైనా టారిఫ్‌ల ప్రభావాలను ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తుండటంతో రూపాయిపై ప్రభావం పడుతోందని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. భారత్‌లో రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న అంచనాలు, విదేశీ మార్కెట్లలో డాలరు బలపడుతుండటం కూడా మదుపరుల సెంటిమెంటును దెబ్బతీస్తున్నాయని వివరించారు. ద్రవ్యోల్బణం నిర్దిష్ట స్థాయికి పరిమితం కావడంతో ఆర్‌బీఐ ఈసారి పాలసీ రేట్లను 0.25 శాతం తగ్గించవచ్చనే అంచనాలు ఉన్నాయి. మూడు రోజుల పాటు సాగే ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం బుధవారం ప్రారంభమైంది. ఫిబ్రవరి 7న విధాన నిర్ణయాలను ఎంపీసీ ప్రకటించనుంది.

అమెరికా డాలరు బలోపేతం అవుతుండటంవల్లే దానితో పోలిస్తే రూపాయి మారకం విలువ తగ్గుతోందని నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ విర్మాణీ తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ దేశం జపాన్ యువాన్‌తో కూడా రూపాయిని పోల్చి చూడాల్సిన అవసరం ఉందన్నారు. రూపాయిని నిర్దిష్ట స్థాయికి పరిమితం చేయడం ఆర్‌బీఐ విధానం కాదని, తీవ్ర స్థాయిలో ఒడిదుడుకులను కట్టడి చేసేందుకు మాత్రమే అవసరమైతే జోక్యం చేసుకుంటుందని వివరించారు.

ఓపెన్ ఏఐకి భారత్ కీలక మార్కెట్



ఆల్ట్‌మన్‌కి వైష్ణవ్ కౌంటర్..

చాట్‌జీపీటీలాంటి ఫౌండేషనల్ మోడల్‌ను రూపొందించే సామర్థ్యాల విషయంలో భారత్‌పై అసలు ఆశలే లేవంటూ రెండేళ్ల క్రితం పర్యటనలో వ్యాఖ్యానించిన ఆల్ట్‌మన్‌కి తాజాగా మంత్రి వైష్ణవ్ కౌంటర్ ఇచ్చారు. చంద్రుడి మీదకు అత్యంత చౌకగా చంద్రయాన్–3 మిషన్‌ను అమలు చేసిన భారత్‌కి.. అత్యంత తక్కువ ఖర్చులోనే ఏఐని కూడా రూపొందించే సామర్థ్యాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. సొంతంగా చిప్ సెట్లను తయారు చేసుకోవడం, అత్యంత చౌకగా కంప్యూటింగ్ సామర్థ్యాలను అందించడం నుంచి ప్రాంతీయ భాషలు, సంస్కృతులకు అనుగుణంగా మోడల్స్‌కి శిక్షణనిచ్చే డేటా సెట్లను రూపొందించే వరకు ఏఐ సంబంధిత పూర్తి వ్యవస్థను తీర్చిదిద్దడంపై భారత్ కసరత్తు చేస్తోందని తెలిపారు.

- భారత పర్యటనలో కంపెనీ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ వెల్లడి
- మంత్రులు, పరిశ్రమ దిగ్గజాలతో భేటీ

న్యూఢిల్లీ: కృత్రిమ మేధలో సంచలనం సృష్టించిన తమ చాట్‌జీపీటీకి భారత్ రెండో అతి పెద్ద మార్కెట్‌గా మారిందని ఓపెన్‌ఏఐ సంస్థ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. దేశీయంగా చాట్‌జీపీటీని ఉపయోగించే యూజర్ల సంఖ్య గతేడాది మూడు రెట్లు పెరిగినట్లు ఆయన చెప్పారు. ఏఐ విప్లవానికి సారథ్యం వహించే దేశాల్లో భారత్ కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఏఐ టెక్నాలజీ అభివృద్ధి వ్యయాలు ఏడాది తర్వాత దాదాపు పది రెట్లు తగ్గిపోయే అవకాశం ఉందని చెప్పారు. దేశీయంగా టెక్నాలజీ రంగం అసాధారణంగా పురోగమిస్తోందని తెలిపారు. భారత పర్యటనలో భాగంగా కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆల్ట్‌మన్ ఈ విషయాలు తెలిపారు. పేటీఎం వ్యవస్థాపక సీఈవో విజయ్ శేఖర్ శర్మ, స్నాప్‌డీల్ సహ వ్యవస్థాపకుడు కునాల్ బెహల్, అన్‌అకాడెమీ సీఈవో గౌరవ్ ముంజాల్ తదితర పరిశ్రమ దిగ్గజాలతో కూడా ఆయన సమావేశమయ్యారు. చాట్‌జీపీటీ, డీప్‌సీక్‌లాంటి కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను ఉపయోగించొద్దంటూ కేంద్ర ఆర్థిక శాఖ తమ అధికారులను ఆదేశించిన తరుణంలో ఆల్ట్‌మన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రభుత్వ కంప్యూటర్లలో 'ఏఐ' టూల్స్ వాడొద్దు

- ప్రభుత్వ ఉద్యోగులకు ఆదేశాలిచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ
- డేటా భద్రతకు ప్రాధాన్యం
- ఇప్పటికే ఇటలీ, ఆస్ట్రేలియా, తైవాన్ దేశాల్లో డీప్‌సీక్‌పై నిషేధం

సాక్షి, న్యూఢిల్లీ: సమాచార భద్రత విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్, అప్లికేషన్స్ వినియోగంపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. చాట్ జీపీటీ, డీప్‌సీక్ వంటి ఏఐ అప్లికేషన్ల వినియోగంతో ప్రభుత్వ సమాచారం లీక్ అయ్యే ప్రమాద నేపథ్యంలో చర్యలు తీసుకుంది. ప్రభుత్వ డేటాకు ప్రాధాన్యతనివ్వడంతో పాటు సైబర్ నేరాలను నిరోధించడమే లక్ష్యంగా... ప్రభుత్వ ఉద్యోగులు ఏఐ టూల్స్, అప్లికేషన్స్‌ను ప్రభుత్వ కంప్యూటర్లలలో ఉపయోగించడాన్ని నిషేధిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ ఒక అంతర్గత సర్క్యులర్ జారీ చేసింది. ప్రభుత్వ కంప్యూటర్‌లలో ఏఐ–ఎనేబుల్డ్ అప్లికేషన్‌లను ఉపయోగించడం వల్ల గోప్యమైన ప్రభుత్వ సమాచారం ప్రమాదంలో పడుతుందని పేర్కొంటూ ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్ కుమార్ సింగ్ ఉత్తర్వు జారీ చేశారు.



కాగా చాట్ జీపీటీ సహా అనేక ఏఐ మోడల్‌ల ద్వారా డేటా లీక్‌లు లేదా అనధికారిక యాక్సెస్ జరిగి డేటా దుర్వినియోగం జరుగుతుందని ఇప్పటికే చాలా ప్రైవేట్ కంపెనీలు, గ్లోబల్ ఆర్గనైజేషన్లు ఏఐ టూల్స్ వినియోగాన్ని పరిమితం చేశాయి. అంతేగాక చైనీస్ ఏఐ టూల్ డీప్‌సీక్‌ను ఇప్పటికే ఇటలీ, ఆస్ట్రేలియా, తైవాన్ దేశాలు నిషేధించాయి.

కన్జూమర్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ నష్టం 313 పాయింట్లు ● 23,700 దిగువకు నిఫ్టీ



ముంబై: ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో బుధవారం స్టాక్ సూచీలు దాదాపు అరశాతం నష్టపోయాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాల వెల్లడికి(రేపు)ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ ఆందోళనలు కొనసాగాయి. రూపాయి విలువ జీవితకాల కనిష్టానికి దిగిరావడం ఒత్తిడి పెంచింది. ఫలితంగా సెన్సెక్స్ 313 పాయింట్లు నష్టపోయి 78,271 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు పతనమై 23,696 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు..., కాసేపు లాభాల్లో ట్రేడయ్యాయి. తదుపరి నష్టాల్లోకి జారుకుని ఏ దశలో కోలుకోలేపోయాయి. సెన్సెక్స్ 368 పాయింట్లు క్షీణించి 78,216 వద్ద, నిఫ్టీ 60 పాయింట్లు కోల్పోయి 23,680 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. అయితే ఆయిల్‌అండ్‌గ్యాస్, సర్వీసెస్, మెటల్, ఇంధన, ఫార్మా షేర్లు రాణించాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.50%, అరశాతం చొప్పున పెరిగాయి.

- డిసెంబర్ క్వార్టర్ నికర లాభం 23% క్షీణతతో ఏషియన్ పెయింట్స్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. 3.5% నష్టపోయి రూ.2,276 వద్ద స్థిరపడింది.
- వినియోగ ప్రాధాన్యత బడ్జెట్ ప్రకటన తర్వాత ర్యాలీ చేసిన కన్జూమర్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. యూబీఎల్ 3%, యూనైటెడ్ స్పిరిట్స్, బ్లూస్టార్ 2.50% పతనమయ్యాయి.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
బంగారం డిమాండ్ @ రూ.5.15 లక్షల కోట్లు | భారత్‌కు లగ్జరీ బ్రాండ్స్ క్యూ

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్‌ఆర్‌ఆర్‌ఎల్, రాజస్థాన్‌లో 121 పోస్టులు

రాజస్థాన్‌లోని హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్(హెచ్‌ఆర్‌ఆర్‌ఎల్).. ఇంజనీర్, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 121.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(కెమికల్)–80, ఇంజనీర్(ఇన్‌స్ట్రుమెంటేషన్)–03, ఇంజనీర్(ఎలక్ట్రికల్)–03, ఆఫీసర్–ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్–01, సీనియర్ ఇంజనీర్(ప్రాసెస్)–18, సీనియర్ మేనేజర్ (టెక్నికల్ ప్లానింగ్)–01, సీనియర్ మేనేజర్ (సేఫ్టీ)–01, సీనియర్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్)–01, సీనియర్ మేనేజర్(మెకానికల్)–08, సీనియర్ మేనేజర్(ఇన్‌స్ట్రుమెంటేషన్)–03, సీనియర్ మేనేజర్(ఫైర్ అండ్ సేఫ్టీ)–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(కెమికల్, ప్లాస్టిక్, పాలిమర్), బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఈ, బీటెక్(ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (కెమికల్)కు 25 ఏళ్లు, సీనియర్ ఇంజనీర్ (ప్రాసెస్)కు 34 ఏళ్లు, ఇంజనీర్(ఇన్‌స్ట్రుమెంటేషన్), ఇంజనీర్(ఎలక్ట్రికల్), ఆఫీసర్–ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌కు 29ఏళ్లు,మిగతా పోస్టులకు 42 ఏళ్లు
» **వేతనం:** నెలకు జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(కెమికల్)కు రూ.30,000 నుంచి రూ.1,20,000, ఇంజనీర్(ఇన్‌స్ట్రుమెంటేషన్), ఇంజనీర్(ఎలక్ట్రికల్), ఆఫీసర్–ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000, సీనియర్ ఇంజనీర్(ప్రాసెస్)కు రూ.60,000 నుంచి రూ.1,80,000, మిగతా పోస్టులకు రూ.80,000 నుంచి రూ.2,20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**08.02.2025
» **వెబ్‌సైట్:** https://hrrl.in

ఏపీ, తెలంగాణలో ఎన్‌ఆర్‌డీఆర్‌ఎంలో 13,762 ఉద్యోగాలు

నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ రిక్రియేషన్ మిషన్, మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా.. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13,762.
» **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్ –6,881, తెలంగాణ–6,881.
» **ఖాళీల వివరాలు:** డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్–93, అకౌంట్ ఆఫీసర్–140, టెక్నికల్ అసిస్టెంట్–198, డేటా మేనేజర్–383, ఎంఐఎస్ మేనేజర్–626, ఎంఐఎస్ అసిస్టెంట్–930, మల్టీ టాస్కింగ్ అఫీషియల్–862, కంప్యూటర్ ఆపరేటర్–1290, ఫీల్డ్ కో ఆర్డినేటర్–1256, ఫెసిలిటేటర్స్–1103.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు 23 నుంచి 43 ఏళ్లు, అకౌంట్ ఆఫీసర్‌కు 22 నుంచి 43 ఏళ్లు, టెక్నికల్ అసిస్టెంట్, డేటా మేనేజర్, ఎంఐఎస్ మేనేజర్‌కు 21 నుంచి 43 ఏళ్లు, మిగతా పోస్టులకు 18 నుంచి 43 ఏళ్లు.
» **వేతనం:** నెలకు డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.36,760, అకౌంట్ ఆఫీసర్‌కు రూ.27,450, టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.30,750, డేటా మేనేజర్‌కు రూ.28,350, ఎంఐఎస్ మేనేజర్‌కు రూ.25,650, ఎంఐఎస్ అసిస్టెంట్‌కు రూ.24,650, ఫీల్డ్ కోఆర్డినేటర్‌కు రూ.23,250,ఫెసిలిటేటర్స్‌కు రూ.22,750
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.02.2025
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.02.2025
» **వెబ్‌సైట్:** https://nrdrm.com

అమెరికా వీసా ఎంత కఠినం!

» విదేశీ ఉద్యోగులు, విద్యార్థులకు ట్రంప్ టెన్షన్
» ఇప్పటికే హెచ్–1బి వీసాలపై కఠిన నిబంధనలు
» హెచ్–1బి కాల పరిమితి, సంఖ్య తగ్గింపు?
» ఎఫ్–1 వీసా విద్యార్థులపైనా ప్రభావం

అమెరికాలో విద్య, ఉద్యోగం.. ఎక్కువ మంది భారతీయ విద్యార్థుల స్వప్నం! ఇందుకోసం ఎలాగైనా అమెరికాలో అడుగుపెట్టాలని విశ్వ ప్రయత్నం చేస్తుంటారు. కానీ.. ఇప్పుడు వారి అమెరికా కలలు అంత సులభంగా సాకారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు! కారణం.. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికారంలోకి వచ్చిన దోనాల్డ్ ట్రంప్.. అమలు చేస్తున్న కఠిన వీసా విధానాలే!! అమెరికా ఫస్ట్ అనే నినాదంతో ఎన్నికల్లో గెలిచిన ట్రంప్.. విదేశీ విద్యార్థులు, ఉద్యోగార్థుల విషయంలో కఠిన నిబంధనల దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. అమెరికాలో మారుతున్న వీసా నిబంధనలు, తాజా పరిణామాలపై ప్రత్యేక కథనం..



హెచ్–1బిపై ఆంక్షలు

ట్రంప్ బాధ్యతలు చేపట్టాక హెచ్–1బి వీసాలపైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. హెచ్–1బి, ఇతర వర్క్ వీసాల నిబంధనలు కఠినతరం చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ప్రత్యక్షంగా,పరోక్షంగా దాదాపు మూడు లక్షల మంది విదేశీ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వారంతా తమ స్వదేశాలకు తిరిగి వెళ్లాల్సిందేనా అనే ఆందోళనతో కాలం గడుపుతున్నారు.

ఒక అభ్యర్థి.. ఒకే పిటిషన్

హెచ్–1బి వీసా అంటే.. అమెరికాలోని సంస్థల్లో ఉద్యోగం పొందిన విదేశీయులకు మంజూరు చేసే నాన్ ఇమిగ్రెంట్ వీసా! తమ సంస్థల్లో ఉద్యోగం ఖరారు చేసుకున్న అభ్యర్థుల తరపున.. సదరు సంస్థలు హెచ్1–బి వీసా పిటిషన్ దాఖలు చేస్తాయి. ఆ తర్వాత ఇమిగ్రేషన్ వర్గాలు అభ్యర్థులకు ఇస్తున్న జీతం, ఉద్యోగ విభాగం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా మంజూరుపై నిర్ణయం తీసుకుంటాయి. ఇంతకాలం పలువురు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ సంస్థల్లోని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం, ఉద్యోగాలకు ఎంపికవడం.. ఒకే అభ్యర్థి తరపున పలు కంపెనీలు హెచ్–1బి వీసా పిటిషన్ దాఖలు చేయడం జరుగుతోంది. తాజా ఉత్తర్వుల ప్రకారం–ఒక అభ్యర్థికి, ఒకే హెచ్–1బి వీసా పిటిషన్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు. దీంతో.. అవకాశాలు తగ్గనున్నాయి.

హెచ్–1బి దరఖాస్తుల్లో తగ్గుదల

ఒక అభ్యర్థికి ఒకటే హెచ్–1బి పిటిషన్ అనే నిబంధన నేపథ్యంలో.. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే హెచ్–1బి పిటిషన్ల సంఖ్యలో 38 శాతం మేరకు తగ్గుదల నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో 7,58,994 పిటిషన్లు దాఖలైతే.. ఈ ఏడాది ఆ సంఖ్య 4,79,953కు పడిపోవడమే ఇందుకు నిదర్శనం.

గడువు, సంఖ్య తగ్గింపు!

తాజాగా అమెరికాలోని సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ డైరెక్టర్ సూచనల ప్రకారం–హెచ్–1బి వీసాల పరిమితిని 85 వేల నుంచి 75 వేలకు తగ్గించాలి. అదే విధంగా వీసా కాల పరిమితిని రెండేళ్లకు కుదించాలి. ఆ తర్వాత మరో రెండేళ్లు మాత్రమే పొడిగించుకునే అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రస్తుతం హెచ్–1బి వీసా కాల పరిమితి తొలుత మూడేళ్లుగా.. ఆ తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకునే వీలుంది. అంటే.. మొత్తం ఆరేళ్లు అమెరికాలో ఉండి ఉద్యోగం చేసుకునే అవకాశం లభించేది. కానీ తాజాగా సెంటర్ ఫర్ ఇమిగ్రేషన్ స్టడీస్ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనలకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలిపితే.. భారతీయులకు మరింత శరాఘాతంగా మారే ఆస్కారముంది.

భారతీయులే అధికంగా

హెచ్–1బి వీసాలు పొందుతున్న వారిలో భారతీయులే అధికంగా ఉంటున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యలో .. 1,30,000 హెచ్–1బి వీసాలు మంజూరు కాగా, వీటిలో భారతీయులకు 24,766 లభించాయి. వాస్తవానికి ఏటా 65 వేల హెచ్–1బి వీసాలు, ఎల్–1 కేటగిరీలో మరో 20 వేల వర్క్ వీసాలను మంజూరు చేస్తారు. వీటిలో భారతీయుల వాటానే అధికంగా ఉంటోంది.

కనీస వేతనాలు పెంపు

హెచ్–1బి వీసాల విషయంలో.. మన దేశ అభ్యర్థులకు ప్రతిబంధకంగా మారబోతున్న మరో నిబంధన.. కనీస వేతనాలను రెట్టింపు చేయాలనే ప్రతిపాదన! ప్రస్తుతం అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ నిబంధనల ప్రకారం–నిపుణుల కొరత ఉన్న రంగాల్లో కనీస వేతనం 60 వేల డాలర్లుగా ఉంది. ఈ మొత్తాన్ని 1.2 లక్షల డాలర్లకు పెంచాలనే ఆలోచనతో ట్రంప్ సర్కార్ ఉన్నట్లు సమాచారం. దీంతో అంత భారీ మొత్తంలో వేతనాలిచ్చి విదేశీయులను నియమించుకునేందుకు అమెరికా సంస్థలు సుముఖంగా ఉండవని చెబుతున్నారు. ఇది మన దేశానికి చెందిన వారిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు. అమెరికాలో ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో నిపుణుల కొరత ఉంది. దీంతో అక్కడి కంపెనీలు విదేశీ అభ్యర్థుల వైపు చూస్తున్నాయి. కానీ.. తాజా నిబంధనలతో ఈ పరిస్థితి మారే ఆస్కారముంది.

ఓపీటీ పైనా ప్రభావం

అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసుకున్న తర్వాత హెచ్–1బి వీసా పొందేందుకు మార్గం.. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ). ఈ విధానంలో విద్యార్థులు తమ అకడమిక్ నైపుణ్యాలకు సరితూగే సంస్థల్లో 24 నెలల నుంచి 36 నెలల వరకు ప్రాక్టికల్ ట్రైనింగ్ పేరుతో ఉద్యోగం చేసుకోవచ్చు. ఆ సమయంలో యాజమాన్యం మెప్పు పొందితే.. హెచ్–1బి వీసా పిటిషన్ దాఖలు చేయించుకునే అవకాశం ఉంది. కానీ.. రానున్న రోజుల్లో ఇది మరింత కష్టంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎఫ్ 1 వీసా.. విద్యార్థులకు ఇబ్బందులు

ఎఫ్–1 వీసాతో అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులకు.. ట్రంప్ రాకతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వారానికి 20 గంటలు పార్ట్ టైమ్ జాబ్ చేసుకునే విషయంలో ట్రంప్ సర్కారు కఠినంగా వ్యవహరిస్తోంది. వాస్తవానికి అమెరికా నిబంధనల ప్రకారం –విదేశీ విద్యార్థులు వారానికి 20 గంటలు, సెమిస్టర్ సెలవుల వ్యవధిలో వారానికి 40 గంటలు ఆన్ క్యాంపస్ పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయొచ్చు. ఆన్ క్యాంపస్ పార్ట్ టైమ్ అంటే.. తాము చదువుతున్న ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లోనే ఉద్యోగం చేయడం. టీచింగ్ అసిస్టెంట్స్,రీసెర్చ్ అసిస్టెంట్స్, ల్యాబ్ అసిస్టెంట్స్ వంటి కొలువులు చేయొచ్చు.కానీ..అందరికీ ఈ ఉద్యోగాలు లభించకపోవడంతో..ఆఫ్ క్యాంపస్ పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. సూపర్ మార్కెట్స్, రెస్టారెంట్స్, ఫ్యూయల్ స్టేషన్స్ వంటి వాటిలో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ తమ నివాస ఖర్చులకు సరిపడే ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు.

కానీ..గత కొన్ని రోజులుగా ఆఫ్ క్యాంపస్ విధానంలో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్న వారి వివరాలను అమెరికా ఇమిగ్రేషన్ వర్గాలు సేకరిస్తున్నాయి. దీంతో.. పట్టుబడితే రూ.లక్షల ఫీజులు చెల్లించిన తమ చదువును మధ్యలోనే ఆపేసి.. స్వదేశానికి తిరిగి వెళ్లిపోవాల్సి వస్తుందనే ఆందోళనతో.. విద్యార్థులు పార్ట్‌టైమ్ కొలువులకు వెళ్లకుండా క్యాంపస్ లోనే ఉంటున్నారు. దీనివల్ల తమకు ఖర్చుల భారం పెరుగుతోందని.. ఇంటి నుంచి ఖర్చులకు డబ్బులు తెప్పించుకోవడానికి ఇబ్బందిగా ఉందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.

నిపుణుల కొరత

అమెరికాలో స్టెమ్ విభాగాల్లో నిపుణుల కొరత 30 శాతం మేర కనిపిస్తోంది. ఈ కారణంగానే అక్కడి సంస్థలు విదేశీయులను నియమించుకుంటున్నాయి. ట్రంప్ సర్కారు తాజా నిబంధనలతో పాటు ప్రతి ఏటా వీసా ఫీజు పెంచడం, కనీస వేతనం పెంపు వంటి ప్రతిపాదిత అంశాలు కంపెనీలకు భారంగా మారనుంది. వాస్తవానికి ట్రంప్ మొదటి పదవీ కాలంలో సైతం ఇలాంటి చర్యలకు ఉపక్రమించినప్పుడు అక్కడి టెక్ దిగ్గజాలైన గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి సంస్థల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఇప్పటికీ ఈ సంస్థలే అత్యధికంగా స్పాన్సర్ చేస్తూ విదేశీయుల్ని నియమించుకుంటున్నాయి. ఇక అమెరికాలో ఉన్న భారతీయ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, కాగ్నిజెంట్ వంటి కంపెనీలూ కూడా తక్కువ వేతనాలకే భారతీయ టెకీలను రిక్రూట్ చేసుకుంటున్నాయి.

ఔట్ సోర్సింగ్, ఆన్‌లైన్‌పై ఆశలు

ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న విధానాలు అమల్లోకి వస్తే.. భారతీయులకు మిగిలే ఆశ.. ఇక ఆన్‌లైన్ లేదా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలేనని చెబుతున్నారు! అమెరికాలో నైపుణ్యవంతులైన, ప్రతిభావంతులైన అభ్యర్థుల కొరత వెంటాడుతోంది. కాబట్టి అక్కడి సంస్థలు ఔట్ సోర్సింగ్ లేదా ఆన్‌లైన్ విధానంలో పని చేసే విధంగా విదేశీయులను నియమించుకునే అవకాశముందనే వాదన వినిపిస్తోంది.

ప్రత్యామ్నాయాలపై దృష్టి

ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల్లో విదేశీ విద్య, ఉద్యోగ అభ్యర్థులు అమెరికాకే పరిమితం కాకుండా.. ప్రత్యామ్నాయ గమ్యాలవైపు దృష్టి పెట్టడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు టెక్ గ్రాడ్యుయేట్స్‌కు యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలను ఉత్తమ ప్రత్యామ్నాయాలుగా పేర్కొంటున్నారు. ఈ దేశాలు కూడా స్థానికులకే ప్రాధాన్యం అనే విధానాలు అనుసరిస్తున్నాయి. అక్కడి అవకాశాలు, అనుసరిస్తున్న ఇమిగ్రేషన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటే.. వర్క్ వీసా, పోస్ట్ స్టడీ వర్క్ పరంగా అమెరికా కంటే కొంత సులభంగానే అవకాశాలు దక్కించుకోవచ్చు.

అమెరికా వీసా నిబంధనలు.. ముఖ్యాంశాలు

- హెచ్–1బి వీసా దరఖాస్తు పెంచే యోచన.
- ఒక అభ్యర్థికి ఒకటే పిటిషన్ దాఖలు చేసేలా నిర్ణయం.
- ఇప్పటికే 36 శాతం మేర తగ్గిన హెచ్–1బి పిటిషన్ల సంఖ్య.
- కనీస వేతనాన్ని 1.2 లక్షల డాలర్లకు పెంచే యోచన.
- అమెరికాలోని సంస్థలు సైతం ప్రతికూలత వ్యక్తం చేస్తున్న పరిస్థితి.
- ఎఫ్–1 వీసా విద్యార్థులు ఆఫ్ క్యాంపస్ కొలువులకు స్వస్తి.
- రూ.లక్షల్లో ఫీజులు, ఖర్చుల భారం తట్టుకోలేక ఇబ్బందులు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం । 6-2-2025



తుదిదశకు స్వర్ణ తాపడం పనులు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ విమానగోపురానికి చేపట్టిన స్వర్ణతాపడం పనులు పూర్తికావొచ్చాయి. ఈ నెల 23న కుంభాభిషేకం కార్యక్రమానికి దేవాదాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. దాతలు ఇచ్చిన సొమ్ముతోపాటు దేవస్థానం నిధులు రూ.21 కోట్లతో సుమారు 60 కిలోలకు పైగా బంగారంతో స్వర్ణతాపడం పనులు చేపట్టారు. సీసీ కెమెరాల నిఘాలో పనులు రాత్రింబవళ్లు జరుగుతున్నాయి. అయితే, భక్తుల మనోభావాలకు అనుగుణంగా క్షేత్ర ప్రాశస్త్యం పెంచే చర్యలు తీసుకోవడంతోపాటు భక్తులకు మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరముంది. ఆలయ ఉద్ఘాటన జరిగిన రెండు సంవత్సరాలు కావొస్తున్నా నిధుల లేమితో వసతుల పనులు ఇంకా పూర్తికాలేదు. మార్చిలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల నాటికి పెండింగ్ పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు.

- సాక్షి, యాదాద్రి

ఈ నెల 20 లోపు పనులు పూర్తి

23న కుంభాభిషేకానికి ఏర్పాట్లు

భక్తుల వసతులకు తలపెట్టిన పనులు మాత్రం అసంపూర్తిగానే

నిధుల రాక నిలిచిన పనులు... కొత్త ప్రతిపాదనలు సీఎం పేషీలో పెండింగ్

సీఎం సమీక్షించినా

యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. దేవస్థానంలో పనులు పూర్తి చేయడానికి నిధులు విడుదల చేయడం లేదు. ఇప్పటివరకు జరిగిన పనులకు చెల్లించాల్సిన బిల్లులు రూ.70 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నవంబర్ 8న యాదగిరిగుట్టకు వచ్చిన సీఎం.. అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు అధికారులు కొండ ప్రాశస్త్యం, భక్తుల వసతులకు పనుల ప్రతిపాదనలు పంపించారు. ప్రధానంగా కొండపైన రాత్రి నిద్ర చేయడానికి డార్మెటరీ హాల్, కల్యాణ మండపం, కళాభవన్, కల్యాణకట్ట, క్యూలైన్లలో మరిన్ని వసతుల కోసం పంపిన ప్రతిపాదనలకు సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది.



ఆలయ దివ్య విమాన గోపురానికి పరదాలు కట్టి స్వర్ణతాపడం పనులు చేస్తున్న దృశ్యం

అసంపూర్తిగా ఉన్న దేవస్థానం నిర్మిస్తున్న బస్టాండ్



ఇవీ చేపట్టిన పనులు

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల్లో ప్రధానమైనవి కొండపైన కృష్ణ శిలలతో ఆలయ గోపురాలు, మాడవీధులు, చుట్టూ ప్రాకారాలు, గర్భగుడి, ధ్వజస్తంభం, శివాలయం, క్యూలైన్లు, ప్రసాదాల వంటశాల, కొండపైన విష్ణుపుష్కరిణి, కొండకింద లక్ష్మీ పుష్కరిణి, స్వామి తెప్పోత్సవం కోసం గండి చెరువు, నిత్యాన్నదాన సత్రం, సత్యనారాయణస్వామి వ్రత మండపం, కొండపైన బస్‌బే, దీక్షాపరుల మండపం, గిరి ప్రదర్శన రింగ్‌రోడ్డు, పెద్దగుట్టపైన టెంపుల్ సిటీ, గుట్ట చుట్టూ రింగ్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, దేవస్థానం బస్టాండ్, ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టారు.

ఉపయోగంలోకి రాని అన్నదాన భవనం





నిధులు లేక మధ్యలోనే నిలిచిపోయిన మొదటి ఘాట్‌రోడ్డు ఫ్లైఓవర్

ఈ పనులు పూర్తికాలేదు

- బాలాలయం స్థానంలో రంగ మండపం (కళాభవన్) నిర్మించాలని నిర్ణయించారు. కల్యాణోత్సవాలు, భక్తుల రాత్రి నిద్ర చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపించొచ్చని భావించారు. పనులు ఇంకా ప్రారంభం కాలేదు.
- స్వచ్ఛంద సంస్థ వెగ్నేష్ రూ.11 కోట్లతో నిర్మించిన అన్నదాన సత్రం ఇంకా భక్తులకు అందుబాటులోకి రాలేదు. ఇది అందుబాటులోకి వస్తే రోజు సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించొచ్చు. ప్రస్తుతం దీక్షాపరుల మండపంలో భక్తులకు రోజు అన్నప్రసాదం అందిస్తున్నారు.
- దేవస్థానం బస్టాండ్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.
- కొండ పైన దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు కొండ కింద 122 దుకాణాల కోసం మడిగెలు నిర్మిస్తున్నారు. ఇందులో పుష్కరిణి వద్ద కొందరికి దుకాణాలు కేటాయించారు. మిగతావి ఇంకా పూర్తి కాలేదు.
- గోదావరి జలాలతో నింపిన గండి చెరువులో తెప్పోత్సవం పనులు పూర్తి కాలేదు. గ్రీనరీ, బెంచీలు ఏర్పాటు వరకే నిలిచిపోయాయి.
- కొండపైకి చేపట్టిన ఘాట్‌రోడ్డు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఒకే రోడ్డు ఉండడంతో వాహనాలకు ఇబ్బందిగా మారింది.
- పెద్దగుట్టపైన వైటీడీఏ అభివృద్ధి చేసిన టెంపుల్ సిటీలో దాతల సాయంతో నిర్మించతలపెట్టిన వసతిగదుల నిర్మాణం ప్రారంభం కాలేదు.

గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై నివేదికలు రూపొందించాలి



ఎస్టీ ప్రజాప్రతినిధుల సమావేశంలో మంత్రి సీతక్క ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై నివేదికలు రూపొందించాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం దామోదరం సంజీవయ్య సంక్షేమభవన్‌లో గిరిజన ప్రజాప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ఎస్టీ ప్రజాప్రతినిధులంతా ఐకమత్యంతో పనిచేయాలన్నారు. అధికారులు రూపొందించే నివేదికల ఆధారంగా బడ్జెట్‌లో పథకాలు ప్రవేశపెట్టేందుకు వీలుంటుందని చెప్పారు. గత పదేళ్లలో గిరిజనుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. పోడు సమస్యలను పట్టించుకోలేదని, ఐటీడీఏలను బలహీనపరిచారని తెలిపారు. ఇందిరజలప్రభ వంటి పథకాలకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. గిరిజన, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సీఎం సానుకూలంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలన్నీ సీఎంకు నివేదిస్తానని చెప్పారు. గురువారం సీఎంతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ ఎంపీ బలరాంనాయక్, విప్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రాందాస్‌నాయక్, ఆదినారాయణ, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోవాలక్ష్మి, అనిల్ జాదవ్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో నోటాను కల్పిత అభ్యర్థిగా పెట్టాలి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదినికి ఎఫ్‌జీజీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చాలా జిల్లాల్లో గ్రామాభివృద్ధి కమిటీలు సర్పంచ్ పోస్టులను వేలం వేస్తున్నాయని, ఈ నేపథ్యంలో నోటాను ఒక కల్పిత అభ్యర్థిగా నిలిపితే ఏకగ్రీవ ఎన్నికలకు స్థానం లేకుండా ఎన్నికలు జరపాల్సి ఉంటుందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదినికి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఈ మేరకు ఎస్‌ఈసీ కార్యాలయంలో రాణీకుముదినికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కార్యదర్శి సోమ శ్రీనివాసరెడ్డి, సభ్యుడు జిల్లెల గోవర్ధన్‌రెడ్డి వినతిపత్రం అందించారు. '2013లో పోలింగ్ శాతం పెంచడానికి సుప్రీంకోర్టు నోటాను ప్రవేశపెట్టింది. ఓటర్లకు పోటీలో ఉన్న అభ్యర్థులెవరు నచ్చకపోయినా కనీసం నోటాకు ఓటు వేయాలన్నది కోర్టు ఉద్దేశం. అయితే నోటాకు ఎన్ని ఓట్లు వచ్చినా అది ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపడం లేదు. దీనిపై మహారాష్ట్ర, హరియాణా, ఢిల్లీలో స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటాను ఒక ఎన్నికల కల్పిత అభ్యర్థిగా గుర్తించింది. దీంతో నోటాకు అధిక ఓట్లు వచ్చినా ఎన్నికలు తిరిగి జరిపించాల్సి ఉంటుంది' అని వినతిపత్రంలో పేర్కొన్నారు.

యూపీఎస్‌పై మార్చి 2న యుద్ధభేరి

టీఎస్‌సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



యుద్ధభేరి వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఏప్రిల్ నుంచి అమలు కానున్న యూనిఫైడ్ పెన్షన్ పథకం (యూపీఎస్) అమలుకు నిరసనగా.. మార్చి 2న యుద్ధభేరి నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం కేంద్ర కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు తమ ప్రధాన లక్ష్యమని, యూపీఎస్‌ను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గం, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేస్తున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ అభ్యర్థులు కొలిపాక వెంకటస్వామి, తిరుమలరెడ్డి ఇన్నారెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆగాఖాన్ మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ఆగాఖాన్ మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. కరీం అల్–హుస్సేనీ ఆగాఖాన్ మరణం మానవాళికి తీరని లోటు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆయన గొప్ప సామాజిక వేత్తగా, మానవతావాదిగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును అందుకున్నారని అన్నారు. ఆగాఖాన్ నెట్‌వర్క్ ద్వారా వివిధ దేశాల్లో ఆస్పత్రులు, విద్యా, సాంస్కృతిక సంస్థలను నెలకొల్పి మానవాళికి తన సేవలను అందించారని గుర్తు చేశారు. పేదరిక నిర్మూలన, వారసత్వ సంపద పరిరక్షణ, వైద్య సేవలు, విద్యా రంగంలో ఆయన అందించిన సేవలు మరచిపోలేనివని, హైదరాబాద్ కేంద్రంగా ఆగా ఖాన్ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో గొప్పవని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆగాఖాన్ వారసులు, కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆగాఖాన్ మృతి తీరని లోటు: ఈటల



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు, పద్మవిభూషణ్ గ్రహీత ఆగాఖాన్ మరణంపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సంతాపం తెలిపారు. ఇస్మాయిలీ ముస్లింల వారసుడు కరీం అల్హుస్సేనీ ఆగా ఖాన్ (IV) మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆగాఖాన్ ఫౌండేషన్ ద్వారా వివిధ దేశాల్లో ఆస్పత్రులు, విద్యాసంస్థలను ఏర్పాటుచేసి ఎంతోమందికి సేవలందించారని గుర్తు చేసుకున్నారు. ఆగాఖాన్ కుటుంబసభ్యులకు 'ఈటల' ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య



సాక్షి, హైదరాబాద్: ఎస్సీలను మూడు కేటగిరీలుగా విభజిస్తున్నట్టు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణలో ఏపీ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారో వెల్లడించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. షమీమ్‌అక్తర్ కమిటీతో సహా గతంలో ఏర్పాటైన కమిటీలన్నీ మాదిగలకు అన్యాయం జరిగినట్టుగానే నివేదిక ఇచ్చాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా తాజాగా ఎస్సీలను ఏ, బీ, సీ కేటగిరీలుగా వర్గీకరిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జనాభా ఆధారంగా మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, పార్టీ నేతలు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బొమ్మెర రామ్మూర్తితో కలిసి రాజయ్య తెలంగాణభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఎస్సీల్లో అభివృద్ధి చెందిన కులాలను కూడా అత్యంత వెనుకబడిన కులాల జాబితాలో చేర్చారన్నారు. బుడగ జంగాలను గ్రూప్ ఏ, నేతకాని సామాజికవర్గాన్ని గ్రూప్ సీలో చేర్చారని చెప్పారు. ఎస్సీ కులాల కేటగిరీల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హస్తం ఉందని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తదితరుల ఒత్తిడికి సీఎం రేవంత్ లొంగిపోయారన్నారు. ఎస్సీ వర్గీకరణలో సీఎం రేవంత్ మాలలకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాదిగలకు అనుకూలంగా లేరని, ఎస్సీ కులాల కేటగిరీలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని రాజయ్య కోరారు.

సంగారెడ్డిని మరో జవహర్‌నగర్‌గా మార్చొద్దు

మెదక్ ఎంపీ రఘునందన్ రావు



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లాను మరో జవహర్‌నగర్‌గా మార్చాలనే కుట్ర జరుగుతోందని బీజేపీ మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా హైదరాబాద్ నుంచి వేస్టేజ్ తీసుకొచ్చి అక్కడ శుద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. దీనికి సంబంధించి నల్లవెల్లి ఫారెస్ట్ మధ్యలో పనులు మొదలు పెట్టారని తెలిపారు. ఈ జిల్లాలో ఇప్పటికే రసాయన కంపెనీల వల్ల భూములు పాడై పోయాయన్నారు. దీని ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వమే భూమి ఇచ్చిందని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ పనులను వెంటనే ఆపకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతానని రఘునందన్‌రావు హెచ్చరించారు. చెత్తను శుద్ధి చేసేందుకు కొత్త కొత్త టెక్నాలజీలు వచ్చాయని, చిత్తశుద్ధి ఉంటే నూతన సాంకేతికతలను వాడాలని సూచించారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రఘునందన్‌రావు ధీమా వ్యక్తంచేశారు. ఎగ్జిట్ పోల్స్ కొన్నిసార్లు నిజం అయ్యాయి, కొన్నిసార్లు అబద్ధం అయ్యాయని ఒక ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

రూ.25వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్

మాజీ ఎంపీ వీహెచ్ సూచన



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీల తరహాలోనే బీసీలకు కూడా సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి రూ.25 వేల కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్వాతంత్య్రం వచ్చిన 76 ఏళ్ల తర్వాత బీసీలకు న్యాయం జరిగే రోజులు వచ్చాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశానికే దిక్సూచి లాంటిదని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు.. జనాభా ప్రకారం వాటాలు తేల్చే దిశలో ముందడుగు పడిందని తెలిపారు. ఎస్సీల వర్గీకరణ కూడా జరగడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యల విషయంలో పీసీసీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. దేశంలో కులగణన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరేనని ప్రశంసించారు.

మాదిగలకు న్యాయం జరిగే వరకు పోరాటం

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చినా సీఎం రేవంత్ ఉపకులాల నడుమ చిచ్చు రగిలించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమం అయినా అసెంబ్లీలో సీఎం చేసిన ప్రకటన ఎస్సీల్లో ఎదిగిన కులాలకే న్యాయం చేసేలా ఉందన్నారు. పార్టీ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి గువ్వల బాలరాజు బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఈనెల 7వ తేదీన తలపెట్టిన లక్ష డప్పులు, వేయి గొంతుకల కార్యక్రమాన్ని వాయిదా వేయించడంలో ప్రభుత్వం సఫలమైందన్నారు. మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ దక్కేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని బాలరాజు స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగిందంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంబురాలు చేసుకోవడంలో అర్థం లేదని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి మాదిగలకు వ్యతిరేకమేనన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన ఘనత మందకృష్ణకు దక్కుతుందని, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కూడా వర్గీకరణ కోసం చిత్తశుద్ధితో పనిచేశారని అన్నారు.

న్యాయబద్ధంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేసిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే న్యాయబద్ధంగా సాగిందని బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. గత ప్రభుత్వ మాదిరి శాస్త్రీయత లేకుండా సర్వే చేయలేదని, అన్ని నిబంధనలకు అనుగుణంగా సర్వే చేసి ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు సర్వే చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాదిరి నిర్దిష్ట పద్ధతుల్లో చేయలేకపోవడంతో న్యాయస్థానాల ముందు నిలవలేదన్నారు. బీసీ సామాజిక వర్గాలకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీకాంత్‌గౌడ్ వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం వర్గీకరణ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవడంపై హర్షం వ్యక్తంచేశారు.

అర్వపల్లి మండలం తిమ్మాపురంలో పొగాకు పంట



విస్తృతంగా పొగాకు సాగు

అర్వపల్లి మండలంలో 300 ఎకరాల్లో పంట

అర్వపల్లి: సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో కొందరు రైతులు పొగాకు పంట సాగుపై దృష్టి సారించారు. గతంలో ఒకరిద్దరు రైతులు సాగు చేయగా.. ప్రస్తుతం 50మందికి పైగానే ఈ పంటను సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులోని ఐటీసీ సంస్థ వారు రైతులకు నారు సరఫరా చేస్తున్నారు. రైతులు పంట పండించి ఆ కంపెనీకే దిగుబడిని విక్రయిస్తున్నారు. అర్వపల్లి మండలంలో సుమారు 300 ఎకరాల్లో పొగాకు పంట సాగవుతోంది. ఈ పంటకు కోతులు, అడవి పందుల బెడద లేదు.



ఆశలు రాలిన చోట కొత్త చిగురు

పంట రాని మామిడి చెట్లను కాండం వరకు కొట్టేసినా.. చిగురిస్తోంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రేగులచెలకలో ఏళ్ల క్రితం నాటిన మామిడి తోటలో చెట్లకు కాలం చెల్లింది. పంట రాకపోవడంతో రైతు చెట్లను కాండం వరకు కొట్టేసి అధికారుల సూచనలతో కొన్ని రసాయనాలు పూశాడు. దీంతో ఇటీవల మళ్లీ కాండం పక్క నుంచి కొత్తగా చిగుళ్లు వస్తుండడంతో.. రెండు, మూడేళ్ల తర్వాత పంట మొదలయ్యే అవకాశముందని ఆశిస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సాక్షి, ఖమ్మం

ఎన్నికల కోడ్ నుంచి వక్ఫ్ సంస్థలను మినహాయించండి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వక్ఫ్ బోర్డ్ లేఖ

సాక్షి, అమరావతి: ఎన్నికల కోడ్ నుంచి వక్ఫ్ సంస్థలను మినహాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వక్ఫ్ బోర్డ్ తరఫున లేఖ రాసినట్లు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వక్ఫ్ చట్టం, ప్రాపర్టీస్ లీజు రూల్స్‌లోని వక్ఫ్‌బోర్డ్ అధికారాల ప్రకారం వివిధ వక్ఫ్ సంస్థల ఆస్తులను మూడేళ్ల కాలానికి అత్యధిక టెండర్‌కు లీజుకు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్ వల్ల పలు చోట్ల వక్ఫ్ టెండర్ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. ఎన్నికల కోడ్ నుంచి వక్ఫ్ సంస్థలను సడలించి, టెండర్ ప్రక్రియ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరారు.



చిన్నారుల చేపల వేట..!

విశాఖలో నిన్నమొన్నటి వరకు ముందుకువచ్చిన సముద్రం. .ఒక్కసారిగా బుధవారం 50 మీటర్లకు పైగా వెనక్కు వెళ్లింది. ఒడ్డున రాళ్లు బయటపడటంతో చిన్నారులు రాళ్ల మధ్య ఉన్న నీటిలో చేపలు పట్టారు. కవర్లు, క్లాత్‌లతో చిన్న చిన్న చేపలను ఇలా వేటాడారు.



ఇనుములో ఓ హృదయం మొలిచెనే...

ఇనుములోనూ ఓ హృదయాన్ని సృష్టించారు తెనాలికి చెందిన శిల్ప కళాకారులైన తండ్రీకొడుకులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర. గుంటూరులోని ఏఎన్‌యూ ప్రాంగణంలో పాత ఇనుప ముక్కలతో వీరు తయారు చేసిన 'ఐ థింకింగ్' శిల్పం అక్కడికి వచ్చిన వారిని విశేషంగా కనువిందు చేస్తోంది.

మహిళల తోడ్పాటుకు నాబార్డుతో సెర్ప్ ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పొదుపు స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధులకు తోడ్పాటు అందించే కార్యక్రమాలపై బుధవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)– జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) పరస్పర అంగీకార ఒప్పందంపై సంతకాలు చేశాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనోపాధుల పెంపునకు సంబంధించి నాబార్డు ప్రస్తుతం ఎన్‌జీవోల సహాయంతో చేపడుతున్న కార్యక్రమాలను భవిష్యత్‌లో సెర్ప్ తోడ్పాటుతో కొనసాగిస్తుందని నాబార్డు ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్. గోపాల్ తెలిపారు. కాగా, చిన్న, సన్నకారు మహిళా రైతులకు పాలీ హౌస్ అంశంలో తగిన తోడ్పాటు అందించే అంశంలో ఖేతి టెక్ సంస్థతోనూ ఈ సందర్భంగా సెర్ప్ మరో ఒప్పందం చేసుకుంది.

ప్రేమ పరీక్షకు వేళాయే

- ఈ నెల 7 నుంచి లవ్ వీక్ సందడి ప్రారంభం
- రోజ్ డే తో మొదలై.. వాలంటైన్స్ డేతో ముగింపు
- వాలెంటైన్ వీక్ సంబరాల్లో మునిగి తేలుతున్న యువతరం
- ప్రేమ సాగరంలో విహరిస్తున్న లవ్ బర్డ్స్

మనసు ముసిముసిగా నవ్వితే..ఊహ ఉప్పొంగితే..గుండె ఆనందంతో గంతులేస్తే..ఆ సందడి పేరే ప్రేమ. చిరునవ్వుతో వరమిస్తావా.. చితి నుంచి నడిచొస్తాను.. మరు జన్మకు కరుణిస్తావా.. ఈ క్షణమే మరణిస్తానంటూ ప్రేమికుల మనసు పలికే మాటల్ని ఓ సినీ కవి అద్భుతంగా చెప్పారు. నిజమే.. ప్రేమిస్తే.. ప్రపంచమంతా మనసిచ్చిన మనిషిలోనే కనిపిస్తుంది. ప్రేమిస్తే..నీడ కూడా జంట హృదయం వెన్నంటే ఉంటుంది.

ఎందుకంటే.. అది ప్రేమంట అంటున్నారు ప్రేమికులు. అందుకే.. ప్రేమ పండుగను వారం రోజుల పాటు చేసుకునేలా వాలెంటైన్ వీక్ రానే వచ్చింది. గుప్పెడంత గుండెలో ఉప్పెనంత ఊహల్ని నింపేలా..అనిర్వచనీయమైన మధురానుభూతిగా చెప్పుకునే ప్రేమకు వారాల పండగ చేసుకునేందుకు కొత్తతరం లవ్‌బర్డ్స్ సిద్ధమవుతున్నారు. వారం పాటు ప్రేమానందాల్ని మూటకట్టి నచ్చిన మనసుల ముందు పెడితే..గుండె ఆనందంతో గంతులేస్తుంది..గొంతు సంబరంతో గోల చేస్తుంది.

మనసు ఊహల్లో తేలే మధుమాసపు పండగను తీసుకొచ్చిందని ప్రేమ పక్షులు వలపు గూటికి చేరుకొని ఊసులాడుకుంటున్నాయి. వాలెంటైన్స్ డే రోజునే ప్రేమికులు నిజమైన పండగలా చేసుకుంటారు. కానీ..ఆ పండగనూ వారం రోజుల పాటు విభిన్నతలతో వలపు హృదయాలు విహరించేలా చేసుకోవాలనే తపన ఉన్న వారికీ ఓ వీక్ ఉంది. ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజని అందరికీ తెలుసు. కానీ ఆ అసలైన పండగను వారం రోజుల పాటు జరుపుతారని కొంతమంది ప్రేమికులకే తెలుసు. ఎదలోతులో ఏ మూలనో దాగి ఉన్న ప్రేమను ఎదుటి వారికి చెప్పేందుకు ఒకటి కాదు.. ఏకంగా వారం పాటు ఒక్కో విధంగా వ్యక్తపరచవచ్చు. కానుకలు, పుష్పగుచ్ఛాలతో ఎదుటి వారి మనసుల్ని కొల్లగొట్టేందుకు ప్రేమికులు ఉవ్విళ్లూరుతుంటారు. ఆ కానుకల్ని ఒక్కో స్పెషల్ రోజున ఒక్కో విధంగా ఇస్తూ వారి ప్రేమను పొందేందుకు వచ్చిందే వాలెంటైన్ వీక్. ప్రేమికుల రోజు ముందు వారం రోజుల పాటు అంటే ఈ నెల 7 నుంచి వాలెంటైన్ వీక్‌ను ఎలా సెలబ్రేట్ చేసుకుంటారో చూద్దాం.

– సాక్షి, విశాఖపట్నం



రోజ్ డే (ఫిబ్రవరి 7)

ఎదుటి వారికి ప్రేమను వ్యక్తం చెయ్యాలంటే 90 శాతం మంది ఎంచుకునే ప్రధాన మార్గం గులాబీ. ఎర్ర గులాబీని ఇచ్చి కళ్లల్లోకి చూస్తూ ఐ లవ్ యూ చెబితే ఎదుటి వారి మనసు లోతుల్ని తాకుతుందంటారు. అందుకే ఈ వాలెంటైన్ వీక్ తొలి రోజుని రోజ్ డేగా పండగ చేసుకుంటారు. ఈ రోజున మొదటిసారిగా మీకు చాలా ఇష్టమైన వారితో కలవాలన్నా, పలకరించాలన్నా ఈ రోజ్‌డే రోజున మంచి గులాబీ ఇచ్చి ప్రపోజ్ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. విశాఖ నగరంలో చాలా మంది యువత బుధవారం రోజ్ డే సంబరాల్ని చేసుకున్నారు. వైజాగ్‌లోని రామాటాకీస్‌లోని ఓ ఫ్లోరిస్ట్ దుకాణంలో రోజుకి 200 నుంచి గులాబీలు అమ్ముడవుతుంటాయి. కానీ.. రోజ్ డే రోజు మాత్రం 1000 వరకూ గులాబీలు అమ్ముడు పోతాయని దుకాణ యజమాని రాజు తెలిపారు. ఇక దేశంలో ప్రతి రోజూ రూ.68.4 కోట్ల గులాబీ వ్యాపారం జరుగుతుంటుంది. వాలెంటైన్స్‌డే, రోజ్‌డే రోజు మాత్రం రూ.100 కోట్లకు చేరుకుంటుంది.



ప్రపోజ్ డే (ఫిబ్రవరి 8)

ప్రేమను వ్యక్తపరచాలంటే చాలా ధైర్యం కావాలి. ఆ ధైర్యం లేకపోవడం వల్లే చాలా మంది ప్రేమలు మనసు లోతుల నుంచి బయటకు వచ్చి పెదాల వద్దే నిలిచిపోతున్నాయి. ఆ రెండు మాటలు చెప్పేందుకు తటపటాయించే ప్రేమికులకు ఈ ప్రపోజ్ డే కొత్త ఉత్సాహాన్నిస్తుంది. నచ్చిన వ్యక్తిని తనకు నచ్చిన ప్రాంతానికి తీసుకెళ్లి చిన్న బహుమతి ఇచ్చి ప్రేమను వ్యక్తీకరిస్తే చాలు మనసులు పెనవేసుకునే మధుమాసం వచ్చేస్తుంది. అందుకే ఈ రోజుకి చాలా ప్రాముఖ్యమిస్తుంటారు.



చాక్లెట్ డే (ఫిబ్రవరి 9)

చాక్లెట్ అంటే ఇష్టంలేని వారు ఎవరుంటారు. అమ్మాయిలకు చాక్లెట్ ఇస్తే చాలు ప్రపంచాన్ని తమ చేతిలో పెట్టినట్లుగా ఎగిరి గంతేస్తారు. అందుకే చాలా మంది ప్రేమికులు తన ప్రేయసికి ప్రపోజ్ చెయ్యాలంటే ఓ ఎర్రగులాబీతో పాటు చాక్లెట్ ఇస్తుంటారు. అలాంటి వారికోసం ఈ చాక్లెట్ డే. ప్రేమ ఓకే అయితే ఓ తియ్యని వేడుక చేసుకుందాం.. మన ప్రేమకు ఇదో తీపి గుర్తుగా భావిద్దాం.. అంటూ చిన్న భావుకవితను చెబుతూ చాక్లెట్ ఇచ్చి ప్రపోజ్ చేస్తే సరి.. ఆ సంబరమంతా జీవితాంతం తీపి గురుతుగా ఉండిపోతుంది. సాధారణంగా దేశంలో ప్రతి రోజూ 3.87 లక్షల కిలోల చాక్లెట్లు అమ్ముడుపోతుంటాయి. చాక్లెట్‌డే రోజున మాత్రం 5 లక్షల కిలోల అమ్మకాలు పక్కా అని మార్కెట్‌దారులు అంచనా వేస్తున్నారు.



టెడ్డీ డే (ఫిబ్రవరి 10)

ముద్దు ముద్దుగా ఉండే టెడ్డీ బేర్‌ను చూసి ఇష్టపడని వారంటూ ఉండరు. మనసుకు హత్తుకునేలా ఉండే టెడ్డీలను ఇష్టపడే ప్రేయసి ఉంటే ఈ రోజున ఓ బొమ్మను బహుమతిగా ఇచ్చి ఆనందపరచండి. నచ్చిన రంగుని ఎంపిక చేసి మరీ కొంటే వారు పొందే ఆనందం వెలకట్టలేనిది. అర చేతిలో పట్టే టెడ్డీ నుంచి ఆరడుగులుంటే టెడ్డీ బేర్ వరకూ మార్కెట్లో వివిధ సైజుల్లో లభిస్తున్నాయి. జగదాంబా సెంటర్‌లోని దావూద్ టెడ్డీబేర్ దుకాణంలో గతేడాది ఇదే రోజున సుమారు 250 బొమ్మలు అమ్ముడు పోయాయంట. ఇక నగరం మొత్తం చూస్తే ఈరోజున ఎన్ని టెడ్డీబేర్‌లు ప్రేమికుల గుండెలపై వాలిపోతాయో అర్థం చేసుకోవచ్చు. దేశంలో సగటున ప్రతి రోజూ సగటున రూ.14.67 కోట్ల సాఫ్ట్‌టాయ్స్ వ్యాపారం జరుగుతుంది. టెడ్డీడే, వాలెంటైన్స్‌డే రోజున మాత్రం ఏకంగా రూ.25 లక్షలకు పైగా విక్రయాలు జరుగుతుంటాయని సాఫ్ట్‌టాయ్స్ కంపెనీలు చెబుతున్నాయి.



ప్రామిస్ డే (ఫిబ్రవరి 11)

రెండు హృదయాల మధ్య చిగురించిన ప్రేమకు నమ్మకం పునాది. చిలిపి ఉదాహరణగా చెప్పుకుంటే రెండు బిస్కెట్లను క్రీమ్ అంటిపెట్టుకొని ఉంటేనే క్రీమ్ బిస్కట్ అన్నట్లుగానే రెండు మనసుల్ని జీవితాంతం కలిపి ఉంచేది నమ్మకమే. అలాంటి నమ్మకాన్ని ఎదుటివారిలో కలిగించడానికి ఈ రోజు గొప్పదనే చెప్పుకోవాలి. నచ్చిన వ్యక్తికి దగ్గర కావడానికి, వారిలో తనపై ఉన్న ప్రేమను కలకాలం ఉంచేందుకు వాగ్దానాలు చేస్తుంటారు. ప్రేయసి మీద మీకున్న ప్రేమను ఈ రోజున వాగ్దానం చేసి తెలిపితే.. ఎదుటి వారు మీకు మరింత చేరువవుతారు.



హగ్ డే (ఫిబ్రవరి 12)

ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలు, కష్ట సుఖాలకు చిహ్నం హగ్. ఒక కౌగిలి.. కష్టాల్లో ఉన్న ఎదుటి మనసుకు సాంత్వననిస్తుంది. బాధలను దూరం చేస్తుంది. ఒత్తిడిని తగ్గించేస్తుంది. అందుకే ఈ కౌగిలింత మంత్రాన్నే యువతరం ప్రేమ మంత్రంగా పాటిస్తున్నారు. చిన్న కౌగిలింతతో వలచిన మనసు పరవశంలో ముంచేస్తూ మెప్పించేస్తున్నారు. ప్రశాంతతను కలిగించేలా ప్రేమికుడికి, ప్రేయసికి ఒక హగ్ ఇస్తే చాలు.. అందులోనే మన ప్రేమలోతుల్ని అన్వేషించగలరు. 10 నిమిషాల పాటు హగ్ చేసుకుంటే హైబీపీ కూడా అదుపులోకి వచ్చేస్తుందంట. ఆనందం కలిగినప్పుడు ఎలానో.. హగ్ చేసుకున్నప్పుడు కూడా ఆక్సిటోసిన్ అనే రసాయనం విడుదలై మనసుకి సంతోషాన్ని కలిగిస్తుంటుంది. ఒక సమస్యలో ఉన్న లవర్‌కు రోజుకు 8 హగ్‌లు ఇస్తే చాలంట. రోజుకు 12 సార్లు హగ్ చేసుకుంటే..లైఫ్ సాఫీగా సాగిపోతుందంటూ అధ్యయనాలు ప్రేమ పాఠాలు చెబుతున్నాయండోయ్. అందుకే..ఈ రోజున ఒక హగ్‌తో మీరెంతగా ప్రేమిస్తున్నారో చెప్పేసుకోవచ్చు.



కిస్ డే (ఫిబ్రవరి 13)

వేయి మాటలు చెప్పలేని ఓ భావాన్ని చిన్న ముద్దు చెబుతుంది. ఎదుటివారి మీద అంతులేని ప్రేమ ఉన్నా చెప్పలేని వారు చాలా మంది ఉంటారు. అలాంటి వారు ఓ తియ్యని ముద్దుతో తన ప్రేమను వ్యక్తపరిచే రోజు ఇది. అందుకే కిస్ డే రోజున మీ భాగస్వామికి జీవితాంతం గుర్తుండిపోయేలా ఓ ముద్దు ఇస్తే చాలు.. మీ ప్రేమ అలా.. నిలబడిపోతుంది. అన్నట్లు ముద్దు కూడా ఒక దివ్యౌషధమేనంట. ముద్దు పెట్టుకోవడం వల్ల మీ శరీరంలో ఎపినెర్ఫిన్ విడుదలై రక్తనాళాలు వెడల్పుగా మారి రక్త ప్రసరణ సజావుగా సాగేందుకు దోహదపడి మానసిక విశ్రాంతిని అందిస్తుంది. గుండె రేటుని పెంచడం వల్ల శరీరంలోని అన్ని భాగాలకు రక్తప్రవాహం సక్రమంగా సాగుతుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు నచ్చిన వ్యక్తికి ముద్దు పెడితే.. రక్తపోటు తగ్గుతుంది. ముద్దు వల్ల రెండు మనసుల మధ్య ప్రేమ బదిలీ అవ్వడమే కాదు.. బ్యాక్టీరియా కూడా బదిలీ అవుతుంది. ఈ బ్యాక్టీరియా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇద్దరు వ్యక్తులు చుంబించుకునే సమయంలో ఉత్పత్తయ్యే సెరోటోనిన్ డోపమైన్, ఆక్సిటోసిన్ వంటి సంతోష రసాయనాలు..ఆ ఇద్దరి వ్యక్తుల మధ్య సంబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

వాలెంటైన్ డే (ఫిబ్రవరి 14)



ఇక చివరి రోజైన వాలెంటైన్ డే గురించి అందరికీ తెలిసిందే. ఎన్నో కొత్త రకాల ప్లాన్లతో మనసులు ఉరకలేస్తుంటాయి. తన భాగస్వామి ఊహించని రీతిలో బహుమతి అందించాలని, సమ్‌థింగ్ స్పెషల్‌గా ప్రేమను వ్యక్తం చేయాలని ఉవ్విళ్లూరుతుంటారు. నచ్చిన స్టైల్‌లో.. ఎదుటి వారి మనసు దోచేలా ప్రేమను వ్యక్తం చేయండి. ఇందుకోసం విశాఖలో ప్రధాన హోటల్స్ అన్నీ ఇప్పటికే ప్రత్యేక ప్యాకేజీలనూ ప్రకటిస్తున్నాయ్. చుట్టూ గులాబీ పూల మధ్య క్యాండిల్ లైట్ డిన్నర్‌లు, సైలెంట్ మ్యూజిక్‌తో మైమరపించేలా ఏర్పాట్లకు సిద్ధమవుతున్నాయి. హ్యాపీ వాలెంటైన్స్ వీక్!!

హ్యాపీ వాలెంటైన్స్ వీక్!!

8 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఎనిమిది నెలల్లోనే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ నెల 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో నిర్వహించిన పార్టీ 27వ రాష్ట్ర మహాసభ నిర్ణయాలను విజయవాడలో బుధవారం విలేకరులకు ఆయన వెల్లడించారు. ప్రజలకు ఎన్నికల్లో హామీలు ఇచ్చిన విధంగా వారి ఆదాయాలు పెంచేందుకు చర్యలు తీసుకోలేదని పేర్కొన్న ఆయన, పైగా వారిపై అదనపు భారాలు మోపుతున్నారన్నారు. ప్రజా సమస్యలపై కలిసొచ్చే లౌకిక ప్రజాతంత్ర శక్తులతో విస్తృత స్థాయిలో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని రాష్ట్ర మహాసభలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు,బాబూరావు పాల్గొన్నారు.

లోపాలను సరిచేయడమే లక్ష్యంగా రీసర్వే

సీసీఎల్‌ఏ జయలక్ష్మి పిలుపు

సాక్షి, అమరావతి/ఏఎన్‌యూ: లోపాలను సరిచేసి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా, వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన రెవిన్యూ రికార్డుల రూపకల్పనకు కృషి చేయాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) జీ జయలక్ష్మి డిప్యూటీ తహసీల్దార్లకు పిలుపునిచ్చారు. గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ల శిక్షణ, సమీక్ష కార్యక్రమానికి విచ్చేసిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ, చట్ట పరిధికి లోబడి సహజ న్యాయ సూత్రాలను అన్వయిస్తూ రీ సర్వేను పూర్తి చేయాలన్నారు. ఇచ్చే ఉత్తర్వులలో స్పష్టత అవసరమన్నారు. తప్పులు చేసే వారిపై కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. రెవిన్యూ సదస్సులలో 2.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయని, యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసి భవిష్యత్తులో ఈ సమస్యలు ఎదురు కాకుండా చూడాలని సర్వే సెటిల్మెంట్, భూ రికార్డుల సంచాలకులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 550 మంది రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్న ఈ సమావేశంలో సర్వే సెటిల్మెంట్, భూ రికార్డుల అదనపు సంచాలకులు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న ప్రధాన కమిషనర్ జయలక్ష్మి

తులసిబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 7కి వాయిదా



సాక్షి, అమరావతి: అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టయి.. బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కామేపల్లి తులసిబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. తులసిబాబును మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోరిన నేపథ్యంలో ఆ పిటిషన్ పురోగతికి సంబంధించిన వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా నందిగామ మునిసిపాలిటీ చైర్‌పర్సన్ పదవిని భర్తీ చేయకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత బుధవారం తీర్పునిచ్చారు. ఖాళీగా ఉన్న 7, 11 వార్డులకు ముందు ఎన్నికలు నిర్వహించకుండా మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించడం సరికాదంటూ నాదెండ్ల హారిక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ సుజాత.. పిటిషనర్‌కు ఈ వ్యాజ్యం దాఖలు చేసే అర్హత లేదని తేల్చి చెప్పారు.

పాలకొండ చైర్‌పర్సన్ ఎన్నికపై పిటిషన్ తిరస్కృతి

అలాగే, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక నిమిత్తం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సైతం హైకోర్టు తోసిపుచ్చింది. ఖాళీగా ఉన్న 19 వార్డుకు ముందు ఎన్నిక నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ స్వర్ణకుమారి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల

సాక్షి, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీ బోర్డును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ చైర్మన్‌గా మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, వైస్ చైర్మన్‌గా మునిరత్నం, డైరెక్టర్లుగా రెడ్డి అప్పలనాయుడు, సురేష్‌రెడ్డి, నాగరాజు నియమితులయ్యారు. రవాణా, ఆర్థిక, జీఏడీ, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఆర్టీసీ ఎండీ, తదితరులు బోర్డు సభ్యులుగా వ్యవహరిస్తారు.



మాఘ మాసం ఎంతో పవిత్రమైన మాసం. ఈ మాసంలో చేసే స్నానం, పర్వదినాలకు ప్రముఖ స్థానం ఉంది. మాఘ మాసం శుక్ల పక్షం ఏకాదశి అతి పవిత్రమయినది. ఈరోజునే భీష్మ ఏకాదశిగా అంతర్వేది ఏకాదశిగా ఎంతో పవిత్రంగా జరుపుకుంటారు.

● పండుగ- పర్వం

పవిత్రం... ఫలప్రదం

భీష్మ ఏకాదశి

కురుక్షేత్ర యుద్ధ సమయంలో నిలువెల్లా గాయపడిన భీష్ముడు అంపశయ్య మీద ఉన్న సమయంలో ధర్మరాజుకి విష్ణు సహస్రనామాన్ని బోధించిన అనంతరం స్వచ్ఛంద మరణమనే వరం తో విష్ణుసాయుజ్యాన్ని పొందుతాడు భీష్ముడు. ఆయన భక్తికి మెచ్చిన కృష్ణపరమాత్మ అష్టమి మొదలుకొని ద్వాదశి వరకు గల ఐదు రోజులూ భీష్మపంచకంగా ప్రసిద్ధికెక్కుతాయనీ, ముఖ్యంగా భీష్ముని మరణానంతరం వచ్చిన ఏకాదశి భీష్మ ఏకాదశిగా... పరమ పవిత్రమైన రోజుగా ప్రసిద్ధికెక్కుతుందని వరమిచ్చాడు. ఈ భీష్మ ఏకాదశికే జయ ఏకాదశి అని కూడా పేరు. ఎందుకంటే ఈ రోజు ఏ కార్యం తలపెట్టినా అది ఖచ్చితంగా విజయవంతం అవుతుందని నమ్మకం. ఈరోజున శ్రీ మహావిష్ణువును భీష్ముడు బోధించిన విష్ణు సహస్ర నామాలతో పూజించిన పాండవులు కురుక్షేత్ర యుద్ధంలో విజయం సాధించారని ప్రతీతి.. అటువంటి విష్ణు సహస్రనామ పారాయణం ఎంతో విశిష్టమైంది. ఇక ఈ భీష్మ ఏకాదశినాడు విష్ణు సహస్రనామం పఠిస్తే అనేక శుభాలు కలుగుతాయి. ఈ రోజున శ్రీ మహావిష్ణువుని పూజించిన వారికి స్వర్గ లోక ప్రాప్తి కలుగుతుందని పెద్దల విశ్వాసం.

తండ్రికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం జీవితాంతం బ్రహ్మచారిగా ఉన్న భీష్ముడికి ఈ పర్వదినాన తర్పణ వదిలితే సంతానప్రాప్తి కలుగుతుందని, సంతానం ఉన్న వారి పిల్లలకు సద్బుద్ధులు కలుగుతాయని విశ్వాసం.

భీష్ముడు ప్రవచించిన 'విష్ణుసహస్రనామ స్తోత్రం' ఇప్పటికీ జనుల నోట నర్తిస్తూనే వుంది.



ఆయన దివ్యవాణి విశ్వవ్యాప్తమై ప్రతిధ్వనిస్తూనే వుంది. విష్ణుసహస్రనామ పఠనం సర్వదుఃఖహరం, సకల శుభకరం. ఆ నామావళిలోని ప్రతి అక్షరము దైవస్వరూపమే. ప్రతినామమూ మహామంత్రమే. అది అజరామరం.

భీష్మ ఏకాదశిన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారికి కళ్యాణం, అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో, సింహాచలం నరసింహ స్వామి ఆలయంలో, యాదగిరి గుట్ట, భద్రాచాలం సీతారాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ రోజు చేసే ఉపవాసం అత్యంత ఫలదాయకమై, ఈ రోజున తలపెట్టిన కార్యక్రమాలు జయప్రదం అవుతాయనీ పెద్దలు చెబుతారు.

– డి.వి.ఆర్.
(8, శనివారం భీష్మ ఏకాదశి)

ఈవేళ ఇవి నిషిద్ధం

- మాంసం, వెల్లుల్లి, ఉల్లిపాయ, కాయధాన్యాలు వంటి వాటికీ దూరంగా ఉండాలి.
- ఉపవాస దీక్ష చేపట్టాలి.
- ద్వాదశి వరకు బ్రహ్మచర్యం పాటించాలి.
- ఏకాదశి రోజున.. ఇంటిని శుభ్రం చేసుకోకుడదు. ఎందుకంటే చీమలు, పురుగులు వంటి చంపే అవకాశం ఉంటుంది.
- తెల్లవారు జామునే నిద్ర లేవాలి.. మధ్యాన్నం కునుకు తీయకూడదు.
- ఉపవాసం చేసిన వారు భగవంతుడి కీర్తనలు చేస్తూ.. రాత్రంతా జాగారం చేయాలి.
- జుట్టు కత్తిరించకూడదు.
- ఎవరిని కించపరిచే విధంగా మాట్లాడకూడదు.
- విష్ణు సహస్రనామాలు, భగవద్గీతను పఠించడం మంచిది.
- పేదవారికి, ఆకలి అన్నవారికి ఈ రోజు అన్నం పెట్టడం పుణ్యప్రదం.

ఈవేళ ఇలా చేయాలి

పూజకు విష్ణుమూర్తి పటాన్ని పసుపు, కుంకుమలు, తామర పువ్వులు, తులసి దళాలు, జాజిమాలతో అలంకరించాలి. విష్ణు అష్టోత్తరం, నారాయణ కవచం, శ్రీమన్నారాయణ హృదయం, విష్ణు సహస్రనామాలు లేదా విష్ణు పురాణం పఠించాలి. లేదంటే కనీసం "ఓం నమోనారాయణాయ" అనే అష్టాక్షరీ మంత్రాన్ని 108 సార్లు జపించాలి. అనంతరం ఆవునేతితో పంచహారతి ఇవ్వాలి. దేవాలయాల్లో విష్ణు అష్టోత్తరం, సత్యనారాయణ వ్రతం, బ్రహ్మోత్సవ దర్శనం, లక్ష తులసిపూజ వంటివి నిర్వహించడం ద్వారా శుభఫలితాలు చేకూరుతాయని పెద్దలు చెబుతారు.

భీష్మాష్టమి రోజున సూర్యోదయానికి ముందే లేచి పూజామందిరాన్ని, ఇంటిని శుభ్రం చేయాలి. గడపకు పసుపు కుంకుమ, గుమ్మానికి తోరణాలు, పూజామందిరాన్ని ముగ్గులతోనూ అలంకరించుకోవాలి. అభ్యంగ స్నానం చేసి.. పసుపు రంగు దుస్తులను ధరించాలి. ఆ రోజంతా ఉపవాసం ఉండి, రాత్రి జాగారం చేయాలి. దీని నియమాలు దశమి సాయంత్రం నుంచి మొదలై ద్వాదశి వరకు అనుసరించవలసి ఉంటుంది.

● తత్త్వం

అన్నీ నోటి మాటలే!



పూర్వం ఒకానొక పట్టణంలో కాళీదేవి ఆలయం ఉండేది. అమ్మవారి దర్శనార్థం వేలమంది భక్తులు తరలివస్తుండేవారు. అందరూ అమ్మవారి విగ్రహం దగ్గరికి వచ్చి.. 'అమ్మా! ఈ పాపపు లోకంలో ఉండలేక పోతున్నాను. ఈ మాయాకూపం నుంచి నన్ను బయట పడేలా చూడు తల్లి. నీ భక్తుడికి మోక్షం ప్రసాదించు' అని వేడుకుంటూ ఉండేవారు. భక్తులు పదే పదే అదే కోరుకోవడంతో వినీ వినీ ఆలయ పూజారికి విసుగు పుట్టింది. అసలు ఈ భక్తుల మాటల్లో విశ్వసనీయత ఎంతో తెలుసుకోవాలనుకున్నాడు. మార్నాడు భక్తులు వచ్చేసరికి అమ్మవారి విగ్రహం వెనుక ఎవరికీ కనిపించకుండా దాక్కున్నాడు పూజారి. కాసేపటికి భక్తులంతా వచ్చారు. అందరూ తమకు ముక్తి ప్రసాదించాల్సిందిగా కోరుకుంటున్నారు. అమ్మవారి వెనక దాక్కున్న పూజారి సన్నని గొంతుకతో.. 'భక్తులారా! మీ భక్తికి మెచ్చాను. మీలో మోక్షం కావాలని అనుకుంటున్న వారంతా.. నా విగ్రహం దగ్గరికి రండి. నాలో లీనం చేసుకుంటాను' అన్నాడు. ఆ మాటలు అమ్మవారే పలికిందని భావించిన భక్తులు ఒక్కసారిగా మిన్నకుండిపోయారు. ఒక్కొక్కరుగా అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు. కాసేపయ్యాక పూజారి బయటకు వచ్చి చూస్తే.. ఆలయంలో ఒక్క భక్తుడూ లేడు. ఈ భక్తుల మాటలు మనసులో నుంచి వచ్చినవి కావని, కేవలం నోటి మాటలే అని పూజారికి అర్థమైంది. అమ్మవారికి ప్రణమిల్లి.. 'నీ బిడ్డలను చల్లగా చూడు తల్లి' ప్రార్థించాడు.

● నిర్మల వాణి

ఆత్మసాక్షాత్కారం మానవుని జన్మ హక్కు అంటారు శ్రీ మాతాజీ. మనలోని కుండలినీ శక్తియే మన తల్లి. ఆమె మన అన్ని జన్మలలోను మనతోనే ఉంటూ, జాగృతి చెందే సదవకాశం కోసం ఎదురు చూస్తూ వస్తున్నది.

స్త్రీలు, పురుషులు, పిల్లలు, అన్ని వర్ణాల, జాతుల వారు, ఎవరైనా సహజయోగ సాధన చేసుకోవచ్చును. ఆత్మసాక్షాత్కార అనుభూతి పొందవచ్చును. దీనికి కావలసింది ఆత్మసాక్షాత్కారం పొందాలనే శుద్ధమైన కోరిక మాత్రమే. అన్ని మతాలలోను, జ్ఞానమూర్తులు, అవతార పురుషులు సహజ యోగం గురించే బోధించారు. ఆత్మసాక్షాత్కారం ద్వారా పొందే ఆధ్యాత్మిక జీవనమే గొప్పదని చెప్పారు. ఆత్మసాక్షాత్కారం అంటే ఏమిటి?

పూర్వంలోలా ఆత్మ సాక్షాత్కారాన్ని పొందటానికి ఏ అడవులకో, హిమాలయాలకో వెళ్ళనవసరం లేకుండానే తమ, తమ సంసారిక బాధ్యతలు, సాంఘిక పరమైన విధులు నిర్వర్తిస్తూనే ఆత్మసాక్షాత్కారం పొందే ప్రక్రియను మాతాజీ కనుగొన్నారు.

ఆత్మసాక్షాత్కారం పొందాలి అనే శుద్ధ ఇచ్ఛాశక్తి మనకు కలిగినప్పుడు నిద్రాణ స్థితిలో ఉన్న కుండలినీ శక్తి జాగృతమై కేంద్ర నాడీ వ్యవస్థ ద్వారా ఊర్ధ్వముఖంగా పయనించి, శిరస్సునందు గల సహస్రార చక్రాన్ని ఛేదించి,



ఆత్మసాక్షాత్కారం అంటే..?



పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి

పరమ చైతన్య శక్తితో అనుసంధానం జరగటం వలన అనంతమైన దైవశక్తులన్నీ అనుభవంలోకి వచ్చి, తద్వారా మనకున్న అజ్ఞానం తొలగి పరిపూర్ణమైన ఆత్మజ్ఞానిగా... బ్రహ్మజ్ఞానిగా మారటమే ఆత్మసాక్షాత్కార పరమార్థం.

ఆత్మసాక్షాత్కారం అనేది ఒక అంధ విశ్వాసం, మూఢ నమ్మకమూ కానే కాదు. అనుభవ స్థిరమైనది, స్వయం అనుభూతి కలిగినటువంటిది. మాతాజీ ఫోటో ముందు కూర్చుని, నిస్సంకోచంగా హృదయపూర్వకంగా శుద్ధ ఇచ్ఛాశక్తితో ధ్యానం చేసినా ఈ అనుభూతి సహస్రార చక్రంలోనికి ప్రవేశిస్తున్నప్పుడు అప్రయత్నంగా ఆలోచనలు నిలిచిపోతాయి. ఈ స్థితిని 'నిర్విచారస్థితి' అంటారు. ఈ స్థితిలో మన అరచేతులలో గానీ, మాడు పైనగాని, చల్లని వాయుతరంగాల అనుభూతి కలుగుతుంది. ఇది మీలోనే సంభవించు 'ఆత్మ సాక్షాత్కార' అనుభవం, అనుభూతి.

శ్రీకృష్ణుడు, అర్జునునికి చేసిన గీతోపదేశంలో 'యోగక్షేమం వహామ్యహం' అన్నాడు. భగవంతుని యందు ఎల్లప్పుడూ ధ్యాన స్థితిలో నిమగ్నమై ఉన్నవారి యోగ క్షేమాలు తానే వహిస్తానని, యోగం ద్వారా భగవంతుని చేరినప్పుడే ఈ క్షేమం కలుగుతుందని బోధించిన విషయం మనందరికీ తెలిసినదే. ఇటువంటి యోగం అంటే ఆ సర్వవ్యాప్త భగవంతుని శక్తితో కలయిక ఈ సహజ యోగం ద్వారా సిద్ధిస్తుంది.

శ్రీ లలితా సహస్రనామావళిలో పొందుపరచిన మంత్రాల సారాంశం కుండలిని జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందగోరటమే.

సాధారణంగా మనం ఎల్లప్పుడూ గతానికి సబంధించిన లేక భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించిన విషయాలను ఆలోచిస్తూ ఉండటం వల్ల, శారీరకంగానూ, మానసికంగానూ సమతుల్యత లోపించటం వలన సదా మానసిక ఒత్తిడికి, శ్రమకు గురవుతూ ఉంటాం.

అయితే సహజయోగలో కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు మనల్ని ఎల్లప్పుడూ వర్తమానంలో ఉంచడం వల్ల మనం సమతుల్యతలో ఉండటం జరుగుతుంది. ఈ స్థితిని పొందటాన్ని 'ఆధ్యాత్మిక పరివర్తన' అని చెప్పవచ్చును.

– డాక్టర్ పి. రాకేష్
(శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రసంగాల ఆధారంగా)

● ఇస్లాం వెలుగు

కోపాన్ని దిగమింగినవాడే

సిసలైన శూరుడు



కోపం మానవుల ఆగర్భ శత్రువు. అది అనేక అనర్థాలకు హేతువు. కోపం అభివృద్ధి నిరోధకం. కోపంలో మనిషి తనపై తాను అదుపును కోల్పోతాడు. కోపంలో మనిషి దుర్భాషలాడతాడు. కొట్లాటకు దిగుతాడు. భార్యా బిడ్డలపై చేయి చేసుకుంటాడు. అసభ్య పదజాలం ప్రయోగిస్తాడు. చిన్నాపెద్దా వయోభేదాన్ని కూడా పాటించడు. కోపంలో మనిషి ఎవరి మాటా వినే పరిస్థితిలో ఉండడు. హత్యలు చేయవచ్చు. ఆత్మహత్యకూ పాల్పడవచ్చు. కోపస్థితిలో సరైన నిర్ణయం తీసుకోలేడు. క్షణికావేశానికి లోనై తప్పుడు నిర్ణయాలు తీసుకుంటాడు. రెప్పపాటులో చేసే ఆ చిన్న తప్పు వల్ల జీవిత కాలానికి సరిపడా చేదు అనుభవాలు మిగిలినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు.

అసలు ఒకటనేమిటి? నేడు సమాజంలో జరుగుతున్న అనేక అనర్థాలకు కోపమే కారణమంటే అతిశయోక్తికాదు. మరి ఈ కోపమనే శత్రువును పారద్రోలాలంటే ఏం చెయ్యాలి?

దీనికి దైవప్రవక్త ముహమ్మద్ (స) ఒక ఉపాయం చెప్పారు. కోపం వచ్చినప్పుడు నియంత్రించుకోవాలంటే, మనిషి తాను ఉన్నచోటునుండి పక్కకు జరగాలి. అంటే ఆ చోటును వదిలేయాలి. నిలబడి ఉంటే కూర్చోవాలి. కూర్చొని ఉంటే పడుకోవాలి. ఇలా చేయడంవల్ల కోపం అదుపులోకొస్తుంది. అంతకూ ఇంకా కోపం తగ్గకపోతే, వజూ చేయాలి. అంటే నియమబద్ధంగా చేతులూ, ముఖమూ, కాళ్ళు కడుక్కోవాలి. ఎందుకంటే, ఆగ్రహం షైతాన్ ప్రేరణ వల్ల కలుగుతుంది. షైతాన్ సృజన అగ్నితో జరిగింది. అగ్ని నీటితో ఆరుతుంది. కనుక షైతాన్ ప్రేరణతో కలిగిన ఆగ్రహం చల్లారాలంటే నీటిని ఉపయోగించాలి. వజూచేయాలి. ఇలాచేస్తే తప్పకుండా కోపం మటుమాయమవుతుంది.

వాస్తవానికి, కోపం రావడమన్నది మానవ సహజమే. మానవమాత్రులెవరూ దీనికి అతీతులు కారు. కాని కోపంలో విచక్షణ కోల్పోకపోవడమే గొప్పతనం. కోపానికి లోనై జుట్టు పీక్కోవడం, చిర్రుబుర్రులాడడం, అయిందానికీ, కానిదానికీ ఎవరిపైబడితే వారిపై విరుచుకుపడడం, చేతిలో ఏముంటే అది విసిరి కొట్టడం, నోటికొచ్చినంత మాట్లాడడం, బూతులు లంకించుకోవడం ఇవన్నీ ఉన్మాదపుచేష్టలు. మానవ ఔన్నత్యానికి ఏమాత్రం శోభించని లక్షణాలు. అసలు ఏకోశానా ఇవి వీరత్వమూకాదు, ధీరత్వమూకాదు. మానవత్వమూ కాదు.

అందుకే దైవప్రవక్త ముహమ్మద్ (స)'కుస్తీలో ప్రత్యర్థిని మట్టికరిపించే వాడు వీరుడు కాదు. తనకు కోపం వచ్చినప్పుడు విచక్షణ కోల్పోకుండా నిగ్రహించుకున్నవాడే అసలైన వీరుడు, శూరుడు'.అన్నారు.

కనుక, కోపం మానవ సహజమే అయినప్పటికీ, దానిపై అదుపుకలిగిఉండాలి. విచక్షణ కోల్పోయి ఉన్మాదిగా ప్రవర్తించకూడదు. తాను కోపగించుకొని, కస్సుబుస్సులాడి ఏం సాధించగలనని ఆలోచించ గలగాలి. అందరికంటే బలవంతుడు దైవం ఉన్నాడని, ఏదో ఒకరోజు ఆయన ముందు హాజరు కావలసిందేనని, ఆయన అందరి మనోస్థితులూ తెలిసిన సర్వజ్ఞాని అని తెలుసుకొని, విచక్షణాజ్ఞానంతో మసలుకుంటే ఎటువంటి అనర్థాలూ ఉండవు. కోపానికి దూరంగా ఉంటే జీవితమంతా సంతోషమే.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● మీకు తెలుసా?



- వంట చేసేవారు కోపంగా, విసుగ్గా వంట చేస్తే, ఆ వంటకాలకు సరైన రుచి రాకపోగా, దాన్ని భుజించిన వారి మనస్సు కూడా కోపతాపాలకు నిలయమవుతుంది. అందుకే వంట చేసేటప్పుడు ఆ వంట చేసేవారు మానసికంగా ప్రశాంతంగా, సంతోషంగా ఉండాలి. అప్పుడే ఆ పదార్థానికి రుచితోపాటు ఆ వంట తిన్నవారి మనస్సులు సంతోషంగా వుంటాయన్నది పూర్వీకుల విశ్వాసం.



- తీర్థాన్ని తీసుకున్నాక చాలామంది తలపై తుడుచుకుంటారు. కాని అలా చేయకూడదు. తలపైన బ్రహ్మదేవుడు ఉంటాడు. మన ఎంగిలిని బ్రహ్మకు అర్పణం చేసిన వారమవుతాము. కనుక కళ్లకద్దుకోవడం మంచిది.

● మహనీయుల మాటలు

చీకటి, చీకటిని తరిమికొట్టదు.
కాంతి మాత్రమే అలా చేయగలదు.
ద్వేషం, ద్వేషాన్ని తరిమికొట్టలేదు.
స్నేహం,' ప్రేమ' మాత్రమే చేయగలదు.

- నిశ్శబ్దం గొప్ప బలానికి మూలం. మీరు ఎంత నిశ్శబ్దంగా మారితే అంత ఎక్కువగా మీరు వినగలరు.
- మౌనం ఎప్పుడూ తీర్పు చెప్పని నిజమైన స్నేహితుడు.
- 'నేనే గొప్ప' అనే ఆలోచన మీద ఎటువంటి శ్రద్ధా పెట్టకుండా, 'నేను' అనే అహాన్ని అణగేటట్లు చేసేవారే గొప్ప ఉన్నతి కలవారు.'
- కొత్త విషయాలు తెలుసుకోవడం మంచి వారితో స్నేహం మనల్ని ఉన్న స్థితి నుంచీ అత్యున్నత స్థితికి తీసుకెళ్తాయి.
- సరైన నిర్ణయం ఆత్మ విశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. తప్పు నిర్ణయం అనుభవాన్ని రెట్టింపు చేస్తుంది. అందుకే రెండిటి గురించి చింతించాల్సిన అవసరం లేదు.
- ప్రతి కన్నీటి చుక్క వెనుక వదులుకోలేని బంధాలు, చెప్పుకోలేని బాధలు, చెప్పినా అర్థంకాని అనుభవాలు, ఎన్నో ఉంటాయి.

సువార్త

ఆత్మశుద్ధీకరణ... బాప్తిస్మము

రెండు వేల సంవత్సరాల నుండి కొనసాగుతున్న క్రైస్తవ సంఘంలో అనేక సంఘాలు కొనసాగుతున్నప్పటికీ క్రీస్తు ఒక్కడే సంఘాలకు శిరస్సు. మనమందరం ఆరాధించు/పూజించు తండ్రియైన దేవుడొక్కడేనని అపొస్తలుడైన పౌలు క్రీస్తు శిష్యులలో ఒక్కడే స్పష్టీకరించడం ఈ క్రింది వాక్యం ద్వారా గమనించగలం. ఇది ప్రభువైన క్రీస్తు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘం (అపొ.కా. 20:28). అందుచేత మనం సమాధానమను బంధం చేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకోవాలని ప్రేమతో ఒకనినొకడు దీర్ఘశాంతంతో, సాత్వికతతో నడుచుకోవాలని మనలను క్రీస్తును బట్టి ఖైదీ అయిన పౌలు భక్తుడు బతిమాలుకొనుచున్నాడు. శరీరం ఒక్కటే, ప్రభువు ఒక్కడే, విశ్వాసం ఒక్కటే, బాప్తిస్మమొక్కటే అంటూ ఆయన సంఘానికి శిరస్సు, ఆ సంఘం ఆయన శరీరం అని వాక్యం ప్రబోధిస్తున్నది (ఎఫెసీ 4 :1-6).

ప్రభువైన యేసుక్రీస్తు దేవుని రాజ్య సువార్తను ప్రకటిస్తున్న కాలంలో నీకొదేమను పరిసయ్యుడు, యూదుల అధికారికి యేసు బోధనలు తనలోని లోపాలను తట్టి లేపుతున్నట్టు, రహస్యంగా రాత్రిపూట ప్రభువును కలిసిన ఆయన సాక్షాత్తూ దేవుని వద్ద నుండి వచ్చిన బోధకుడని ఆయన సూచక క్రియలే ఋజువు చేస్తున్నాయంటూ ప్రశంసాపూర్వకంగా తెలియజేశాడు. అప్పుడు ప్రభువు అతనితో – ఒకడు కొత్తగా జన్మించితేనే కానీ దేవుని రాజ్యాన్ని చూడలేడని అతనితో అనెను. అందుకతడు ముసలివాడినైన నేను మరలా తల్లిగర్భంలో ప్రవేశించి ఎలా జన్మించగలను? అందుకు ప్రభువు అతనితో –ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మిస్తే గాని దేవుని రాజ్యంలో ప్రవేశింపలేడంటారు (యోహాను 3:1=5).

ఇది లోకంలో జీవిస్తున్న స్త్రీ పురుష భేదం లేకుండా స్త్రీ కన్న సంతానానికి అవసరమని దీని పరమార్థం. కొత్తగా జన్మించడమంటే ఇది నూతనప్రక్రియ. ఇది క్రీస్తు సువార్త ప్రారంభానికి ముందే దేవుని దూతయైన యోహానుతో ప్రారంభించబడింది. పాప పంకిలమైన ఈ లోకంలో వున్నవారు తమను తాము శుద్ధీకరించుకోవాల్సి వుంది. సృష్ట్యారంభంలో ఒక మనుష్యుడు (ఆదాము) చేసిన పాపం వలన అనేకులమైన మనం పాపులముగా చేయబడితిమి కదా! అలాగే ఒకని (యేసుప్రభువు)



విధేయత వలన మనం నీతిమంతులుగా చేయబడతాము. అలా నీతిమంతులుగా చేయబడాలంటే నీటిమూలముగాను, ఆత్మమూలముగానూ జన్మింపవలసి వున్నది. అదే పరిశుద్ధాత్మ. అది పై నుండి వచ్చునది. దానినే బాప్తిస్మము అంటారు. శరీర శుద్ధీకరణ నీటి ద్వారా, ఆత్మశుద్ధీకరణ పరిశుద్ధాత్మ ద్వారా ఆవశ్యకం.

ఆ విధంగా శుద్ధీకరింపబడి దేవుని రాజ్యమనే పరలోక రాజ్యంలో ప్రవేశించుదుము గాక.

– కోట బిపిన్ చంద్రపాల్

సాక్షి ప్లస్
గురువారం। 6-2-2025

బంగారం డిమాండ్ @ రూ.5.15 లక్షల కోట్లు

- 2024లో 803 టన్నులు
- పరిమాణంలో 5 శాతం పెరుగుదల
- విలువలో 31 శాతం అధికం
- 2025లో డిమాండ్ 700–800 టన్నులు
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక



ముంబై: పసిడి కొనుగోళ్లు, పెట్టుబడులు 2024లో పండుగలా సాగాయి. గత ఏడాది మొత్తం మీద బంగారం డిమాండ్ 802.8 టన్నులకు చేరుకుంది. పరిమాణం పరంగా 2023 సంవత్సంతో పోల్చి చూసినప్పుడు 5 శాతం పెరగ్గా, విలువ పరంగా చూస్తే ఏకంగా 31 శాతం వృద్ధి కనిపించింది. 2023లో 761 టన్నుల బంగారం కోసం భారతీయులు రూ.3,92,000 కోట్లను ఖర్చు చేయగా, 2024లో 802.8 టన్నుల కోసం ఏకంగా రూ.5,15,390 కోట్ల రూపాయలు వెచ్చించారు. ఈ గణాంకాలతో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజాగా ఒక నివేదికను విడుదల చేసింది. ''2025లో బంగారం డిమాండ్ భారత్‌లో 700–800 టన్నుల మధ్య ఉండొచ్చు. వివాహ సంబంధిత కొనుగోళ్లతో బంగారం ఆభరణాలకు డిమాండ్ కొనసాగుతుంది. దీంతో ధరల పరంగా కొంత స్థిరత్వం ఉండొచ్చు''అని డబ్ల్యూజీసీ ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ తెలిపారు.

తగ్గిన ఆభరణాల డిమాండ్

- 2024లో బంగారం ఆభరణాల డిమాండ్ 2 శాతం తక్కువగా 563.4 టన్నులకు పరిమితమైంది. 2023లో ఆభరణాల డిమాండ్ 575.8 టన్నులుగా ఉంది.
- గతేడాది జూలైలో బంగారం దిగుమతుల సుంకాన్ని తగ్గించడంతోపాటు, ఇతర మార్కెట్లతో పోల్చితే భారత ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధిని నమోదు చేయడం సానుకూలించినట్టు డబ్ల్యూజీసీ తెలిపింది.
- పండుగల సీజన్‌కు కీలకమైన 2024 చివరి మూడు నెలల కాలంలో పసిడి డిమాండ్ 265.8 టన్నులుగా ఉంది. 2023 ఇదే త్రైమాసికంలో డిమాండ్ 266.2 టన్నులతో పోల్చితే మార్పు అతి స్వల్పమే.

పెట్టుబడులకు ఆకర్షణీయం

- అనిశ్చితుల్లో సురక్షిత సాధనంగా పేరొందిన పసిడి.. 2024లో పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా మారింది. 2024లో బంగారంపై పెట్టుబడులు 29 శాతం పెరిగి 239.4 టన్నులకు చేరాయి. 2013 తర్వాత తిరిగి ఇదే గరిష్ట స్థాయి.
- 2023లో బంగారం పెట్టుబడుల డిమాండ్ 185.2 టన్నులుగా ఉంది.
- బంగారం ఈటీఎఫ్‌ల పట్ల రిటైల్ ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోంది. దీంతో పెట్టుబడి పరంగా పసిడికి డిమాండ్ ఇక ముందూ బలంగానే కొనసాగనుంది.

జోరుగా ఆర్‌బీఐ కొనుగోళ్లు

- 2024లో ఆర్‌బీఐ 73 టన్నుల బంగారాన్ని అదనంగా సమకూర్చుకుంది. 2023లో 16 టన్నుల కొనుగోలుతో పోల్చితే నాలుగు రెట్లు అధికంగా గతేడాది సొంతం చేసుకుంది.
- బంగారం రీసైక్లింగ్ పరిమాణం 2% తక్కువగా 114.3 టన్నులుగా నమోదైంది. 2023లో రీసైక్లింగ్ పరిమాణం 117.1 టన్నులుగా ఉంది.
- బంగారం దిగుమతులు గతేడాది 4 శాతం తక్కువగా 712.1 టన్నులకు పరిమితమయ్యాయి. 2023లో దిగుమతుల పరిమాణం 744 టన్నులుగా ఉంది.

ప్రపంచవ్యాప్తంగా స్థిరమైన డిమాండ్

- ✔ 2024లో ప్రపంచవ్యాప్తంగా బంగారం డిమాండ్ 4,974 టన్నులుగా నమోదైంది. 2023లో డిమాండ్ 4,945.9 టన్నులతో పోల్చితే ఒక శాతం పెరిగింది.
- ✔ మూడు, నాలుగో త్రైమాసికాల్లో ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ ఈటీఎఫ్‌లకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. సెంట్రల్ బ్యాంక్‌లు రేట్ల కోత ఆరంభించడం, అంతర్జాతీయ అనిశ్చితులు, అమెరికా అధ్యక్ష ఎన్నికలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇందుకు కారణాలుగా ఉన్నాయి.
- ✔ సెంట్రల్ బ్యాంక్‌లు 1,044.6 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయి. 2023లో కొనుగోళ్లు 1,050.8 టన్నులుగా ఉన్నాయి.
- ✔ పెట్టుబడులకు డిమాండ్ 25% పెరిగి 1,179.5 టన్నులకు చేరింది. 2023లో పసిడి పెట్టుబడుల డిమాండ్ 945.5 టన్నులుగా ఉంది.
- ✔ బంగారం కాయిన్లు, బార్లకు డిమాండ్ 2023 స్థాయిలోనే 1,186 టన్నులుగా నమోదైంది.
- ✔ 2024 మొత్తం మీద ప్రపంచవ్యాప్తంగా ఆభరణాల డిమాండ్ 11 శాతం క్షీణించి 1,877.1 టన్నులకు పరిమితమైంది. 2023లో ఇది 2,110.3 టన్నులుగా ఉంది.
- ✔ 2025లోనూ సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు, గోల్డ్ ఈటీఎఫ్‌ల డిమాండ్ బలంగానే కొనసాగొచ్చని డబ్ల్యూజీసీ అంచనా.

మొదలైన ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్ష

7న విధాన నిర్ణయాల వెల్లడి

ముంబై: ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) భేటీ బుధవారం ప్రారంభమైంది. కొత్త ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల ఎంపీసీ కమిటీ వడ్డీ రేట్లు, పరపతి విధానంపై కీలక నిర్ణయాలు తీసుకోనుంది. వడ్డీ రేట్ల తగ్గింపునకు ఆర్‌బీఐ కీలకంగా చూసేది ద్రవ్యోల్బణాన్నే. వినియోగ ధరల ఆధారిత సూచీ (రిటైల్ ద్రవ్యోల్బణం) డిసెంబర్ త్రైమాసికానికి 4.5 శాతానికి తగ్గుముఖం పడుతుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి 4.8 శాతంగా ఉంటుందన్నది ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా. జనవరి నెల ద్రవ్యోల్బణం 4.5 సమీపంలో ఉండొచ్చని పేర్కొంది. ''ద్రవ్యపరమైన ఉద్దీపనలు, వాణిజ్య యుద్ధాల పరంగా అనిశ్చితుల మధ్య ఆర్‌బీఐ రిస్కులను సమతుల్యం చేయాల్సిన సున్నితమైన టాస్కును ఎదుర్కొంటున్నది. కనీసం స్వల్పకాలానికి రేట్ల తగ్గింపు పరంగా ఆర్‌బీఐకి వెసులుబాటు ఉంది'' అని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది. ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో పావు శాతం చొప్పున రేట్ల కోతలకు వెళ్లొచ్చని.. విరామం అనంతరం తిరిగి అక్టోబర్‌లో మళ్లీ రేట్ల కోత ఆరంభించొచ్చని తెలిపింది. మొత్తం మీద 0.75 శాతం మేర రేట్ల తగ్గింపు అవకాశాలను అంచనా వేస్తోంది.

భారత్‌లో వ్యాపారంపై ఈఎఫ్‌టీఏ ఇన్వెస్టర్ల దృష్టి

- అవకాశాల పరిశీలనకు వచ్చే వారం పర్యటన
- టెక్నాలజీ, తయారీ ప్లాంట్లపై ఆసక్తి



న్యూఢిల్లీ: భారత్‌లో వ్యాపారావకాశాలను అందిపుచ్చుకోవడంపై విదేశీ ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోంది. నాలుగు యూరోపియన్ దేశాల కూటమి ఈఎఫ్‌టీఏ నుంచి 100 మంది, ఇజ్రాయెల్‌కి చెందిన 200 మంది ఇన్వెస్టర్లు వచ్చే వారం భారత్‌ను సందర్శించనున్నారు. ఫిబ్రవరి 10 నుంచి మూడు రోజుల పాటు వారు పర్యటించనున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. టెక్నాలజీ, తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేయడంపై ఆసక్తి గల పెద్ద కంపెనీలు వస్తున్నట్లు వివరించారు. 2024లో ఈఎఫ్‌టీఏ, భారత్ వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈఎఫ్‌టీఏలో ఐస్‌ల్యాండ్, నార్వే, లీష్‌టెన్‌స్టెయిన్, స్విట్జర్లాండ్ సభ్యదేశాలుగా ఉన్నాయి. యూరోపియన్ యూనియన్‌లో చేరడానికి ఇష్టపడని దేశాలు ఏర్పాటు చేసుకున్న ఈ కూటమి.. వచ్చే 15 ఏళ్ల వ్యవధిలో భారత్‌లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు హామీనిచ్చింది. దానికి ప్రతిగా స్విస్ వాచీలు, చాక్లెట్లు, కట్.. పాలిష్డ్ డైమండ్లు తదితర ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు భారత్ అంగీకరించింది. ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ ఒప్పందం అమల్లోకి రానుంది.

24 బిలియన్ డాలర్ల వాణిజ్యం..

ఈఎఫ్‌టీఏ–భారత్ మధ్య 2022–23లో ద్వైపాక్షిక వాణిజ్యం 18.65 బిలియన్ డాలర్లుగా ఉండగా 2023–24 నాటికి 24 బిలియన్ డాలర్లకు చేరింది. భారత్‌కు స్విట్జర్లాండ్ అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా, ఇన్వెస్టరుగా ఉంటోంది. తర్వాత స్థానంలో నార్వే ఉంది. 2000 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ మధ్య కాలంలో స్విట్జర్లాండ్ నుంచి 10.72 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. వచ్చే 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేస్తామని హామీ ఇచ్చిన ఈఎఫ్‌టీఏ బ్లాక్ .. ఇందులో 50 బిలియన్ డాలర్లను ఒప్పందం అమల్లోకి వచ్చిన 10 ఏళ్ల వ్యవధిలో పెట్టుబడులు పెట్టనుంది. మిగతా మొత్తాన్ని అయిదేళ్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ పెట్టుబడులతో భారత్‌లో 10 లక్షల పైచిలుకు ప్రత్యక్ష ఉద్యోగాల కల్పన జరుగుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

చాట్‌జీపీటీకే జై...

- దేశంలో అత్యధికంగా వినియోగిస్తున్న ఏఐ ప్లాట్‌ఫాం
- గూగుల్, ఇతర సెర్చ్ ఇంజిన్లకూ ప్రాధాన్యత
- లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా దాదాపు సగం మంది ఇంటర్నెట్ యూజర్లు ఇప్పటికే కృత్రిమ మేధ (ఏఐ) ప్లాట్‌ఫాంలను వినియోగిస్తున్నారు. ఇందులో ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ అగ్రస్థానంలో ఉంది. ఆన్‌లైన్ సర్వే సంస్థ లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2024 ఆగస్టు 11 నుంచి 2025 ఫిబ్రవరి 1 వరకు దీన్ని నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా 309 జిల్లాల నుంచి 92,000 మంది ఇందులో పాల్గొన్నారు. దీని ప్రకారం వివిధ అంశాలపై వివరాల కోసం 40 శాతం మంది గూగుల్ తదితర సెర్చ్ ఇంజిన్లకు ప్రాధాన్యమిస్తున్నారు. సమాచారం కోసం ఏ కృత్రిమ మేధ ప్లాట్ ఫాంను ఉపయోగిస్తున్నారనే ప్రశ్నకు స్పందిస్తూ .. 15,377 మందిలో 28 శాతం మంది చాట్‌జీపీటీకి ఓటేయగా, 9 శాతం మంది పర్‌ప్లెక్సిటీని, 6 శాతం మంది కో–పైలట్‌ను నేరుగా లేదా బింగ్ ద్వారా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. అలాగే చెరి 3 శాతం మంది 'జెమిని వయా గూగుల్', ల్లామా (మెటా)ను వాడుతున్నారు. మరో ఆరు శాతం మంది తాము ఉపయోగించే ప్లాట్‌ఫాం పేరు సర్వేలో లేదని తెలిపారు. 'మొత్తం మీద చూస్తే భారతీయ ఇంటర్నెట్ యూజర్లలో ప్రతి ఇద్దరిలో ఒకరు ఇప్పటికే ఏఐ ప్లాట్‌ఫాంలను ఉపయోగిస్తున్నారు. చాట్‌జీపీటీని అత్యధికంగా వాడుతున్నారు' అని లోకల్‌సర్కిల్స్ పేర్కొంది.

సర్వేలోని మరిన్ని వివరాలు..

- 90 శాతం మంది ఏఐ యూజర్లు ప్రధానంగా టెక్ట్స్ మోడ్‌లోను, 10 శాతం మంది వాయిస్ మోడ్‌లోను ఈ ప్లాట్‌ఫాంను ఉపయోగిస్తున్నారు.
- ఉచితంగా ఏఐ ఫీచర్లు ఇస్తున్న చైనా ప్లాట్‌ఫాం డీప్‌సీక్‌కు మారతారా అనే ప్రశ్నకు స్పందిస్తూ, 15,753 మందిలో 8 శాతం మంది ఇప్పటికే తాము మారినట్లు తెలిపారు. 8 శాతం మంది మారతామని తెలపగా, 38 శాతం మంది అయిష్టత వ్యక్తం చేశారు.
- ఇప్పటికే డీప్‌సీక్‌కి మారిన ఏఐ యూజర్లు, లేదా త్వరలోనే మారనున్న యూజర్లు ప్రతి పది మందిలో ముగ్గురు ఉన్నారు.
- ప్రతి పది మంది ఏఐ యూజర్లలో ముగ్గురు పెయిడ్ లేదా ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ఉపయోగిస్తున్నారు.

నెమ్మదించిన సేవల రంగం..

జనవరిలో 56.5కి పీఎంఐ సూచీ



న్యూఢిల్లీ: అమ్మకాలు, ఉత్పత్తి ఒక మోస్తరుగానే పెరుగుతున్న నేపథ్యంలో జనవరిలో దేశీయంగా సేవల రంగం వృద్ధి నెమ్మదించింది. డిసెంబర్‌లో 59.3గా ఉన్న హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ 56.5కి పరిమితమైంది. రెండేళ్ళ తర్వాత వృద్ధి ఇంతగా నెమ్మదించడం ఇదే ప్రథమం. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) పరిభాషలో సూచీ 50కి పైన ఉంటే వృద్ధిని, దానికన్నా తక్కువుంటే క్షీణతను సూచిస్తుంది. బిజినెస్ యాక్టివిటీ, కొత్త బిజినెస్ పీఎంఐ సూచీలు వరుసగా 2022 నవంబర్, 2023 నవంబర్ తర్వాత కనిష్ఠ స్థాయిలకు తగ్గినట్లు హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకానమిస్ట్ ప్రాంజల్ భండారీ తెలిపారు. సిబ్బంది ఖర్చులు, ఆహార ధరలు పెరిగిపోతుండటంతో సర్వీస్ కంపెనీల వ్యయాలు కూడా మరింత పెరిగాయి. అయితే, రాబోయే 12 నెలల్లో వ్యాపార కార్యకలాపాలు గణనీయంగా పుంజుకుంటాయని దేశీయంగా సర్వీస్ ప్రొవైడర్లు ధీమాగా ఉన్నారు. ప్రకటనలు, పోటీ సంస్థలతో పోలిస్తే మెరుగైన రేట్లు ఆఫర్ చేయడం, కొత్త క్లయింట్ల ఎంక్వైరీలు మొదలైన అంశాలు ఇందుకు కారణం. సర్వీస్ రంగానికి చెందిన 400 కంపెనీల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐని ఎస్అండ్‌పీ గ్లోబల్ రూపొందిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-2-2025	
విశాఖ	470–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	452–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50 – టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	600.9	2.9
ITCHOTELS	168.45	2.88
ONGC	261.05	2.74
APOLLOHOSP	6,958.00	2.44
BPCL	261.55	2.19

నిఫ్టీ 50 – టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,274.20	-3.4
TITAN	3,490.00	-2.99
NESTLEIND	2,249.45	-2.17
BRITANNIA	4,930.00	-1.96
TATACONSUM	1,014.95	-1.86

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,319
ఎన్ఎస్ఈ	94,512
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,52,276
ఎఫ్ఐఐ	- 1,683
డీఐఐ	+ 996

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.72 (రాత్రి 11.30కి)	$ 72.07 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.21 (రాత్రి 11.30కి)	$ 76.02 (క్రితం ముగింపు)

దక్షిణాదిలో న్యూ షాప్ విస్తరణ



హైదరాబాద్: కన్వీనియెన్స్ రిటైల్ చెయిన్ 'న్యూ షాప్' తాజాగా దక్షిణాది మార్కెట్లోకి ప్రవేశించింది. హైదరాబాద్, విశాఖలో 20 కొత్త ఫ్రాంచైజీ ఔట్‌లెట్స్‌ను ప్రారంభించింది. విశాఖపట్నంలో తమ తొలి ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ మార్కెట్లో కూడా ప్రవేశించినట్లు సంస్థ కో-ఫౌండర్ ఆస్థా అల్మస్ట్ తెలిపారు. దేశవ్యాప్తంగా కన్వీనియెన్స్ స్టోర్స్ నెలకొల్పే దిశగా రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించడం తమకు కీలక మైలురాయిగా వివరించారు. ప్రస్తుతం 18 రాష్ట్రాల్లో 35 నగరాలవ్యాప్తంగా 250 పైచిలుకు స్టోర్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. గాడ్‌ఫ్రే ఫిలిప్స్‌కి చెందిన రిటైల్ విభాగం 24సెవెన్‌ను కొనుగోలుచేయడం ఇందులో భాగమేనని పేర్కొన్నారు.

టాప్-100 కంపెనీలకు డిజిటల్ అష్యూరెన్స్: సెబీ



న్యూఢిల్లీ: టాప్–100 లిస్టెడ్ కంపెనీలకు ఆర్థిక నివేదికలకు సంబంధించి తప్పనిసరి డిజిటల్ అష్యూరెన్స్‌ను సెబీ ప్రతిపాదించింది. కంపెనీల ఆర్థిక నివేదికలను మదింపు చేసే ఆడిటర్లు, ఆయా కంపెనీల డిజిటల్ సమాచార మూలాలను కూడా ధ్రువీకరించనుండడం ఇందులో భాగంగా ఉంటుంది. దీనిపై సంప్రదింపుల పత్రాన్ని సెబీ విడుదల చేసింది. ''డిజిటల్ అష్యూరెన్స్ రిపోర్ట్‌తో పారదర్శకత పెరుగుతుంది. సమాచార వెల్లడి ప్రమాణాలు మెరుగుపడతాయి. తద్వారా ఇన్వెస్టర్ల ప్రయోజనాలకు మరింత రక్షణ లభించి, వ్యవస్థ పట్ల నమ్మకం పెరుగుతుంది''అని సెబీ పేర్కొంది. కంపెనీ ఆర్థిక నివేదికలను మదింపు చేసే ఆడిటర్లే ఈ డిజిటల్ అష్యూరెన్స్ నివేదికలను ప్రత్యేకంగా జారీ చేయాల్సి ఉంటుంది.

క్యూ3 ఫలితాలు

నష్టాల్లోకి మొబిక్విక్



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీ మొబిక్విక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 55 కోట్ల నికర నష్టం ప్రకటించింది. పేమెంట్ గేట్‌వే వ్యయాలు పెరగడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 5 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. వన్ మొబిక్విక్ గేట్‌వే చెల్లింపుల వ్యయాలు మూడు రెట్లు పెరిగి రూ. 144 కోట్లకు చేరాయి. గత క్యూ3లో ఇవి రూ. 51 కోట్లు మాత్రమే. మొత్తం ఆదాయం మాత్రం 18 శాతం ఎగసి రూ. 269 కోట్లను అధిగమించింది. పేమెంట్స్ స్థూల మెర్కండైజ్ విలువ మూడు రెట్లుపైగా జంప్‌చేసి రూ. 29,400 కోట్లయ్యింది. రిజిస్టర్డ్ వినియోగదారుల సంఖ్య 14 శాతం వృద్ధితో 17.2 కోట్లను తాకింది. పేమెంట్స్ ఆదాయం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 196 కోట్లను దాటింది.

ఫలితాల నేపథ్యంలో షేరు బీఎస్ఈలో 0.50 శాతం పెరిగి రూ. 405 వద్ద ముగిసింది.

జైడస్ లైఫ్ లాభం జూమ్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ కంపెనీ జైడస్ లైఫ్ సైన్సెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 30% జంప్‌చేసి రూ. 1,023 కోట్లకు చేరింది. దేశ, విదేశాలలో పెరిగిన అమ్మకాలు ఇందుకు దోహదపడ్డాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 790 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,505 కోట్ల నుంచి రూ. 5,269 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో జైడస్ లైఫ్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం బలపడి రూ. 978 వద్ద ముగిసింది.

లాభాల్లోకి పీసీ జ్యువెలర్స్



న్యూఢిల్లీ: బంగారు ఆభరణ తయారీ కంపెనీ పీసీ జ్యువెలర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో నష్టాలనువీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 148 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 198 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 43 కోట్ల నుంచి రూ. 683 కోట్లకు భారీగా జంప్‌చేసింది. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కారణంగా క్యూ3లో ఆభరణాలకు భారీ డిమాండ్ నెలకొన్నట్లు కంపెనీ పేర్కొంది. కంపెనీ 15 రాష్ట్రాలలో మొత్తం 55 షోరూములను నిర్వహిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 5% జంప్‌చేసి రూ. 15.7 వద్ద ముగిసింది.

స్విగ్గీ నష్టాలు పెరిగాయ్



న్యూఢిల్లీ: ఫుడ్, గ్రోసరీ డెలివరీల ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర నష్టం భారీగా పెరిగి రూ. 799 కోట్లను దాటింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 574 కోట్ల నష్టం నమోదైంది. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం రూ. 3,049 కోట్ల నుంచి రూ. 3,993 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 3,700 కోట్ల నుంచి రూ. 4,898 కోట్లకు పెరిగాయి. స్థూల ఆర్డర్ల విలువ(జీవోవీ) 38 శాతం బలపడి రూ. 12,165 కోట్లను తాకింది. క్విక్ కామర్స్ బిజినెస్ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ జీవోవీ 88 శాతం జంప్‌చేసి రూ. 3,907 కోట్లకు చేరింది. కొత్తగా 96 స్టోర్లను జత కలుపుకోవడంతో యాక్టివ్ డార్క్ స్టోర్ల విస్తీర్ణం 2.445 మిలియన్ చదరపు అడుగులకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో స్విగ్గీ షేరు బీఎస్ఈలో 3.6 శాతం నష్టంతో రూ. 418 వద్ద ముగిసింది.

ఇన్ఫో ఎడ్జ్ లాభం హైజంప్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఇన్ఫో ఎడ్జ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 61 శాతం జంప్‌చేసి రూ. 243 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతం ఎగసి రూ. 722 కోట్లను అధిగమించింది. కంపెనీ బోర్డు 1:5 నిష్పత్తిలో షేర్ల విభజనకు ఆమోదముద్ర వేసింది. అంటే రూ. 10 ముఖ విలువగల ప్రతీ షేరుని రూ. 2 ముఖ విలువగల 5 షేర్లుగా విభజించనుంది. తద్వారా కంపెనీ షేర్లను రిటైల్ ఇన్వెస్టర్లకు మరింత అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇన్ఫో ఎడ్జ్ పేర్కొంది. దీంతో లిక్విడిటీ భారీగా పెరగనున్నట్లు తెలియజేసింది. 2024 డిసెంబర్‌కల్లా కంపెనీవద్ద రూ. 4,290 కోట్ల నగదు నిల్వలున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ఇన్ఫో ఎడ్జ్ షేరు బీఎస్ఈలో 3 శాతం జంప్‌చేసి రూ. 7,943 వద్ద ముగిసింది.

తగ్గిన సీసీఎల్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్‌స్టంట్ కాఫీ తయారీ దిగ్గజం సీసీఎల్ ప్రొడక్ట్స్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 33 శాతం క్షీణించి రూ.46.3 కోట్లు నమోదైంది. టర్నోవర్ రూ.665 కోట్ల నుంచి రూ.761 కోట్లకు చేరింది.

క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో సీసీఎల్ షేరు ధర బుధవారం 0.26 శాతం అధికమై రూ.681.10 వద్ద స్థిరపడింది.

భారత్‌కు లగ్జరీ బ్రాండ్స్ క్యూ



- 2024లో 27 కంపెనీల ఎంట్రీ
- లగ్జరీ ఉత్పత్తులకు డిమాండ్

న్యూఢిల్లీ: విదేశీ బ్రాండ్లను భారత రిటైల్ మార్కెట్ ఊరిస్తోంది. 2024లో దాదాపు 27 కొత్త విదేశీ రిటైల్ బ్రాండ్స్ దేశీయ విపణిలోకి ఎంట్రీ ఇచ్చాయి. విలాసవంత వస్తువుల కోసం పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో తమ ఉనికిని చాటుకోవడానికి ఇవి భారత్‌లో రంగ ప్రవేశం చేస్తున్నాయని రియల్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ తెలిపింది. అంత క్రితం ఏడాదితో పోలిస్తే భారత్‌లో అడుగుపెట్టిన బ్రాండ్ల సంఖ్య 2024లో రెట్టింపు అయిందని వెల్లడించింది. పట్టణీకరణ, ఖర్చు చేయదగ్గ ఆదాయం పెరగడం, షాపింగ్ ప్రాధాన్యతల్లో మార్పు లగ్జరీ ఉత్పత్తులకు డిమాండ్‌ను పెంచుతోందని వివరించింది. భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా చురుకైన రిటైల్ మార్కెట్లలో ఒకటిగా మార్చిందని తెలిపింది. 2023లో 14 బ్రాండ్స్ ఇక్కడి మార్కెట్లో ప్రవేశించాయి. నాలుగేళ్లలో 60 విదేశీ బ్రాండ్స్ భారత్‌కు వచ్చాయి.

దృష్టిని ఆకర్షించింది..

2024లో దేశీయ రిటైల్ రంగంలో బ్యూటీ, సౌందర్య సాధనాలు, ఆరోగ్య సంరక్షణ; పాదరక్షలు, బ్యాగ్స్, యాక్సెసరీస్; ఫ్యాషన్, దుస్తుల విభాగాలు టాప్–3లో నిలిచాయి. 'భారత రిటైల్ రంగం అంతర్జాతీయ కంపెనీల దృష్టిని ఆకర్షించింది. నాలుగేళ్లుగా ఇక్కడి విపణిలో ఉనికిని నెలకొల్పడానికి ప్రయత్నాలను క్రమంగా పెంచాయి. గత సంవత్సరం ప్రవేశించిన కంపెనీల్లో 56 శాతం యూరప్, మధ్యప్రాచ్య, ఆఫ్రికా ప్రాంతానికి చెందినవి. ఫ్రెంచ్, ఇటాలియన్ సంస్థలు సైతం వీటిలో ఉన్నాయి. గత ఏడాది దేశంలో ఈ బ్రాండ్స్ సుమారు 1,90,000 చదరపు అడుగుల స్థలం లీజుకు తీసుకున్నాయి. ఇందులో సగం వాటా ఫ్యాషన్, అపారెల్ బ్రాండ్స్ కైవసం చేసుకున్నాయి' అని జేఎల్ఎల్ ప్రతినిధి రాహుల్ అరోరా తెలిపారు.

హాలెప్ వీడ్కోలు



ప్రొఫెషనల్ టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రొమేనియా స్టార్

బుకారెస్ట్ (రొమేనియా): మాజీ ప్రపంచ నంబర్‌వన్ మహిళా టెన్నిస్ ప్లేయర్ సిమోనా హాలెప్ (రొమేనియా) కెరీర్‌కు వీడ్కోలు పలికింది. డోపింగ్ సస్పెన్షన్‌తో పాటు గాయాల కారణంగా చాన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్న 33 ఏళ్ల హాలెప్... బుధవారం ప్రొఫెషనల్ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన హాలెప్... టాన్సిల్వేనియా ఓపెన్ తొలి రౌండ్‌లో పరాజయం అనంతరం తన నిర్ణయాన్ని వెల్లడించింది. 'ఇది సంతోషమో, బాధో అర్థం కావడం లేదు. కానీ ఈ నిర్ణయంతో నా మనసు ప్రశాంతంగా ఉంటుంది అని మాత్రం చెప్పగలను. ప్రొఫెషనల్ టెన్నిస్ ఆడేందుకు నా శరీరం సహకరించదని అనిపిస్తోంది. అందుకే ఆట నుంచి తప్పుకుంటున్నా. ఈ స్థాయికి చేరేందుకు ఎన్నో కష్టాలు పడ్డా. చివరి మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయలేకపోయా. అయినా అభిమానుల సమక్షంలో మైదానంలో దిగడాన్ని ఆస్వాదించా' అని హాలెప్ పేర్కొంది.

2017లో డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన హాలెప్... ఆ తర్వాత గాయాలు, నిషేధం కారణంగా 870వ ర్యాంక్‌కు పడిపోయింది. టాన్సిల్వేనియా ఓపెన్‌లో వైల్డ్ కార్డ్ ద్వారా ఎంట్రీ ఇచ్చిన ఆమె బుధవారం జరిగిన మ్యాచ్‌లో 1-6, 1-6తో లుసియా బ్రాంజెట్టి (రొమేనియా) చేతిలో ఓడింది. మోకాలు, భుజం గాయాలతో ఇబ్బంది పడుతున్న హాలెప్ ఇటీవల ఆ్రస్టేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వాలిఫయింగ్ టోర్నీ నుంచి కూడా తప్పుకుంది. 2018 ఫ్రెంచ్ ఓపెన్, 2019 వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన హాలెప్ మరో మూడు గ్రాండ్‌స్లామ్ (2014, 2017 ఫ్రెంచ్ ఓపెన్, 2018 ఆ్రస్టేలియా ఓపెన్) టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది.

2022 యూఎస్ ఓపెన్ తొలి రౌండ్ పరాజయం అనంతరం డోపింగ్ కారణంగా హాలెప్ ప్రొఫెషనల్ కెరీర్‌కు దూరమైంది. దీంతో ఆమె మీద నాలుగు సంవత్సరాల నిషేధం పడింది. దీనిపై హాలెప్ కోర్ట్ ఆఫ్ అర్బిట్రేషన్ స్పోర్ట్స్‌లో అప్పీల్ చేసుకోగా... నిషేధాన్ని 9 నెలలకు తగ్గించారు. అయితే గాయాల బెడద ఎక్కువవడంతో తిరిగి కోర్టులో పూర్వ వైభవం సాధించలేకపోయింది.

కెరీర్ విశేషాలు

24 మొత్తం గెలిచిన సింగిల్స్ టైటిల్స్
2 సాధించిన గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ (2018 ఫ్రెంచ్ ఓపెన్; 2019 వింబుల్డన్)
580 కెరీర్‌లో గెలిచిన మ్యాచ్‌లు
243 కెరీర్‌లో ఓడిన మ్యాచ్‌లు
1 అత్యుత్తమ ర్యాంక్ (అక్టోబర్ 9, 2017)
64 ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న వారాలు

గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో గెలుపోటములు (112/44)
→ ఆస్ట్రేలియన్ ఓపెన్ (12 సార్లు): 31/12
→ ఫ్రెంచ్ ఓపెన్ (11 సార్లు): 32/11
→ వింబుల్డన్ (10 సార్లు): 29/9
→ యూఎస్ ఓపెన్ (12 సార్లు): 20/12

సంపాదించిన మొత్తం ప్రైజ్‌మనీ
4,02,32,663 డాలర్లు
(రూ. 351 కోట్లు)

'నా భవిష్యత్తు గురించి ఇప్పుడెందుకు'

రోహిత్ శర్మ అసహనం



నాగ్‌పూర్: చాంపియన్స్ ట్రోఫీ తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మ వన్డే క్రికెట్ భవిష్యత్తు విషయంలో సెలక్టర్లు చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. సంధి దశను దాటి 2027 వన్డే వరల్డ్ కప్ కోసం టీమ్‌ను సిద్ధం చేసే క్రమంలో రోహిత్ ఆలోచనలేమిటో సెలక్టర్లు తెలుసుకోవాలని భావిస్తున్నారు. తన ప్రణాళికలు ఏమిటో చెప్పమంటూ రోహిత్‌ను వారు కోరినట్లు సమాచారం. వరల్డ్ కప్‌నాటికి రోహిత్‌కు 40 ఏళ్లు నిండుతాయి. పైగా ఇప్పటికే పేలవ ఫామ్‌తో అతని టెస్టు కెరీర్ దాదాపుగా ముగిసినట్లే అనిపిస్తోంది. మరో సీనియర్ విరాట్ కోహ్లి ఫామ్, ఫిట్‌నెస్‌తో పోలిస్తే రోహిత్ విషయంలోనే సెలక్టర్లు మరింత స్పష్టత ఆశిస్తున్నారు. అయితే ఈ పరిణామాలపై స్పందించేందుకు రోహిత్ నిరాకరించాడు. ప్రస్తుతం రాబోయే మ్యాచ్‌లపైనే తాను దృష్టి పెట్టినట్లు అతను స్పష్టం చేశాడు. 'ముందుగా మూడు వన్డేలు, ఆపై చాంపియన్స్ ట్రోఫీ ఉన్నాయి. ప్రస్తుతానికి నా దృష్టంతా వీటిపైనే. ఇలాంటి సమయంలో నా భవిష్యత్తు ప్రణాళిక గురించి చర్చించాల్సిన అవసరం ఏముంది. అసలు ఏమైనా సంబంధం ఉందా. నా భవిష్యత్తు గురించి ఎన్నో ఏళ్లుగా వార్తలు వస్తూనే ఉన్నాయి. వాటన్నంటికి వివరణ ఇచ్చేందుకు నేను ఇక్కడ లేను. టెస్టుల్లో వైఫల్యాలను ఇక్కడ పట్టించుకోను. ఇది పూర్తిగా వేరే ఫార్మాట్. వేరే సిరీస్. కెరీర్‌లో ఎన్నో ఎగుడుదిగుళ్లు చూశాను. ప్రతి రోజూ కొత్తగా మొదలవుతుంది. కాబట్టి గతం గురించి అనవసరంగా ఆలోచించకుండా ప్రస్తుతం జరిగే సిరీస్‌పైనే దృష్టి పెట్టాం' అని రోహిత్ వ్యాఖ్యానించాడు.

క్వార్టర్స్‌లో రియా-రష్మిక జోడీ



ముంబై: ఎల్ అండ్ టి ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక-రియా భాటియా (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-రియా ద్వయం 5-7, 6-2, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో మియా హొంటామా-క్యోకా ఒకమురా (జపాన్) జంటను ఓడించింది. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. రుతుజా భోస్లే (భారత్)-అలీసియా బార్నెట్ (బ్రిటన్); ప్రార్థన తొంబారే (భారత్)-అరీన్ హర్తానో (నెదర్లాండ్స్) జోడీలు కూడా క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. నేడు జరిగే సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అలెగ్జాండ్రా క్రునిక్ (సెర్బియా)తో రష్మిక; రెబెకా మరీనో (కెనడా)తో అంకిత రైనా; జరీనా దియాస్ (కజకిస్తాన్)తో మాయ రాజేశ్వరి తలపడతారు.

సాకేత్-రామ్ జంట శుభారంభం



చెన్నై: చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ 6-3, 6-1తో కిమర్ కాప్‌జాన్స్ (బెల్జియం)-ఎర్గీ కిర్కిన్ (టర్కీ) ద్వయంపై అలవోకగా గెలిచింది. 53 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్ ద్వయం ఎనిమిది ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోకుండా ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. భారత్‌కే చెందిన విజయ్ సుందర్ ప్రశాంత్-జీవన్ నెడుంజెళియన్ జంట 6-3, 3-6, 13-11తో చిరాగ్ దుహాన్-దేవ్ జావియా (భారత్) జోడీపై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరింది.

'విజయావకాశాలు 35% తగ్గుతాయి'

బుమ్రా లేకపోతే కష్టమన్న రవిశాస్త్రి


రవిశాస్త్రి, బుమ్రా

దుబాయ్: భారత స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనడం ఇంకా సందేహంగానే ఉంది. ఆ్రస్టేలియాతో చివరి టెస్టులో వెన్నునొప్పితో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయని బుమ్రా ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రీహాబిలిటేషన్‌లో ఉన్నాడు. అతను ఎంతవరకు కోలుకున్నాడనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. ఇంగ్లండ్‌తో చివరి వన్డే ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకుంటాడని చెబుతున్నా దానిపైనా సందేహాలు ఉన్నాయి. భారత జట్టుకు సంబంధించి అతని బౌలింగ్ విలువ ఎంత అమూల్యమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అతను చాంపియన్స్ ట్రోఫీకి దూరమైతే టీమిండియా బలహీనంగా మారిపోవచ్చు. మాజీ ఆటగాడు రవిశాస్త్రి కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. బుమ్రా గైర్హాజరు చాలా ప్రభావం చూపిస్తుందని అతను వ్యాఖ్యానించాడు. 'బుమ్రా ఫిట్‌గా లేకపోతే భారత జట్టు విజయావకాశాలు చాలా తగ్గిపోతాయి. సరిగ్గా చెప్పాలంటే 30-35 శాతం వరకు గెలుపుపై ప్రభావం పడుతుంది. అతను పూర్తి ఫిట్‌గా ఉండి బరిలోకి దిగితే ఆట స్వరూపమే మారిపోతుంది. ముఖ్యంగా చివరి ఓవర్లలో అతను కచ్చితంగా చెలరేగి గెలిపించగలడు. అయితే బుమ్రాను ఆడించే విషయంలో తొందర పడవద్దు. లేకపోతే గాయం తీవ్రత మరింత పెరిగిపోతుంది. కెరీర్ కీలక దశలో ఉన్న అతను రాబోయే రోజుల్లో ఎంతో ఆడాల్సి ఉంది. అలాంటివాడిని ఒక్కసారిగా పిలిపించి గెలిపించమని కోరడం సరైంది కాదు. బుమ్రా చాలా విలువైనవాడు. అతనిపై అంచనాలూ భారీగా ఉంటాయి. వచ్చి రాగానే చెలరేగిపోవాలని అంతా కోరుకుంటారు. నాకు తెలిసి గాయంనుంచి కోలుకొని వచ్చి అలా ఆడటం సాధ్యం కాదు' అని రవిశాస్త్రి విశ్లేషించాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో మొహమ్మద్ షమీపై అందరి దృష్టీ ఉంటుందని...అతని ఫిట్‌నెస్‌కు కూడా ఇది పరీక్ష కానుందని కూడా భారత మాజీ కోచ్ అభిప్రాయ పడ్డాడు.

రూ.1092 కోట్లు!

- నార్తర్న్ సూపర్ చార్జర్స్‌లో వాటాను కొన్న సన్ గ్రూప్
- 'హండ్రెడ్'లో సన్‌రైజర్స్ టీమ్ ఎంట్రీ


సన్‌రైజర్స్ ప్రతినిధి కావ్య మారన్

లీడ్స్: ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ)కి చెందిన 'హండ్రెడ్' లీగ్‌లో మరో ఐపీఎల్ జట్టు అడుగు పెట్టింది. యార్క్‌షైర్ కౌంటీ కేంద్రంగా ఉన్న నార్తర్న్ సూపర్ చార్జర్స్ టీమ్‌లో చెన్నైకి చెందిన సన్ గ్రూప్ 49 శాతం వాటాను కొనుగోలు చేసింది. దీని విలువ సుమారు 100 మిలియన్ బ్రిటన్ పౌండ్లు (సుమారు రూ.1092 కోట్లు)గా తెలుస్తోంది. బుధవారం కొనసాగిన అమ్మకంలో సన్ గ్రూప్ అత్యధిక మొత్తానికి బిడ్ చేసింది. సన్ గ్రూప్‌నకు ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ టీమ్‌తో పాటు సౌతాఫ్రికా టి20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ టీమ్ కూడా ఉంది. ఇప్పుడు ఆ గ్రూప్ తమ జాబితాలో మూడో క్రికెట్ టీమ్‌ను చేర్చింది. 'హండ్రెడ్'లో టీమ్ వాటాను కొనుగోలు చేసిన మూడో ఐపీఎల్ టీమ్ యాజమాన్యంగా సన్ గ్రూప్ నిలిచింది. ఇప్పటికే లక్నో సూపర్ జెయింట్స్ యాజమాన్యం మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టును, ముంబై ఇండియన్స్ (రిలయన్స్) యాజమాన్యం ఓవల్ ఇన్విన్సిబుల్స్ టీమ్‌ను సొంతం చేసుకున్నాయి. ఈ జాబితాలో మరో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం అయిన జీఎంఆర్ గ్రూప్ కూడా చేరే అవకాశం ఉంది. హండ్రెడ్‌లోని మరో టీమ్ సదరన్ బ్రేవ్‌ను జీఎంఆర్ కొనుగోలు చేయవచ్చని సమాచారం. 2024 'హండ్రెడ్' సీజన్‌లో నార్తర్న్ సూపర్ చార్జర్స్ పురుషుల, మహిళల జట్లు నాలుగో స్థానాల్లో నిలిచాయి. ఈ టీమ్ టోర్నీలో ఒక్కసారి కూడా విజేతగా నిలవలేదు. సూపర్ చార్జర్స్‌కు ప్రస్తుతం హ్యారీ బ్రూక్ కెప్టెన్‌గా, ఆండ్రూ ఫ్లింటాఫ్ కోచ్‌గా ఉన్నారు.

గుజరాత్ జెయింట్స్ కొత్త కెప్టెన్‌గా ఆష్లీ గార్డ్‌నర్

బెత్ మూనీ స్థానంలో నియామకం ● ఈనెల 14 నుంచి డబ్ల్యూపీఎల్


ఆష్లీ గార్డ్‌నర్

అహ్మదాబాద్: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తాజా సీజన్‌లో కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో గుజరాత్ జెయింట్స్ జట్టు బరిలోకి దిగనుంది. గత రెండు సీజన్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన బెత్ మూనీ బ్యాటింగ్‌పై దృష్టి పెట్టేందుకు సారథ్య బాధ్యతల నుంచి వైదొలిగింది. దాంతో బెత్ మూనీ స్థానంలో ఆ్రస్టేలియాకే చెందిన ఆల్‌రౌండర్ ఆష్లీ గార్డ్‌నర్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించారు. ఈ నెల 14 నుంచి డబ్ల్యూపీఎల్ మూడో సీజన్ ప్రారంభమవుతుంది. 2017లో ఆసీస్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన ఆష్లీ ఇప్పటి వరకు కెరీర్‌లో 95 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లాడి 1411 పరుగులు చేయడంతో పాటు 78 వికెట్లు పడగొట్టింది. కామన్వెల్త్ క్రీడల్లో ఆసీస్ జట్టు స్వర్ణం గెలవడంలో కీలక పాత్ర పోషించిన ఆమె 2023లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్'గా నిలిచింది. గత రెండు సీజన్‌లుగా గుజరాత్ జెయింట్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆష్లీ డబ్ల్యూపీఎల్‌లో 324 పరుగులు చేయడంతో పాటు 17 వికెట్లు తీసింది. 'గుజరాత్ జెయింట్స్ కెప్టెన్‌గా ఎంపికవడం గౌరవంగా భావిస్తున్నా. వచ్చే సీజన్‌లో జట్టును ముందుండి నడిపించేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా. యంగ్‌ప్లేయర్లు, అనుభవజ్ఞులతో జట్టు సమతూకంగా ఉంది' అని ఆష్లీ పేర్కొంది. తొలి రెండు సీజన్‌లలోనూ పెద్దగా రాణించలేకపోయిన గుజరాత్ జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంతో సరిపెట్టుకుంది. ఈ నెల 14న జరగనున్న సీజన్ ఆరంభ పోరులో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో గుజరాత్ జెయింట్స్ జట్టు తలపడుతుంది.

భారత బ్యాడ్మింటన్ జట్టులో జ్ఞాన దత్తు, తన్వీ రెడ్డి

న్యూఢిల్లీ: డచ్ ఓపెన్, జర్మనీ ఓపెన్ అండర్-17 జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లలో పాల్గొనే భారత జట్లను ప్రకటించారు. జాతీయ జూనియర్ చాంపియన్, హైదరాబాద్ కుర్రాడు జ్ఞాన దత్తుతోపాటు హైదరాబాద్‌కే చెందిన మరో ప్లేయర్ తన్వీ రెడ్డి భారత జట్టులోకి ఎంపికయ్యారు. డచ్ ఓపెన్ ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2 వరకు... జర్మన్ ఓపెన్ మార్చి 5 నుంచి 9 వరకు జరుగుతాయి.

మనుష్-దియా జోడీ ఓటమి

న్యూఢిల్లీ: సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మనుష్ షా-దియా చిటాలె (భారత్) ద్వయం పోరాటం ముగిసింది. బుధవారం సింగపూర్‌లో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మనుష్-దియా జోడీ 11-9, 4-11, 8-11, 8-11తో అల్వారో రాబెల్స్-మరియా జియో (స్పెయిన్) జంట చేతిలో ఓడిపోయింది. క్వార్టర్స్‌లో ఓడిన మనుష్-దియా జోడీకి 2000 డాలర్ల (రూ. 1 లక్ష 74 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

చాంపియన్స్ ట్రోఫీ నుంచి వైదొలిగిన అంపైర్ నితిన్ మేనన్

పాకిస్తాన్ గడ్డపై బాధ్యతలు నిర్వర్తించేందుకు విముఖం!



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ముగ్గురు రిఫరీలు, 12 మంది అంపైర్లతో కూడిన జాబితాను ప్రకటించింది. ఎలీట్ ప్యానెల్‌లో ఉన్న ఏకైక భారత అంపైర్ నితిన్ మేనన్‌కు ఈ జాబితాలో చోటు లభించలేదు. పాకిస్తాన్ గడ్డపై జరిగే మ్యాచ్‌లకు అంపైరింగ్ చేసేందుకు అతను ఇష్టపడలేదని సమాచారం. 'చాంపియన్స్ ట్రోఫీ అంపైర్ల జాబితాలో నితిన్‌ను కూడా చేర్చాలని ఐసీసీ భావించింది. అయితే వ్యక్తిగత కారణాలతో అతను తప్పుకున్నాడు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఐసీసీ తటస్థ అంపైర్ల నిబంధనల కారణంగా దుబాయ్‌లో భారత్ ఆడే మ్యాచ్‌లకు కూడా నితిన్ అంపైరింగ్ చేసే అవకాశం లేదు. అంపైర్ల జాబితాలో కుమార్ ధర్మసేన, క్రిస్ గాఫ్‌నీ, మైకేల్ గాఫ్, అడ్రియాన్ హోల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, ఎహ్‌సాన్ రజా, పాల్ రీఫెల్, షర్ఫుద్దౌలా, రాడ్నీ టకర్, అలెక్స్ వార్ఫ్, జోయెల్ విల్సన్ ఉండగా...డేవిడ్ బూన్, రంజన్ మదుగలే, ఆండ్రూ పైక్రాఫ్ట్ రిఫరీలుగా వ్యవహరిస్తారు.

ఫెరారీ రిజర్వ్ డ్రైవర్‌గా జో గ్వాన్‌యు



మారానెల్లో (ఇటలీ): ఫార్ములావన్‌లో బరిలోకి దిగిన తొలి చైనా డ్రైవర్‌గా గుర్తింపు పొందిన జో గ్వాన్‌యు తన కెరీర్‌లో గొప్ప పురోగతి సాధించాడు. 2025 సీజన్‌కుగాను విఖ్యాత ఫెరారీ జట్టులో రిజర్వ్ డ్రైవర్‌గా స్థానం దక్కించుకున్నాడు. రెండో రిజర్వ్ డ్రైవర్‌గా ఆంటోనియో జియోవినాజి కొనసాగుతాడు. ఈ సీజన్‌లో ఫెరారీ జట్టుకు రెగ్యులర్ డ్రైవర్లయిన లూయిస్ హామిల్టన్, చార్లెస్ లెక్‌లెర్క్‌లలో ఒకరు ప్రధాన రేసులో బరిలోకి దిగే అవకాశం లేకపోతే వారి స్థానాల్లో జో గ్వాన్‌యు లేదా జియోవినాజిలకు చాన్స్ లభిస్తుంది. 25 ఏళ్ల జో గ్వాన్‌యు 2022లో అల్ఫా రోమియో జట్టు తరఫున ఫార్ములావన్‌లో అరంగేట్రం చేశాడు. 2024లో అల్ఫా రోమియో జట్టు తమ పేరును సాబెర్‌గా మార్చుకుంది. వరుసగా మూడేళ్లు అల్ఫా రోమియో/సాబెర్ జట్టుకు ప్రధాన డ్రైవర్‌గా వ్యవహరించిన జో గ్వాన్‌యు మొత్తం 68 రేసుల్లో పోటీపడ్డాడు. ఓవరాల్‌గా ఏడుసార్లు టాప్-10లో నిలిచాడు. 2022లో కెనడా గ్రాండ్‌ప్రిలో, 2024లో ఖతర్ గ్రాండ్‌ప్రిలో గ్వాన్‌యు అత్యుత్తమంగా ఎనిమిదో స్థానంలో నిలిచాడు.

లాహ్లీలో కాదు కోల్‌కతాలో...

హరియాణా, ముంబై జట్ల మధ్య రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ వేదిక మార్పు



ముంబై: డిఫెండింగ్ చాంపియన్ ముంబై, హరియాణా జట్ల మధ్య ఈనెల 8 నుంచి జరగాల్సిన రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ వేదిక మారింది. హరియాణాలోని లాహ్లీలో జరగాల్సిన ఈ మ్యాచ్‌ను కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌కు మార్చారు. 'హరియాణాలో చలితీవ్రత అధికంగా ఉండటంతో పాటు... ఉదయం పూట పొగమంచు కప్పేస్తుండటంతో లాహ్లీలో నిర్వహించాల్సిన మ్యాచ్‌ను కోల్‌కతాకు మార్చినట్లు బీసీసీఐ నుంచి సమాచారం అందింది' అని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) అధ్యక్షుడు అజింక్య నాయక్ బుధవారం పేర్కొన్నారు. 42 సార్లు రంజీ ట్రోఫీ విజేతగా నిలిచిన ముంబై జట్టు ఈసారి కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే సారథ్యం వహిస్తున్న ముంబై జట్టులో భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పేస్ ఆల్‌రౌండర్లు శివమ్ దూబే, శార్దుల్ ఠాకూర్ వంటి పలువురు స్టార్ ఆటగాళ్లు ఉన్నారు. మిగిలిన మూడు క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారమే నిర్వహించనున్నారు. రాజ్‌కోట్ వేదికగా సౌరాష్ట్ర, గుజరాత్ క్వార్టర్ ఫైనల్... నాగ్‌పూర్ వేదికగా విదర్భ, తమిళనాడు పోరు... పుణేలో జమ్మూకశ్మీర్, కేరళ మ్యాచ్‌లు జరగనున్నాయి.

చాంపియన్స్ ట్రోఫీకి కమిన్స్, హాజల్‌వుడ్ దూరం!



సిడ్నీ: ఆ్రస్టేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్, పేస్ బౌలర్ హాజల్‌వుడ్ చాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగడం అనుమానంగా మారింది. టీమిండియాతో స్వదేశంలో 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' విజయం తర్వాత వ్యక్తిగత కారణాలతో జట్టుకు దూరమైన కమిన్స్... మడమ గాయానికి చికిత్స చేయించుకుంటున్నాడు. దీంతో ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో అతడు పాల్గొనడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ప్రాక్టీస్ ప్రారంభించని కమిన్స్ నేరుగా చాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగడం కష్టమని ఆ్రస్టేలియా హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు. 'కమిన్స్ పూర్తిగా కోలుకోలేదు. ఇంకా శిక్షణ కూడా మొదలు పెట్టలేదు. ఇలాంటి స్థితిలో అతడు చాంపియన్స్ ట్రోఫీలో ఆడటం అసాధ్యం. మరోవైపు పేసర్ హాజల్‌వుడ్ కూడా గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు' అని మెక్‌డొనాల్డ్ అన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన టీమ్‌లలో మార్పులు చేసుకునేందుకు ఈ నెల 12 వరకు గడువు ఉంది.

కోవిడ్ కారణంగా అల్జీమర్స్ ముప్పు

వెల్లడించిన అధ్యయనం

వాషింగ్టన్: కోవిడ్ సోకిన వారు అల్జీమర్స్ వ్యాధి బారిన పడే అవకాశాలు పెరుగుతున్నట్లు తాజాగా ఒక అధ్యయనంలో తేలింది. మధ్యస్థాయిలో కోవిడ్ కారణంగా ఆయా వ్యక్తుల మెదడులో అల్జీమర్స్ కారక ప్రోటీన్ క్రియాశీలకమవుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ పరిశోధకులు చేసిన అధ్యయనం వివరాలు తాజాగా 'నేచర్ మెడిసిన్'జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. బ్రిటన్‌లో కోవిడ్ బారిన పడి కోలుకున్న 46 నుంచి 80 ఏళ్ల వయసు వేలాది మంది వ్యక్తుల సమాచారాన్ని సేకరించి వాటిపై పరిశోధన చేయడంలో ఈ ఫలితాలొచ్చాయి. ''కోవిడ్ బారిన పడిన వారిలో మెదడులోని బీటా రకం ప్రోటీన్‌లో జీవక్రియలు గతంతో పోలిస్తే మరింత క్రియాశీలకమవుతున్నాయి. ఇవి త్వరలో మెదడు న్యూరాన్లు క్షీణించడానికి, అల్జీమర్స్(మతిమరుపు) వ్యాధి వచ్చే అవకాశాలను పెంచుతోంది. కోవిడ్ కాలంలో వచ్చే వాపు భవిష్యత్తులో ఈ వ్యాధి ముప్పుకు ప్రధాన కారణం. అయితే సార్స్-కోవ్2 వైరస్ అనేది అల్జీమర్స్‌కు నేరుగా హేతువు కాదుకానీ భవిష్యత్తులో అల్జీమర్స్ రిస్క్‌ను మాత్రం పెంచుతుంది. ఇప్పటికే అల్జీమర్స్ వచ్చే అవకాశాలు ఉన్న వ్యక్తుల్లో ఈ రిస్క్‌ను కోవిడ్ ఎగదోస్తుంది. పలు రక్త ప్రోటీన్లలోనూ మార్పుల కోవిడ్ కారణం. ఈ రక్త ప్రోటీన్లలో కొన్నింటికి మెదడులోని బీటా ప్రోటీన్‌తో సంబంధం ఉంది. కోవిడ్ కారణంగా మెదడులో పీటీపీఏయూ181 అనే ప్రోటీన్ స్థాయిలు పెరుగుతాయి. వీటి కారణంగా టవూ ప్రోటీన్ ముద్దలు ఏర్పడటం, ఈ ప్రతిబంధకాల కారణంగా న్యూరాన్లు దెబ్బతింటాయి. అది చివరకు మతిమరుపునకు దారితీస్తాయి''అని ఈ పరిశోధనలో ప్రధాన రచయిత డాక్టర్ ఎజీన్ డఫ్ వ్యాఖ్యానించారు. కోవిడ్ బారిన పడిన వారిలో డిమెన్షియా (చిత్రభ్రంశం) వ్యాధి ముప్పు పెరిగిన నేపథ్యంలో ఆ కోణంలోనే ఈసారి కూడా పరిశోధన చేశారు.

గుడ్ల దొంగలొచ్చారు

పాత తెలుగు సినిమాల్లో కామెడీ దొంగలుంటారు. వాళ్ల పని ఊళ్లో కోళ్లు పట్టడమే. ఎత్తుకొచ్చిన, కొట్టుకొచ్చిన కోళ్లను చక్కగా వండుకు తినే వాళ్లు కొందరైతే వాటిని ఎంతకో కొంతకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వాళ్లు ఇంకొందరు. అలాంటి దొంగలు ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికాలో పడ్డారు. అయితే వాళ్లు దొంగకోళ్లు పట్టేవాళ్లు కాదు. కోడిగుడ్లు కొట్టేసేవాళ్లు. పెరుగుతున్న కోడి గుడ్డు ధరను సొమ్ము చేసుకునేందుకు కొందరు ఈ 'గుడ్ల గుటకాయస్వాహ'పథకానికి వ్యూహ రచన చేశారు. అనుకున్నదే తడవుగా ఒకే దెబ్బకు 1,00,000కుపైగా గుడ్లను కొట్టేశారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని గ్రీన్‌క్యాసెల్ నగరంలో పీట్ అండ్ గ్యారీస్ ఆర్గానిక్స్ ఎల్ఎల్‌సీ సంస్థకు చెందిన లారీ నుంచి దొంగలు ఈ గుడ్లను దొంగతనం చేశారు. వీటి విలువ దాదాపు రూ.35 లక్షలు.

కొండెక్కుతున్న గుడ్డు ధర

ఎవరైనా కోళ్లను దొంగతనం చేస్తారు. వీళ్లేంటి కోడి గుడ్ల వెంట పడ్డారని అనుమానం రావొచ్చు. ఇందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి బర్డ్‌ఫ్లూ. రెండోది పెరుగుతున్న గుడ్ల ధర. అమెరికాలో గత రెండేళ్లుగా పలు ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ ప్రభావం నెమ్మదినెమ్మదిగా పెరుగుతూ వస్తోంది. గత దశాబ్దకాలంలో ఇంతటి విస్తృత స్థాయిలో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాపించడం ఇదే తొలిసారి. గత నెల లూసియానాలో మనుషులకు సైతం ప్రాణాంతకరమైన స్థాయి వేరియంట్ బర్డ్‌ఫ్లూను కనుగొన్నారు. దీంతో పౌల్ట్రీ యజమానులు ప్రతి నెలా లక్షలాది కోళ్లను చంపేస్తున్నారు. ఈ దొంగలు నిజంగానే కోళ్లను కొట్టేసి అమ్మినా జనం 'బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లు'అని భావించి ఎవరూ కొనక పోవచ్చు. బర్డ్‌ఫ్లూ భయంతో జనం చికెన్‌లాంటి పక్షి మాంసం వాడకం తగ్గించి చాలా మటుకు గుడ్లను తింటున్నారని తెలుస్తోంది. ఇందుకు పెరుగుతున్న కోడి గుడ్ల ధరలే ప్రబల తార్కాణం. మొత్తంగా చూస్తే కోడి గుడ్డు ధర రెట్టింపు అయినట్లు వార్తలొచ్చాయి. ఈ వార్తే దొంగలను గుడ్ల చోరీకి ఉసిగొల్పింది. దుకాణాల్లో పంపిణీ కోసం లారీలో సిద్ధంగా ఉంచిన గుడ్లను శనివారం రాత్రి ఆగంతకులు ఎత్తుకెళ్లిపోయారని పోలీసులు ప్రకటించారు. కేసు నమోదుచేసి గుడ్ల దొంగల కోసం పోలీసులు తీవ్రంగా గాలింపు చేపడుతున్నారు. అయితే దొంగలు ఈపాటికి గుడ్లను ఇష్టమొచ్చిన అధిక రేటుకు అమ్ముకుని మరో గుడ్ల షాపుపై రెక్కీ నిర్వహిస్తూ ఉంటారని కొందరు నెటిజన్లు సరదా వ్యాఖ్యల పోస్ట్‌లు పెట్టారు. గుడ్ల కొరత ఏర్పడటంతో గుడ్లతో చేసే వంటకాల ధరలూ రెస్టారెంట్లు, హోటళ్లలో పెరుగుతున్నాయి. అమెరికాలో 25 రాష్ట్రాల్లో దాదాపు 2,000 చోట్ల వ్యాపారం చేస్తున్న ప్రఖ్యాత వేఫుల్ హౌస్ రెస్టారెంట్ తమ గుడ్ల వంటకాల ధరను కాస్తంత పెంచింది. ''మార్కెట్లో గుడ్లు దొరకట్లేవు. ఎక్కువ ఖరీదు పెట్టి కొంటున్నాం. అందుకే ఎక్కువ ధరకు అమ్ముతున్నాం''అని రెస్టారెంట్ తాపీగా చెబుతోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్



1. బుధవారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ముందు చేతి వేలికి సిరా గుర్తును పెట్టించుకుంటున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2. ఓటేసిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులు. 3. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, 4. సోనియా గాంధీ 5. ఢిల్లీ సీఎం ఆతిశి

యూఎస్ఎయిడ్ ఉద్యోగులకు సెలవులు

30 రోజుల్లోగా స్వదేశానికి తిరిగిరావాలని ఆదేశం

వాషింగ్టన్: అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో పని చేస్తున్న యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ఎయిడ్) ఉద్యోగులను సెలవులపై ఉండాలని, విధులకు రావొద్దని ఆదేశించింది. అత్యవసర విధుల్లో ఉన్నవారికి మినహాయింపు ఇచ్చింది. యూఎస్ఎయిడ్‌లో ప్రత్యక్షంగా నియమితులైన ఉద్యోగులంతా బలవంతంగా సెలవులపై ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారంతా 30 రోజుల్లోగా స్వదేశానికి చేరుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం నోటీసును ఆన్‌లైన్‌లో పోస్టు చేసింది. యూఎస్ఎయిడ్ సంస్థ గత 60 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఇది అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటూనే స్వతంత్రంగా పనిచేసే సంస్థ. యుద్ధాలు, విపత్తులు, సంక్షోభాల్లో చిక్కుకున్న దేశాల్లో ప్రజలకు మానవతా సాయం అందించడం యూఎస్ఎయిడ్ బాధ్యత. ఇందుకోసం అమెరికా పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోంది. ఇటీవల డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఖర్చులకు కళ్లెం వేస్తున్నారు. ఇందులో భాగంగానే యూఎస్ఎయిడ్ ఉద్యోగులకు సెలవులు ఇచ్చేశారు. ప్రపంచదేశాల్లో ఈ సంస్థ కార్యకలాపాలను పూర్తిగా లేదా పాక్షికంగా రద్దుచేసే దిశగా ట్రంప్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. వేలాది మంది యూఎస్ఎయిడ్ సిబ్బందిని విధుల నుంచి తొలగించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. విదేశాలకు తామెందుకు ఆర్థిక సాయం అందించాలని ట్రంప్ ప్రశ్నిస్తున్నారు. అమెరికా ప్రజలు కట్టిన పన్నుల సొమ్మును వారి అభివృద్ధికే ఖర్చు చేస్తామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, యూఎస్ఎయిడ్ సిబ్బందిని ఇంటికి పంపించడాన్ని అమెరికన్ ఫారిన్ సర్వీసు అసోసియేషన్ వ్యతిరేకిస్తోంది. ట్రంప్ నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేస్తామని అంటోంది.

డోజ్‌కు రీడ్ ఓన్లీ యాక్సెస్

వాషింగ్టన్: ప్రభుత్వ చెల్లింపుల వ్యవస్థలో ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)కు 'రీడ్ ఓన్లీ యాక్సెస్' మాత్రమే ఉందని అమెరికా ట్రెజరీ శాఖ తెలిపింది. ఫెడరల్ ప్రభుత్వ చెల్లింపు వ్యవస్థలో డోజ్ ప్రమేయం భద్రతకు ముప్పన్న కాంగ్రెస్ సభ్యుల ఆందోళనల నేపథ్యంలో మంగళవారం వారికి ఈ మేరకు లేఖ రాసింది. డోజ్‌కు అనుమతివ్వడం వల్ల సామాజిక భద్రత, మెడికేర్ వంటి చెల్లింపుల్లో ఆలస్యం, దారి మళ్లింపుల వంటివేవీ జరగవని పేర్కొంది. సున్నితమైన చెల్లింపు వ్యవస్థలకు డోజ్‌ను అనుమతించడాన్ని నిరసిస్తూ వందలాది మంది మంగళవారం ట్రెజరీ భవనం ముందు ఆందోళనకు దిగారు. 'మస్క్‌ను బహిష్కరించాలి', 'ట్రంప్ డౌన్ డౌన్', 'డూ యువర్ జాబ్ కాంగ్రెస్'అంటూ నినాదాలు చేశారు. డజను మందికి పైగా డెమొక్రటిక్ చట్టసభ సభ్యులు వారికి సంఘీభావంగా మాట్లాడారు.

నన్ను హతమారిస్తే ఇరాన్‌లో ఏమీ మిగలదు

- ట్రంప్ ఘాటు హెచ్చరికలు
- ఇరాన్‌పై ఒత్తిడికి ఆదేశాలు

వాషింగ్టన్: ఇరాన్ తనను అంతమొందించాలని చూస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆరోపించారు. అదే జరిగితే ఆ ప్రాంతంలో ఏమీ మిగలదంటూ తీవ్రంగా హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధి యత్నాల నేపథ్యంలో ఆ దేశంపై 'గరిష్ఠ ఒత్తిడి'విధానాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉత్తర్వులపై మంగళవారం సంతకం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ చర్యలపై ట్రంప్ కొంత విచారం వ్యక్తం చేశారు. ''ఇది చాలా కఠిన నిర్ణయం. ఇరాన్‌పై చర్యలు తీసుకోవాలా, వద్దా అని పలుమార్లు ఆలోచించా. ఇరాన్‌పై కఠిన ఆంక్షలు నాకు సంతోషం కాదు. ఆ దేశంతో ఒప్పందానికి అమెరికా సిద్ధం. ఆ దేశాధినేతతో మాట్లాడేందుకూ సుముఖత వ్యక్తం చేశా. కానీ అణు కార్యకలాపాల విషయంలో మాత్రం చూస్తూ ఊరుకునేది లేదు. ఎందుకంటే అమెరికా బలంగా ఉండాలి''అని వ్యాఖ్యానించారు. చమురు ఎగుమతి ఆంక్షలను కఠినంగా అమలు చేయడంలో మాజీ అధ్యక్షుడు జో బైడెన్ విఫలమయ్యారని ఆరోపించారు. మధ్యప్రాచ్యంలో అణ్వాయుధ కార్యక్రమం, సాయుధ ముఠాలకు నిధులు సమకూర్చడానికి చమురును విక్రయాలకు అనుమతించడం ఇరాన్‌కు ధైర్యానిచ్చిందన్నారు. ఇరాన్ నుంచి అమెరికాకు 2022లో 54 బిలియన్ డాలర్లు, 2023లో 53 బిలియన్ డాలర్ల చమురు ఎగుమతులు జరిగాయి. ట్రంప్ తన తొలి పదవీకాలం 2017–20 మధ్య ఇరాన్ నుంచి అమెరికాలోకి చమురు దిగుమతులను పూర్తిగా నిషేధించారు. యురేనియం శుద్ధిని ఇరాన్ వేగవంతం చేస్తోందని, అది అణ్వాయుధ గ్రేడ్ స్థాయికి దగ్గరగా ఉందని ఐరాస అణు సంస్థ గత డిసెంబర్‌లో ప్రకటించారు. అణ్వాయుధాలను అభివృద్ధి చేయడం లేదని ఇరాన్ పేర్కొంది.

ఒక స్కూటర్ ట్రాఫిక్ చలాన్లు 311

రూ.1,61,500 జరిమానా

బెంగళూరు: అరవీర భయంకరంగా బ్యాటింగ్ చేసే బ్యాటర్ క్రికెట్ మైదానంలో 300 పరుగులు చేస్తే అద్భుతం అంటాం. అయితే ఒక గేర్‌లెస్ స్కూటర్ యజమాని క్రికెట్ గ్రౌండ్‌లో కాకుండా నడిరోడ్డుపై ట్రిపుల్ సెంచరీచేశాడు. అయితే అది పరుగుల రూపంలో కాకుండా ట్రాఫిక్ చలాన్ల రూపంలో. ఒకే స్కూటర్‌పై ఏకంగా 311 ట్రాఫిక్ ఉల్లంఘన చలాన్లు ఉండటం చూసి కర్ణాటకలోని వాహన వినియోగదారులు ఔరా అని అచ్చెరువొందారు. ఈ ఘటనకు బెంగళూరు మహానగరం వేదికైంది. సోమవారం బెంగళూరు సిటీ మార్కెట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఈ స్కూటర్ యజమాని ఈ 311 చలాన్లకు జరిమానా కింద రూ.1,61,500 కట్టేసి జప్తులో ఉన్న వాహనాన్ని తీసుకెళ్లడంతో ఈ కథ సుఖాంతంగా ముగిసింది.

ఇన్ని చలాన్లు ఎలా ?

కలాసిపాళ్య ప్రాంతానికి చెందిన పెరియస్వామికి ఒక గేర్‌లెస్ స్కూటర్ ఉంది. ఇతను ట్రావెల్ ఏజెన్సీ వ్యాపారం చేస్తాడు. ఇతనికి సమీప బంధువు సుదీప్ వ్యాపార భాగస్వామిగా ఉన్నాడు. సుదీప్‌కు తరచూ స్కూటర్‌పై వెళ్తూనే ఫోన్ మాట్లాడే అలవాటు ఉంది. హెల్మెట్ అస్సలు ధరించడు. ట్రావెల్ ఏజెన్సీ వ్యవహారాలన్నీ బండితోపాటే ఫోన్‌లోనే నడిపిస్తాడు. అత్యధికంగా ఇతను నడిపేటప్పుడు ఎక్కువ ట్రాఫిక్ చలాన్లు నమోదయ్యాయి. రెడ్ సిగ్నల్ దాటి వెళ్లడం, రాంగ్ రూట్, హెల్మెట్ ధరించకపోవడం, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ ఇలా పలు రకాల చలాన్లు అలా పడుతూనే ఉన్నాయి. సుదీప్‌గానీ, స్కూటర్ యజమాని పెరియస్వామిగానీ ఏనాడూ ఈ చలాన్లు కట్టలేదు. దీంతో చలాన్లు చాంతాడంత పెరిగిపోయాయి. పెరియస్వామి, సుదీప్, మరో వ్యక్తి ఈ స్కూటర్‌ను వాడినట్లు తెలుస్తోంది.

ఓ వ్యక్తి ఫిర్యాదుతో

శిభమ్ అనే వ్యక్తి సరదాగా చలాన్లను ఆన్‌లైన్‌లో చెక్ చేస్తున్న సమయంలో ఈ స్కూటర్ నంబర్ ప్లేట్ మీద వేల రూపాయల చలాన్లు నమోదైన విషయం గుర్తించినట్లు తెలుస్తోంది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో శిభమ్ ఇటీవల ఒక భారీ పోస్ట్ పెట్టారు. ''ఈ స్కూటర్‌పై నమోదైన చలాన్ల సంఖ్యను గత ఏడాది కాలంగా గమనిస్తూ ఉన్నా. ఎప్పటికప్పుడు కొత్త చలాన్లు వస్తూనే ఉన్నాయి. కట్టాల్సిన జరిమానా పెరుగుతూనే ఉంది. ఇప్పుడది రూ.1లక్ష నుంచి రూ.1,60,000 దాటింది. ఇప్పటికైనా పోలీసులు మేలుకొని దానిని సీజ్ చేస్తారా? లేదంటే కొత్త రికార్డ్ సృష్టించేదాకా అలాగే రోడ్లపై తిరగనిస్తారా?''అంటూ అతను చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. దీంతో బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం అంటూ నెటిజన్లు దుమ్మెత్తి పోశారు. విషయం చివరకు పోలీసులకు తెలియడంతో నష్ట నివారణ చర్యల్లో భాగంగా ఓనర్‌ను పిలిపించి స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అప్పటికిగానీ ఓనర్‌కు ఈ విషయం తెలియలేదు. పోలీస్‌స్టేషన్‌కు బంధువు సుదీప్‌ను రప్పించి వాళ్ల ముందే చీవాట్లు పెట్టినట్లు వార్తలొచ్చాయి. 311 చలాన్లను ఒకేసారి ప్రింట్ తీస్తే 20 అడుగుల పొడవు పేపర్ బయటికొచ్చింది.

ఎట్టకేలకు హెల్మెట్

వందల చలాన్ల గేర్‌లెస్ స్కూటర్ అంశం నగరంలో హాట్‌టాపిక్‌గా మారడంతో పోలీసులు వెంటనే యజమానితో జరిమానా మొత్తాన్ని కట్టేలా ఒప్పించినట్లు వార్తలొచ్చాయి. సోమవారం సుదీప్ ఈ మొత్తాన్ని కట్టేసి వాహనాన్ని వెంటతీసుకెళ్లారు. ఈ సందర్భంగా సుదీప్ ఒక కొత్త హెల్మెట్‌ను ధరించారు. ''ఇకనైనా చలాన్ల సెంచరీలు కొట్టడం ఆపండి''అని పోలీసులు అతనికి హితబోధ చేసి పంపించారు. జరిమానా కట్టించుకుని ఊరకే వదిలేయకుండా ఇలాంటి వాళ్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలని కొందరు నెటిజన్లు డిమాండ్‌చేశారు.

యూజీసీ ముసాయిదా నిబంధనలు ఉపసంహరించుకోవాలి

- బీజేపీయేతర పాలిత రాష్ట్రాల డిమాండ్
- బెంగళూరులో ఆరు రాష్ట్రాల మంత్రుల సమావేశం

బెంగళూరు: విశ్వవిద్యాలయ నిధుల సంఘం(యూజీసీ) ముసాయిదా నిబంధనల పట్ల బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. ఈ నిబంధనలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. కర్ణాటక రాజధాని బెంగళూరులో బుధవారం ఆరు రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ మంత్రుల సదస్సు జరిగింది. కర్ణాటక ప్రభుత్వ ఆహ్వానం మేరకు కేరళ మంత్రి ఆర్.బిందు, తమిళనాడు మంత్రి గోవి చెళియన్, హిమాచల్‌ప్రదేశ్ మంత్రి రోహిత్ ఠాకూర్, తెలంగాణ ప్రభుత్వం తరఫున ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, జార్ఖండ్ ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే సుదివ్యకుమార్ పాల్గొన్నారు. యూజీసీ ముసాయిదా నిబంధనలపై విస్తృతంగా చర్చించారు. ఈ ముసాయిదాలో ఎన్నో లోపాలున్నాయని అభిప్రాయపడ్డారు. సదస్సు అనంతరం కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎం.సి.సుధాకర్ మీడియాతో మాట్లాడారు. యూజీసీ ముసాయిదా విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలతో చర్చించాలని అన్నారు. కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదని చెప్పారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో ప్రొఫెసర్లుగా, అధ్యాపకులుగా చేరేచేరేవారికి, పదోన్నతి పొందేవారికి కనీస విద్యార్హతలు ఉండాలని పేర్కొంటూ యూజీసీ కొత్త నిబంధనలు రూపొందించింది. అకడమిక్ స్టాఫ్‌కు సైతం విద్యార్హతలు నిర్దేశించింది. ఉన్నత విద్యావ్యవస్థలో ప్రమాణాలు పాటించడానికి కొన్ని నిబంధనలు రూపొందించింది. ఎవరైనా యూనివర్సిటీలో వైస్‌చాన్సలర్‌గా నియామకం కావాలంటే 24 ఏళ్ల సర్వీసు ఉండాలి. వేర్వేరు బాధ్యతలు నిర్వర్తించి ఉండాలి. ఇలాంటి నిబంధనలను బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. యూజీసీ నిబంధనలను తాము ఆమోదించబోమని చెబుతున్నాయి. ఈ విషయంలో వివిధ రాష్ట్రాల ఉన్నత విద్యాశాఖ మంత్రులతో వచ్చే నెలలో తమ రాష్ట్రంలో ఒక సదస్సు నిర్వహించాలని కేరళ ప్రభుత్వం భావిస్తోంది.

వలసదారులతో గ్వాంటనామోకు తొలి విమానం

వాషింగ్టన్: అక్రమంగా అమెరికాలోకి చొరబడిన విదేశీయులను ట్రంప్ సర్కార్ క్యూబాలోని గ్వాంటనామో కారాగారానికి తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. కొద్దిమంది వలసదారులను తరలిస్తున్న అమెరికా సైనిక విమానం మంగళవారం సాయంత్రం 'గ్వాంటనామో బే'కు చేరుకుందని అమెరికా అధికారి బుధవారం ప్రకటించారు. ఇరవై మూడేళ్ల క్రితం సెప్టెంబర్ 11 వైమానిక దాడి ఘటనతో సంబంధం ఉన్న నేరస్థులనే ఎక్కువగా ఈ కారాగారంలో బంధించగా మళ్లీ ఇన్నాళ్లకు అక్రమ వలసదారుల నిర్బంధం కోసం ఈ జైలును వాడటం ఇదే తొలిసారి. 30,000 మంది ఖైదీల సామర్థ్యమున్న ఈ జైలును సరైన డాక్యుమెంట్లు లేని అక్రమ వలసదారుల నిర్బంధ కేంద్రంగా వినియోగిస్తామని ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించడం తెల్సిందే. అయితే గ్వాంటనామోను వలసదారుల జైలుగా మార్చడాన్ని 'వలసదారులు, శరణార్థుల హక్కుల కార్యక్రమం'డైరెక్టర్ అమీ ఫిషర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇప్పటికే ఈక్వెడార్, గ్వామ్, హోండురాస్, పెరూ, కొలంబియా, భారత్‌లకు అమెరికా అక్రమ వలసదారులను విమానాల్లో తరలించే ప్రక్రియ మొదలుపెట్టడం తెల్సిందే.

అప్పు కంటే ఎక్కువే కట్టా

కర్ణాటక హైకోర్టును ఆశ్రయించిన విజయ్ మాల్యా

సాక్షి బెంగళూరు: కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్ లిమిటెడ్ (యూబీహెచ్ఎల్) నుంచి బ్యాంకులు వసూలు చేయాల్సిన రూ.6,200 కోట్ల కంటే ఎన్నో రెట్లు అధికంగా రాబట్టుకున్నాయని పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా పేర్కొన్నారు. రూ.14 వేల కోట్లకు పైగా రికవరీ చేశాయన్నారు. రుణాల రికవరీ ప్రక్రియలో భాగంగా తన కంపెనీల నుంచి బ్యాంకులు వసూలు చేసిన అసలు, వడ్డీల తదితర వివరాలను అందించేలా వాటిని ఆదేశించాలంటూ బుధవారం కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున యూబీహెచ్ఎల్ డైరెక్టర్ దల్జిత్ మహల్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. మాల్యా రుణంలో రూ.10, 200 కోట్ల దాకా వసూలు చేసినట్లు రికవరీ అధికారులు కూడా తెలిపినట్లు ఆయన తరఫు న్యాయవాది గుర్తు చేశారు. రూ.14 వేల కోట్లను రికవర్ చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా గతంలో లోకసభకు వెల్లడించారన్నారు. అయినా ఇప్పటికీ అప్పులు వసూలైనట్లు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదన్నారు. ''రుణ వసూలు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఇకపై ఎలాంటి వసూళ్లూ చేయకుండా, ఆస్తులను విక్రయించకుండా స్టే ఇవ్వండి''అని కోరారు. దాంతో సంబంధిత బ్యాంకులు, రుణ రికవరీ అధికారులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేసింది. బ్యాంకులకు మాల్యా వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టి దేశం విడిచి పారిపోవడం తెలిసిందే.

అమెరికాలో కాల్పులు

ఒకరి మృతి

న్యూ అల్బనీ(యూఎస్): అమెరికాలో మళ్లీ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఒహాయో రాష్ట్రంలోని న్యూ అల్బనీ నగరంలోని కేడీసీ/వన్ కాస్మెటిక్స్ గిడ్డంగిలో మంగళవారం రాత్రి పదిన్నర గంటలకు ఒక గుర్తు తెలియని వ్యక్తి జరిపిన కాల్పుల్లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పారిపోయిన దుండగుడిని బుధవారం ఉదయం 24 కిలోమీటర్ల దూరంలోని డౌన్‌టౌన్ కొలంబస్ ప్రాంతంలో పోలీసులు అరెస్ట్‌చేశారు. కాల్పుల ఘటనకు కారణాలు ఇంకా తెలియరాలేదు. కాల్పులు జరిపేందుకు ఉపయోగించిన గన్‌ను దుండగుడు అక్కడే వదిలేసి పారిపోయాడని తర్వాత ఎవరికీ హాని తలపెట్టలేదని పోలీసులు చెప్పారు. కాల్పుల ఘటన జరిగినప్పుడు గిడ్డంగిలో 140 మంది ఉన్నట్లు తెలుస్తోంది.

ఫ్రాన్స్‌లో వీగిన అవిశ్వాస తీర్మానం

పారిస్: ఫ్రాన్స్ ప్రభుత్వం అవిశ్వాస గండం నుంచి గట్టెక్కింది. బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో తీర్మానానికి మద్దతుగా తగినన్ని ఓట్లు పడకపోవడంతో అది వీగిపోయింది. పార్లమెంట్ దిగువసభ అయిన నేషనల్ అసెంబ్లీలో 577 మంది సభ్యులకుగాను కనీసం 289 మంది మద్దతుగా ఓటేస్తేనే అవిశ్వాస తీర్మానం నెగ్గి ప్రభుత్వం కూలుతుంది. కానీ కేవలం 128 మంది మాత్రమే అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటేశారు. తమ తీర్మానానికి మద్దతు పలకలేదని సోషలిస్ట్‌లు, అతివాద నేషనల్ ర్యాలీ పార్టీల సభ్యులు తెలిపారు. అవిశ్వాస తీర్మానం వీగిన నేపథ్యంలో ఈ ఏడాదికి బడ్జెట్ అమలుకు అవాంతరాలు తొలగిపోయాయి.

పథకం విఫలమైందని మోదీ ఒప్పుకోవాలి

'మేక్ ఇన్ ఇండియా'పై రాహుల్ గాంధీ వ్యాఖ్య



న్యూఢిల్లీ/పట్నా: ప్రధాని మోదీ సారథ్యంలో ఎన్‌డీఏ సర్కార్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించి అమలు చేసిన 'మేక్ ఇన్ ఇండియా'పథకం ఘోర వైఫల్యం చెందిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ పథకం విఫలమైందని ప్రధాని మోదీకి కూడా తెలుసుకాబట్టి ఆయన ప్రసంగంలో ఈ పథకం పేరును కూడా ప్రస్తావించలేదని రాహుల్ ఆరోపించారు. బుధవారం 'ఎక్స్'లో రాహుల్ పలు పోస్ట్‌లు పెట్టారు. ''మోదీజీ.. లోక్‌సభలో మీరు ప్రసంగిస్తూ మేక్ ఇన్ ఇండియా పథకం ప్రస్తావన కూడా తేలేదు. పథకం మంచిదే అయినప్పటికీ దానిని సమర్థంగా అమలుచేయలేక దాని వైఫల్యానికి కారణమయ్యారు. ఈ పథకం విఫలమైందని మీరు ఒప్పుకుని తీరాల్సిందే. దేశంలో 2014లో స్థూల జాతీయోత్పత్తిలో తయారీరంగం వాటా 15.3 శాతంగా ఉంటే ప్రస్తుతం అది 12.6 శాతానికి పడిపోయింది. ఇది 60 ఏళ్ల కనిష్టం''అని రాహుల్ వ్యాఖ్యానించారు. ''భారత యువత సరైన ఉపాధి అవకాశాల కోసం ఎంతగానో ఎదురుచూస్తోంది. ఇటీవలికాలంలో యూపీఏ కావొచ్చు ఎన్‌డీఏ కావొచ్చు. అధికారంలో కొనసాగిన ఏ కూటమి ప్రభుత్వాలైనా యువత ఉపాధి డిమాండ్లను జాతీయస్థాయిలో తీర్చలేకపోయాయి. ఇకనైనా తయారీరంగానికి పునరుజ్జీవం కల్పించి భవిష్యత్తులో అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థలో పోటీపడే స్థాయికి తీర్చిదిద్దాలి''అని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ద్వయం రాజ్యాంగంపై దాడికి పాల్పడుతోందని రాహుల్ ఆరోపించారు. బిహార్ రాజధాని పట్నాలో బుధవారం జరిగిన దళిత స్వాతంత్ర్య సమర యోధుడు, కాంగ్రెస్ నేత జగ్‌లాల్ చౌదరి జయంతి కార్యక్రమంలో రాహుల్ మాట్లాడారు. ''ఈరోజు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఎంత ముఖ్యమో ఈ సభ కూడా అంతే ముఖ్యం. అందుకే ఢిల్లీలో ఓటేసి నేరుగా పట్నాకు వచ్చా. ప్రస్తుతకాలంలో అన్ని రంగాల్లోనూ దళితులు, గిరిజనులు, ఓబీసీలకు మెరుగైన భాగస్వామ్యం దక్కాలి. ఒక్క రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటే సరిపోదు''అని అన్నారు. రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ.. ''ఇది బలీయంగా అమలైనన్ని రోజులూ దళితులు, అణగారిన వర్గాలు సమాజంలో మెరుగైన జీవితం గడపొచ్చనే భరోసా ఉంటుంది. ఇది గమనించిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ ద్వయం రాజ్యాంగంపై దాడికి చేస్తున్నాయి'' అని రాహుల్ అన్నారు.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరు ఉధృతం చేయండి

భద్రతా దళాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద భూతంపై పోరాటం మరింత ఉధృతం చేయాలని భద్రతా దళాలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశించారు. అక్రమ చొరబాట్లను పూర్తిగా అరికట్టాలని చెప్పారు. చొరబాటుదార్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతలపై అమిత్ షా బుధవారం ఢిల్లీలో రెండు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ భేటీల్లో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోపాటు హోంశాఖ ఉన్నతాధికారులు, సైనికాధికారులు, పోలీసులు, పారామిలటరీ దళాల అధికారులు పాల్గొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన పటిష్టమైన చర్యలతో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం చాలావరకు బలహీనపడిందని ఈ సందర్భంగా అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదులను పూర్తిగా ఏరిపారేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే మన లక్ష్యమని భద్రతా దళాలకు దిశానిర్దేశం చేశారు. ఉగ్రవాదుల కార్యకలాపాలను సహించడానికి వీల్లేదన్నారు. జమ్మూకశ్మీర్ నుంచి ఉగ్రవాదాన్ని సమూలంగా తుడిచిపెట్టేయడానికి మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని అమిత్ షా వివరించారు. భద్రతా సిబ్బంది కలసికట్టుగా పనిచేస్తే ముష్కరుల భరతం పట్టడం కష్టమేమీ కాదన్నారు. జమ్మూకశ్మీర్‌లో మాదకద్రవ్యాల ముఠాలు చురుగ్గా పని చేస్తున్నాయని, చొరబాటుదార్లకు, ఉగ్రవాదులకు సహకరిస్తున్నాయని, ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ గ్యాంగ్‌ల నుంచి ఉగ్రవాదులకు నిధులు అందకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో కొత్త నియామకాలు చేపట్టాలన్నారు. జమ్మూకశ్మీర్‌లో మన భద్రతా సిబ్బంది కృషి వల్ల శాంతి భద్రతలు చాలావరకు మెరుగుపడ్డాయని అమిత్ షా ప్రశంసించారు.

'బర్త్ రైట్' ఉత్తర్వులపై మరో స్టే

గ్రీన్‌బెల్ట్ (యూఎస్): జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన ఉత్తర్వులపై మరో కోర్టు స్టే ఇచ్చింది. మేరీలాండ్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి దెబొరా బోర్డ్‌మన్ మంగళవారం ఈ మేరకు నిర్ణయం వెలువరించారు. పౌరసత్వానికి సంబంధించి 14వ రాజ్యాంగ సవరణకు ట్రంప్ యంత్రాంగం భాష్యాన్ని ఏ కోర్టూ సమర్థించడం లేదని ఆమె ఈ సందర్భంగా ఆక్షేపించారు. పౌరసత్వ రద్దు నిర్ణయాన్ని ఇప్పటికే 22 రాష్ట్రాలు సవాలు చేయడం, ట్రంప్ ఉత్తర్వులపై కోర్టు స్టే విధించడం తెలిసిందే.

ప్రాచీన కాలంలో ప్రధాన ఓడరేవు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ప్రాచీన భారతదేశ పట్టణీకరణ

రాఖీగర్హ్, మొహంజొదారో, కాళీభంగన్, దోలవీరాలను పరిశీలించాక పట్టణ ప్రణాళిక విషయంలో ఆనాటి పట్టణాల్లో ఏకరూపత ఉన్నట్లు తెలుస్తోంది. నగరాల్లో పశ్చిమ వాయవ్య ప్రాంతాలు ఎత్తుగా ఉండి, తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు పల్లంగా కనిపిస్తున్నాయి. ఎత్తుగా ఉండే ప్రాంతాన్ని కోట అని పిలిచారు. కోట్‌డిజి వంటి వాటి ద్వారా కోట చుట్టూ ఆగడ్త ఉండటమే కాకుండా, కోట పై భాగంలో బురుజులున్నాయి అని తెలుస్తోంది. 12-14 అడుగుల ఎత్తు వరకు ప్రాకారాలు సురక్షితంగా ఉన్నట్లు అవగతమవుతోంది.

మొహంజొదారోలో స్నానవాటిక, రెండు స్థూపాలు, స్తంభ మండపం, కళాశాల భవనం వంటి నిర్మాణాలను గుర్తించారు. హరప్పాలో దిగువ భాగాన ఒక గ్రామం, ఒక దిబ్బ ఉండి, దిబ్బకు తూర్పు వైపున పోలీస్‌స్టేషన్ వంటి నిర్మాణ విశేషాన్ని కనుగొన్నారు. ప్రధాన వీధులు 4 నుంచి 6 మీటర్ల వరకు వెడల్పుతో ఉండేవి. రోడ్లన్నీ ఉత్తరం నుంచి దక్షిణం వైపుకు ఒకదానికొకటి లంబ కోణంలో ఉన్నాయి. లోథాల్ (గుజరాత్) వంటి పట్టణాల్లో కుమ్మరులు, లోహ కర్మ, శిలాకర్మలు చేసే వారి కార్ఖానాలు ఏర్పడ్డాయి.

పట్టణాలన్నింటిలో రోడ్ల పక్కన మురుగునీటి కాల్వలను నిర్మించారు. ఈ కాల్వల తయారీకి కాల్చిన ఇటుకలను ఉపయోగించారు. ఈ మురుగు నీటి కాల్వలను బాగు చేయడానికి అనువుగా నియమిత అంతరాల్లో మనిషి దిగడానికి కావాల్సిన రంధ్రాలను ఏర్పర్చారు. అదేవిధంగా ఎక్కువగా పారిన నీరు ఇంకడానికి చిన్న చిన్న గోతులను తవ్వారు.

ప్రత్యేక నిర్మాణాలు

మొహంజొదారోలో గొప్ప స్నాన వాటిక, స్తంభ మండపం, హరప్పాలో ధాన్యాగారాలు, లోథాల్‌లో ఓడరేవును గుర్తించారు. మొహంజొదారోలోని స్నానవాటిక 30×23×8 అడుగుల కొలతలతో నిర్మితమైంది. దీని గోడలు నీరు ఇంకకుండా ఏర్పడ్డాయి. దీనికి ఒకవైపు మెట్లవరుస, గ్యాలరీలా కూర్చోవడానికి వీలుగా నిర్మాణాలు ఉన్నాయి. దీనికి పైభాగంలో కొన్ని వరండాలు, గదులు కూడా ఉన్నాయి. హరప్పాలోని ధాన్యాగారాలను 50×20 అడుగుల కొలతతో ఆరు నిర్మాణాలను నదీ తీరాన నిర్మించారు. రెండు వరుసల్లో మొత్తం 12 ధాన్యాగారాలు ఉన్నాయి. లోథాల్ ప్రసిద్ధ ఓడరేవు. దీన్ని నదికి జతపరుస్తూ కృత్రిమ కాల్వలను తవ్వారు. ఈ నిర్మాణాలన్నింటికి ఒకే కొలతతో కూడిన కాల్చిన ఇటుకలను వాడారు. ఇటుకలు 11×5.5×2.75 అంగుళాల్లో, 4:2:1 నిష్పత్తిలో పొడవు, వెడల్పు, మందాన్ని కలిగి ఉండేవి.

నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావం

నాగరికత కాలాల్లోని కట్టడాల్లో బానిసలను అధిక సంఖ్యలో వినియోగించినట్లు వాల్టేర్ రూబెన్ అభిప్రాయం. ఇళ్ల పరిమాణాల్లోని మార్పులు, వివిధ విలాసాల ఉనికిని బట్టి కొందరు చరిత్రకారులు సమాజంలోని అంతరాలను ఊహించారు. సామాజిక ప్రక్రియలో ప్రయోజనాత్మక గమనశీలత.. పట్టణ నిర్మాణ వ్యవస్థ, ప్రణాళికలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేయగా నగర, గ్రామ సంబంధాలు పట్టణ వ్యవస్థ అస్థిత్వానికి దోహదపడ్డాయి. కానీ వ్యవసాయక వృత్తుల ప్రాముఖ్యత కలిగిన గ్రామీణ నిర్మాణాల గురించి ఎలాంటి ఆధారాలు లభించడం లేదు.

రెండో పట్టణీకరణ

క్రీ.పూ. 600-300 మధ్యకాలంలో గంగానది లోయలో చోటు చేసుకున్న పట్టణీకరణను భారత ఉపఖండంలో రెండో పట్టణీకరణగా పేర్కొంటారు. రాజ్‌గాట్, చిరండ్ తవ్వకాల్లో లభ్యమైన ఆధారాలను బట్టి ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలో, బీహార్ పశ్చిమ ప్రాంతంలో ఇనుము వినియోగం విస్తృతంగా ఉండేదని తెలుస్తోంది. ఈ ఇనుము వాడకం విశాల సామ్రాజ్య స్థాపనకు దారి తీసింది. ఈ సామ్రాజ్యాలన్నీ సైనికపరంగా ఆయుధ సంపత్తితో కూడుకొన్నవి. వీటిలో యుద్ధవీరుల వర్గం ప్రధాన పాత్ర పోషించింది. కొత్త వ్యవసాయ పనిముట్లు రైతులు అధిక ఉత్పత్తి చేయడానికి దోహదం చేశాయి. ఈ ఉత్పత్తులు పాలక వర్గ అవసరాలను తీర్చడమే కాకుండా అసంఖ్యాకమైన ఇతర నగరాలను పోషించాయి. ఈ భౌతిక వస్తు వినియోగశక్తి కోసల, మగధ సామ్రాజ్యాల విస్తరణకు దోహదం చేసింది. వైదికేతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ సామ్రాజ్యాల్లో కలిసిపోయారు. తద్వారా కొత్త సామ్రాజ్యాలు పరిపాలనా సంబంధమైన కొత్త సమస్యలను, సామాజికంగా ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొన్నాయి.

పాళీ, సంస్కృత గ్రంథాల్లో పేర్కొన్న అనేక నగరాలు కౌశాంబి, శ్రావస్తి, అయోధ్య, కపిలవస్తు, వారణాసి, వైశాలి, రాజగిరి, పాటలీపుత్రం మొదలైనవి తవ్వకాల్లో బయటపడ్డాయి. ఆవాసాలు, మట్టి నిర్మాణాల చిహ్నాలు కన్పించాయి. వాస్తవానికి ఇవి భారతదేశంలో రెండో నగరీకరణ ప్రారంభాన్ని సూచిస్తున్నాయి. మొత్తం దేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే శ్రావస్తిలాంటి పెద్ద నగరాలు దాదాపు 20 వరకు ఉంటాయి. తర్వాత కాలంలో నగరాలు గణనీయంగా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం గ్రీకు నుంచి అలెగ్జాండర్ సైన్యం భారతదేశానికి తరలి రావడమేనని గుర్తుంచుకోవాలి. దీని వల్ల అనేక వ్యాపార రవాణా మార్గాలు ఏర్పడ్డాయి. వాయవ్య భారతదేశం, పశ్చిమ ఆసియాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడ్డాయి.

నగర ఆర్థిక వ్యవస్థ

నగరాల ఆవిర్భావానికి కారణాలు (రాజకీయ, ఆర్థిక, మతపరమైనవి) విభిన్నంగా ఉన్నప్పటికీ చివరికి ఈ నగరాలన్నీ మంచి వ్యాపార కేంద్రాలుగా ప్రసిద్ధి పొందాయి. వాటిలో రకరకాల వృత్తి నిపుణులు, వ్యాపారులు స్థిరపడ్డారు. వీరు కొన్ని సంఘాలుగా ఏర్పడ్డారు. జాతక కథల్లో అంటే బుద్ధుడి పుట్టుకకు సంబంధించిన కథల్లో ఇలాంటి సంఘాలను దాదాపు 18 వరకు పేర్కొన్నారు. అందులో నాలుగు పేర్లు (వడ్రంగులు, కుమ్మరులు, తోలుపని చేసేవారు, చిత్రకారులు) మాత్రం ప్రత్యేకంగా ఉన్నాయి. ప్రతి సంఘం నగరంలో ఒక ప్రత్యేక ప్రాంతంలో నివసించేది. అంటే ఇలాంటి నివాసాలు, పరిశ్రమలు వృత్తుల స్థానికీకరణకు తోడ్పడటమే కాకుండా వారసత్వంగా తండ్రుల నుంచి వారి సంతానానికి సంక్రమించడానికి ఈ కళలు దోహదపడ్డాయి. సాధారణంగా వ్యాపారులంతా నగరాల్లోనే జీవించేవారు. కానీ వ్యాపారులు జీవనోపాధి కోసం రాజు జారీ చేసిన మాన్యాలు (భోగ గ్రామాలు) చేసుకోవడానికి గ్రామాలతో సంబంధం పెట్టుకోక తప్పలేదు. ఆర్థిక వ్యవస్థకు వ్యాపారులు చేస్తున్న సేవలను బట్టి పరమ నిరంకుశులైన రాజులు కూడా వారిని తగిన రీతిలో గౌరవించేవారు. వీటన్నింటినీ గమనిస్తే వృత్తి నిపుణులు, వ్యాపారులు నగరాల్లో ప్రధానమైన సామాజిక వర్గాలుగా అభివృద్ధిలోకి వచ్చారన్న విషయం అవగతమవుతోంది.

వృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువులను వ్యాపారులు సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవారు. జాతక కథల్లో 500 బండ్లకు సరిపోయే వస్తువులు, వస్త్రాలు, దంతపు వస్తువులు, కుండలు మొదలైనవి తీసుకెళ్లినట్లు ప్రస్తావించారు. ఆ కాలంలో అన్ని ప్రధాన నగరాలు నదీ తీరాలకు ఆనుకునే ఉండేవి. వాటిని కలుపుతూ వ్యాపార మార్గాలు చాలా ఏర్పడ్డాయి. ఉదా॥ శ్రావస్తి పట్టణాన్ని కౌశాంబి, వారణాసి, కపిలవస్తు, కుశినార మొదలైన నగరాలతో అనుసంధానం చేశారు. లోహాలతో తయారైన నాణేలు మొట్టమొదట ఈ కాలంలోనే కన్పిస్తాయి. వైదిక గ్రంథాల్లో కనిపించే నిష్క, శతమాన అనే పదాలను నాణేల పేర్లుగానే గుర్తించినప్పటికీ అప్పటికే దొరికిన నాణేలు క్రీ.పూ. 6వ శతాబ్ది నాటి కంటే పాతవి మాత్రం కావు. ఈ కాలంలో మొట్టమొదటి దశలో నాణేలు చాలావరకు వెండితో తయారుచేశారు. కొన్ని రాగి నాణేలు కూడ లభించాయి. లోహ నాణేలపైన కొన్ని గుర్తులు అంటే.. కొండలు, చెట్లు, చేప, వృషభం మొదలైన చిహ్నాలతో రంధ్రాలు చేయడం వల్ల వీటిని రంధ్రపు గుర్తులున్న నాణేలనేవారు. పాళీ గ్రంథాలు ధనాన్ని విస్తారంగా ఉపయోగించేవారని, జీతభత్యాలు ధనరూపంలోనే చెల్లించేవారనీ పేర్కొన్నాయి.

అశోకుడికి ముందు రెండు శతాబ్దాల కిందటే ప్రారంభమైన లిపి కూడా వ్యాపారాభివృద్ధికి చాలా దోహదం చేసింది. ఈ కాలంలో గ్రంథాలన్నీ కొలతలకు సంబంధించిన సునిశిత పరిజ్ఞానాన్ని వివరించాయి. బహుశా ఇవి ఇళ్లు, భూముల సరిహద్దుల గుర్తింపులకు, నిర్మాణాలకు ఉపయోగపడి ఉంటాయి. ఆ విధంగా లేఖనం అనేది చట్టాలు, మతాచారాల సంకలనానికి మాత్రమే కాకుండా వ్యాపార వివరాలు, పన్నుల చెల్లింపు, విస్తృతమైన సైనిక ఉద్యోగుల వివరాలు రాసి పెట్టుకోవడానికి అవకాశం కల్పించింది. కానీ ఈ కాలంలో లిపి ఉండేదనే విషయానికి సంబంధించి ఎలాంటి పురావస్తు ఆధారాలు లేవు. అయితే ఈ ప్రాచీన రికార్డులను శిలలు, లోహపు ఫలకాలపై రాయకపోవడం వల్ల అవి నాశనమై ఉండొచ్చని అందుకే అవి అలభ్యాలని చెప్పొచ్చు.

మౌర్యుల తర్వాత పట్టణీకరణ

వ్యాపారం అభివృద్ధి చెందడం, ద్రవ్య ఆర్థిక విధానం విస్తరించడం పట్టణీకరణకు కారణభూతమయ్యాయి. చైనా యాత్రికులు తమ రచనల్లో పాటలీపుత్రం, వైశాలి, వారణాసి, కౌశాంబి, హస్తినాపురం, మధుర, ఇంద్రప్రస్థం మొదలైన నగరాలను పేర్కొన్నారు. కుషాణుల కాలంలో చిరండ్, సోన్‌పూర్, బక్సార్ (బీహార్), తూర్పు ఉత్తరప్రదేశ్‌లో ఖేరత్, మాసన్, ఉత్తరప్రదేశ్‌లో సోహ్‌గౌరా, భీటా, కౌశాంబి, శృంగవేర్‌పూర్, ఆంత్రజిఖేరా, మీరట్, మజఫర్‌పూర్ ప్రాంతాలు సంపదలతో తులతూగేవి. అదేవిధంగా పంజాబ్‌లోని జలంధర్, లూధియానా, రూపార్‌ల్లో కూడా కుషాణుల కాలం నాటి నిర్మాణాలు బయటపడ్డాయి. మొత్తం మీద కుషాణుల కాలంలో నగరీకరణ అత్యున్నత స్థాయికి చేరుకుంది. పశ్చిమ భారతదేశంలో మాళ్వా ప్రాంతాన్ని పరిపాలించిన శకుల నగరాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. వారి ప్రధాన నగరం ఉజ్జయిని. కౌశాంబి నుంచి మధుర, మధుర నుంచి పశ్చిమ తీర ప్రాంతానికి వచ్చే రెండు ప్రధాన రహదారులు ఉజ్జయినిలో కలవడం వల్ల ఆ నగరానికి అధిక ప్రాధాన్యత లభించింది. దీనికితోడు ఉజ్జయిని అతి విలువ కలిగిన ఆగేట్, కార్నిలియన్ రాళ్ల వ్యాపారానికి కేంద్రంగా ఉండేది. క్రీ.పూ. 200 నుంచి ఇక్కడ కార్నిలియన్, జాస్పర్ రాళ్లతో పూసల్ని తయారు చేసేవారని తవ్వకాలు నిరూపిస్తున్నాయి. క్షిప్రా నదీ గర్భంలో పుష్కలంగా ముడిసరుకు లభించడం వల్ల ఈ పరిశ్రమ గొప్పగా వర్ధిల్లింది.

శకులు, కుషాణుల యుగంలా శాతవాహనుల కాలంలో టగర్, పైఠాన్, ధాన్యకటకం, అమరావతి, నాగార్జునకొండ, బరూచ్, సొపారా, అరికమేడు, కావేరిపట్నం ప్రసిద్ధి చెందాయి. తెలంగాణలో ఫణిగిరి, మునుల గుట్ట, పోతన్ ప్రసిద్ధి చెందిన బౌద్ధ పట్టణాలని 'ప్లిని' అనే చరిత్రకారుడు తన రచనల్లో పేర్కొన్నారు.

గుప్తుల యుగం నాటి పట్టణీకరణ క్షీణత-ప్రభావం

6వ శతాబ్దం నుంచి వ్యాపారం తీవ్రంగా తగ్గుముఖం పట్టింది. రోమన్ సామ్రాజ్యంతో, పశ్చిమ దేశాలతో వ్యాపారం ఆగిపోయింది. 6వ శతాబ్దంలో ఇరాన్, బైజాంటియన్‌లతో పట్టువస్త్రాల వ్యాపారం ఆగిపోయింది, భారతదేశం.. చైనా, ఆగ్నేయ ఆసియాతో వ్యాపారం కొనసాగించడంలో దళారీలైన అరబ్బుల పాత్ర ప్రధానం. లాభాలు కూడా పూర్తిగా వారే పొందారు. వ్యాపారం క్రమక్రమంగా తగ్గుముఖం పట్టడంతో దేశంలో బంగారం నాణేలు పూర్తిగా తగ్గిపోయాయి. క్రమంగా పట్టణాలు శిథిలం కావడంతో మధుర, శ్రావస్తి, చరండ్, వైశాలి, పాటలీపుత్రం మొదలైన నగరాలు కాలగర్భంలో కలిసినట్లు తవ్వకాలు నిరూపిస్తున్నాయి. భారతీయ ఎగుమతులకు అవకాశాలు తగ్గడం వల్ల చేతివృత్తులవారు, వ్యాపారులు గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లి వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించారు. 5వ శతాబ్దం చివరలో పట్టు నేసేవాళ్లు పశ్చిమ తీరం నుంచి మాళ్వా ప్రాంతంలోని మాండ్‌సోర్‌కు వలస వెళ్లారు. పట్టణాలు శిథిలం కావడం వల్ల, వ్యాపారం తగ్గుముఖం పట్టి గ్రామాలు తమకు కావలసిన నూనె, ఉప్పు, సుగంధద్రవ్యాలు, బట్టలు మొదలైన వస్తువుల్ని సమకూర్చుకోవాల్సివచ్చింది. అందువల్ల ఉత్పత్తి కేంద్రాలు చిన్నవిగా మారి, తమ అవసరాలకు మాత్రమే పరిమితంగా ఉండిపోయాయి. తర్వాత సామాజిక నిర్మాణంలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. ఉత్తర భారతదేశంలో వైశ్యులను స్వతంత్ర రైతులుగా పరిగణించేవారు.

భూదానాలు రాజుకు, రైతుకు మధ్య భూస్వాములను సృష్టించాయి. అందువల్ల వైశ్యులు శూద్రులతో సమానమైపోయారు. ఈ మార్పు ఉత్తర భారతదేశం నుంచి బెంగాల్‌కు, దక్షిణ భారతదేశానికి విస్తరించింది.

వర్ణ వ్యవస్థలో మార్పులు

ధర్మశాస్త్రాల ప్రకారం వ్యక్తుల సామాజిక స్థాయి వర్ణంపై ఆధారపడి ఉండేది. ఒక వ్యక్తికి ఉన్న ఆర్థిక హక్కులు కూడా అతని వర్ణంపై ఆధారపడి ఉండేవి. పరిస్థితులు మారిన తర్వాత కొత్త భూస్వామ్య వర్గానికి ఇవ్వాల్సిన స్థానాన్ని గురించి ధర్మశాస్త్ర గ్రంథాల్లో మార్పులు చేశారు.

ఎక్స్‌ట్రాపొలేషన్ దేనికి సంబంధించింది?



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

ఎస్‌జీటీ - సైన్స్ మెథడాలజీ

విజ్ఞానశాస్త్ర బోధన లక్ష్యాలు

- సాధారణంగా ఉద్దేశాలు, గమ్యాలు, లక్ష్యా లు అనే పదాలను పర్యాయపదాలుగా వాడతారు.
- **గమ్యాలు:** విశాలమైన, దీర్ఘకాలిక అంతిమ ప్రయోజనాన్ని తెలిపేవి గమ్యాలు.
  ఉదా: విద్యకు పరమార్థం మోక్షం. **- ఉపనిషత్తులు**
- **ఉద్దేశాలు:** గమ్యాల నుంచి ఏర్పడినవి ఉద్దేశాలు. ఇవి గమ్యాల కంటే నిర్దిష్టమైనవే కాకుండా విద్యా దిశలను కూడా సూచి స్తాయి.
  ఉదా: విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర జ్ఞానం కలిగించడం.
- **లక్ష్యాలు:** స్వల్పకాలంలో చేరగలిగే గమ్యాలను లక్ష్యాలనవచ్చు.
  ఉదా: డీఈడీ పరీక్ష పాసవడం.

విజ్ఞానశాస్త్ర అధ్యయన విలువలు:

1. సామాజిక విలువలు
2. సాంస్కృతిక విలువలు
3. నైతిక విలువలు 4.వృత్తిపరమైన విలువలు
5. ఔపయోగిక విలువలు

సామాజిక విలువలు- రకాలు:

1. బౌద్ధిక విలువ 2. సృజనాత్మక విలువ 3. సౌందర్య విలువ.

విద్యా లక్ష్యాలు
↓
స్థాయిలవారీగా విద్యా లక్ష్యాలు
↓
సబ్జెక్టుల వారీగా విద్యా లక్ష్యాలు
↓
తరగతుల వారీగా విద్యా లక్ష్యాలు

విద్యా లక్ష్యాలను ఈ కింది విధంగా చూపొచ్చు

- **గాగ్నే అనే విద్యావేత్త సూచించిన వర్గీకరణ:** గాగ్నే అభ్యసనాన్ని వివిధ రకాలుగా విడమర్చి చెప్పారు. అవి..

సూచీ అభ్యసనం- ఉద్దీపన- ప్రతిస్పందన అభ్యసనం, భావనాభ్యసనం, సూత్రాల అభ్య సనం, సమస్యా పరిష్కారం. ఇవి సరళం నుంచి సంక్లిష్టం వరకు ఒక క్రమ పద్ధతిలో అమిరి ఉంటాయి.

- **బెంజిమన్ బ్లూమ్, క్రాత్‌హోల్, డేవిడ్ సూచించిన వర్గీకరణ:** వీరు విద్యా లక్ష్యాలను మూడు వర్గాలుగా విభజించారు. అవి..
  ఎ) జ్ఞానాత్మక రంగం బి) భావావేశ రంగం
  సి) మానసిక చలనాత్మక రంగం
- జ్ఞానాత్మక రంగంపై బెంజిమన్ బ్లూమ్, భావావేశ రంగంపై డేవిడ్.ఆర్. క్రాత్‌హోల్, మానసిక చలనాత్మక రంగంపై ఎలిబత్ సింప్సన్, ఆర్.హెచ్. దవే కృషి చేశారు.
- జ్ఞానాత్మక రంగం మెదడుకు, భావావేశ రంగం హృదయానికి, మానసిక చలనా త్మక రంగం మనసుకు, శరీరానికి సంబం ధించినవి.
- ఏ అంశం గురించి అయినా ఈ మూడు రంగాల్లో విద్యార్థులను అభివృద్ధి చేయాలి.

విజ్ఞాన శాస్త్రంలో లక్ష్యాలు - స్పష్టీకరణలు -వివరణలు

ఎ. జ్ఞాన రంగంలో లక్ష్యాలు:

- జ్ఞప్తికి తెచ్చుకోవడం • గుర్తించడం

లక్ష్యం-I

1. **జ్ఞప్తికి తెచ్చుకోవడం :** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదాలు, సత్యాలు, భావన లు, సూత్రాలు, నిర్వచనాలు, నియమాలు పద్ధతులు జ్ఞప్తికి తెచ్చుకొంటాడు.
   ఉదా: చంద్ర గ్రహణం అంటే ఏమిటి?
2. **గుర్తించడం:** విద్యార్థి విజ్ఞానశాస్త్ర సం బంధమైన సత్యాలు, భావనలు, సూత్రా లు, నియమాలు, పద్ధతులు గుర్తిస్తాడు.
   ఉదా: కుంభాకార, పుటాకార దర్పణాల్లో భేదాలను గుర్తించడం.

లక్ష్యం-II అవగాహన:

విద్యార్థి విజ్ఞానశాస్త్ర సంబంధమైన పదా లు, సత్యాలు, భావనలు మొదలైన వాటిని అవగాహన చేసుకుంటాడు.

స్పష్టీకరణలు:

- భావనలు, నియమాలు, సూత్రాలకు ఉదాహరణలిస్తాడు.
  ఉదా: సజీవులకు ఉదాహరణనిస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు, నియమాలను వివరిస్తాడు.
- ఇచ్చిన వాక్యంలోని దోషాన్ని సవరించి సరి చేస్తాడు.
- వివిధ భావనలు, సూత్రాలు నియమా లను సరి చేస్తాడు.
- చిత్రపటాలకు, రేఖా పటాలకు, దత్తాంశాలకు వ్యాఖ్యానం రాస్తాడు.
- విజ్ఞాన సూత్ర సత్యాలను, భావాలను వర్గీకరిస్తాడు.
- సమస్యలను సాధిస్తాడు.
- విజ్ఞానశాస్త్ర పరికరాలను, రసాయనాలను ఎంపిక చేసుకుంటాడు.
- భౌతిక రాశులకు సరైన ప్రమాణాలు తెలుపుతాడు.
- శాస్త్ర సత్యాలు, భావనలను, ప్రక్రియలను సరిపోల్చుతాడు.

లక్ష్యం - III వినియోగం: విద్యార్థి తాను నేర్చుకున్న విజ్ఞానశాస్త్ర విజ్ఞానాన్ని పరిస్థితులకనుగుణంగా వినియోగిస్తాడు.

స్పష్టీకరణలు:

- భావనలు, సూత్రాలు, నియమాలు మొదలైన వాటిని విశ్లేషిస్తాడు.
- విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని నేరుగా వినియోగిస్తారు.
- శాస్త్ర ప్రక్రియలకు, దృగ్విషయాలకు కారణాలను తెలుపుతాడు.
- కారణానికి, ఫలితానికి మధ్య సంబం ధాన్ని ఏర్పరుస్తాడు.
- శాస్త్ర పరిశీలనలను వ్యాఖ్యానిస్తాడు.
- సామాన్యీకరణలను ప్రతిపాదిస్తాడు.
- సరైన ప్రయోగ విధానాలు, పరికరాలను సూచిస్తాడు. ❖ ప్రాగుక్తీకరించగలడు.
- దత్తాంశం ఆధారంగా నిర్ణయం తీసుకుంటాడు.

భావావేశ రంగం లక్ష్యాలు:

లక్ష్యం I: శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
లక్ష్యం II: అభిరుచి
లక్ష్యం III: అభినందన

మానసిక చలనాత్మక రంగ లక్ష్యాలు

లక్ష్యం I: చిత్రలేఖన నైపుణ్యం
లక్ష్యం II: హస్త నైపుణ్యాలు
లక్ష్యం III: పరిశీలన నైపుణ్యాలు
లక్ష్యం IV: అభివ్యంజన నైపుణ్యాలు
లక్ష్యం V: నివేదన నైపుణ్యాలు

విజ్ఞాన శాస్త్రం- సహ సంబంధం

సహ సంబంధం ఆవశ్యకత:

- జ్ఞానాన్ని సంయుక్తపరచడం
- సమర్థవంతమైన అభ్యసనం
- శ్రమ ఆదా ❖ అభ్యసన బదలాయింపు

సహ సంబంధం- రకాలు:

- సహజసిద్ధం
- కృత్రిమ సహ సంబంధం
- వ్యవస్థీకృత సహ సంబంధం
- విజ్ఞానశాస్త్రానికి విద్యా ప్రణాళికలోని ఇతర పాఠ్యవిషయాలకు సంబంధం
- విజ్ఞానశాస్త్రం- భాష
- విజ్ఞానశాస్త్రం - చరిత్ర
- విజ్ఞానశాస్త్రం - భౌగోళిక శాస్త్రం
- విజ్ఞానశాస్త్రం- గణితం
- విజ్ఞానశాస్త్రం - చిత్రలేఖనం
- విజ్ఞాన శాస్త్రం - చేతిపని
- విజ్ఞాన శాస్త్రం-దైనందిన జీవితానికి సంబంధం.

విద్యా లక్ష్యాలు

జ్ఞాన రంగం	భావావేశ రంగం	మానసిక చలనాత్మక రంగం
జ్ఞానానికి సంబంధించిన వాటిని జ్ఞప్తికి తెచ్చుకోవడం, గుర్తించడం, మానసిక సామర్థ్యాలు, నైపుణ్యాలను అభివృద్ధి పరచడం.	ఆసక్తులు, విలువల్లో మార్పులు, అభినందనను పెంపొందించడం	హస్తలాఘవ, మోటార్ నైపుణ్యాలు అభివృద్ధి చేయడం

బ్లూమ్ సూచించిన లక్ష్యాల వర్గీకరణ

శిశువు (ప్రవర్తన)

జ్ఞాన రంగం	భావావేశ రంగం	మానసిక చలనాత్మక రంగం
1. జ్ఞానం	1. గ్రహించడం	1. అనుకరణ
2. అవగాహన	2. ప్రతిస్పందించడం	2. హస్తలాఘవం
3. వినియోగం	3. విలువకట్టడం	3. సునిశితత్వం
4. విశ్లేషణ	4. వ్యవస్థాపనం	4. ఉచ్చారణ
5. సంశ్లేషణ	5. శీలస్థాపనం	5. స్వాభావీకరణం
6. మూల్యాంకనం		

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విద్యార్థులు చేసే ప్రయోగాలకు కావాల్సిన పరికరాలను, వస్తు సామగ్రిని వారే తయారు చేసుకోవడాన్ని సూచించే విలువ? (డీఎస్సీ2008)
   ఎ) క్రమశిక్షణ విలువ
   బి) ఉపయోగిత విలువ
   సి) సృజనాత్మక విలువ
   డి) వృత్తిపరమైన విలువ
2. అవగాహనలో ప్రవర్తనాత్మకమైన స్పష్టీకరణం ఎక్స్‌ట్రాపొలేషన్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)
   ఎ) కార్యనిర్వాహక సంబంధం తెలపడం
   బి) అన్వయం చేయడం, వర్ణించడం
   సి) పోల్చడం, తేడాలు చెప్పడం
   డి) ఒక పరిష్కారం నుంచి మరొక పరిష్కారానికి
3. సామర్థ్యాలను స్పష్టీకరించడంలో ఒక మౌలికాంశం? (డీఎస్సీ-2006)
   ఎ) అభ్యసన ఔచిత్యం బి) పరిస్థితులు
   సి) పరిసరాల అనుగుణ్యత
   డి) పాఠ్యాంశాలు
4. మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యాల క్రమం? (డీఎస్సీ-2006)
   ఎ) అనుకరణ, నిర్వహణ, సునిశితత్వం, సమన్వయం, స్వాభావీకరణం
   బి) అనుకరణ, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, శీలస్థాపనం
   సి) గ్రహించడం, నిర్వహణ, సునిశితత్వం సమన్వయం, శంకుస్థాపన
   డి) గ్రహించడం, ప్రతిస్పందన, విలువ, సమన్వయం, స్వాభావీకరణం
5. ఇందులో ఒకటి మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యం? (డీఎస్సీ-2001)
   ఎ) పరిసరాల్లో ఉన్న వాటిపై ఆసక్తి ప్రదర్శించడం
   బి) శాస్త్ర సంబంధమైన భావనలు గుర్తించడం
   సి) పటాలు గీయడంలో నైపుణ్యం
   డి) శాస్త్ర జ్ఞానాన్ని వినియోగించడం
6. మన ప్రకృతి సంపదను, వనరులను సద్వినియోగం చేసుకోవడం అనేది శాస్త్రపరంగా ఏ విలువను పెంపొందిస్తుంది? (డీఎస్సీ-2001)
   ఎ) బౌద్ధిక విలువ
   బి) సౌందర్య విలువ
   సి) ఉపయోగిత విలువ
   డి) వృత్తి విలువ
7. విద్యార్థి గడించిన సామర్థ్యాలను సూచించేవి? (డీఎస్సీ-2001)
   ఎ) ఉద్దేశాలు బి) లక్ష్యాలు
   సి) నైతిక విలువలు
   డి) స్పష్టీకరణలు
8. విజ్ఞానశాస్త్రాన్ని ఇతర సబ్జెక్టులతో సహసంబంధం కలిగించడం? (డీఎస్సీ-2000)
   ఎ) కష్టం బి) సులువు
   సి) ఇవేవీ కావు డి) మౌలికమైంది
9. ప్రయోగాలు/ కృత్యాలు చేయడం దేనికి సంబంధించింది? (డీఎస్సీ-2000)
   ఎ) అవగాహన బి) జ్ఞానం
   సి) నైపుణ్యం డి) అభినందన
10. క్షేత్ర పర్యటన ఏ రంగంలోనిది? (డీఎస్సీ-1998)
    ఎ) జ్ఞానాత్మక రంగం
    బి) మానసిక చలనాత్మక రంగం
    సి) భావావేశ రంగం
    డి) పైవేవీ కావు
11. 'విద్యార్థి నమ్మకంగా తన పరిశీలనలను నమోదు చేయడం' ఏ ముఖ్య లక్షణాన్ని సూచిస్తుంది? (డీఎస్సీ-1994)
    ఎ) అవగాహన బి) వైఖరి
    సి) నైపుణ్యం డి) జ్ఞానం

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) సి; 6) సి; 7) డి; 8) డి; 9) సి; 10) సి; 11) సి.

మాదిరి ప్రశ్నలు

1. విద్యా విషయక లక్ష్యాలను వర్గీకరించింది?
   ఎ) R.C. రాస్ బి) C.P.S. నాయర్
   సి) బ్లూమ్ డి) స్మిత్
2. ఎక్స్‌ట్రాపొలేషన్ దేనికి సంబంధించింది?
   ఎ) అనునాదం బి) అవగాహన
   సి) పరికల్పన డి) హేతుకీకరణ
3. 'Taxonomy of Educational Objectives'.. ఎవరి రచన?
   ఎ) బ్లూమ్ బి) థార్న్‌డైక్
   సి) అరిస్టాటిల్ డి) గాగ్నే
4. ఎత్తుకు, గురుత్వ త్వరణానికి సంబంధం తెలపడం ____
   ఎ) వినియోగం బి) జ్ఞానం
   సి) అవగాహన డి) సంశ్లేషణ
5. బొమ్మలు గీయడం ఏ రంగానికి చెందింది?
   ఎ) భావావేశ బి) జ్ఞానాత్మక
   సి) మానసిక చలనాత్మక
   డి) ఏదీకాదు
6. భావావేశ రంగాన్ని వివరించినవారు?
   ఎ) గేట్స్ బి) విలియమ్స్
   సి) క్రాత్‌హోల్ డి) బ్లూమ్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) సి; 5) సి; 6) సి.

ససన్ థర్మల్ ప్రాజెక్టు ఏ రాష్ట్రంలో ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశం - శక్తి సంపద

శక్తి ఒక ముఖ్య వనరు మాత్రమే కాకుండా ఆధునిక కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రథమ కారకం. ఒక దేశం వ్యవసాయకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి శక్తి సంపద ఎంతో అవసరం. ప్రస్తుతం మానవ జీవితం శక్తి వనరులపై ఎంతో ఆధారపడింది. మానవ జీవితావసరానికి రూపొందించే ప్రతి వస్తు ఉత్పత్తి ఈ శక్తిపైనే ఆధారపడి ఉంటుంది. శక్తి వనరులను రెండు రకాలుగా విభజించొచ్చు. అవి

1. సంప్రదాయ శక్తి వనరులు/తరిగిపోయే శక్తి వనరులు
2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు

1. సంప్రదాయ/తరిగిపోయే శక్తి వనరులు:

- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తిని ఉత్పత్తి చేసే యురేనియం, థోరియం వంటి ఖనిజాలు మొదలైన వాటిని సంప్రదాయ శక్తి వనరులు అంటారు.
- వీటి నిల్వలు ప్రకృతిలో నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే ఉన్నందున వాడుతూ ఉంటే క్రమేణా తరిగిపోతాయి.
- ఇవి తరిగిపోతే మానవుడు పునరుద్ధరించలేడు. కాబట్టి వచ్చే తరాలను దృష్టిలో పెట్టుకొని వీటిని క్రమబద్ధంగా వినియోగించుకోవాలి.

2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు:

- నీరు, సౌరశక్తి, పవన శక్తి, వేలా తరంగాలు, భూతాప శక్తి మొదలైన వాటిని సంప్రదాయేతర శక్తి వనరులుగా పరిగణిస్తారు.
- ఇవి ప్రకృతిలో నిరంతరం లభ్యమవుతాయి. కాబట్టి తరిగిపోవడమనే సమస్యే లేదు.
- అయితే వీటిని శక్తి ఉత్పాదకతకు ఉపయోగించుకోవాలంటే సాంకేతికాభివృద్ధితో మాత్రమే సాధ్యపడుతుంది.
- మనదేశంలో నేలబొగ్గు, చమురు, కర్ర బొగ్గు, నీరు ప్రధాన శక్తి వనరులు. సూర్యరశ్మి, గాలి మొదలైన వనరుల వాడకం ఇప్పుడిప్పుడే అభివృద్ధి దశలో ఉంది. అలాగే అణుశక్తి కూడా మంచి అభివృద్ధి దశలో ఉందని చెప్పొచ్చు. వీటన్నింటిలోనూ బొగ్గు చాలా ముఖ్యమైన శక్తి ఉత్పాదక వనరు. ఆ తర్వాత స్థానం జలశక్తి ఆక్రమిస్తుంది.
- మనదేశంలో మొదటిసారి విద్యుచ్ఛక్తి తయారీ డార్జిలింగ్ (పశ్చిమ బంగా)లో 1897లో ప్రారంభమైంది. ఆ తర్వాత 1902లో కర్ణాటకలోని శివసముద్రం వద్ద జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- స్వాతంత్ర్యానంతరం 'విద్యుచ్ఛక్తి చట్టం 1948'లో ప్రవేశపెట్టి విద్యుచ్ఛక్తిని ప్రభుత్వ రంగ పరిధిలోకి తెచ్చారు.
- 1975లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, 'నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్'ల ఏర్పాటుతో దేశంలో విద్యుచ్ఛక్తి రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది.
- మనదేశంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 1947లో 1400 మెగావాట్లు ఉంటే, 2005-06 నాటికి 1,19,607 మె.వాట్లకు చేరింది.

థర్మల్ విద్యుత్

- బొగ్గు, నీటి ఆవిరి ఆధారంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను థర్మల్ విద్యుత్ అంటారు. దేశంలో సుమారు 73 శాతం ఉత్పత్తితో థర్మల్ విద్యుత్ మొదటి స్థానంలో ఉంది.
- థర్మల్ విద్యుత్‌ను ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఉత్పత్తి చేస్తున్నాయి.
- వేయి మెగావాట్ల కంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పవర్ స్టేషన్‌ను సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటారు. ఇవి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో ఉంటాయి.
- 4000 మె.వాట్ల కంటే ఎక్కువ థర్మల్ విద్యుత్ సామర్థ్యం ఉంటే వాటిని 'అల్ట్రా మెగా పవర్ ప్లాంట్' (యూఎంపీపీ) అంటారు.

అణు విద్యుత్

అణు విద్యుదుత్పత్తికి అవసరమైన యురేనియం, థోరియం, ఇల్మనైట్, మోనజైట్ ఖనిజాలు భారతదేశంలో తగినంతగా లభిస్తున్నాయి.

- జార్ఖండ్‌లోని రాణి మేఖలలో, రాజస్థాన్‌లోని 'ఆరావళి' పర్వత ప్రాంతంలో యురేనియం లభిస్తోంది.
- బీహార్‌లో గయ, రాజస్థాన్‌లో జైపూర్, ఉదయ్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు జిల్లాల్లో యురేనియం నిల్వలున్నాయి.
- జార్ఖండ్‌లోని 'జాదుగూడ'లో యురేనియాన్ని శుద్ధి చేసే ప్లాంట్ ఉంది.
- కేరళ తీరం వెంట ఉన్న మోనజైట్ ఇసుకల్లో థోరియం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి.
- ప్రపంచంలోని థోరియం నిక్షేపాల్లో 50 శాతం పైగా భారతదేశంలోనే ఉన్నాయి.
- ప్రస్తుతం భారతదేశ అణు విద్యుత్ సామర్థ్యం 4780 మె.వా. ఇది దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఉత్పత్తిలో సుమారు 3 శాతం.
- ప్రపంచంలో అణు విద్యుత్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం ఫ్రాన్స్.

భారతదేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు

1. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం (టీఏపీఎస్) (మహారాష్ట్ర):

- భారతదేశంలో ఏర్పాటు చేసిన మొదటి అణు విద్యుత్ కేంద్రం.
- 1969, అక్టోబర్ 28న దీన్ని స్థాపించారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు - అప్సర.
- ఈ కేంద్రం అణు విద్యుత్ సామర్థ్యం - 1400 మె.వాట్లు.

2. రావత్ భటా అణు విద్యుత్ కేంద్రం (ఆర్ఏపీఎస్) (రాజస్థాన్):

- ఈ కేంద్రాన్ని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు.
- 1973, డిసెంబర్ 16న రాజస్థాన్‌లో నెలకొల్పారు.
- 'కోటా అణు విద్యుత్ కేంద్రం' అని కూడా అంటారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 1180 మె.వాట్లు.

3. కల్పకం అణు విద్యుత్ కేంద్రం (ఎంఏపీఎస్) (తమిళనాడు):

- 1984, జనవరి 24న తమిళనాడులోని కల్పకం వద్ద ఏర్పాటు చేశారు.
- మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్ (ఎంఏపీఎస్) అని, 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' అని కూడా అంటారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు - కామిని, ఈ రియాక్టర్ ద్వారా ప్లాటినాన్ని ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం - 440 మె.వా.

4. నరోరా అణు విద్యుత్ కేంద్రం (ఎన్ఏపీఎస్) (ఉత్తరప్రదేశ్):

- ఉత్తరప్రదేశ్‌లోని నరోరా వద్ద 1991, జనవరి 1న దీన్ని ఏర్పాటు చేశారు.
- దీని ద్వారా ప్రధానంగా ఢిల్లీకి విద్యుత్‌ను అందిస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

5. కాక్రపార అణు విద్యుత్ కేంద్రం (కెఏపీపీ) (గుజరాత్):

- గుజరాత్‌లోని కాక్రపార ప్రాంతంలో 1993, మే 6న నెలకొల్పారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

6. కైగా అణు విద్యుత్ కేంద్రం (కెపీపీ) (కర్ణాటక):

- కర్ణాటక రాష్ట్రంలోని 'కైగా' ప్రాంతంలో 2000, నవంబర్ 16న స్థాపించారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 850 మె.వా.
- తమిళనాడులోని 'కూడంకుళం' వద్ద రష్యా సహాయంతో వేయి మెగావాట్లతో రెండు అణు రియాక్టర్లను నిర్మిస్తున్నారు.
- అణు విద్యుత్ కర్మాగారంలో మితకారిగా 'భారజలం'ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చు.



- భారతదేశంలో 1962లో మొట్టమొదటి 'భారజల కేంద్రాన్ని' 'నంగల్' (ఉత్తరప్రదేశ్)లో ఏర్పాటు చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్ పేరు?
   1) ఊర్వశి 2) కామిని
   3) రోహిణి 4) అప్సర
2. యురేనియం శుద్ధి ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) ట్రాంబే 2) తారాపూర్
   3) జాదుగూడ 4) కల్పకం
3. కామిని అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
   1) కల్పక్కం అణు విద్యుత్ కేంద్రం
   2) తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం
   3) కైగా అణు విద్యుత్ కేంద్రం
   4) నరోరా అణు విద్యుత్ కేంద్రం
4. సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటే?
   1) 4000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   2) 1000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   3) 1000 మె.వా. కంటే తక్కువ గల ప్రాజెక్టు
   4) ఏదీకాదు
5. 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' ఎక్కడ ఉంది?
   1) మహారాష్ట్ర 2) ఉత్తరప్రదేశ్
   3) తమిళనాడు 4) గుజరాత్
6. వీటిలో ఏది సంప్రదాయ వనరు కాదు?
   1) బొగ్గు 2) ముడిచమురు
   3) సౌర శక్తి 4) అణు శక్తి
7. మనదేశంలో మొట్టమొదటిసారిగా (1897) విద్యుచ్ఛక్తి ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   1) శివ సముద్రం 2) డార్జిలింగ్
   3) తాల్చేర్ 4) నంగల్
8. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1948 2) 1962 3) 1980 4) 1975
9. 'రీహాండ్' సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఉత్తరప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) కేరళ
10. దేశంలో నాలుగో అణు విద్యుత్ కేంద్రం 'నరోరా' ఎక్కడ ఉంది?
    1) గుజరాత్ 2) రాజస్థాన్
    3) తమిళనాడు 4) ఉత్తరప్రదేశ్
11. వీటిలో ఏ శక్తి వనరు సంప్రదాయేతర శక్తి వనరు కాదు?
    1) సూర్యరశ్మి 2) అణుశక్తి
    3) పవన శక్తి 4) వేలా తరంగాలు
12. వీటిలో థర్మల్ పవర్ స్టేషన్లలో సరి కానిది?
    1) ఉత్తరప్రదేశ్ - దాద్రి
    2) పశ్చిమ బెంగాల్ - ఫరక్కా
    3) ఛత్తీస్‌గఢ్ - వూంచహార్
    4) కేరళ - కాయంకుళం
13. ససన్ థర్మల్ ప్రాజెక్టు ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మహారాష్ట్ర 2) మధ్యప్రదేశ్
    3) కర్ణాటక 4) ఒడిశా
14. భారతదేశంలో మొట్టమొదటి భారజల కేంద్రాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1975 2) 1948 3) 1962 4) 1972
15. 'కోటా' భారజల కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) ఒడిశా
    3) మహారాష్ట్ర 4) గుజరాత్

భారతదేశంలో సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లు

ఎస్టీపీఎస్	రాష్ట్రం
1. సింగ్రౌలి	ఉత్తరప్రదేశ్
2. దాద్రి	ఉత్తరప్రదేశ్
3. రీహాండ్	ఉత్తరప్రదేశ్
4. వూంచహార్	ఉత్తరప్రదేశ్
5. సింహాద్రి	ఆంధ్రప్రదేశ్
6. రామగుండం	తెలంగాణ
7. వింద్యాచల్ -1	మధ్యప్రదేశ్
8. వింద్యాచల్-2	మధ్యప్రదేశ్
9. కోర్బా	ఛత్తీస్‌గఢ్
10. కహాల్‌గావ్	బీహార్
11. తాల్చేర్	ఒడిశా
12. కాయంకుళం	కేరళ
13. ఫరక్కా	పశ్చిమ బంగా

భారతదేశంలో భారజల కేంద్రాలు

భారజల కేంద్రం	రాష్ట్రం
1. కోటా	రాజస్థాన్
2. తాల్చేర్	ఒడిశా
3. థాల్	మహారాష్ట్ర
4. బరోడా	గుజరాత్
5. ట్యుటికోరిన్	తమిళనాడు
6. హజీరా	మధ్యప్రదేశ్
7. మణుగూరు	తెలంగాణ


భారతదేశంలో అల్ట్రా మెగా పవర్ ప్లాంట్స్

యూఎంపీపీ	రాష్ట్రం
1. ముంద్రా	గుజరాత్
2. తాద్రి	కర్ణాటక
3. గిర్యా	మహారాష్ట్ర
4. ససన్	మధ్యప్రదేశ్
5. ఇబ్ నదీ లోయ	ఒడిశా
6. కృష్ణపట్నం (నెల్లూరు)	ఆంధ్రప్రదేశ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 2;
5) 3; 6) 3; 7) 2; 8) 4;
9) 1; 10) 4; 11) 2; 12) 4;
13) 2; 14) 3; 15) 1.

The two major types of computer chips are



1. UNIVAC stands for:
   a) Universal Automatic Computer
   b) Universal Array Computer
   c) Unique Automatic Computer
   d) Unvalued Automatic Computer
   e) None of the above
2. The basic operations performed by a computer are ___
   a) Arithmetic operation
   b) Logical operation
   c) Storage and relative
   d) All of the above
   e) None of the above
3. The two major types of computer chips are ___
   a) External memory chip
   b) Primary memory chip
   c) Microprocessor chip
   d) Both b and c
   e) None of the above
4. Microprocessors as switching devices are for which generation computers?
   a) First b) Second
   c) Third d) Fourth
   e) None of the above
5. What is the main difference between a mainframe and a super computer?
   a) Super computer is much larger than mainframe computers
   b) Super computers are much smaller than mainframe computers
   c) Supercomputers are focused to execute few programs as fast as possible while mainframe uses its power to execute as many programs concurrently
   d) Supercomputers are focused to execute as many programs as possible while mainframe uses its power to execute few programs as fast as possible
   e) None of the above
6. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
   a) Extended Binary Coded Decimal Interchange Code
   b) Extended Bit Code Decimal Interchange Code
   c) Extended Bit Case Decimal Interchange Code
   d) Extended Binary Case Decimal Interchange Code
   e) None of the above
7. The brain of any computer system is ___
   a) ALU b) Memory c) CPU
   d) Control unit
   e) None of the above
8. Storage capacity of magnetic disk depends on:
   a) Tracks per inch of surface
   b) Bits per inch of tracks
   c) Disk pack in disk surface
   d) All of the above
   e) None of the above
9. The two kinds of main memory are:
   a) Primary and secondary
   b) Random and sequential
   c) ROM and RAM
   d) All of the above
   e) None of the above
10. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is ___
    a) Memory b) Buffer
    c) Accumulator d) Address
    e) None of the above
11. Bluetooth is a type of radio wave information transmission system that is good for about:
    a) 30 feet b) 30 yards
    c) 30 miles d) 300 miles
    e) None of the above
12. The telephone is an example of a(n) ___ signal.
    a) Analog b) Digital
    c) Modulated d) Demodulated
    e) None of the above
13. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the ______.
    a) Internal modem
    b) External modem
    c) PC Card modem
    d) Wireless modem
    e) None of the above
14. A modem that is contained within the system unit is called a(n) ______ modem.
    a) External b) Internal
    c) Wireless d) Wi-Fi
    e) None of the above
15. A modem that doesn't need to be connected to a telephone line is the ______ modem.
    a) External b) Internal
    c) Wireless d) DSL
    e) None of the above
16. A special high-speed line used by large corporations to support digital communications is known as ____
    a) satellite/air connection service lines
    b) cable modems
    c) digital subscriber lines
    d) T1, T2, T3 and T4 lines
    e) None of the above
17. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ______.
    a) ISDN b) Microwave
    c) Cable modem d) DSL
    e) None of the above
18. The capacity of a communication channel is measured in ___
    a) Bandwidth b) Bit capacity
    c) Baud rate d) Data flow
    e) None of the above
19. Voice band
    a) allows the user to download messages
    b) is used for standard telephone communication
    c) is used in special leased lines to connect minicomputers and mainframes
    d) provides a high-speed communication channel
    e) None of the above
20. The greatest capacity for data transmission happens in ____ devices.
    a) Voice band b) medium band
    c) broadband d) mega-band
    e) None of the above
21. A page fault:
    a) Is an error in a specific page
    b) Occurs when a program accesses a page of memory
    c) Is an access to a page not currently in memory
    d) None of the above
    e) All of the above
22. The process of transferring data intended for a peripheral device into a disk (or intermediate store) so that it can be transferred to peripheral at a more convenient time or in bulk, is known as ____
    a) Multiprogramming
    b) Spooling c) Caching
    d) Virtual programming
    e) All of the above
23. An instruction in a programming language that is replaced by a sequence of instructions prior to assembly or compiling is known as ____
    a) Procedure name
    b) Macro c) Label
    d) Literal e) None

KEY:

1) a 2) d 3) d 4) d
5) c 6) a 7) c 8) d
9) c 10) b 11) a 12) a
13) c 14) b 15) c 16) d
17) d 18) a 19) b 20) c
21) c 22) b 23) b

Software

Software, simply are the computer programs. The instructions given to the computer in the form of a program is called Software. It is the set of programs, which are used for different purposes. All the programs used in computer to perform specific task is called Software.

Types of software

1. System software

a) Operating System Software

DOS, Windows XP, Windows Vista, Unix/Linux, MAC/OS X etc.

b) Utility Software

Windows Explorer (File/Folder Management), Windows Media Player, Anti-Virus Utilities, Disk Defragmentation, Disk Clean, Back Up, WinZip, Win RAR etc.

2. Application software

a) Package Software

Ms. Office 2003, Ms. Office 2007, Macromedia (Dreamweaver, lash, Free hand), Adobe (Page Maker, Photo Shop)

b) Tailored or Custom Software

SAGE (Accounting), Galileo/ World span (Travel) etc.

Computer Languages & Scripting:

a) Low Level Language

i) Machine Level Language
ii) Assembly Language

Machine language: These language instructions are directly executed by CPU.

Assembly language: The endeavor of giving machine language instructions a name structure that means bit strings of instructions of



machine language are given name here.

b) High Level Language

It is the user friendly language, more natural language than assembly language. Assembler is needed to convert assembly language into machine language. Complier is needed to convert high level to machine language.

COBOL (Common Business Oriented Language), FORTRAN (Formula Translation), BASIC (Beginner's All-purpose Symbolic Instruction Code), C, C++ etc. are the examples of High Level Language.

Booting

The process of loading the system files of the operating system from the disk into the computer memory to complete the circuitry requirement of the computer system is called booting.

There are two types of booting:

1. Cold Booting:

If the computer is in off state and we boot the computer by pressing the power switch 'ON' from the CPU box then it is called as cold booting.

2. Warm Booting:

If the computer is already 'ON' and we restart it by pressing the 'RESET' button from the CPU box or CTRL, ALT and DEL key simultaneously from the keyboard then it is called warm booting.